సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 221
శనివారం 2-11-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



పడగొట్టి... ఆపై తడబడి!
తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 86/4. న్యూజిలాండ్ 235 ఆలౌట్ - 15లో



వాహన అమ్మకాలు అంతంతే
నిరాశపరిచిన పండుగ సీజన్... తగ్గిన మారుతీ, హ్యుందాయ్ విక్రయాలు - 15లో



అంగుళం భూమినీ వదులుకోం
దేశ భూభాగంలో ఒక్క అంగుళాన్నీ వదులుకోబోమని ప్రధాని మోదీ చెప్పారు. సరిహద్దులో సైనికులతో కలిసి దీపావళి జరుపుకున్నారు.
- వివరాలు 6లో▶



ఆ హామీలే ఇవ్వాలి
పార్టీల విచ్చలవిడి గ్యారంటీల ప్రకటనలతో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే చెప్పారు.
- వివరాలు 6లో▶



గూగుల్‌కు జరిమానా
గూగుల్‌పై రష్యా కన్నెర్రజేసింది. భూమి మీద చలామణీలో ఉన్న మొత్తం నగదు కంటే ఎక్కువ జరిమానా విధించింది.
- వివరాలు 6లో▶




తేల్చేది 'అబార్షనే'!
అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అబార్షన్ హక్కులు కీలకంగా మారాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.
- వివరాలు 6లో▶

మనోళ్ల ఆశలు ఆవిరి!

విదేశీ విద్యపై భారత విద్యార్థుల వెనకడుగు

అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో మారిన పరిస్థితులే కారణం

- 2024లో లక్ష మందికిపైగా తగ్గిన విదేశీ విద్యార్థుల సంఖ్య
- ఐటీ రంగంపై ఆర్థిక సంక్షోభ ప్రభావం
- ఎంఎస్ చేసినా దొరకని స్కిల్డ్ జాబ్స్.. పార్ట్ టైం ఉద్యోగాలూ కష్టమే
- నిరాశానిస్పృహల్లో విద్యార్థులు, ఉద్యోగార్థులు



"అప్పుచేసి అమెరికా వచ్చా. పార్ట్ టైం జాబ్ కూడా ఒక వారం ఉంటే ఇంకో వారం ఉండటం లేదు. కన్సల్టెన్సీలు కూడా చేతులెత్తేస్తున్నాయి. మరోవైపు ఎంఎస్ పూర్తి చేసిన నా స్నేహితులకు స్కిల్డ్ ఉద్యోగాలు దొరకడం లేదు. మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. ఇంటికి ఫోన్ చేయాలంటే బాధగా ఉంటోంది."
– సామా నీలేష్ (అమెరికా వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి)

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల విదేశీ విద్య ఆశలు ఆవిరైపోతున్నాయి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ లాంటి దేశాలకు ఎమ్మెస్‌కు వెళ్లాలనుకునేవారి సంఖ్య తగ్గిపోతోంది. ఆర్థిక సంక్షోభంతో అమెరికా తదితర దేశాల్లో ఐటీ రంగం ఆటుపోట్లను ఎదుర్కొంటుండటమే ఇందుకు కారణం. ఇప్పటికే విదేశాల్లో చదువు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టిన వారు కూడా పునరాలోచనలో పడుతున్నారు. కొన్నాళ్లు వేచి చూడటమే మంచిదనే నిర్ణయానికి వస్తున్నారు. కొందరు ఆయా దేశాల్లో ఉన్న తమతోటి మిత్రులతో అక్కడి పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గురించిన వివరాలు కనుక్కుంటున్నారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలో పరిస్థితి ఇబ్బందికరంగానే ఉందని ఆయా దేశాల్లో ఉన్న
మిగతా 2వ పేజీలో ▶

కొన్నేళ్లుగా విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య

2017	4,53,977
2018	5,17,978
2019	5,86,329
2020	2,59,644
2021	4,44,574
2022	6,84,678
2023	6,94,000
2024	5,90,000



భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా
పాదయాత్ర

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం: కేటీఆర్

- ఇప్పుడు జరుగుతున్న నష్టం నుంచి తెలంగాణ కోలుకోవడం కష్టమే
- రాజకీయాల్లోకి కుటుంబాలను లాగడం అత్యంత నీచం
- త్వరలో పార్టీ సోషల్ మీడియా బృందంతో సమావేశం
- కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో మార్గదర్శనం చేస్తున్నారు
- పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయం
- చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న పోలీసులను వదిలిపెట్టబోమని వ్యాఖ్య
- కొత్త సంవత్సరంలో కేసీఆర్ జనంలోకి వస్తారని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పార్టీ కార్యకర్తల కోరిక మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రకటించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా తన పాదయాత్ర ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగడం అత్యంత నీచమన్నారు. తన కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగుతున్న సీఎం రేవంత్, ఆయన వందిమాగధులపై ప్రజల మద్దతుతో పోరాటం చేస్తానని పేర్కొన్నారు. గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో 'ఆస్క్ కేటీఆర్'పేరిట నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. ఆయా అంశాలు కేటీఆర్ మాటల్లోనే..

ఈ నష్టం నుంచి కోలుకోవడం కష్టమే..
"తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన ఒక శాపంగా మారింది. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం లేదు. సర్కారు వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు కాంగ్రెస్ ప్రారంభించిన రాజకీయ వేధింపులకు భయపడేది లేదు. కాంగ్రెస్ పాలన ఢిల్లీ నుంచి, ఢిల్లీ కోసమే అన్నట్టుగా తయారైంది. రాష్ట్రం నుంచి పెట్టుబడులు కూడా వెనక్కి మళ్లుతున్నాయి. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న నష్టం నుంచి తెలంగాణ కోలుకోవడం కష్టమే. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చే పార్టీకి తెలంగాణను ముందుకు తీసుకెళ్లడం అతిపెద్ద సవాల్‌గా మారుతుంది.

రాజకీయాల్లోకి కుటుంబాలను లాగడం నీచం
బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదు. సుమారు రెండు దశాబ్దాల రాజకీయ జీవితంలో కుటుంబ సభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు, రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురయ్యాను. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు
మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నోటికందే కూడు నీటిపాలు!



ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చాయి. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నీటి పాలవగా.. కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరిపంట పొలాల్లోనే నేలకొరిగింది. దీనితో అన్నదాతలు ఆందోళనలో పడిపోయారు.
- వివరాలు 12లో▶

సికింద్రాబాద్-పుణే మధ్య వందే భారత్ రైలు




సికింద్రాబాద్-పుణే మధ్య త్వరలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలోనే ఈ మార్గాన్ని రైల్వేబోర్డు నోటిఫై చేసినా.. రైల్ రేక్ సిద్ధంగా లేకపోవటంతో ప్రారంభించలేదు. ఈ క్రమంలో త్వరలో ఈ రైలును పట్టాలు ఎక్కించాలని అధికారులు భావిస్తున్నారు.
- వివరాలు 2లో▶

రేవంత్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది



సీఎం రేవంత్‌రెడ్డికి హనీమూన్ పీరియడ్ ముగిసి కౌంట్‌డౌన్ మొదలైందని... వచ్చే ఏడాది జూన్–డిసెంబర్‌ల మధ్య ఆయన పదవి పోవడం ఖాయమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌కు ప్రత్యామ్నాయం కోసం కాంగ్రెస్ అధిష్టానం చూస్తోందన్నారు.
- వివరాలు 2లో▶



'భద్రాద్రి.. యాదాద్రి'పై
సర్కారుకు నివేదిక

గత నెల 28న అందజేసిన జస్టిస్ లోకూర్ కమిషన్

- పవర్‌ప్లాంట్లలో అవకతవకలు, ఖజానాకు జరిగిన నష్టం వెల్లడి
- నిర్ణయాలన్నీ మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్నారని నిర్ధారణ!
- కేసులుపెట్టే యోచనలో ప్రభుత్వం!
- కేబినెట్, అసెంబ్లీలో చర్చించిన తర్వాత నిర్ణయం




సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అవకతవకలు చోటు చేసుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించిన జస్టిస్ మదన్ బి.లోకూర్ కమిషన్.. గడువు చివరి తేదీ అయిన గత నెల 28న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రస్తుతం రాష్ట్ర ఇంధన శాఖ వద్ద ఈ నివేదిక ఉంది. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీనిపై సమీక్ష నిర్వహించడంతో పాటు కేబినెట్ భేటీలో చర్చించి తదుపరి కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర శాసన సభలో కూడా నివేదికను ప్రవేశపెట్టి చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

తదుపరి చర్యలకు సిఫార్సు
టెండర్లు లేకుండా నామినేషన్ ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని బీహెచ్ఈఎల్‌కు అప్పగించడం,
మిగతా 12వ పేజీలో ▶

తొలిసారిగా గవర్నర్ ప్రతిభా అవార్డులు

- ఒక్కో అవార్డుకు రూ. 2 లక్షల నగదుతోపాటు ఒక మెడల్
- నేటి నుంచి ఈ నెల 23 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 'గవర్నర్ ఎట్ హోం' కార్యక్రమంలో అవార్డుల ప్రదానం
- గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడి

3లో



ధ్యానముద్రా? 'దండి'యాత్రా?



బాపూఘాట్‌లో 'మహాత్ముడు' ఎలా ఉండాలి?

- దేశంలో అత్యధికంగా పట్నాలోని మహాత్ముడి విగ్రహం ఎత్తు 72 అడుగులు
- అంతకంటే పెద్దగానా? సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ కంటే ఎత్తైనది కడదామా?
- గాంధీ విగ్రహం ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వంలో తర్జనభర్జన
- దేశ, విదేశాల్లోని విగ్రహాల పరిశీలనకు నిర్ణయం
- బాపూఘాట్‌లో గాంధీ ఐడియాలజీ కేంద్రం ఏర్పాటుపై కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మూసా-ఈసీల సంగమ ప్రాంతమైన ఇక్కడ మహాత్ముడి భారీ విగ్రహం ఏర్పాటుతో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మార్చాలని భావిస్తోంది. ఈ విగ్రహం ఎలా ఉండాలి? మహాత్ముడు ధ్యానముద్ర లో ఉండాలా? లేక దండియాత్రకు వెళ్తున్నట్టు ఉండాలా? మరేదైనా ఆకృతిలో ఉంటే బాగుంటుందా? అన్న దానిపై పరిశీలన జరుపుతోంది. ఈ విషయంలో విస్తృత స్థాయిలో చర్చలు, సంప్రదింపులు జరపాలని.. అవసరమైతే అన్నివర్గాల మేధావులు, అన్ని పార్టీల నేతలు, ప్రజాప్రతినిధుల సలహాలు, మిగతా 2వ పేజీలో ▶

జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు ఏపీ విద్యార్థుల దుర్మరణం

కారు అదుపు తప్పి లోయలో పడటంతో మృత్యువాత


వెంకట ఆనందరెడ్డి (ఫైల్)


కావ్య (ఫైల్)

పత్తికొండ (తుగ్గలి)/గిద్దలూరు రూరల్: జమ్మూకశ్మీర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏపీకి చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థులు దుర్మరణం చెందారు. కారు అదుపు తప్పి లోయలో పడిన ఘటనల్లో మొత్తం నలుగురు మృతి చెందగా వారిలో వీరిద్దరూ ఉన్నారు. మృతుల కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా పత్తికొండలో స్థిర నివాసమేర్పరచుకున్న తుగ్గలి మండలం పెండేకల్లుకు చెందిన పాటిల్ ప్రతాపరెడ్డి, అనిత దంపతుల పెద్ద కుమారుడు వెంకట ఆనందరెడ్డి (21), ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన చెందిన ఆర్మీ జవాన్ రమణారెడ్డి కుమార్తె కావ్యారెడ్డి (19) ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో వీరు బీటెక్ చదువుతున్నారు. అయితే కావ్యారెడ్డి చెల్లెలు మనీషా (19) కూడా అదే కాలేజీలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. దీపావళికి వరుస సెలవులు రావడంతో గత నెల 28వ తేదీన జమ్మూకశ్మీర్‌కు 30 మంది స్నేహితులతో కలిసి ఆరు కార్లలో విహార యాత్రకు వెళ్లారు. 30వ తేదీ తిరుగు ప్రయాణంలో శ్రీనగర్–జమ్మూ నేషనల్ హైవేలో రామబన్ జిల్లా మగర్‌కూట్ వద్ద పర్వతాల మధ్య కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఘటనలో ఆనందరెడ్డి, కావ్యారెడ్డి, మరో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కాగా, కారు అదుపు తప్పి లోయలో పడటాన్ని గమనించిన మనీషా వెంటనే డోరు తీసుకుని రోడ్డుపైకి దూకేసింది. దీంతో ఆమె చెయ్యి విరిగి తల పగిలింది. పరిస్థితి కొంత విషమంగా ఉంది. సమాచారం అందుకున్న మృతుల తల్లిదండ్రులు హుటాహుటిన ఘటనాస్థలానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఉదయం మృతదేహాలు స్వస్థలాలకు చేరుకుంటాయని బంధువులు తెలిపారు.

ఎమ్మెల్యేగా కాదు చిలుక జ్యోతిష్యుడిగా సూటవుతారు

ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అంతా తన చేతిలోనే ఉన్నట్లు బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి మారుస్తారని, ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా రాహుల్‌గాంధీ తిరస్కరించినట్లు మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డిని చూస్తే జాలేస్తోందన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మీడియాలో పాపులారిటీ కోసం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. ఆయన ఎమ్మెల్యేగా కంటే చిలుక జ్యోతిష్యుడిగా సెట్ అవుతారని రాష్ట్రంలో బీజేపీకి పెద్ద పనేం లేదని అవసరమైతే సెక్రటేరియట్ చెట్టు కింద జ్యోతిష్యం చెప్పుకోవచ్చని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి కావాలనుకుంటే నాగ్‌పూర్ వెళ్లి ఆర్‌ఎస్‌ఎస్ పెద్దల దగ్గర పైరవీలు చేసుకోవాలేగానీ ఇష్టం వచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి గురించి గోబెల్స్ ప్రచారం చేయడం తగదని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఎలాంటి ఢోకాలేదని, మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఆయన వెంటే ఉన్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో అవినీతి జరిగి ఉంటే కేంద్ర ప్రభుత్వ విచారణ సంస్థలతో దర్యాప్తు జరిపించుకోవచ్చని సవాల్ చేశారు.

సికింద్రాబాద్–పుణే మధ్య

వందే భారత్ రైలు

మహారాష్ట్ర ఎన్నికల తర్వాత ప్రారంభమయ్యే అవకాశం

స్లీపర్ సర్వీసును ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆ కేటగిరీ అయితే.. కొంత జాప్యం జరిగే చాన్స్



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్–పుణే మధ్య త్వరలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలోనే ఈ మార్గాన్ని రైల్వేబోర్డు నోటిఫై చేసినా.. రైల్ రేక్ సిద్ధంగా లేకపోవటంతో ప్రారంభించలేదు. ఈ క్రమంలో త్వరలో ఈ రైలును పట్టాలెక్కించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో.. అది ముగిశాక ప్రారంభించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య శతాబ్ది సర్వీసు కొనసాగుతోంది. అది రోజూ మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి బయలు దేరుతుంది. వందే భారత్‌ను ఉదయమే బయలుదేరేలా నడిపే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెప్తున్నాయి.

స్లీపర్ కేటగిరీపై పరిశీలన!

వందే భారత్ రైళ్లలో స్లీపర్ కేటగిరీ త్వరలో పట్టాలెక్కబోతోంది. ఇటీవలే నమూనా రైలు సిద్ధమైంది. ఆ రైలు రేక్స్ తయారవుతున్నాయి. ట్రయల్‌రన్ తర్వాత వాటిని ప్రారంభించనున్నారు. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా 16 రూట్లను ఈ రైళ్లకోసం ఖరారు చేశారు. మరిన్ని మార్గాలను కూడా ఎంపిక చేయనున్నారు. సికింద్రాబాద్–పుణే మధ్య వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపే అంశాన్ని కూడా రైల్వే బోర్డు పరిశీలిస్తోంది. ఈ నగరాల మధ్య ప్రస్తుతమున్న పుణే శతాబ్ది రైలు సికింద్రాబాద్‌లో మధ్యాహ్న సమయంలో ప్రారంభమవుతోంది. కానీ రాత్రివేళ సర్వీసు పెట్టాలన్న డిమాండ్ చాలా కాలం నుంచి ఉంది. ఈ క్రమంలో రాత్రివేళ వందే భారత్‌స్లీపర్ సర్వీసును ప్రారంభించి.. ఆ తర్వాత సాధారణ వందే భారత్‌ను శతాబ్ది స్థానంలో ప్రవేశపెట్టాలన్నది రైల్వే యోచన అని సమాచారం.

నాగ్‌పూర్ సర్వీసు విఫలంతో..

సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య 20 కోచ్‌లతో వందే భారత్‌రైలు సేవలు మొదలైన విషయం తెలిసిందే. అయితే ఈ రెండు నగరాల మధ్య నిత్యం నాలుగు రైళ్లు నడుస్తున్న నేపథ్యంలో వందే భారత్‌కు డిమాండ్ లేకుండా పోయింది. ఆక్యుపెన్సీ రేషియో 20 శాతం కూడా ఉండటం లేదు. నెల గడుస్తున్నా దీనికి ఆదరణ పెరగకపోవటంతో కోచ్‌ల సంఖ్యను తగ్గించి.. ఎనిమిది కోచ్‌లకే పరిమితం చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో పుణే సర్వీసు ఎలా ఉంటుందన్న అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. సికింద్రాబాద్–పుణే మధ్య సర్వీసులు తక్కువ. పైగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉన్న నగరాలు కావడం, ప్రయాణికుల డిమాండ్ కూడా ఎక్కువగా ఉండటంతో.. ఈ రెండు నగరాల మధ్య వందే భారత్ సర్వీసు విఫలమయ్యే చాన్స్ లేదని ప్రాథమికంగా తేల్చారు. వందే భారత్‌ను పట్టాలెక్కించాలనే నిర్ణయానికి వచ్చారు. సాధారణ వందే భారత్ సర్వీసా? స్లీపర్ సర్వీసా? అన్నదానిపై మహారాష్ట్ర ఎన్నికల తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ధ్యానముద్రా? 'దండి' యాత్రా?

▶ మొదటి పేజీ తరువాయి

సూచనలను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎంత ఎత్తుతో ఏర్పాటు చేద్దాం..?

ప్రస్తుతం దేశంలోని మహాత్మా గాంధీ విగ్రహాల్లోకెల్లా.. బిహార్ పట్నాలోని గాంధీ మైదాన్‌లో ఉన్న 72 అడుగుల గాంధీ విగ్రహమే అత్యంత ఎత్తయినది. దానిని 2013లో కాంస్యంతో రూపొందించారు. ఇద్దరు చిన్నారులతో గాంధీ ఆప్యాయంగా ఉన్నట్టుగా ఆ విగ్రహాన్ని రూపొందించారు. ఇక గుజరాత్‌లో నర్మదా నది తీరాన ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం ఎత్తు 182 అడుగులు. అది ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం కూడా. ఈ నేపథ్యంలో అంతకన్నా పెద్దదైన విగ్రహం ఏర్పాటు చేద్దామా, రాష్ట్రంలోని బాపూఘాట్‌లో మహాత్ముడి విగ్రహం ఎలా ఉంటే ప్రత్యేకత సంతరించుకుంటుంది? అన్న పరిశీలన జరుగుతోంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా నమూనాలు, డిజైన్లపై సంప్రదింపులు జరుపుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

ప్రపంచ శాంతికి, ఆధ్యాత్మికతకు చిహ్నంగా..

బాపూఘాట్‌ను సౌభ్రాతృత్వానికి సంకేతంగా, ప్రపంచ శాంతికి చిహ్నంగా, అటు ఆధ్యాత్మికంగా, ఇటు విద్యా బోధన కేంద్రంగా రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ప్రపంచంలోని అందరి దృష్టిని ఆకర్షించేలా బాపూఘాట్‌ను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ప్రపంచంలోనే ఎత్తయిన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కూడా పేర్కొన్నారు. ఈ క్రమంలో బాపూఘాట్ వద్ద బ్రిడ్జి కమ్ బ్యారేజీతోపాటు గాంధీ ఐడియాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో అధికారులు బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

దేశ విదేశాల్లోని విగ్రహాల పరిశీలన

దేశ విదేశాల్లో ఎక్కడెక్కడ గాంధీ విగ్రహాలు ఉన్నాయి, ఎక్కడెక్కడ గాంధీ ఆశ్రమాలున్నాయి? ఏయే నమూనాలలో ఉన్నాయనే దానిపై వెంటనే అధ్యయనం చేయాలని సీఎం ఇప్పటికే అధికారులకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా బాపూఘాట్‌లో ఎలాంటి విగ్రహం పెట్టాలి? మూసీ తీరంలో ఎంత ఎత్తున నిర్మించే అవకాశముందనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. గాంధీ బోధనలు, ఆయన ఆచరణ, ఆశయాలను ప్రతిబింబించేలా ఐడియాలజీ సెంటర్‌తోపాటు సమాచార నైపుణ్యం, నైతికత, విలువల కోర్సులను నిర్వహించే ఎడ్యుకేషన్ హబ్‌గా గాంధీ ఆశ్రమం ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

రాష్ట్రంలో అసెంబ్లీ ఎదుట..

రాష్ట్రంలో అసెంబ్లీ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహమే పెద్దది. ధ్యానముద్రలో ఉన్న ఈ విగ్రహం ఎత్తు 22 అడుగులు. 'మైలైఫ్ ఈజ్ మై మెసేజ్' అనే సందేశంతో కాంస్యంతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఇక మన దేశంతోపాటు విదేశాల్లోనూ గాంధీ విగ్రహాలు ఉన్నాయి. అమెరికాలో టెక్సాస్‌లోని ఇర్వింగ్‌లో మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజా వద్ద 8 అడుగుల కాంస్య విగ్రహం ఉంది. భారతదేశం బయట ఉన్న పెద్ద విగ్రహం అదేనని.. గాంధీ దండి మార్చ్‌కు అడుగేస్తున్న ఆకృతిలోని విగ్రహం ఆకట్టుకుంటుందని చెప్తున్నారు.

జార్ఖండ్‌లో కాంగ్రెస్ కూటమి గెలుపు ఖాయం

- ఎన్నికలు పూర్తయ్యేవరకు నియోజకవర్గాలను వదిలిపెట్టకండి
- రాంచీ సమావేశంలో జార్ఖండ్ ఎన్నికల ఇన్‌చార్జి, స్టార్ క్యాంపెయినర్ భట్టి



సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్‌లో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి గెలుపు ఖాయమని ఉపముఖ్యమంత్రి, జార్ఖండ్ ఎన్నికల ఇన్‌చార్జి, స్టార్ క్యాంపెయినర్ మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమిని గెలిపించుకోవాలనే ఉత్సాహం అటు ప్రజల్లోనూ, ఇటు పార్టీ కేడర్‌లోనూ కనిపిస్తోందన్నారు. ఎన్నికల ఇన్‌చార్జిగా జార్ఖండ్‌లో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన భట్టి శుక్రవారం రాంచీలో జరిగిన రాష్ట్ర పీసీసీ నేతలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీల సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ...అసెంబ్లీ ఇన్‌చార్జీలు, జిల్లా కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్ నేతలెవరూ ఎన్నికలు పూర్తయ్యేవరకు తమకు కేటాయించిన నియోజకవర్గాలను వదిలిపెట్టవద్దని సూచించారు. కూటమిలో అసంతృప్తితో ఉన్న నేతలతో చర్చించి వారు ప్రచారంలో పాల్గొనేలా చేయాలన్నారు. ప్రచారాన్ని నిర్వహించాలని, సోషల్‌మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, మేనిఫెస్టో తయారీపై అభిప్రాయాలను తెలిపారు. సమావేశంలో కేసీ వేణుగోపాల్, కేశవ్‌మహతో కమలేశ్, గులాం అహ్మద్ మీర్‌సాబ్, బి.కె.హరి ప్రసాద్, రామేశ్వరరావు పాల్గొన్నారు.

భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర

▶ మొదటి పేజీ తరువాయి

లాగుతారో అర్థం కాదు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నీచ రాజకీయ సంస్కృతి అత్యంత హీనదశకు చేరుకుంది. కాంగ్రెస్‌ను ఐదేళ్ల కోసం ప్రజలు ఎన్నుకున్నారు. ఈ సీఎం ఐదేళ్ల పదవిలో ఉంటారా లేదా అనేది చెప్పలేం. కాంగ్రెస్‌లో ఎప్పుడైనా ఎలాంటి పరిణామమైనా జరగొచ్చు.

ఆ అధికారులను గుర్తుపెట్టుకుంటాం!

విధులు మరిచి, చట్టవిరుద్ధంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై రెచ్చిపోతున్న పోలీస్ అధికారులను గుర్తుపెట్టుకుని.. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కఠినచర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనుల్లో కొందరు పోలీసు అధికారులు బిజీగా ఉండటంతో శాంతిభద్రతలు క్షీణించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలసి పనిచేస్తున్నాయి. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ వంటి పార్టీలపై చర్యలకు బలమైన సంస్కరణలు అవసరం.

కొత్త సంవత్సరంలో జనంలోకి కేసీఆర్..

ఎన్నికల్లో ఓటమి తర్వాత సామాజిక మాధ్యమాల్లో బీఆర్‌ఎస్ మద్దతుదారులు ప్రపంచవ్యాప్తంగా బాగా యాక్టివ్‌గా మారారు. త్వరలో సోషల్ మీడియా విభాగంతో విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. పార్టీ అధినేత కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో పార్టీకి, నాయకులకు ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తున్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుకు సరిపడా సమయం ఇచ్చారు. నూతన సంవత్సరం తర్వాత ఆయన నుంచి మరిన్ని కార్యక్రమాలను చూస్తాం. ప్రతిపక్ష పార్టీగా నూతన నాయకత్వాన్ని తయారు చేసుకునే అవకాశం వచ్చింది. పార్టీ ఫిరాయింపులు జరిగిన పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఖాయం..''అని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్యారంటీల మోసం ఇప్పుడు అర్థమైందా?

అధికారమే లక్ష్యంగా గ్యారంటీల పేరిట కాంగ్రెస్ ఆడిన ఆటలో తెలంగాణ ఏడాదిలోపే ఆగమైందని కేటీఆర్ పేర్కొన్నారు. అడ్డగోలు ఎన్నికల హామీలు సరికాదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''గాలి మాటల గ్యారంటీలిస్తే మొదటికే మోసం వస్తుందని ఇప్పుడు అర్థమైందా? కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ప్రకటించినప్పుడు ఆ రాష్ట్ర బడ్జెట్ గుర్తుకు రాలేదా? ఆరు గ్యారంటీలతో వల వేసినప్పుడు తెలంగాణ బడ్జెట్ గురించి తెలియదా? తెలంగాణ ప్రజలను నమ్మించి వంచించినందుకు కాంగ్రెస్ పార్టీ తప్పు ఒప్పుకోవాలి, క్షమాపణ చెప్పాలి. అనాలోచితంగా ఇచ్చే కాంగ్రెస్ గ్యారంటీలతో భవిష్యత్ తరాలకు కూడా నష్టం జరుగుతుందని ఇప్పటికైనా గుర్తించినందుకు సంతోషం. కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మిన పాపానికి ఏడాది కాలంలో తెలంగాణకు జరిగిన నష్టం పూడ్చలేనిది'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రేవంత్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది

వచ్చే జూన్–డిసెంబర్ మధ్యలో సీఎం మార్పు ఖాయం

- ఏడుసార్లు వెళ్లినా రేవంత్‌కు.. రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు
- రేవంత్ ప్రత్యామ్నాయానికి కాంగ్రెస్ అధిష్టానం చూస్తోంది
- సీఎం ఏకపక్ష ధోరణిని చాలామంది నేతలు ఒప్పుకోవడం లేదు
- సీఎం రేసులో ఉత్తమ్, భట్టి, వెంకట్‌రెడ్డి పోటీ పడుతున్నారు
- మీడియాతో ఇష్టాగోష్టిలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి హనీమూన్ పీరియడ్ ముగిసి కౌంట్‌డౌన్ మొదలైందని... వచ్చే ఏడాది జూన్–డిసెంబర్‌ల మధ్య ఆయన పదవి పోవడం ఖాయమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌కు ప్రత్యామ్నాయం కోసం కాంగ్రెస్ అధిష్టానం చూస్తోందని..కొత్త సీఎంగా ఎవరిని పెట్టాలనే దానిపై రహస్యంగా ఓ కమిటీ అన్వేషణ సాగిస్తోందన్నారు. సీఎం రేసులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ఉన్నారని చెప్పారు. మూసీ ప్రాజెక్ట్ వ్యయం ఒకేసారి రూ.50 వేల కోట్ల నుంచి రూ.లక్షన్నర కోట్లకు పెంచి భారీగా అవినీతికి ప్లాన్ చేశారని, ఏకపక్షంగా సొంత ఎజెండాతో సెలక్షన్, కరప్షన్, బ్లాక్‌మెయిలింగ్ వంటి వాటికి దిగడం దీనికి కారణమని ఆరోపించారు. మూసీ, హైడ్రా కూల్చివేతలతో పేదల్లో కాంగ్రెస్ అభాసుపాలు కావాల్సి వస్తోందని హైకమాండ్ ఆందోళన చెందుతోందన్నారు. శుక్రవారం మహేశ్వర్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కొందరు సీనియర్ మంత్రులు హైడ్రా, మూసీ, ల్యాండ్ సెటిల్‌మెంట్ల మీద రేవంత్‌పై హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినట్టు తమకు సమాచారం ఉందన్నారు. మూసీ ప్రాజెక్టు వ్యయాన్ని మూడొంతులు పెంచి తన స్వార్థం కోసం కాంగ్రెస్‌ను వాడుకుంటున్నారని, ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారని చెప్పారు. రేవంత్ ఏకపక్ష ధోరణిని కూడా పలువురు నేతలు అంగీకరించడం లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కాకుండా రేవంత్‌రెడ్డి తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా హైకమాండ్‌కు చేరాయని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు కూడా సోనియాగాంధీకి ఫిర్యాదు చేశారని, కూల్చివేతలపై నివేదిక సమర్పించారని చెప్పారు. దీనిపై పరిశీలనకు సోనియా సూచనలతో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రంగంలోకి దిగి ఫోన్ చేస్తే రేవంత్ స్పందించలేదన్నారు. ఫోన్ ఎత్తకపోగా హైకమాండ్‌కు తాను స్పందించలేదని రేవంత్‌రెడ్డి పేర్కొనడాన్ని అధిష్టానం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. సీనియర్ మంత్రులు, పార్టీ నేతల ఫిర్యాదులపై కాంగ్రెస్ అధిష్టానం సీరియస్‌గా ఉందని తెలుస్తోందన్నారు. రేవంత్ వ్యతిరేకవర్గం ఢిల్లీలో అధిష్టానం వద్ద గట్టిగా లాబీయింగ్ నిర్వహిస్తోందన్నారు. ఈ కారణంగానే ఇప్పటికే ఏడుసార్లు ఢిల్లీకి వెళ్లినా, రేవంత్‌కు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కేబినెట్ విస్తరణ వాయిదా వేస్తూ వస్తున్నారన్నారు. మొత్తం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటామంటూ ఫిరాయింపులకు రేవంత్‌రెడ్డి తెరతీశారని తెలిపారు. అయితే ఆ పార్టీ నుంచి వచ్చిన పదిమంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు మళ్లీ కేసీఆర్‌తో టచ్‌లోకి వెళ్లారన్నారు. దీంతో పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న అంశానికి భిన్నంగా ఫిరాయింపులు చేపట్టడంపై హైకమాండ్ ఆగ్రహంతో ఉందని చెప్పారు. ఈ పరిణామాల నుంచి బీఆర్‌ఎస్ లాభపడుతుందా అనే ప్రశ్నకు లోక్‌సభ ఎన్నికల్లో డకౌట్ అయ్యి ఏం చేయగలుగుతుందని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్–బీఆర్‌ఎస్ ఒక్కటైనా.. బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగానే వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

కేటీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా జనం నమ్మరు: బండి సంజయ్



బెజ్జంకి (సిద్దిపేట): బీఆర్‌ఎస్ అగ్రనేత కేటీఆర్ పాదయాత్ర కాదు.. మోకాళ్లపై యాత్ర చేసినా ప్రజలు నమ్మరని బీజేపీ జాతీయ కార్యదర్శి, కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంగ రవి ఇంట్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై తాను పాదయాత్ర చేస్తే బీఆర్‌ఎస్ దాడి చేయించిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారన్నారు. కేటీఆర్ అతి మాటలతో నాయకులు పార్టీని వీడుతున్నారని సంజయ్ తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దొందూదొందేనని ఎద్దేవాచేశారు. అధికారంలోకి వచ్చాక 6 గ్యారంటీలు అమలుచేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బెజ్జంకి ప్రజల ఆకాంక్ష మేరకు మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని సంజయ్ తెలిపారు.

దేని కోసం పాదయాత్ర?

కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలను మరోమారు మోసం చేసేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మళ్లీ డ్రామాలు మొదలు పెట్టారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వ్యాఖ్యానించారు. రాష్ట్రమంతా పాదయాత్ర చేస్తానని ఆయన చెబుతుంటే దేనికో అర్థంకావడం లేదన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హరీశ్‌రావును ప్రతిపక్ష నేతగా చేయాలనుకుంటున్న కేసీఆర్ దగ్గర మార్కులు కొట్టేయడానికి పాదయాత్ర చేస్తారా? లేక సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిరుద్యోగులు, మహిళలకు పెద్దపీట వేస్తున్నారని చాటింపు వేయడానికి పాదయాత్ర చేస్తారా? కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర మాట అటుంచి ముందు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్ నుంచి బయటకు తీసుకురావాలని అన్నారు. కేటీఆర్‌కు పాదయాత్ర చేసే నైతిక అర్హత లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని చెప్పారు.

'కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటే భయమెందుకు?'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా సమస్యలపై కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటే ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ కంటే ముందే బండి సంజయ్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్ ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వ నిర్వాకం బయటపడి, ఆయనకు ఇబ్బంది వస్తుందని సంజయ్ బాధపడుతున్నట్లు కనిపిస్తుందని శుక్రవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

నటుడు చారుహాసన్‌కు అస్వస్థత

తమిళసినిమా: సీనియర్ నటుడు, దర్శకుడు చారుహాసన్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన వయసు 93 ఏళ్లు. నటుడు కమలహాసన్‌కు ఈయన అన్నయ్య. నటి సుహాసినికి తండ్రి. చారుహాసన్ 1931 జనవరి 5న పరమకుడిలో జన్మించారు. 1979లో ఉదిరి పూక్కల్ చిత్రం ద్వారా నటుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో అనేక చిత్రాల్లో నటించారు. బుధవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చినట్లు ఆమె కుమార్తె సుహాసిని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. చారుహాసన్‌ను పరీక్షించిన వైద్యులు ఆయనకు శస్త్ర చికిత్స అవసరమని చెప్పినట్లు సుహాసిని పేర్కొన్నారు.

మనోళ్ల ఆశలు ఆవిరి

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు చెబుతున్నారు.

ఆ రోజులు పోయాయ్!

విదేశాల్లో ముఖ్యంగా అమెరికాలో ఎమ్మెస్ చదువు చాలామంది విద్యార్థులకు ఓ కల. ముఖ్యంగా బీటెక్ పూర్తి చేయగానే ఏదో ఒక వర్సిటీలో చదువుకోసం ప్రయత్నించేవారు. వీలైనంత త్వరగా ఎమ్మెస్ పూర్తి చేస్తే, ఫుల్‌టైమ్ జాబ్‌తో త్వరగా సెటిల్ అవడానికి వీలవుతుందని భావించేవారు. అప్పు చేసి మరీ విమానం ఎక్కేసేవారు. ఎమ్మెస్ చేస్తూనే ఏదో ఒక పార్ట్ టైమ్ జాబ్‌తో ఎంతోకొంత సంపాదించుకోవడానికి ఆసక్తి చూపేవారు. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది. పరిస్థితి అంత సాను కూలంగా లేదని కన్సల్టెన్సీలు, ఇప్పటికే అక్కడ ఉన్న విద్యార్థులు చెబుతున్నారు. 2021లో 4.44 లక్షల మంది విదేశీ విద్యకు వెళ్తే, 2022లో ఈ సంఖ్య 6.84 లక్షలుగా ఉంది. 2023లో కూడా పెరుగుదల నమోదైనా 2024కు వచ్చేసరికి విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇక ప్రస్తుత పరిస్థితిని, విద్యార్థుల నుంచి వస్తున్న ఎంక్వైరీలను బట్టి చూస్తే 2025లో ఈ సంఖ్య మరింత తగ్గే వీలుందని కన్సల్టెన్సీలు అంచనా వేస్తున్నాయి.

వెళ్లినవారికి ఉపాధి కష్టాలు

ప్రస్తుతం మారిన పరిస్థితుల్లో విదేశాల్లో స్కిల్డ్ ఉద్యోగం దొరకడం గగనంగా మారుతోందని, అన్ స్కిల్డ్ ఉద్యోగాలకు కూడా విపరీతమైన పోటీ ఉందని అంటున్నారు. ఆర్థిక సంక్షోభంతో అమెరికా, కెనడా లాంటి దేశాల్లో ఉద్యోగాలు తీసివేసే పరిస్థితి నెలకొనడం, మరోవైపు భారత్ సహా ఇతర దేశాల నుంచి వచ్చినవారి సంఖ్య ఇప్పటికే గణనీయంగా పెరిగిపోవడం ఇందుకు కారణమని తెలుస్తోంది. మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా ప్రభావం చూపిస్తోందని అంటున్నారు. రోజూ పదుల సంఖ్యలో ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తున్నా, ప్రయత్నాలు కొనసాగిస్తున్నా.. ఉద్యోగం రాకపోవడం మాట అలా ఉంచితే కనీసం ఇంటర్వ్యూకు పిలిచే పరిస్థితి కూడా ఉండటం లేదని తెలుస్తోంది. విదేశాలకు వెళ్ళేందుకు అవసరమైన సెక్యూరిటీ మొత్తం, అక్కడి ఫీజులు ఖర్చుల కోసం ఒక్కో విద్యార్థి కనీసం రూ.40 లక్షల వరకు అవసరం. కాగా ఈ మేరకు అప్పు చేసి వెళ్లేవారి సంఖ్యే ఎక్కువగా ఉండేది. ఏదో ఒక పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ ఖర్చులకు సరిపడా సంపాదించుకోవడంతో పాటు రుణం తీర్చగలమనే ధీమా గతంలో ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది.

ఆఫర్ లెటర్లు ఇచ్చినా..

చాలా కంపెనీలు ఏడాది క్రితం ఆఫర్ లెటర్ ఇచ్చినా కూడా ఉద్యోగాలు ఇవ్వని పరిస్థితి అమెరికాలో కొనసాగుతోంది. తాజాగా నాస్కామ్ జరిపిన ఓ సర్వేలో ఇలాంటి వాళ్ళు అమెరికాలో 20 వేల మంది ఉన్నట్టు తేలింది. ఆస్ట్రేలియాలో ఇచ్చిన ఆఫర్లు వెనక్కు తీసుకుంటున్నట్లు సమాచారం. అప్పు తీర్చలేక, ఇండియా రాలేక, అమెరికాలో ఉద్యోగం లేకుండా ఉండలేక విద్యార్థులు నానా అవస్థలూ పడుతున్నారు.

దేశంలో ఐటీ సెక్టార్‌పైనా ప్రభావం

అమెరికాలో ఆర్థిక సంక్షోభం ఇండియా ఐటీ సెక్టార్‌పైనా ప్రభావం చూపించింది. పలు కంపెనీలు వరుసగా లేఆఫ్‌లు ప్రకటించడంతో ఐటీ విభాగం కుదేలైంది. క్యాంపస్ నియామకాలు తగ్గాయి. దీంతో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు ఆఫ్ క్యాంపస్ ఉద్యోగాలు వెతుక్కోవాల్సి వస్తోంది. పోటీ తీవ్రంగా ఉండటంతో ఫ్రెషర్స్ పోటీని తట్టుకుని నిలబడటం కష్టంగా ఉంది.

నైపుణ్యం సమస్య!

దేశవ్యాప్తంగా ఏటా 12 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు మార్కెట్లోకి వస్తున్నారు. వీరిలో 8% మందికి మాత్రమే అవసరమైన నైపుణ్యం ఉంటున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వీళ్లే బహుళజాతి కంపెనీల్లో మంచి వేతనంతో ఉద్యోగాలు పొందుతున్నారని పేర్కొంటున్నాయి. స్వల్ప సంఖ్యలో విద్యార్థులు చిన్నాచితకా ఉద్యోగంతో సరిపెట్టుకుంటుండగా, ఎక్కువమంది అన్‌స్కిల్డ్ ఉద్యోగులుగా లేదా నిరుద్యోగులుగా కొనసాగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. తాజాగా అమెరికాలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం పరిస్థితిని మరింత దిగజార్చిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే విదేశాలకు వెళ్లినవారి సంఖ్య 2024లో గణనీయంగా తగ్గిందని అంటున్నారు.

మంచి ఉద్యోగం మానుకుని అమెరికా వచ్చా

"బీటెక్ అవ్వగానే ఓ ఎంఎన్‌సీలో మంచి ఉద్యోగం వచ్చింది. రెండేళ్లలో ప్రమోషన్లు కూడా వచ్చాయి. కానీ అమెరికా వెళ్లాలనే కోరికతో అప్పు చేసి ఇక్కడికి వచ్చా. ప్రస్తుతం ఎంఎస్ పూర్తి కావొచ్చింది. కానీ జాబ్ దొరికే అవకాశం కన్పించడం లేదు. ఇప్పటికీ డబ్బుల కోసం ఇంటి వైపే చూడాల్సి వస్తోంది.

- మైలవరపు శశాంక్
(అమెరికా వెళ్లిన ఖమ్మం విద్యార్థి)

10 మంది కూడా ఉండటం లేదు

రెండేళ్ల క్రితం వరకూ అమెరికాలో ఎంఎస్ గురించి రోజుకు సగటున 50 మంది వాకబు చేసేవారు. ఇప్పుడు కనీసం పది మంది కూడా ఉండటం లేదు. కెనడాలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతుండటం, అమెరికాలో ఉద్యోగాలు వస్తాయన్న నమ్మకం సన్నగిల్లడమే ఈ పరిస్థితికి కారణం.

- జాన్సన్
యూఎస్ కన్సల్టింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు

పరిస్థితి అంతంతమాత్రంగానే..

అమెరికాలో ఐటీ రంగం పరిస్థితి ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉంది. కొందరు ఉన్న ఉద్యోగాలు కోల్పోతున్నారు. భారతీయ విద్యార్థులు నూటికి కనీసం ఆరుగురు కూడా కొత్తగా స్కిల్డ్ ఉద్యోగాలు పొందడం లేదు."

- అమెరికాలోని భారతీయ కన్సల్టెన్సీ సంస్థ ఎన్‌వీఎన్

పీహెచ్‌సీల్లో స్పెషలిస్టు వైద్య సేవలు

పైలట్ ప్రాజెక్టుగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రారంభం ● వారానికి 3 రోజులు వైద్యం



యాదగిరిగుట్ట పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహిస్తున్న చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ నవీన్‌సింగ్.

సాక్షి, యాదాద్రి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిపుణులైన డాక్టర్లతో వైద్య సేవలు అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పీహెచ్‌సీలలో ప్రాథమిక వైద్యంతో పాటు స్పెషలిస్ట్ వైద్య సేవలను రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా యాదాద్రి భువనగిరి జిల్లాలో శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల 26వ తేదీ వరకు పీహెచ్‌సీలలో వారానికి మూడు రోజులు క్యాంపులు నిర్వహిస్తారు. వైద్య, ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్‌లు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 29 మంది నిపుణులైన వైద్యులు పీహెచ్‌సీలకు వెళ్లి 12 రకాల వైద్య సేవలు అందిస్తారు. ఇందుకోసం భువనగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక షెడ్యూల్‌ను రూపొందించింది. భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో పనిచేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులు ఆయా పీహెచ్‌సీలకు వెళతారు. వీలైతే అక్కడే వైద్యం చేసి మందులను ఇస్తారు. అవసరాన్ని బట్టి మెరుగైన వైద్యం కోసం భువనగిరి మెడికల్ కళాశాల, జిల్లా కేంద్ర ఆస్పత్రి, జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాల్లో పీడియాట్రిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ఈఎన్‌టీ, సైక్రియాట్రిక్, దంత వైద్యం, ఫిజియోథెరపీ, చర్మవ్యాధులు, సాధారణ శస్త్ర చికిత్సలకు పరీక్షలు నిర్వహిస్తామని భువనగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ తెలిపారు.

క్లుప్తంగా...


9న అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్

ఈనెల 8 వరకు దరఖాస్తుకు గడువు



బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తులకు ఈనెల 8 చివరి తేదీ అని విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపా రు. ఈనెల 9న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో మాత్రమే ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తారని వెల్లడించారు. ఐసెట్–2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించే ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్–2024లో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రవేశం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ ఆన్‌లైన్. ఇన్ లేదా వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్ ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

గిరిజన వర్సిటీకి 211 ఎకరాల భూమి కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: సమ్మక్క–సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి అవసరమైన భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 837/1లో ఉన్న 211 ఎకరాల 26.5 గుంటల భూమిని ఈ విశ్వవిద్యాలయం కోసం కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ శుక్రవారం జీవో నం 114 విడుదల చేశారు. ఈ మేరకు ఆ భూమిని ఉచితంగా యూనివర్సిటీకి కేటాయిస్తున్నట్టు తెలిపారు. వాస్తవానికి ఈ భూమి మార్కెట్ విలువ ప్రకారం రూ.10.58 కోట్లు అవుతుందని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన ఫొటో జర్నలిజం డే కార్యక్రమంలో జి.శ్రీనివాసులు మెమోరియల్ అవార్డు, ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని మహబూబాబాద్ 'సాక్షి' ఫొటో జర్నలిస్టు జిల్లెలమూడి మురళీమోహన్‌కు అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు, మాజీ పార్లమెంట్ సభ్యుడు గోకరాజు గంగరాజు.

14 నుంచి హెచ్‌డబ్ల్యూఓ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



సాక్షి, హైదరాబాద్: పలు సంక్షేమ శాఖల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (గ్రేడ్–2) ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు నాంపల్లిలోని పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక జరిగిందని, డిజేబుల్ కేటగిరీలో మాత్రం 1:5 నిష్పత్తిలో చేసినట్లు వెల్లడించారు. పరిశీలన తేదీల వారీగా అభ్యర్థులు వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. నిర్దేశించిన తేదీల్లో అన్ని రకాల ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. పరిశీలన ప్రక్రియకు గైర్హాజరైతే మరోమారు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు సమర్పించేందుకు ఈనెల 13వ తేదీ నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

తొలిసారిగా గవర్నర్ ప్రతిభా అవార్డులు

ఒక్కో అవార్డుకు రూ.2 లక్షలతో పాటు మెడల్

- నేటి నుంచి ఈ నెల 23 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 'గవర్నర్ ఎట్ హోం'కార్యక్రమంలో అవార్డుల ప్రదానం
- గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడి



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో తొలిసారిగా 'గవర్నర్ ప్రతిభా అవార్డులు'ఇచ్చేందుకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నిర్ణయించారు. ఈ అవార్డులను వచ్చే ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'గవర్నర్ ఎట్ హోం'కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రదానం చేస్తారని గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. ఒక్కో అవార్డుకు రూ.2 లక్షలతో పాటు ఒక మెడల్ కూడా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రాజ్‌భవ న్‌లో శుక్రవారం బుర్రా వెంకటేశం విలేకరులతో మాట్లాడుతూ...అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు, సొసైటీలు, ట్రస్టుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణలో పనిచేసిన వారు, తెలంగాణేతరులైనా దరఖాస్తు చేసుకోవచ్చని అయితే రాష్ట్రంలో కనీసం ఐదేళ్లు పని చేస్తూ ఉండాలని చెప్పారు. ఈ దరఖాస్తుల స్వీకరణ నవంబర్ 2 నుంచి ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు.

నాలుగు విభాగాల నుంచి ఆహ్వానం...

దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని బుర్రా వెంకటేశం వెల్లడించారు. https://governor.telangana.gov.in లేదంటే గవర్నర్ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ సెక్రటేరియట్, రాజ్‌భవన్, సోమాజిగూడ, హైదరాబాద్ – 500041 కు స్పీడ్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా అన్ని డాక్యుమెంట్లతో పాటు సమర్పించాలని కోరారు. గవర్నర్ ఎంపిక చేసిన కమిటీ అన్ని దరఖాస్తులను పరిశీలించి అవార్డులను ఎంపిక చేస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, ఆటల విభాగం, సాంస్కృతిక రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇందులో ఎనిమిది మందికి అవార్డులు ఇవ్వనున్నారు.

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు తీరు బాగుంది

కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా



సంజీవ్ చోప్రాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోలు విష యంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యవస్థాగత మార్పులు బాగున్నాయని కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా పేర్కొన్నా రు. శుక్రవారం ఆయన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా పౌరసరఫరాల విభాగం కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు, ఈ విషయంలో తీసుకొచ్చిన మార్పుల గురించి మంత్రి ఆయనకు వివరించారు. ఈ భేటీలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ చౌహాన్, ఎఫ్‌సీఐ ఈడీ లాజరస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంజీవ్ చోప్రా ఏజీ కాలనీలోని చౌక ధరల దుకాణాన్ని సందర్శించారు. సరుకులు అందుతున్న తీరును కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. చౌక ధరల దుకాణం నిర్వహణ ద్వారా సమకూరుతున్న ఆదాయం గురించి డీలర్‌ను ప్రశ్నించారు. నెలకు రూ.30 వేల ఆదాయం వస్తోందని డీలర్ పేర్కొనగా, విక్రయాలు పెంచుకోవటం ద్వారా రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే వీలుంటుందని చోప్రా చెప్పారు. అనంతరం ఆయన ఎర్రమంజిల్ కాలనీలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి వెళ్లి చౌక ధరల దుకాణాల పర్యవేక్షణ విధానం, ఇతర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు.

విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల సంగమమే భారత్: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాజ్‌భవన్‌లో ఘనంగా 8 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల వ్యవస్థాపక దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాల సంగమమే భారతదేశమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వ్యాఖ్యానించారు. నవంబర్ 1న దేశంలోని ఎనిమిది రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాల వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం రాజ్‌భవన్‌లోని సంస్కృతి హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే నినాదంతో భారతదేశ కీర్తిని ప్రధాని నరేంద్రమోదీ విశ్వవ్యాప్తం చేశార న్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవాలు జరుపుకున్న రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. శుక్రవారం వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా , కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడుతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్–నికోబార్ దీవులు, చండీగఢ్, ఢిల్లీ, లక్షద్వీప్, పుదుచ్చేరిలున్నాయి. ఈ వేడుకల్లో పద్మశ్రీ పద్మజారెడ్డి బృందం ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి రాజేశంగౌడ్, త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, ప్రమోద్ అగ్రవాల్

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుందాం

ఏపీ ప్రజలకు వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుందామని వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

చినజీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవాలు ప్రారంభం



శ్రీరామనగరంలోని దివ్యసాకేతాలయంలో తీర్థ గోష్టి నిర్వహిస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ముచ్చింతల్ శివారులోని శ్రీరామనగరంలో ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. చినజీయర్‌స్వామి దివ్యసాకేతాలయంలో ఉదయం తీర్థగోష్టి, ఆరాధన నిర్వహించారు. అనంతరం జీయర్ అవార్డులను ప్రదానం చేశారు. ఖగేంద్రాచార్య సువేదీ శుక్ల యజుర్వేద సలక్షణ ఘనాపాటి 31వ జీయర్ పురస్కారం అందుకున్నారు. డాక్టర్ శ్రీమాన్ బేతవోలు రామబ్రహ్మంను విద్వన్మణి అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ్ జీయర్ స్వామి, మైహోం గ్రూప్స్ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

40% పెరిగిన డైట్, కాస్మెటిక్ చార్జీలు

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యా సంస్థల్లోని విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ గురువారం జారీ చేశారు. ఏడేళ్ల తర్వాత ఈ చార్జీలను 40శాతం మేర పెంచగా, ఇవి నవంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. చార్జీల పెంపు పట్ల మంత్రి సీతక్క, ఎంపీ మల్లు రవి, ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, ఎన్.శ్రీధర్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల విద్య జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్.బాలరాజు, కె.యాదయ్య, పి.రుషికేశ్‌కుమార్, ఎం.వెంకటేశ్వర్లు, గురుకుల ఉపాధ్యాయ సంఘాల జేఏసీ అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జనార్దన్ వేర్వేరు ప్రకటనల్లో శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.



సీఎంను కలసి కృతజ్ఞతలు చెప్పిన మంత్రి సీతక్క

రాష్ట్రంలోని హాస్టల్ విద్యా ర్థులకు పెంచిన డైట్, కాస్మెటిక్ చార్జీలు గ్రీన్‌చా నల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. పెరిగిన డైట్ చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లకు, హాస్టల్ సిబ్బందికి ఉందని చెప్పారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల విద్యారంగ సమస్యలు త్వరిత గతిన పరిష్కారం అవుతున్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచినందుకు రేవంత్‌రెడ్డిని కలిసి మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ పోలీస్‌కు కేంద్ర పురస్కారాలు

కేంద్ర హోంమంత్రి బెస్ట్ ఇన్వెస్టిగేషన్ అవార్డుకు ఎస్పీ భాస్కరన్

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ పనితీరు కనబర్చిన తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. ప్రతి ఏడాది అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రకటించే 'కేంద్ర హోంమంత్రి దక్షత పథక్' అవార్డుకు రెండు విభాగాల్లో కలిపి మొత్తం 26 మంది తెలంగాణ పోలీసు అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా పోలీసు బలగాలు, భద్రతా సంస్థ, ఇంటెలిజెన్స్ విభాగాలు, కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, ఎన్ఎస్‌జీ (నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్), అసోం రైఫిల్స్‌తోపాటు నేర దర్యాప్తులో ఉత్తమ పనితీరు కనబర్చిన ఫోరెన్సిక్ సైన్స్ సిబ్బందికి ఈ అవార్డులు ఇస్తున్నారు. 2024కు గాను మొత్తం 463 మంది సిబ్బంది అవార్డులకు ఎంపికై నట్టు కేంద్ర హోంశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ నుంచి స్పెషల్ ఆపరేషన్ ఫీల్డ్ విభాగంలో ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ భాస్కరన్. ఆర్, ఇన్‌స్పెక్టర్లు భీసం హరిప్రసాద్, కాంపల్లి శ్రీనివాస్, చీగూరి సుదర్శన్‌రెడ్డి, గ్రూప్ కమాండర్ జాజాల రాఘవేంద్రరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు చారి రాంబాబు, డొంకల రాంబాబు, సోము గౌతంరెడ్డి, పొన్న సంతోష్‌కుమార్, దుండిగల్ల రాజేశ్, ఏఆర్ఎస్సై మహ్మద్ ముజీబ్, హెడ్‌కానిస్టేబుళ్లు దేవులపల్లి మోహన్‌రెడ్డి, పండరి రవీందర్, సీనియర్ కమాండోలు తిప్పని రాకేశ్, ఉడుతనూరి మల్లేశ్, కానిస్టేబుళ్లు కదారి హరిబాబు, అంగీల జెడియో డార్లింగ్ మార్కస్, డి.రామచంద్రారెడ్డి, మదారి నాగరాజు, పట్లావత్ రాజేందర్, కేసరి శ్రీకాంత్ గౌడ్, జూనియర్ కమాండో గంటా సాయి కుమార్ ఉన్నారు. అలాగే ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఐపీఎస్ అధికారి సంగ్రామ్‌సింగ్ పాటిల్, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి పులిమామిడి, డీఎస్పీ సత్యనారాయణ దీపు, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి మామిళ్ల ఉన్నారు.

నేటి నుంచి శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈక్రమంలో స్వామివారి గర్భాలయ అభిషేకాలను రద్దు చేశారు. శని, ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున మల్లికార్జునస్వామి అలంకార దర్శనానికి మాత్రమే భక్తులను అనుమతిస్తారు. వచ్చే కార్తీక సోమవారాలు, పౌర్ణమి రోజున పుష్కరిణి వద్ద లక్షదీపార్చన, పుష్కరిణి హారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలా తోరణోత్సవం, కృష్ణవేణి నదీమా తల్లికి పుణ్య నదీహారతులు ఇస్తారు. భక్తులు కార్తీక దీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ దక్షిణ మాడవీధిలో, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సెక్రటేరియట్ సెక్యూరిటీ విధుల్లోకి టీజీఎస్పీఎఫ్ సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం భద్రత విధుల్లో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) శుక్రవారం చేరారు. తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో సెక్రటేరియట్ భద్రత విధుల నుంచి టీజీఎస్పీని తప్పించి టీజీఎస్పీఎఫ్‌కి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సచివాలయం భద్రత కోసం ప్రస్తుతం 212 మంది టీజీఎస్పీఎఫ్ సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు కేటాయించారు. శుక్రవారం బాధ్యతల సందర్భంగా టీజీఎస్పీఎఫ్ సిబ్బంది సచివాలయం ప్రాంగణంలోని అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించి, కవాతు నిర్వహించారు.

ఏపీలోనూ టెస్కో విక్రయాలు

కొత్తగా 5 చోట్ల ఏర్పాటుకు సన్నాహాలు ● పోచంపల్లి, గద్వాల సహా ఇతర ఉత్పత్తుల విక్రయాలు

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో తయారయ్యే నేత వస్త్రాలను పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ విక్రయించేందుకు తెలంగాణ చేనేత సహకార సంస్థ (టెస్కో) సన్నాహాలు చేస్తోంది. సంస్థ కార్యకలాపాల విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఏపీలోనూ కొత్తగా ఐదు ప్రదర్శన, విక్రయశాలలు (షోరూంలు) ఏర్పాటు చేయనుంది. మరోవైపు ఆన్‌లైన్ విక్రయాలకు వస్తున్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని మరిన్ని విభిన్న డిజైన్లు, ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. తద్వారా నేత రంగంపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని టెస్కో వర్గాలు చెబుతున్నాయి.



దక్షిణాదిలో విక్రయాలపై కూడా దృష్టి

టెస్కో పరిధిలో దేశవ్యాప్తంగా 32 షోరూమ్‌లు ఉన్నాయి. వీటిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తొమ్మిది, రాష్ట్రంలోని ఇతర చోట్ల 15 షోరూమ్‌లు ఉన్నాయి. ఏపీ పునర్విభజనకు ముందు ఉమ్మడి చేనేత సహకార సంస్థ ఆప్కో పరిధిలో ఉన్న మరో ఎనిమిది షోరూమ్‌లు కూడా టెస్కో పరిధిలోకి వచ్చాయి. టెస్కో ఆధ్వర్యంలో ప్రస్తుతం న్యూఢిల్లీలో 3, ముంబైలో 2, కోల్‌కతా, ఔరంగాబాద్, కాన్పూర్‌లో ఒక్కో షోరూమ్ ఉంది.రాష్ట్రం బయట ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రమే టెస్కో షోరూమ్‌లు ఉండటంతో దక్షిణాదిపై దృష్టి సారించి అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టెస్కో అధికారుల బృందం ఇప్పటికే ఏపీలోని విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నంలో పరిశీలించి షోరూమ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసింది. తమిళనాడు, కర్ణాటకలోనూ తెలంగాణ వస్త్రోత్పత్తులను విక్రయించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఏడు క్లస్టర్లలో వస్త్రోత్పత్తులు

ప్రస్తుతం తెలంగాణలో ఏడు చేనేత క్లస్టర్లు గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, సిద్దిపేట, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో నేత కార్మికులు వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారు. గద్వాలలో కాటన్, సిల్క్, సీకో, పైటాన్, నారాయణపేటలో కాటన్, సిల్క్, పోచంపల్లిలో టై అండ్ డై, కాటన్, సిల్క్ డ్రెస్ మెటీరియల్, పట్టుచీరలు, డ్రెస్ మెటీరియల్స్, ఇక్కత్ ఉత్పత్తులు ఉన్నాయి. సిద్దిపేటలో గొల్లభామ, వరంగల్ ధర్రీస్, కరీంనగర్ లుంగీలు, టవల్స్, మహబూబ్‌నగర్ ఊలు ఉత్పత్తులకు పేరొందాయి. మహదేవ్‌పూర్‌లో తయారయ్యే టస్సర్ సిల్క్‌కు మంచి ఆదరణ ఉంది. ప్రస్తుతం టెస్కో షోరూమ్‌లలో 233 రకాల విభిన్న వస్త్రోత్పత్తులకు సంబంధించి ఏటా రూ.30 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నాయి.

ఆన్‌లైన్ విక్రయాలపై టెస్కో దృష్టి

టెస్కో అనుసరిస్తున్న 'ఈ–మార్కెటింగ్'కు ఆదరణ పెరుగుతుండటంతో ఆన్‌లైన్ విక్రయాలపైనా టెస్కో దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా ఏటా సగటున రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఉత్పత్తులు అమ్మకం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ వస్త్ర ఉత్పత్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో విక్రయించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

> ఎవని మనస్సు సర్వ జీవరాసులందు సమత్వమును గ్రహించునో, అతడు ఇహమందే సంసార సముద్రమును దాటినవాడగుచున్నాడు.
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 2 నవంబర్ 2024

అమెరికా కొత్త ఆంక్షలు!

అనుకున్నది సాధించటం కోసం, మాట వినని దేశాలను దారికి తెచ్చుకోవటం కోసం ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించటం అమెరికాకు అలవాటైన విద్య. దాన్ని సహేతుకంగా వినియోగిస్తున్నామా... ఆశించిన ఫలితాలు వస్తున్నాయా దుష్పరిణామాలు పుట్టుకొస్తున్నాయా అనే ఆలోచన దానికి ఎప్పుడూ రాలేదు. 'ప్రపంచంలో అగ్రజులం, మన మాట చెల్లుబాటు కావాలంతే...' అన్న పట్టింపే అధికం. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి తోడ్పడుతున్నారని ఆరోపిస్తూ ప్రపంచవ్యాప్తంగా 400 సంస్థలపైనా, వ్యక్తులపైనా ఆంక్షలు విధిస్తున్నట్టు అమెరికా విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. ఇందులో మన దేశానికి సంబంధించి 19 ప్రైవేటు సంస్థలున్నాయి. ఇంకా ఈ జాబితాలో చైనా, మలేసియా, థాయ్‌లాండ్, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తదితరాలున్నాయి. ఈ దేశాలన్నీ రష్యాకు ఉపకరణాలు, విడిభాగాలు పంపుతున్నాయనీ, వీటితో ఆయుధాలకు పదునుపెట్టుకుని రష్యా ఉక్రెయిన్‌పై దురాక్రమణ యుద్ధం కొనసాగిస్తోందనీ అమెరికా ఆరోపణ. వీటిల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, విమాన విడిభాగాలూ ఉన్నాయంటున్నది. పరాయి దేశాలపై ఆంక్షలు విధించేందుకు ఏ దేశానికైనా హక్కుంటుంది. కానీ ఆ దేశాలతో ఉన్న స్నేహసంబంధాలూ, ద్వైపాక్షిక ఒప్పందాలూ వగైరా చూసుకోవటం, అంతకుముందు సంబంధిత దేశాలతో చర్చించటం కనీస మర్యాద. అమెరికా ఎప్పుడూ ఈ మర్యాద పాటించిన దాఖలా లేదు.

ఎప్పుడూ స్వీయప్రయోజనాలే పరమావధిగా భావించే అమెరికా తన విదేశాంగ విధాన లక్ష్యాలను నెరవేర్చుకోవటానికి ఆంక్షల్ని ఆయుధంగా మలుచుకోవటం పాత కథే. అయితే ఈమధ్యకాలంలో ఇది బాగా ముదిరిందని ఒక అధ్యయనం చెబుతోంది. దాని ప్రకారం మొదటి ప్రపంచయుద్ధానికీ (1914–18), 2000 సంవత్సరానికీ మధ్య అమెరికా 200కు పైగా ఆంక్షలు విధించిందని తేలింది. చిత్రంగా అటు తర్వాత ఈ రెండు దశాబ్దాలపైగా కాలంలో ఈ ఆంక్షలు తొమ్మిదిరెట్లు పెరిగాయని ఆ అధ్యయనం వివరిస్తోంది. అంటే ఎనిమిది దశాబ్దాల కాలంలో అమెరికా విధించిన ఆంక్షల సంఖ్య చాలా స్వల్పం. జాతీయ భద్రత, విదేశాంగ విధానం, ఆర్థికాంశాలు... ఒకటేమిటి అనేకానేక అంశాల విషయంలో ఈ ఆంక్షల జడి పెరిగిపోయింది. క్యూబా, వెనెజులా, ఇరాన్, ఇరాక్ తదితర దేశాలు ఈ ఆంక్షల పర్యవసానాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయి. అసలు అవతలి దేశం నుంచి ఆశిస్తున్నదేమిటో చెప్పకుండానే వీటిని వినియోగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. సాఫల్య వైఫల్యాలను అమెరికా గమనంలోకి తీసుకుంటున్నదా లేదా అనే సంశయం కూడా లేకపోలేదు. ఎందుకంటే ఈ మొత్తం ఆంక్షలవల్ల నెరవేరిన ప్రయోజనాలు ఆశించిన లక్ష్యాల్లో 34 శాతం దాటవన్నది ఆ అధ్యయన సారాంశం. ఈ ఆంక్షలు వికటించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు ఇరాక్‌లో రసాయన ఆయుధాలున్నాయని ప్రపంచాన్ని నమ్మించి ఆ దేశంపై దండెత్తిన అమెరికా అంతకుముందూ ఆ తర్వాత దాన్ని ఆంక్షల చక్రబంధంలో బంధించింది. అందువల్ల పసిపిల్లలకు పాలడబ్బాలు మొదలుకొని ప్రాణావసరమైన ఔషధాల వరకూ ఎన్నో నిత్యావసరాలు కరువై లక్షలమంది మృత్యువాత పడ్డారు. తాను ఆంక్షలు విధించటంతో సరిపెట్టక మిత్రులైన పాశ్చాత్య దేశాలను కలుపుకోవటం అమెరికా విధానం. అంతా అయినాక, ఇరాక్ పాలకుడు సద్దాం హుస్సేన్ ఉసురు తీశాక అక్కడ రసాయన ఆయుధాలున్నాయనటం పచ్చి అబద్ధమని తేలింది. మరి లక్షలమంది జనం ఉసురు తీసిన పాపం ఎవరిది? ఇరాన్‌లో సరేసరి... అక్కడ తన అనుకూలుడైన ఇరాన్ షా పదవీ భ్రష్టుడైంది మొదలుకొని ఆంక్షల పరంపర కొనసాగిస్తూనే ఉంది. ఇందువల్ల మన దేశం సైతం ఆర్థికంగా ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. అందుకే ఈ అర్థరహిత ఆంక్షల్ని దాటుకుని, నష్టం కనిష్ట స్థాయిలో ఉండేలా తెలివిగా వ్యవహరించే దేశాల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. ఉదాహరణకు 2017–2021 మధ్య యూరప్ దేశాలకు రష్యాతో ఉన్న వాణిజ్యం ఉక్రెయిన్ యుద్ధం తర్వాత 5 శాతం తగ్గింది. అదే సమయంలో రష్యాకు ఆర్మేనియా, యూఏఈ, కజఖ్‌స్తాన్, ఉజ్బెకిస్తాన్, హాంకాంగ్‌లతో వాణిజ్యం పెరిగింది. మరోపక్క ఈ దేశాలన్నిటితో యూరప్ దేశాల వాణిజ్యం ఎన్నో రెట్లు పెరిగింది. అంటే రష్యానుంచి కొనుగోలు చేస్తున్న సరుకంతా ఈ దేశాలు యూరప్ దేశాలకు తరలిస్తున్నాయి. ఇక ఆంక్షల ప్రయోజనం ఏం నెరవేరినట్టు? రష్యా నుంచి మన ముడి చమురు దిగుమతులు భారీగా పెరగటం, యూరప్ దేశాలకు శుద్ధిచేసిన చమురునూ, గ్యాస్‌నూ మన దేశం విక్రయించటం ఇటీవలి ముచ్చట.

అసలు ఆంక్షల వల్ల ఒరిగేది లేకపోగా నష్టం ఉంటుందని అమెరికా గుర్తించకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. భారత్ మిత్రదేశం. అసలే అమెరికాలో స్థిరపడిన ఖలిస్తానీ వేర్పాటువాద నాయకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర విషయంలో ఇటీవల సంబంధాలు దెబ్బతిన్నాయి. అవి మరింత దిగజారేలా ఆంక్షలకు దిగటం నిజంగా ప్రయోజనాన్ని ఆశించా లేక నాలుగురోజుల్లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో గొప్పలు చాటుకోవటానికా అన్నది అర్థంకాని విషయం. ఒకపక్క ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను నిలువరించటం కోసమని తనకు తోచినట్టు చేసుకుపోతున్న అమెరికా... గాజా, వెస్ట్‌బ్యాంక్, లెబనాన్‌లలో రోజూ వందలమందిని హతమారుస్తున్న ఇజ్రాయెల్ విషయంలో ఎందుకు నోరెత్తటం లేదు? తనవరకూ అమలు చేసుకుంటూ పోతానంటే అమెరికా విధించిన ఆంక్షలపై ఎవరికీ పెద్దగా అభ్యంతరం ఉండదు. కానీ అదే పని అందరూ చేయాలని శాసించటం తెలివితక్కువతనం. ఈ ఇంగితజ్ఞానం అమెరికాకు ఎప్పటికి అలవడుతుందో?!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం **తిథి:** శు.పాడ్యమి సా.6.42 వరకు తదుపరి విదియ, **నక్షత్రం:** విశాఖ తె.5.30 వరకు(తెల్లవారితే ఆదివారం) తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.9.20 నుండి 11.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.49 నుండి 7.35 వరకు **అమృతఘడియలు:** రా.7.36 నుండి 9.20 వరకు.

సూర్యోదయం : 6.02
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : మ.1.30 నుండి 3.00 వరకు

పింఛన్లు పెంచరా? మాటకు కట్టుబడరా?

అభిప్రాయం



టి.హరీశ్ రావు

అభయ హస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో రూ.2 వేలు నెలవారీ పింఛన్ తీసుకుంటున్న వారందరికీ రూ.4 వేలు ఇస్తామనీ, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచుతామనీ హామీ ఇచ్చారు. అక్కడి సూర్యుడు ఇక్కడ పొడిచినా పెన్షన్ పెంచి ఇస్తామన్నారు. కానీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా పెంచలేదు. వృద్ధులు, ఒంటరివాళ్లు, వికలాంగులు పలు కారణాలతో సొంతంగా సంపాదించుకోలేని పరిస్థితుల్లో ఉంటారు. పింఛన్ వల్ల వీరు ఇతరులపై పూర్తిగా ఆధారపడకుండా జీవితం గడుపగలుగుతారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి హామీ ఇచ్చినట్టు పింఛన్ డబ్బులు పెంచితే వాళ్లు నిశ్చింతగా బతుకుతారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయకపోవడం శోచనీయం.

మాయమాటల కాంగ్రెస్ ప్రభుత్వం మాటతప్పి మరోమారు ప్రజలను మోసపుచ్చింది. కాంగ్రెస్ పాలనలో మాటలకూ, చేతలకూ పొంతన ఉండదని ఇంకోమారు రుజువయింది. ''వృద్ధులకు, వితంతువులకు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, కల్లుగీత కార్మికులకు, చేనేత కార్మికులకు, ఎయిడ్స్ బాధితులకు, డయాలసిస్ పేషెంట్లకు అందరికీ పెన్షన్... నెలకు నాలుగు వేల రూపాయలు, దివ్యాంగులకు నెలకు ఆరు వేల రూపాయలు ఇస్తామని మా నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన్రు. అక్కడి సూర్యుడు ఇక్కడ పొడిచినా పెన్షన్ పెంచి ఇస్తాం...'' అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2023 జూలై నెలలో స్వయంగా పలికిన పలుకులివి! ఈయనే ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ... ''ఒక్క నెల ఆగితే పెన్షన్ డబుల్ అయితది. డిసెంబర్ తొమ్మిదినాడు ఇందిరమ్మ రాజ్యంలో మీ ఖాతాలో రూ.4 వేలు పడుతాయి'' అని కోతలు కోశారు. అయితే, అధికారంలోకి వచ్చి 10 నెలలైనా కాంగ్రెస్ బడా నేతలు ఇచ్చిన హామీలు ఆచరణలోకి రాలేదు.

అభయ హస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన 42 పేజీల మేనిఫెస్టోలోని చాప్టర్–2లో పేర్కొన్న ఆరో గ్యారెంటీలో ఏం చెప్పారు? ఇంతకుముందు రూ.2 వేలు నెలవారీ పింఛన్ తీసుకుంటున్న వారందరికీ తాము అధికారంలోకి వచ్చాక చేయూత కింద రూ.4 వేలు ఇస్తామనీ, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచుతామనీ రాతపూర్వకంగా చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా... పెంచలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పింఛన్నే ఇప్పటికీ కొనసాగిస్తూ లబ్ధిదారులకు ద్రోహం చేస్తున్నారు. పింఛను పెంపు లెక్కను పరిగణనలోకి తీసుకుంటే 10 నెలలుగా ప్రతి అవ్వ, తాతకు, దివ్యాంగుడికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 20 వేల రూపాయిలు బాకీ పడిందని చెప్పవచ్చు.

ఉలుకూ లేదు పలుకూ లేదు

రాష్ట్రంలో ప్రస్తుతం పెన్షన్ తీసుకుంటున్న వారితో పాటు అదనపు వ్యక్తి ఉంటే, ఇంట్లో ఇద్దరు వృద్ధులకూ పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు చెప్పారు. దీంతో పది లక్షల మంది లబ్ధిదారులు పెరుగుతారనీ, ఈ లెక్కన దాదాపు 55 లక్షల మందికి కాంగ్రెస్ పెన్షన్ అందిస్తుందనీ గొప్పలు చెప్పారు. ఇప్పుడు దీని గురించి పల్లెత్తు మాట కూడా మాట్లాడటం లేదు. రెండు మూడు రోజుల్లో ఆసరా పింఛన్ దారులకు తీపి కబురు అందిస్తాననీ, ఆ బాధ్యత తనదేననీ ఈ ఏడాది జూన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పుడు దీనిపై నోరు మెదపడం లేదు! ఇక, ఇతర మంత్రుల సంగతి సరేసరి... ఉలుకూ, పలుకూ లేదు!



వృద్ధులు, ఒంటరివాళ్లు, వికలాంగులు పలు కారణాలతో సొంతంగా సంపాదించుకోలేని పరిస్థితుల్లో ఉంటారు. ప్రభుత్వం అందించే పింఛన్ వల్ల వీరు ఇతరులపై పూర్తిగా ఆధారపడకుండా సొంతంగా బతుకుతూ తృప్తిగా ఉంటారు. ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్లతో లబ్ధిదారులు గౌరవంగా జీవించడమే కాకుండా కష్టమైన పనులు చేయాల్సిన అవసరం లేకుండా జీవితం గడుపగలుగుతారు. అయితే, ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వారికి హామీ ఇచ్చినట్టు పింఛన్ డబ్బులు పెంచితే వాళ్లు నిశ్చింతగా బతుకుతారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయకపోవడం శోచనీయం.

మాట నిలబెట్టుకున్న బీఆర్ఎస్

బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ రాజ్యంలో రూ.200 పెన్షన్ ఇచ్చి చేతులు దులుపుకొంది. 2014 ఎన్నికల సమయంలో పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కేసీఆర్... ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పింఛన్లను రూ.200 నుంచి రూ. 1,000, దివ్యాంగులకు రూ.500 నుంచి 1,500 రూపాయలకు పెంచారు. 2018 ఎన్నికల సమయంలో మరోసారి పింఛన్లు పెంచుతామని బీఆర్ఎస్ హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే వృద్ధులు, వితంతువులు, ఇతర కార్మికుల పింఛన్లను రూ.1,000 నుంచి రూ. 2,016, దివ్యాంగులకు రూ.1,500 నుంచి 3,016 రూపాయలకు పెంచింది.

మారుతున్న కాలమాన పరిస్థితులు, వయసుతో వచ్చే వివిధ ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని 2020 మార్చిలో వృద్ధులకు ఇచ్చే పెన్షన్ అర్హత వయసును 65 ఏళ్ళ నుండి 57 ఏళ్ళకు బీఆర్ఎస్ ప్రభుత్వం తగ్గించడంతో వృద్ధాప్య కేటగిరిలో అదనంగా సుమారు 8 లక్షల మందికి లబ్ధి చేకూరింది. దీంతో పాటు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి మరో లక్ష మందిని ఆసరాకు జోడించింది. దీంతో పథకంలో లబ్ధిదారుల సంఖ్య దాదాపు 45 లక్షలు దాటింది. అయితే కాలక్రమేణ పింఛన్ లబ్ధిదారుల సంఖ్య పెరుగుతున్నా కొత్తవారికి పింఛన్ ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం చొరవ తీసుకోలేదు. సమయానికి సదర్ క్యాంపులు నిర్వహించకపోవడం వల్ల కొత్తగా దివ్యాంగులుగా మారిన వారు చేయూత పథకంలో చేరడం కష్టంగా మారింది. ఇవన్నీ గడిచిన పది నెలల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనతలుగా చెప్పుకోవచ్చు.

మంచిర్యాలలో 2023 జూన్ 9న జరిగిన సభలో దివ్యాంగుల పింఛన్‌ను రూ.3,016 నుంచి రూ.4,106కు పెంచుతున్నట్టు కేసీఆర్ ప్రకటించిన తర్వాతి నెల నుండే అవి అమలులోకి వచ్చాయి. ఇది బీఆర్ఎస్ విశ్వసనీయత! దేశంలోనే బీడీ కార్మికులకు సైతం ఆసరా పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఇది బీఆర్ఎస్‌కు పేదల పట్ల ఉన్న నిబద్ధత! కేవలం వృద్ధులే కాకుండా చేనేత కార్మికులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, వికలాంగులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఇలా అందరికీ కేసీఆర్ 'ఆసరా'గా నిలిచిన సంగతిని కాంగ్రెస్ కప్పిపెట్టవచ్చుగానీ, బీఆర్ఎస్ తీసుకొచ్చిన మార్పు లబ్ధిదారుల మనసుల్లో ఇప్పటికీ ఉంది, ఎన్నటికీ చెరిగిపోదు.

బాకీ చెల్లించాలి

ఆసరా పింఛన్ పేరును చేయూత పింఛన్‌గా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తను ఎన్నికలప్పుడు వాగ్దానం చేసినట్టు పింఛన్ పెంచి ఇవ్వడం లేదు. అసలు సంగతి ఇలా ఉంటే, కొసరుగా... కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టోలో చేయూత పింఛన్ దారులకు రూ. 10 లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా కూడా అందిస్తామనీ, దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామనీ హామీ ఇచ్చారు. కానీ, ఏ హామీనీ నెరవేర్చకుండా, అభాగ్యుల పింఛన్ డబ్బులను దారి మళ్లించి, వారిని రేవంత్ రెడ్డి నట్టేట ముంచారు.

ప్రజల సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాలను, సంక్షేమ పథకాలను సరిగ్గా అమలు చేయాలి. లేదంటే, అది తీవ్ర అసమానతలకు దారి తీస్తుంది. కాబట్టి, హామీ ఇచ్చినట్టు దివ్యాంగుల పెన్షన్ వెంటనే రూ.4,016 నుంచి రూ. 6 వేలకు పెంచాలి. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులకు రూ. 2,016 నుంచి రూ. 4 వేలకు పెంచాలి. పింఛన్ డబ్బులను ప్రతి నెలా 5వ తేదీలోపే ఇవ్వాలి. పది నెలలుగా బాకీ పడ్డ పింఛన్ పైసలన్నీ వెంటనే చెల్లించాలి. ఈ డిమాండ్లు సాధించేవరకు లబ్ధిదారుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుంది.

వ్యాసకర్త మాజీ మంత్రి, ఎమ్మెల్యే

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

సరిహద్దులో వెలుగు



చైనా సైనికులతో మాట్లాడిన తర్వాత, మౌలిక వసతులు చూసిన తర్వాత ఇప్పుడు ప్రతి ఒక్కరూ భారత సరిహద్దు అభివృద్ధి పట్ల గర్వాన్ని పొందుతారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని మన జవాన్లతో బుమ్లా దగ్గర దీపావళి జరుపుకొన్నాను.

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

మేధావికి నివాళి



ప్రసిద్ధ ఆర్థికవేత్త, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ బిబేక్ దేబ్‌రాయ్ హఠాన్మరణపు వార్త విషాదం కలిగించింది. ఈ ప్రతిభావంతుడైన బెంగాల్ బిడ్డ, గౌరవ మర్యాదలున్న మేధావిని మనం స్మరించుకుందాం. ఎడబాటుకు గురైన ఆయన కుటుంబం, స్నేహితులకు సానుభూతి.

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

విలువల స్మరణ



దీపావళి కేవలం ఒక పండుగ కాదు. సహనం, ఉమ్మడితనం, దయ, ఐక్యత లాంటి మన అందరి మనసుల్లోని విలువలను అది గుర్తుచేస్తుంది. యూఎస్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఈ వేడుక జరుపుకొంటున్న అందరికీ దీపావళి పండుగ సంతోషం, శాంతి, సంపదలను తేవాలని కోరుకుంటున్నాను.

– ఆంటోనీ బ్లింకెన్, యూఎస్ విదేశాంగ మంత్రి

ఒత్తిడిలో విరాట్



విరాట్ కోహ్లి ముఖంలో మానసిక ఒత్తిడి కనబడుతోంది. ఔట్ అయినప్పుడు స్పందిస్తున్న తీరు, అక్కడ లేని పరుగు కోసం పరుగెత్తుతున్న తీరు... 2019 నవంబర్ వరకు తన ఆట, విశ్వాసం తెలిసిన వాడిగా, చాలా దారుణమైన మానసిక అవస్థలో ఉన్నారు.

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

ఒంటికాలి తపస్సు



ఒంటి కాలి మీద ఎంతసేపు నిలబడగలరు? ఒంటి కాలి మీద నిలబడగలగడం అనేది నరాలు–కండరాల పనితీరును కొలవడానికి మంచి ప్రమాణం. కళ్లు తెరిచివుంచి, 30 ఏళ్లవాళ్లు 45 సెకన్లు, అంతకంటే ఎక్కువ నిల్చోగలగాలి. వయసు పెరిగినకొద్దీ ఈ సామర్థ్యం తగ్గుతుంది. (యాభైలో 40 సెకన్లు, 70లో 20 సెకన్లయినా ఉండాలి.) కండరాల బలం, నియంత్రణ, చూపు, వినికిడి అన్నింటిమీద ఈ సామర్థ్యం ఆధారపడి ఉంటుంది కాబట్టి మజిల్ స్ట్రెంత్ పరీక్ష కంటే ఇది కచ్చితమైనది.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

ఆలోచనాత్మక మాట



ఇంట్రావర్ట్‌ల దగ్గర తెలివి చూపించకండి. వాళ్లు మాట్లాడరు. కానీ మాట్లాడినప్పుడు దాన్ని వాళ్లు అంతకుముందే అనుభవించి ఉంటారు. ఒక్క మాట చెప్పడానికైనా రోజులు, నెలల పాటు అన్ని రకాలుగా ఆలోచిస్తారు. ఇతరుల వాస్తవాలు ఇన్‌స్టాగ్రామ్ నుంచి వస్తాయి. కానీ వాళ్లు గూగుల్ సెర్చ్ పేజీలో 21 దాకా వెళ్లివుండొచ్చు. బోత్ ఆర్ నాట్ సేమ్.

– కరుణ్ పాల్, మైండ్‌నెస్ కోచ్

కొత్త కుట్ర?



వాయు నాణ్యత సూచి అనేది ఇస్లామిస్టు కుట్ర; అది హిందూయిజం మీద దాడి. ఎందుకు మంచి నాణ్యతను ఆకుపచ్చ రంగులో చూపించాలి? క్షీణించడాన్ని కాషాయంలో ఎందుకు చూపాలి?

– అనుభవ్ సింగ్, మార్క్సిస్ట్

యుద్ధం మిగిల్చేది పరాజయాన్నే!

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

ఏ యుద్ధంలోనైనా పరాజితులే ఉంటారు తప్ప విజేతలు ఉండరని చెప్పారు 'యుద్ధము–శాంతి' (వార్ అండ్ పీస్) నవల ద్వారా రష్యన్ మహా రచయిత లియో టాల్‌స్టాయ్. సరిహద్దులు లేని పరస్పర ప్రేమ ఒక్కటే విశ్వశాంతికి మార్గం వేస్తుందని రెండు శతాబ్దాల ముందే చెప్పారాయన.

1910లో టాల్‌స్టాయ్ మరణించిన 4 ఏళ్ల తర్వాత 1914 నుంచి 1917 వరకు మొదటి ప్రపంచ యుద్ధం జరిగింది. 3 ఏళ్లపాటు జరిగిన ఈ యుద్ధంలో 85 లక్షల మంది సైనికులు, 1 కోటి 30 లక్షల మంది పౌరులు మరణించారు. ఆ యుద్ధంలో అంగవైకల్యం పొందిన వారి సంఖ్యకు లెక్కేలేదు. ఆ తర్వాత, 1939–45 మధ్య 6 ఏళ్ల పాటు సాగిన రెండో ప్రపంచ యుద్ధంలో 6 కోట్ల మంది ఆశువులు బాశారు. కోట్లాది మంది క్షతగాత్రులయ్యారు. ఆ తర్వాత కూడా పలుదేశాల మధ్య యుద్ధాలు జరిగాయి. అంతులేని విషాదాన్ని మిగిల్చాయి. అయినా పలు దేశాలు సమస్యల పరిష్కారానికి యుద్ధాన్నే ఎంచుకోవడం విచారకరం.

గత రెండేళ్ల నుంచి సాగుతున్న ఉక్రెయిన్–రష్యా (యురేషియా) యుద్ధం, ఏడాదిపైబడిన పాలస్తీనా–ఇజ్రాయెల్ (పశ్చిమాసియా) యుద్ధం; తాజాగా లెబనాన్, సిరియా, ఇరాన్‌లకు విస్తరించిన ఇజ్రాయెల్ దాడులు–ప్రతిదాడులు... వెరసి 3వ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయేమోనన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అటు ఉక్రెయిన్‌లో, ఇటు గాజాలో పసిపిల్లలతోసహా వేలాదిమంది అమాయకులు ఈ రెండు యుద్ధాల వల్ల బలైపోయారు. అయినా ఎవ్వరూ తగ్గడం లేదు. ఈ యుద్ధాలను ఆపడానికి ఐక్యరాజ్య సమితి చేసిన అరకొర యత్నాలు ఏమాత్రం ఫలితాలివ్వలేదు. పైగా, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ తమ దేశంలో పర్యటించరాదని ఇజ్రాయెల్ హుకుం జారీ చేసింది. హెజ్బొల్లా, ఇరాన్, హౌతీల దాడులను ఐక్యరాజ్య సమితి ఖండించలేదన్నది ఇజ్రాయెల్ ఆరోపణ. గతంలో యుద్ధాలకు దిగే దేశాలపై దౌత్యపరమైన ఆంక్షలు విధించేవారు. కానీ, ఇప్పుడు ఆ దశ దాటిపోయింది. మధ్యవర్తిత్వం వహించాల్సిన వారు కూడా ఏదో ఒక కూటమికి వంత పాడటంతో... కనుచూపు మేరలో ఈ యుద్ధాలకు ముగింపు కార్డుపడే పరిస్థితి కనపడటం లేదు.

పశ్చిమాసియాలో నెలకొన్న ప్రాంతీయ ఉద్రిక్తతలు, కొనసాగుతున్న యుద్ధం వల్ల భారత్‌కు ఆర్థికంగా అపార నష్టం వాటిల్లే పరిస్థితులు ఉత్పన్నం అయ్యాయి. ఈ పరిణామాలు భారత్ స్టాక్ మార్కెట్లను ఇప్పటికే ఒడిదుడుకులకు గురి చేస్తున్నాయి. ఎందుకంటే భారత ఇంధన అవసరాలు దాదాపు 80 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ప్రధానంగా ఇరాన్ కనుక తన హోర్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేసినట్లయితే ఈ మార్గం ద్వారా చమురు, సహజ వాయువును దిగుమతి చేసుకొంటున్న భారత్ ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని ఎంచుకోవాలి. అలాగే, సూయిజ్ కాలువ ద్వారా రవాణాను అనుమతించనట్లయితే... చుట్టూ తిరిగి దక్షిణాఫ్రికాలోని కేప్ ఆఫ్ గుడ్ హోప్ ద్వారా చమురును రవాణా చేసి తెచ్చుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల దూరం పెరిగి రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతాయి. ఇప్పటికే యెమన్ కేంద్రంగా పనిచేసే హౌతీలు హమాస్‌కు మద్దతుగా సూయిజ్ కాలువ ద్వారా రవాణా అవుతున్న నౌకలపై దాడులు చేస్తున్నారు. ఇది భారత్‌కు ఊహించలేని నష్టాన్ని కలిగిస్తోంది.

ప్రస్తుతం బ్యారెల్ ముడిచమురు 85–90 డాలర్ల మధ్యనే ఉండటం వల్ల... భారత్ స్థిమితంగానే ఉంది. కానీ, మధ్య ప్రాచ్యంలో యుద్ధం కనుక మరింత ముదిరితే



జరిగే పరిణామాలు చేదుగానే ఉంటాయి. పొద్దు తిరుగుడు నూనె, పామాయిల్ నూనెలను అత్యధికంగా ఉత్పత్తి చేసే ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైనతర్వాత ఆ నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి.

ప్రపంచీ కరణ వేగం పుంజుకొన్న తర్వాత ప్రతి దేశంలో ఆర్థిక పరిస్థితులు బాహ్య పరిణామాలపై ఆధారపడ్డాయి. అందుకు భారత్ మినహాయింపు కాదు. ఒకప్పుడు 'రష్యా'తో దౌత్యపరంగా సఖ్యత సాగించిన భారత్... తదనంతర పరిణామాలతో అమెరికాకు సైతం దగ్గరయింది. అమెరికా–చైనాల మధ్య మొదలైన ఆధిపత్య పోరు నేపథ్యంలో భారత్ వ్యూహాత్మకంగా అమెరికాకు మరింత చేరువయింది. రష్యా, అమెరికా... ఈ రెండు అగ్రరాజ్యాలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం భారత్‌కు మేలు చేసేదే. అయితే, భారత్ తన దౌత్యనీతిలో ఎల్లప్పుడూ తటస్థంగానే కొనసాగుతోంది. యుద్ధాలతో ఏ సమస్యనూ పరిష్కరించలేమని ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల తన రష్యా పర్యటనలో అధ్యక్షుడు పుతిన్‌కు స్పష్టం చేయడం ద్వారా భారత్ తన విదేశాంగ విధానాన్ని చాటి చెప్పారు. ముడిచమురుతో సహా పలు వస్తువులను రష్యా నుంచి దిగుమతి చేసుకొంటున్నప్పటికీ... ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధానికి భారత్ మద్దతు తెలపలేదు. పైగా, ఉక్రెయిన్‌కు నైతిక మద్దతు ప్రకటించింది. విస్తరణ వాదాన్ని సహించబోమని ఒక్క రష్యాకే కాదు.. అరుణాల్‌ప్రదేశ్‌ను ఆక్రమించాలని చూస్తున్న చైనాకు కూడా భారత్ పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది.

నిజానికి, అటు యురేషియాలో, ఇటు పశిమాసియాలో జరుగుతున్న యుద్ధాలను నిలిపివేయడానికి గల మార్గాలను భారత్ తీవ్రంగా అన్వేషిస్తోంది. ప్రస్తుతం ప్రపంచ దేశాలలో అత్యధిక స్థాయిలో ఆర్థికాభివృద్ధి రేటును నమోదు చేస్తున్న భారత్‌కు ఈ అంతర్జాతీయ పరిణామాలు మింగుడుపడనివే. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ తరుణంలో పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితులు ఏర్పడేందుకు తన వంతు కృషి చేయడం మినహా భారత్ చేయగలిగింది ఏమీ లేదు. లియో టాల్‌స్టాయ్ చెప్పినట్లు పరాజితులుగా మిగిలిపోతారా లేక యుద్ధవిరమణ చేసి విజేతలుగా అవతరిస్తారా అన్నది యుద్ధాల్లో మునిగి ఉన్న దేశాలు, వాటికి మద్దతు ఇస్తున్న దేశాల వైఖరి మీద ఆధారపడి ఉంది.

వ్యాసకర్త ఏపీ శాసనమండలి సభ్యులు

మృతం – అమృతం

మనిషి మట్టి నుంచి సృష్టింప బడ్డాడు. మళ్ళీ ఆ మట్టి లోకే తిరిగి వెళ్ళిపోతాడు. ఇది కాదన లేని నిజం. 'జాతస్య మరణం ధృవం.' పుట్టిన జీవికి మృత్యువు తప్పదని గీత ప్రబోధిస్తుంది. బైబిల్ 'చినిగిపోయే వస్త్రాల్లా ఆత్మను ధరించిన ఈ శరీరాలు కూడ భ్రష్టమై పోతాయనీ, పచ్చటి చెట్ల నుండి ఆకులు రాలినట్లుగా ఈ జీవులకి అంతిమ మరణం అనేది తప్పదనీ ప్రబోధిస్తోంది (సీరా : 14 :17).

'నా జీవన మార్గం అంతా నల్లటి మేఘాలతో ఆవరింపబడింది. మరణ చిహ్నమైన శూన్యాన్నైపోయా. మృత్యు సంకేతంగా అదృశ్యుడనై పోయాన'టాడు భక్తుడు తోబి (తోబి 2:4).

పాపం వల్ల వచ్చే చీకటి సామ్రాజ్యం నాకొద్దని సొలోమాన్ రాజు అంటాడు.

దేవుడు ఏవేవి చెప్పాడో వాటిని మనిషి తు.చ. తప్పక ఆచరించడం, ముఖ్యంగా తన తోటి మనిషిని ఎటువంటి అరమరికల్లేకుండా ప్రేమించడం వంటి పనుల ద్వారా ఇక్కడ శాశ్వత స్థానం సంపాదించుకోవాలని బైబిలు చెబుతోంది. ఏదేమైనా ప్రేమ మయుడైన దేవుడు అంతిమంగా తన బిడ్డల్ని తన చెంతకు పిలుచుకుంటాడనీ, అందుకు చేయవలసిన పనులూ ఉన్నాయనీ క్రైస్తవ సమాజం విశ్వసిస్తోంది. మనిషిలోని శరీరం దాని మూల రూపమైన మట్టిలో కలిసిపోయినా, దానిలోని ఆత్మ మాత్రం పరమాత్మను చేరుకుంటుందని చెబుతోంది బైబిలు (ప్రసంగి/ఉపదేశి 12 : 7).

మంచి చేస్తే స్వర్గానికి, చెడు చేస్తే నరకానికి ఈ ఆత్మలు పయనం సాగిస్తాయనడం మామూలే, కానీ, మధ్యలో అటూ ఇటూ కాకుండా ఒకటుంది. అదే 'ఉత్తరించు స్థలం'. చిన్న తప్పులు చేసే ఆత్మలు ఇక్కడ ఆగిపోతాయి. దేవుని అనుగ్రహం కలిగేంత వరకూ, వీరి కోసం భూలోకంలో ఉన్న ఆత్మీయులు ప్రార్థన చేసే వరకూ ఇక్కడే ఉంటాయనేది వీరి నమ్మిక. అందుకే అత్యంత ఆశాభావంతో చనిపోయిన తమ సంబంధీకుల్ని తమతమ ప్రార్థనలతో ఈ లోకంలో ఉన్న వారంతా దేవుని చెంతకు చేర్చగలమనే విశ్వాసంతో క్రైస్తవ కుటుంబాలు సకల ఆత్మల పండుగ ఘడియల్ని ఆచరిస్తారు.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు
(నేడు సకల ఆత్మల పండుగ)

క్లుప్తంగా...

సమగ్ర కుల సర్వేకు 85వేల మంది ఎన్యూమరేటర్లు

- నెలాఖరులోగా సమాచార సేకరణ, డేటాఎంట్రీ పూర్తి : మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియకు 85 వేల మంది ఎ్యమరేటర్లు పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి పదిమంది ఎన్యూమరేటర్లపైన ఒక పరిశీలకుడు ఉంటారన్నారు. పరిశీలకులుగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులుంటారని చెప్పారు. ప్రతి ఇంటి సమగ్ర సమాచార సేకరణతోపాటు ఆ వివరాలను కంప్యూటరీకరణ చేసే ప్రక్రియ ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు వివరించారు. ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని మంత్రి పొన్నం శుక్రవారం బహిరంగ లేఖలో కోరారు. దేశంలో తొలిసారిగా ఇలాంటి సర్వే చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేసేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు.

నేడు కులగణనపై జిల్లా స్థాయి సదస్సులు

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వ హించ తలపెట్టిన కుల గణనపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయిలో సదస్సులు జరగనున్నాయి. కులగణనపై ఇటీవల గాంధీ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీల నేతృత్వంలో ఈ సమావేశాలను నిర్వహించనున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు జిల్లాల్లోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, వ్యవసాయ మార్కెట్, దేవాలయ, గ్రంథాలయ కమిటీల ప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలను ఆహ్వానించి కులగణనపై పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రాథమిక పాఠశాల టీచర్లతోనే కులగణన

- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 6 నుంచి మూడు వారాల పాటు నిర్వహించే కులగణన కార్యక్రమానికి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మాత్రమే వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను ఈ విధుల నుంచి మినహాయించింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కుల గణనకు వెళ్లడం వల్ల ఉన్నత పాఠశాల్లో బోధన దెబ్బతింటుందని ఇటీవల ఉపాధ్యాయ సంఘాలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వద్ద అభ్యంతరాలు లేవనెత్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని వారిని ఈ విధులకు దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది.

సర్వే కోసం 80వేలమంది ఉద్యోగులు

సర్వే కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 80 వేల మంది ఉద్యోగుల సేవలను వినియోగించనున్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. వీరిలో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ టీచర్లు 36,559 మంది, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 6,256 మంది, ఎంఆర్‌సీ సిబ్బంది 2 వేలమంది, ఎంపీపీ, జెడ్‌పీపీ, ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేసే మినిస్టీరియల్ సిబ్బంది 2 వేలమంది, అన్ని కేటగిరీల్లోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే బోధనేతర సిబ్బంది ఉన్నట్లు ఆయన వివరించారు. సర్వే జరిగే రోజుల్లో ప్రాథమిక పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట వరకే నడుస్తాయని తెలిపారు.

రైతుల ఆదాయం పెంచేలా 'ఉపాధి' పనులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఐదు నెలలకు సంబంధించి రూ.1,372 కోట్ల నిధులతో చేపట్టే పనుల ప్రణాళికలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. మహిళలకు ఉపాధి భరోసా, పంటపొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపక, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కింద చేపట్టే పనుల ను ఖరారు చేశారు. ఇందులో భాగంగా రూ.106 కోట్ల నిధుల తో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రతి నియోజక వర్గా నికి సుమారు కోటి నిధులను వెచ్చించాలని నిర్ణయించారు. మొత్తం 5,400 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదాయాన్ని పెంచే దిశలో పశువుల కొట్టాలు, కోళ్ల షెడ్ల నిర్మాణం, మహిళా గ్రూపుల్లో ఉన్న రైతుల బీడు భూములను అభివృద్ధి చేసి సాగులోకి తీసుకొచ్చే ప్రణాళికలకు మంత్రి ఆమోదం తెలిపారు. శుక్రవారం సచివాల యంలో మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల ఆదాయం పెంచేలా, వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె ఆదేశించారు.

నేడో, రేపో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు?

- కొలిక్కి వచ్చిన కసరత్తు...3 సీట్లకు ముగ్గురేసి చొప్పున జాబితా సిద్ధం
- అభ్యర్థుల పేర్లను ఖరారు చేయనున్న జాతీయ ఎన్నికల కమిటీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. రెండుమూడురోజుల్లో మూడు స్థానాలకు అభ్యర్థులను పార్టీ అధిష్టానం ఖరారు చేయనుంది. ఒక్కో స్థానానికి మూడేసి పేర్లతో జాబితాను రూపొందించి ఢిల్లీలోని జాతీయ ఎన్నికల కమిటీకి పంపించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రులు, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు వచ్చే ఏడాది మార్చి 29తో ఖాళీ కానున్నాయి. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పరిధిలోనే గెలిచారు. దీంతో ఈ జిల్లాల పరిధిలోని ఒక టీచర్, ఒక గ్రాడ్యుయేట్ స్థానాలను కచ్చితంగా గెలవాలని రాష్ట్ర నాయకత్వం పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో బలమైన ఎమ్మెల్సీ అభ్యర్థులను నిలిపేలా చేస్తున్న కసరత్తు పూర్తి అయినట్టు పార్టీవర్గాల సమాచారం. శని, ఆదివారాల్లో ఈ మూడు స్థానాలకు ముగ్గురు చొప్పున అభ్యర్థులను (తొమ్మిది మందితో) ప్రతిపాదిస్తూ కేంద్ర ఎన్నికల కమిటీకి జాబితా పంపించనున్నారు. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో నేతలు టికెట్ కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. పార్టీకి అంతగా బలం లేదని భావిస్తున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి కూడా పలువురు టికెట్ ఆశిస్తున్నారు. ఇటీవల జరిగిన భేటీలో అభ్యర్థుల పేర్లపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, ఎన్నికలు జరగబోయే ఆయాజిల్లాల పార్టీ అధ్యక్షుల నుంచి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ అభిప్రాయాలు సేకరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కాసం వెంకటేశ్వర్లు, ప్రదీప్‌కుమార్‌లతో ఓ ప్రత్యేక కమిటీని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నియమించింది.

పోటాపోటీగా ప్రయత్నాలు

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీకి పార్టీనేతలతోపాటు, తటస్థులు కూడా టికెట్ ఆశిస్తున్నట్టు సమాచారం. ఈ రెండు స్థానాల్లో గ్రాడ్యుయేట్ స్థానం నుంచి టికెట్ కోసం మంచిర్యాలకు చెందిన ఎర్రబెల్లి రఘునాథరావు, సంగారెడ్డి జిల్లాకు చెందిన గోదావరి అంజిరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్ ముందువరుసలో ఉన్నట్టుగా పార్టీనాయకులు చెబుతున్నారు. ఈ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీకి విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య, గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మామిడి సుధాకర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ టికెట్ కోసం పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, సంఘ్ పరివార్‌కు చెందిన టీపీయూఎస్ నాయకుడు సాయిరెడ్డి తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి.

ఖల్లివెల్లి కార్మికులకు శుభవార్త

- యూఏఈలో మరో రెండు నెలల పాటు క్షమాభిక్ష గడువు పొడిగింపు

మోర్తాడ్(బాల్కొండ): వీసా నిబంధనలను ఉల్లంఘించిన వలస కార్మికులకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం శుభ వార్తను అందించింది. గత సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు అమలు చేసిన క్షమాభిక్ష (ఆమ్నెస్టీ)ని మరో రెండు నెలల పాటు కొన సాగించడానికి యూఏఈ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తమ దేశంలో చట్టవిరుద్ధంగా (ఖల్లివెల్లి) ఉంటున్న విదేశీయుల సంఖ్య పెరిగిపోవడా న్ని దృష్టిలో ఉంచుకుని యూఏఈ సర్కార్ క్షమాభిక్ష ద్వారా.. ఎలాంటి జరిమానా వసూలు చేయకుండా, జైలు శిక్ష విధించకుండా కార్మికులు స్వదేశం చేరుకోవడానికి అవకాశం కల్పించింది. గురువారంతో క్షమాభిక్ష గడువు ముగిసిపోగా ఆమ్నెస్టీ కోసం అనేక మంది యూఏఈ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో దరఖాస్తులు అందించడానికి వచ్చారు. దీంతో విదేశీ వలస కార్మికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని యూఏఈ ప్రభుత్వం క్షమాభిక్షకు గడువు పెంచింది. తమ దేశ 53వ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమ్నెస్టీ గడువు పెంచినట్లు ఫెడరల్ అథారిటీ ఫర్ ఐడెంటిటీ సిటిజన్‌షిప్ కస్టమ్స్ పోర్ట్స్ సెక్యూరిటీ (ఐసీపీ) డీజీ వెల్లడించారు. గడువు ముగిసిపోయినా చట్టవిరుద్ధంగా ఉండేవారిని జైలులో పెడతామని ఐసీపీ హెచ్చరించింది. క్షమాభిక్ష గడువు పొడిగించిన నేపథ్యంలో తనిఖీలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్షను నిబంధనలకు విరు ద్ధంగా ఉంటున్న భారతీయ వలస కార్మికులు సద్వినియో గం చేసుకోవాలని యూఏఈలోని స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులు సూచించారు.

ఎమ్మెల్యే వినోద్, కాంగ్రెస్ నేతలు భూ కబ్జాలకు పాల్పడుతున్నారు

- హెచ్చరిస్తూ మావోయిస్టుల లేఖ



బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఇతర కాంగ్రెస్ నాయకులు, భూకబ్జాదారులను హెచ్చరిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పేరుతో ఓ లేఖ విడుదలైంది. ఈ లేఖ రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. పోలీసు వర్గాలు ఈ లేఖను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. బెల్లంపల్లి కేంద్రంగా భూకబ్జాలు, రౌడీమూకల దౌష్టికాలు, దాడులు, రాజకీయాల ముసుగులో సాగుతున్న అక్రమ దందాలు, వ్యవహారాలను ఎండగడుతూ విడుదలైన ఈ లేఖ కాంగ్రెస్ పార్టీలో అలజడి రేపుతోంది. ఎమ్మెల్యే వినోద్ అనుచరులు రౌడీయిజంతో భూకబ్జాలకు పాల్పడుతున్నారని, వీరిపై ప్రజలు తిరుగుబాటు చేసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో దుర్గం చిన్నయ్య అకృత్యాలను సహించలేక ప్రజలు వినోద్‌ను గెలిపించి రాజకీయ భిక్ష పెట్టారని, అయితే ఆయన ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా.. బినామీల ద్వారా భూకబ్జాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. అలాగే బెల్లంపల్లికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు కూడా భూకబ్జాలకు పాల్పడుతున్నారని, చెరువులు, కుంటలు, ప్రభుత్వ, సింగరేణి భూములు, ప్రజల ఆస్తులను కబ్జా చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాగా, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన కొందరు నాయకులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అందులో ప్రస్తా వించారు. అలాగే కబ్జాదారులు, భౌతిక దాడులకు దిగుతున్న గ్యాంగులకు ఇద్దరు పోలీసు అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.

బాలికపై గ్యాంగ్‌రేప్

- మాయమాటలతో లోబర్చుకొని.. ఆపై బ్లాక్‌మెయిల్ చేసి..
- గర్భం దాల్చిన మైనర్.. ఐదుగురిపై పోక్సో కేసు..వీరిలో నలుగురు మైనర్లు
- వికారాబాద్ జిల్లా దోమలో ఘటన

దోమ: మాయమాటలతో ఓ బాలికను లోబర్చుకున్న ఓ యువకుడు, నలుగురు మైనర్లు ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డారు. దీంతో ఆమె గర్భం దాల్చింది. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని ఓ గ్రామంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక(13)తో అదే ఊరికి చెందిన సంతోష్ సన్నిహితంగా ఉండేవాడు. ఈ చనువును అవకాశంగా తీసుకొని ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం సంతోష్ స్నేహితులైన నలుగురు మైనర్లకు తెలియగా, బాలికను బ్లాక్‌మెయిల్ చేసి అఘాయిత్యానికి పాల్పడ్డారు. విషయం బయటకు చెప్పొద్దని హెచ్చరించడంతో వీరి అఘాయిత్యాలను ఆరు నెలలుగా మౌనంగా ఆ బాలిక భరిస్తోంది. ఈ క్రమంలో గత నెల 28వ తేదీన పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్న బాలికను సంతోష్ తన ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే నలుగురు మిత్రులు అక్కడకు చేరుకున్నారు. అంతా కలిసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. సాయంత్రం వరకే స్కూల్ నుంచి రావాల్సిన బాలిక రాత్రి ఆలస్యంగా ఇంటికి రాగా, తల్లి నిలదీయడంతో బోరున విలపించింది. జరిగిన విషయాన్ని తల్లికి వివరించింది. దీంతో వెంటనే పీఎస్‌కు వెళ్లిన బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని పరిగిలోని డీఎస్పీ కార్యాలయానికి తరలించగా, నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చారు. బాలికను సఖి సెంటర్‌కు తరలించి, వైద్య పరీక్షలు చేయించారు. ప్రస్తుతం బాలిక రెండు నెలల గర్భిణి అని వైద్యులు నిర్ధారించారు.

గంజాయి మత్తు కారణమా?

గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా లభిస్తోందని, ఈ మత్తులోనే వారు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. నగరం నుంచి గ్రామాలకు గంజాయి సరఫరా అవుతోందని, దీనికి బానిసలుగా మారిన యువత విచక్షణ కోల్పోయి వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ములుగు జిల్లాలో వైద్యం అందక వ్యక్తి మృతి

- రోడ్డు సౌకర్యంలేక ప్రాణాలు కోల్పోతున్న ఆదివాసీలు

కన్నాయిగూడెం: సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో నిర్ణీత సమయంలో వైద్యం అందక ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఏజెన్సీ గ్రామమైన ఐలాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పులిశ బాబు కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం ఆయన పరిస్థితి విషమంగా మారింది. గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే అటవీమార్గం గుండా 12 కి.మీ. బైక్‌పై రావాల్సి ఉంటుంది. పక్కమండలమైన ఏటూరునాగారానికి వెళ్లాలన్నా కొండాయి వరకు సుమారు 10 కిలోమీటర్లు కాలినడకనగానీ, ఎడ్లబండిపైగానీ వెళ్లాలి. అక్కడినుంచి ఏటూరునాగారం చేరుకోవాలంటే 30 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్యం చేయించుకునేందుకు ఎటూ వెళ్లలేక బాబు ఇంటి వద్దనే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలం నగేశ్ మాట్లాడుతూ అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో ఐలాపూర్‌కు బీటీ రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. రోడ్డు ఉంటే పులిశ బాబుకు సకాలంలో వైద్యం అంది, బతికేవాడని ఆవేదన వ్యక్తం చేశారు.

రచయిత్రి ఓల్గాకు కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం



మాట్లాడుతున్న మోహన గుప్త

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రముఖ రచయిత్రి ఓల్గాగా ప్రసిద్ధురాలైన పోపూరి లలిత కుమారిని ప్రతిష్టాత్మక శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం–2024కు ఎంపిక చేసినట్లు గుప్త ఫౌండేషన్ సంస్థ చైర్మన్ మదుపల్లి మోహన గుప్త తెలిపారు. గురువారం ఏలూరులో ఆయన విలే కరులతో మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 1994 నుంచి శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం అందజేస్తున్నామని తెలిపారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సాహితీవేత్తలకు ఈ పురస్కారాన్ని ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 20 మంది సాహితీవేత్తలకు అందించామని, ఈ ఏడాది పురస్కారానికి ఎంపికైన ఓల్గాకు రూ.3 లక్షల నగదు పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు.

చిట్యాల గుట్ట ప్రాంతంలో రంగురాళ్లు?



రాజేశానికి దొరికిన రంగురాయి

వీర్నపల్లి (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని పిట్ల రాజేశం అనే రైతు శుక్రవారం సీతాఫలాల కోసం చిట్యాల గుట్ట అటవీ ప్రాంతంలోకి వెళ్లగా రంగురాళ్లు దొరికాయి. వజ్రంలా మెరుస్తున్న ఈ మూడు రాళ్లను చూసిన రైతు ఆశ్చర్యానికి గురై ఇంటికి తెచ్చుకున్నాడు. ఆ రంగురాళ్లను తన హోటల్‌లో పెట్టుకోగా.. కస్టమర్లు చూసి ప్రచారం చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది.

డీసీసీబీల్లో అవకతవకలపై విచారణ పూర్తి చేయాలి: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: గతంలో డీసీసీబీ, డీసీఎంఎస్‌లలో జరిగిన అవకతవకలపై శాఖాపరమైన విచారణ పూర్తి చేయాలని, బాధ్యులపై చర్యలతో పాటు నిధులు రికవరీ చేయాలని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించిన రైతులకు అవసరమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అవసరమున్న చోట కొత్త శాఖలు ఏర్పాటు చేసి సంఘాల పరిపుష్టికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మారుతున్న కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాలో ఒక మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఫిర్యాదులు చేయడానికి, పత్తి పంటను విక్రయానికి తీసుకురావడానికి అనువైన సమయం తెలుసుకునేందుకు 8897281111 నంబర్‌లో వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలని ఆయన రైతులను కోరారు.

ఆయిల్‌పామ్ ఉప ఉత్పత్తుల మీద దృష్టి సారించాలి

భవిష్యత్‌లో ఆయిల్ పామ్ సాగును మరింత పెంచాలని, ఆయిల్‌పామ్ ఉప ఉత్పత్తుల మీద దృష్టి సారించాలని అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆయిల్‌పామ్ గెలల టన్ను ధర రూ.19,144కు చేరినందున శుక్రవారం ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా, జీఎం సుధాకర్‌రెడ్డి తదితరులు మంత్రి తుమ్మలను కలిసి ధన్యవాదాలు తెలిపారు. పెరిగిన ఆయిల్ పామ్ ధరతో రైతుల వృద్ధికి తోడ్పాటు అందించినట్లు అవుతుందన్నారు.

యాదాద్రిలో బ్రహ్మోత్సవాల నాటికి స్వర్ణతాపడం పూర్తి

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విమానగోపురం బంగారు తాపడం పనులు వేగవంతం అయ్యాయి. బ్రహ్మోత్సవాల నాటికి తాపడం పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా దేవస్థానం అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. స్వర్ణతాపడం కోసం ఇప్పటికే చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు 12 కిలోల బంగారం అప్పగించారు. కాగా, స్వర్ణతాపడం పనుల్లో భాగంగా ఈనెల 6న మహా కళా అవరోహణ పూజ చేయనున్నారు. సుదర్శన చక్రంలోనుంచి చక్ర ఆళ్వార్లను కలశంలోకి ఆహ్వానించే వేడుకే కళా అవరోహణం. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, 9 కలశాలతో పూజలు నిర్వహిస్తారు. కలశాలను గర్భాలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. బంగారు తాపడం పనులు పూర్తయిన అనంతరం కళారోహణం ద్వారా తిరిగి చక్ర ఆళ్వార్లను సుదర్శన చక్రంలోకి పంపిస్తారు. వివిధ వృత్తుల వారు విమాన గోపురంపైకి ఎక్కి పనులు చేయడానికి దేవుని నుంచి అనుమతి తీసుకోవడమే మహా కళా అవరోహణ పూజ. ప్రధానాలయ విమానగోపురం స్వర్ణతాపడం పనులు ఈనెల 1న మొదలయ్యాయి. విడతల వారీగా చేపడుతున్న పనులను 2025 ఫిబ్రవరి 20వ తేదీ వరకు పూర్తి చేస్తారు. ఫిబ్రవరి 26 నుంచి శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి.

తప్పుడు సమాచారమిస్తే క్రిమినల్ చర్యలు

- బీసీ ఏ, ఈలోకి చేర్చాలంటూ కొన్ని కులాల వినతులు
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు బీసీ కమిషన్‌కు వినతిపత్రం ఇచ్చి తమ అభిప్రాయం చెబుతుండగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: బీసీలు కాకున్నా కులగణన సర్వేలో బీసీలుగా నమోదు చేసుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లు ఖరారు చేసే అంశంపై శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా వేదికగా బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ సమగ్ర వివరాలు సేకరించనున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఇవే కీలకమని, దీని ఆధారంగానే రిజర్వేషన్లు, పథకాలు ఉంటాయని వివరించారు. కులాల వారీగా సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుసుకునేందుకు కలెక్టర్లకు బహిరంగ విచారణ చక్కటి అవకాశమని, 13 వరకు జరిగే కార్యక్రమాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొనాలని సూచించారు. కొన్ని కులాలు డీ నుంచి ఏ కు మార్చాలని, మరికొన్ని కులాలు బీసీ ఏ నుంచి ఎస్టీకి, బీసీ బీ నుంచి ఈకి రిజర్వేషన్లు మార్చాలని నివేదించారని, వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రకాశ్, కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.

విచారణ రసాభాస

బీసీ కమిషన్ బహిరంగ విచారణ రసాభాసగా మారింది. వివిధ బీసీ కుల సంఘాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వినతిపత్రాలు సమర్పించగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్‌కుమార్ బీసీ కమిషన్‌కు వినతిపత్రమిస్తూ కమిషన్ విచారణపై అనుమానాలు వ్యక్తం చేశారు. బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రొసీజర్ ల్యాప్స్ పేరుతో కోర్టు కొట్టివేసిందని, తెలంగాణలో కేవలం కాలయాపన కోసమే విచారణ, సర్వేలు చేస్తుందని దుయ్యబట్టారు. సర్వే కోర్టులో నిలబడుతుందా.. ఏ రకంగా నిలబడుతుందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. తన అభిప్రాయం చెప్పేందుకు కమిషన్ అనుమతించకపోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆక్షేపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కరూ రాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తీరును కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి బీసీలకు ఏం చేశారని, రిజర్వేషన్ల అమలులో ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



అబార్షన్ హక్కుల ప్రచార సామగ్రితో కార్యకర్తలు

తేల్చేది అబార్షనే!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకాంశంగా మారిన వైనం

తమకే సానుకూలం అంటున్న డెమొక్రాట్లు

అధ్యక్ష ఎన్నికతో పాటు అబార్షన్‌పైనా ఓటేయనున్న 10 రాష్ట్రాలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అబార్షన్ హక్కులు కీలకంగా మారాయి. అధ్యక్షుడు ఎవరనేది అవే నిర్ణయించినా ఆశ్చర్యం లేదని పరిశీలకులూ అభిప్రాయపడుతున్నారు. అబార్షన్ హక్కులను 2022లో అమెరికా సుప్రీంకోర్టు కొట్టేయడం తెలిసిందే. వాటిపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. ఆ తర్వాత జరుగుతున్న తొలి అధ్యక్ష ఎన్నికలివి. ఈ నేపథ్యంలో 10 కీలక రాష్ట్రాల్లోని ఓటర్లు అధ్యక్ష ఎన్నికల్లో ఓటింగ్‌తో పాటు అబార్షన్ హక్కులపైనా తమ అభిప్రాయాన్ని తెలపనున్నారు. అధ్యక్ష అభ్యర్థులతో పాటు అబార్షన్ హక్కుల సవరణ (4) అంశాన్ని కూడా ఆ రాష్ట్రాలు బ్యాలెట్‌లో పొందుపరిచాయి.



గర్భస్రావాన్ని నిషేధిస్తూ అమెరికాలో కనెక్టికట్ రాష్ట్రం 1821లో తొలిసారిగా చట్టం చేసింది. దాంతో అప్పటిదాకా సాధారణ చికిత్సగా ఉన్న గర్భస్రావం నేరంగా మారిపోయింది. 1880వ దశకం చివర్లలో పలు ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి చట్టాలే చేశాయి. జేన్ రో అనే మహిళ దీన్ని వ్యతిరేస్తూ 1971లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గర్భస్రావం అందుబాటులో ఉండేలా చూడాలని, పునరుత్పత్తి సంబంధిత విషయాల్లో నిర్ణయాధికారం మహిళలకే ఉండాలని వాదించారు. దాంతో గర్భస్రావాన్ని చట్టబద్ధం చేస్తూ రెండేళ్ల తర్వాత కోర్టు తీర్పునిచ్చింది. 'రోవర్సెస్ వేడ్' కేసుగా ఇది చరిత్రకెక్కింది. తర్వాత చాలా రాష్ట్రాలు మహిళలకు అబార్షన్ సదుపాయాన్ని కల్పించినా కొన్ని మాత్రం నిషేధం కొనసాగించాయి.

పోప్ వ్యాఖ్యలతో..

అబార్షన్ హక్కులను 1951లో పోప్ గట్టిగా విమర్శించారు. ''గర్భంలోని బిడ్డకు కూడా జీవించే హక్కుంది. ఆ బిడ్డనిచ్చింది దేవుడు. అంతే తప్ప తల్లిదండ్రులు, ఈ సమాజమో లేదా మనిషో సృష్టించిన ప్రభుత్వాలు కాదు'' అంటూ సందేశమిచ్చారు. ఆ తర్వాత గర్భస్రావంపై ఆంక్షలను సుప్రీంకోర్టే తొలగించడం మత సమూహాలకు సమస్యగా మారింది. దాన్ని అడ్డుకోడానికి రిపబ్లికన్ పార్టీని మాధ్యమంగా అవి ఎంచుకున్నాయి. ఫలితంగా 1970వ దశకంలో అంతంతమాత్రంగా ఉన్న పార్టీ ఈ మత సమూహాలతో కలిసి ప్రభావశీలంగా మారింది. 1968–88 మధ్య ఆరు అధ్యక్ష ఎన్నికల్లో ఏకంగా ఐదింటిలో విజయం సాధించింది.

జడ్జీల ద్వారా ఎత్తులు

1983లో పార్లమెంటులో గర్భస్రావ చట్ట సవరణకు ప్రతిపాదనలు ప్రవేశపెట్టినా ఆమోదం పొందలేదు. గర్భస్రావాన్ని నిషేధించడం పార్లమెంటు ద్వారా సాధ్యం కాదని, కోర్టు ద్వారానే ముందుకెళ్లాలని భావించారు. కానీ దానికోసం సంప్రదాయవాద జడ్జిలు అవసరమయ్యారు. అమెరికాలో జడ్జీలను అధ్యక్షుడే నియమిస్తారు. సుప్రీంకోర్టు జడ్జీల నియామకంపై పార్టీలు దశాబ్దాలుగా రెండుగా చీలుతున్నాయి. అధికారం రిపబ్లికన్ల చేతుల్లో ఉంటే గర్భస్రావాన్ని వ్యతిరేకించే జడ్జీలు, డెమొక్రాట్ల చేతిలో ఉంటే సమర్థించే వాళ్లు వచ్చేవారు. ట్రంప్ హయాంలో గర్భస్రావ వ్యతిరేక ధోరణి ఉన్న జడ్జీల నియామకం ఎక్కువగా జరిగింది. దాంతో అబార్షన్‌ను చట్టబద్ధం చేసిన 50 ఏళ్ల నాటి తీర్పును సుప్రీంకోర్టు 2022లో కొట్టివేసింది. అమెరికాలో అబార్షన్ హక్కులను ఈ తీర్పు పూర్తిగా మార్చేసింది. రాష్ట్రాలు తమ పరిధిలో అబార్షన్ అనుమతులను మార్చుకోవచ్చని పేర్కొంది. దీని ఆధారంగానే టెక్సాస్ రిపబ్లికన్ గవర్నర్ గ్రెగ్ అబాట్ ఒక కొత్త గర్భస్రావం చట్టాన్ని అమలు చేశారు. ఈ బాటలో మరిన్ని రాష్ట్రాలు నడిచాయి.

మెజారిటీ అమెరికన్ల వ్యతిరేకత

2022 నాటి సుప్రీంకోర్టు తీర్పుతో మెజారిటీ అమెరికన్లు విభేదించారు. ఇది ఆ ఏడాది జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్ల విజయానికి కారణమైంది. ఇప్పుడు మాత్రం పునరుత్పత్తి హక్కుల కంటే ఆర్థిక వ్యవస్థ గురించి ఓటర్లలో ఎక్కువ ఆందోళన ఉందని సర్వే లు చెబుతున్నాయి. కానీ డెమొక్రాట్ల అభ్యర్థి, కమలా హారిస్ మాత్రం తన ప్రచా రంలో అబార్షన్ హక్కులనే ప్రస్తావిస్తున్నారు. అబార్షన్ల అనుకూల తీర్పును రద్దు చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో తన పాత్రను ట్రంప్ ప్రచారం మొదట్లో పదేపదే పేర్కొంటున్నారు. ఇటీవల మాత్రం అబార్షన్ హక్కులపై నిర్ణయాధికారం రాష్ట్రాలదేనంటున్నారు.

డెమొక్రాట్లకే సానుకూలం


ఫ్లోరిడా, అరిజోనా, నెవడా, కొలరాడో, మోంటానా, సౌత్ డకోటా, మిస్సోరి, న్యూయార్క్, మేరీలాండ్, నెబ్రాస్కాల్లో అధ్యక్ష ఎన్నికలతో పాటు అబార్షన్ హక్కులపై కూడా ఒకేసారి ఓటింగ్ జరుగుతోంది. అబార్షన్ హక్కులుండాలా, పూర్తిగా రద్దు చేయాలా అనే విషయమై ఓటర్లు నిర్ణయం వెలువరించనున్నారు. ఈ విషయాలను అధ్యక్ష బ్యాలెట్‌తో పాటుగా జోడించడం అరిజోనా, నెవడా వంటి రాష్ట్రాల్లో డెమొక్రాట్లకు కలిసి రానుందని చెబుతున్నారు. గత ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఓటేసిన ఫ్లోరిడా కూడా ఈసారి డెమొక్రాట్లకు మద్దతుగా నిలుస్తుందని అంచనా. ఫ్లోరిడా ఓటర్లలో 46 శాతం మంది చట్ట సవరణకు అనుకూలంగా, 38 శాతం వ్యతిరేకంగా, 16 మంది తటస్థంగా ఉన్నారని అక్టోబర్‌లో న్యూయార్క్ టైమ్స్/సియానా కాలేజ్ నిర్వహించిన సర్వే వెల్లడించింది. కాకపోతే వచ్చే మంగళవారం జరగనున్న అధ్యక్ష ఎన్నికల పోలింగ్‌లో అబార్షన్ అంశం ఏ మేరకు ప్రభావం చూపిస్తుందనే దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. ఎందుకంటే ఏకానమీనే ఈ ఎన్నికల్లో అతి పెద్ద సమస్యగా ఏకంగా 28 శాతం మంది ఓటర్లు చూస్తున్నట్టు సియానా కాలేజ్ పోల్ సర్వే పేర్కొంది. అబార్షన్ హక్కులను పెద్ద సమస్యగా భావిస్తున్నది 14 శాతమే. ఇక ట్రంప్ అత్యంత ప్రాధాన్యమిస్తున్న అక్రమ వలసల అంశానికి 12 శాతం మంది మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆచరణసాధ్యమైన హామీలే ఇవ్వాలి

- విచ్చలవిడి గ్యారంటీలతో రాష్ట్రాలు దివాలా తీయడం ఖాయం
- ఎన్నికల్లో ఇచ్చే హామీలు ఆర్థిక పరిస్థితికి సరితూగేలా ఉండాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హితవు
- కర్ణాటక డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్ వ్యాఖ్యలపై అసహనం

బెంగళూరు/న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా ప్రకటిస్తున్న గ్యారంటీలతో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దారుణంగా దెబ్బతింటోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. నోటితో నమలగలిగే దాని కంటే ఎక్కువ మింగేయకూడదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చే హామీలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితికి సరితూగేలా ఉండాలని స్పష్టంచేశారు. ఆచరణ సాధ్యమయ్యే హామీలే ఇవ్వాలని తేల్చిచెప్పారు. కర్ణాటకలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం అమలు చేస్తున్న 'శక్తి' పథకాన్ని పునఃసమీక్షించాలని భావిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఖర్గే మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డి.కె.శివకుమార్ కూడా పాల్గొన్నారు. ఖర్గే మాట్లాడుతూ... రాష్ట్రాల కాంగ్రెస్ యూనిట్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హామీలు ఇచ్చే ముందు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రణాళిక లేకుండా ముందుకెళ్తే ఎన్నో ఆర్థిక ఇబ్బందులు వస్తాయని, రాష్ట్రాలు దివాలా తీసే ప్రమాదం ఉందని, భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్థిక బాధ్యత అనేది ఉండాలన్నారు.



భవిష్యత్ తరాలు నష్టపోతాయి

''కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ఇచ్చారు. మమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని మహారాష్ట్రలోనూ ఐదు గ్యారంటీలు ఇచ్చారు. కర్ణాటకలో ఒక గ్యారంటీని రద్దు చేస్తామని ఇప్పుడు చెబుతున్నారు. మిమ్మల్ని చూస్తుంటే మీరు వార్తాపత్రికలు చదవడం లేదనిపిస్తోంది. కానీ, నేను చదువుతున్నా. అందుకే ఈ విషయం చెబుతున్నా. ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేయకపోతే ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుంది. ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది గ్యారంటీల పేరిట హామీలు ఇవ్వొద్దని మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సలహా ఇస్తున్నా. దానికి బదులు రాష్ట్ర బడ్జెట్‌కు సరిపోయే హామీలే ఇవ్వండి. రాష్ట్రం దివాలా తీసే గ్యారంటీలు వద్దు. ఇష్టానుసారంగా గ్యారంటీలు ఇచ్చేస్తే రేపు రోడ్లు వేయడానికి కూడా డబ్బులు ఉండవు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్ తరాలు నష్టపోతాయి. ప్రభుత్వం మరో పదేళ్లు ఎన్నో ఇక్కట్లు, ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది'' అని మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. ఖర్గే చేసిన ఘాటైన వ్యాఖ్యలపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. శక్తి పథకాన్ని కేవలం పునఃసమీక్ష చేస్తామని మాత్రమే డి.కె.శివకుమార్ చెప్పారని, రద్దు చేస్తామని అనలేదని వివరించారు. దీనిపై ఖర్గే బదులిస్తూ.. డి.కె.శికుమార్ మాట్లాడింది ఏదైనప్పటికీ బీజేపీ విమర్శలు చేయడానికి ఒక అవకాశం ఇచ్చారని తప్పుపట్టారు.

వక్రీకరించారు: డి.కె.

శక్తి పథకంపై తన వ్యాఖ్యలను వక్రీకరించారని డి.కె.శివకుమార్ చెప్పారు. పథకాన్ని రద్దు చేస్తామని తాము ప్రకటించినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బస్సుల్లో ప్రయాణానికి స్వచ్ఛందంగా చార్జీలు చెల్లించడానికి మహిళల్లో ఒక వర్గం సిద్ధంగా ఉందని మాత్రమే తాను అన్నానని ఉద్ఘాటించారు. చార్జీలు చెల్లించడానికి కొందరు మహిళలు ముందుకొచ్చినప్పటికీ తీసుకోవడానికి కండక్టర్లు భయపడుతున్నారని తాను చెప్పానని వివరించారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీని ఉపసంహరించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. శక్తి పథకాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని ధ్వజమెత్తారు. భావోద్వేగాలతో ఆడుకుంటూ ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే విపక్షాల పని అని ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వ గ్యారంటీల మోడల్‌ను చూసి గర్వపడు తున్నామని డి.కె.శివకుమార్ చెప్పారు.

కాంగ్రెస్ రంగు బయటపడింది: మోదీ



ప్రధానమంత్రి మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఆ పార్టీ అసలు రంగు బయటపడిందని అన్నారు. బడ్జెట్‌కు మించి గ్యారంటీలు ఇవ్వొద్దంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున చేసిన వ్యాఖ్యలపై మోదీ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. హామీలు ఇవ్వడమే సులభమే అయినప్పటికీ వాటిని అమలు చేయడం కష్టం, అసాధ్యమన్న సంగతి కాంగ్రెస్‌కు తెలుసని పేర్కొన్నారు. అమలు చేయలేమని తెలిసినప్పటికీ హామీలు, గ్యారంటీల పేరిట ఆ పార్టీ ప్రజలను దగా చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటకలో ఒక గ్యారంటీని రద్దు చేయాలని చూస్తు న్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్ పాలిత తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా మారిందన్నారు. తెలంగాణలో రుణ మాఫీ కోసం రైతులు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ దుష్ట రాజకీయాలకు పేదలు, రైతులు, యువత, మహిళలు తీవ్రంగా నష్టపోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల హరియాణా ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ అబద్ధాలను తిరస్కరించారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే అధ్వాన్న పరిపాలనకు, దిగజారిన ఆర్థిక వ్యవస్థకు, వనరుల లూటీకి ఓటు వేసినట్లేనని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని వెల్లడించారు. కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే హామీలు అమలు కాకపోవడమే కాదు, ఉన్న పథకాలు సైతం రద్దవుతాయని విమర్శించారు. కాంగ్రెస్ సంస్కృతి అయిన బూటకపు హామీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోదీ పిలుపునిచ్చారు. దేశ ప్రజలు కేవలం అభివృద్ధిని కోరుకుంటున్నారు తప్ప అదే పాతకాలం నాటి బోగస్ హామీలను కాదని తేల్చిచెప్పారు.

ఇజ్రాయెల్ హై అలర్ట్

ఇరాన్ ప్రతీకార దాడి చేస్తుందని అనుమానం

టెల్ అవీవ్: ఇరాన్ చేసే ఎలాంటి దాడినైనా ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. ఎప్పుడు, ఎలా దాడి చేయనుందో కచ్చితంగా తెలియనప్పటికీ ఇజ్రాయెల్ మాత్రం అత్యున్నత స్థాయి అప్రమత్తత ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్‌పైకి విరుచుకుపడటం తెలిసిందే. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు కూడా ఇరాన్‌పై రెండు సార్లు దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రాలు, గగనతల రక్షణ వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. ఇది ఇరాన్‌ను ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టేసింది. ఇజ్రాయెల్‌పైకి దాడి చేసే శక్తి, ఇజ్రాయెల్ దాడులను ఎదుర్కొనే సామర్థ్యం ఈ దాడులతో దెబ్బతిన్నట్లు రూఢీ అయ్యింది. 'ఇజ్రాయెల్ చేసిన దాడులను అతిగా చూపలేం, అలాగని తక్కువని చెప్పలేం'అని సాక్షాత్తూ ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా ఖమేనీయే స్వయంగా వ్యాఖ్యానించడం గమనార్హం. అయినప్పటికీ, ఇరాదన్ ప్రతీకారం తీర్చుకునే అవకాశాలున్నట్లు ఇజ్రాయెల్ అనుమానిస్తోంది.

గూగుల్‌కు రష్యా విధించిన జరిమానా!

$20,000,000,000,000,000,000,000,000,000,000,000

భూమి మీదున్న నగదు కంటే ఎక్కువ

గూగుల్‌పై రష్యా కన్నెర్రజేసింది. ఆ సంస్థకు మాస్కో కోర్టు అత్యంత భారీ జరిమానా విధించింది. ఎంతో తెలుసా? భూమి మీద చలామణీలో ఉన్న మొత్తం నగదు కంటే కూడా ఎక్కువ! సరిగ్గా చెప్పాలంటే రెండు అన్‌డెసీలియన్ల రష్యన్ రూబుళ్లు. అన్‌డెసీలియన్ అంటే ఒకటి పక్కన 36 సున్నాలన్నమాట. ఈ జరిమానా మొత్తం డాలర్లలో 2 తర్వాత 34 సున్నాలుగా తేలింది. ప్రపంచపు మొత్తం జీడీపీని కలిపినా ఇందులో కనీసం ఒక మూలకు కూడా రాదు. ప్రపంచ జీడీపీ 110 ట్రిలియన్ డాలర్లని అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనా. ట్రిలియన్ అంటే ఒకటి పక్కన 12 సున్నాలు. ఇక ఒకటి పక్కన పద్నాలుగు సున్నాలు పెడితే వచ్చే క్వాడ్రిలియన్ విలువ ఏకంగా వెయ్యి ట్రిలియన్లు! దీన్ని బట్టి అన్‌డెసీలియన్ ఎన్ని ట్రిలియన్లో ఊహించుకోవాల్సిందే తప్ప చెప్పడం దాదాపుగా అసాధ్యమే. గూగుల్ కంపెనీ తాలూకు మొత్తం విలువే రెండు ట్రిలియన్ డాలర్లు కావడం విశేషం. జరిమానాలో పేర్కొన్న సంఖ్యను పలకడం కూడా అసాధ్యమేనని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ అంగీకరించారు. కాకపోతే రష్యా అభ్యంతరాలను గూగుల్ యాజమాన్యం తక్షణం సీరియస్‌గా తీసుకోవాలని హెచ్చరించారు. దీనిపై గూగుల్ అధికారికంగా స్పందించలేదు.

ఎందుకీ జరిమానా?

గూగుల్‌తో రష్యా రగడ 2020లోనే మొదలైంది. 2021 మేలో రష్యా ప్రభుత్వానికి చెందిన 17 మీడియా చానళ్లపై యూట్యూబ్ నియంత్రణలు విధించడంతో ముదురు పాకాన పడింది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దండెత్తడంతో దాన్ని నిరసిస్తూ పాశ్చాత్య కంపెనీలన్నీ ఒకటి తర్వాత ఒకటిగా రష్యాను వీడటం తెలిసిందే. ఆ క్రమంలో రష్యా మీడియా కంపెనీలు కూడా యూరప్‌లో నిషేధానికి గురయ్యాయి. రష్యాలోని గూగుల్ అనుబంధ సంస్థ 2022లో దివాలా ప్రకటించింది. ప్రకటనల వంటి వాణిజ్య సేవలను పూర్తిగా నిలిపేసింది. కాకపోతే రష్యా నుంచి పూర్తిగా వైదొలగలేదు. తమ మీడియా చానళ్లకు యూట్యూబ్ యాక్సెస్‌ను గూగుల్ నిషేధించిందని రష్యా మీడియా నియంత్రణ సంస్థ ఆరోపించింది. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి నిషేధిత సమాచార వ్యాప్తిని నిరోధించడంలో విఫలమైందంటూ 2022 జూలైలోనే గూగుల్‌కు 21 బిలియన్ రూబుళ్ల జరిమానా విధించింది. ఇలాంటి పరిస్థితిని గూగుల్ ముందే ఊహించింది. రష్యా కోర్టుల తీర్పుల ప్రభావం తనపై పడకుండా ముందుజాగ్రత్తకు దిగింది. రష్యా టీవీ చానళ్లపై అమెరికా, యూరప్‌ల్లో ఇప్పటికే కేసులు వేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

చపలచిత్తుడు

- ట్రంప్‌పై హారిస్ విమర్శలు
- హారిస్‌కే ఓటేయండి: లోపెజ్



ఫిలడెల్ఫియా: రిపబ్లికన్ల అధ్యర్థి అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై ఆయన డెమొక్రాటిక్ పార్టీ ప్రత్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఘాటైన విమర్శలు చేశారు. ''ట్రంప్ అత్యంత చపలచిత్తుడు. ఆపాదమస్తకమూ ప్రతీకారేచ్ఛతో నిండిపోయిన బాపతు. దానికోసమే అపరిమితమైన అధికారానికై అర్రులు చాస్తున్నారు'' అంటూ దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ అతి సమీపంలోకి నేపథ్యంలో ఆమె శుక్రవారం లాస్‌వెగాస్‌లో ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ అంటేనే విద్వేషానికి ప్రతినిధి అంటూ తూర్పారబట్టారు. ''పొరపాటున ట్రంప్‌ను గెలిపిస్తే 'శత్రువుల జాబితా'ను జేబులో పెట్టుకుని మరీ శ్వేతసౌధంలోకి అడుగు పెడతారు. నేనైతే అమెరికన్ల జీవితాలను మరింత మెరుగుపరిచేందుకు ఏమేం చేయాలన్న జాబితాతో కాలు పెడతా. అందులో మొదటిది మీ జీవనవ్యయాన్ని తగ్గించడమే'' అని ప్రకటించారు. హారిస్‌కు మద్దతుగా ప్రఖ్యాత గాయని జెన్నిఫర్ లోపెజ్ కూడా ర్యాలీలో పాల్గొన్నారు. అమెరికన్లంతా, ప్రత్యేకించి లాటినో అమెరికన్లు హారిస్‌కు మద్దతివ్వాలని పిలుపు నిచ్చారు. ట్రంప్ మాదిరిగా కొందరినే కాకుండా అమెరికన్లందరి సంక్షేమాన్నీ హారిస్ పట్టించుకుంటారని లోపెజ్ అభిప్రాయపడ్డారు. అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం లెబ్రాన్ జేమ్స్ కూడా గురువారం హారిస్‌కు తన మద్దతు ప్రకటించారు. ఆమెకు ఓటేస్తేనే తన పిల్లల భవిష్యత్తు క్షేమంగా ఉంటుందన్నారు. 'కమలా హారిస్‌కే ఓటేయండి' అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.


జవాన్‌కు మిఠాయి తినిపిస్తున్న మోదీ

అంగుళం భూమి కూడా వదులుకోం

- సరిహద్దుల్లో భూభాగాన్ని రక్షించుకొనే విషయంలో రాజీ ప్రసక్తే లేదు: మోదీ
- గుజరాత్‌లోని సర్ క్రీక్‌లో సైనికులతో కలిసి దీపావళి వేడుకలు

భుజ్: దేశ సరిహద్దుల్లో మన భూభాగంలో ఒక్క అంగుళం భూమి కూడా వదులుకోబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. మన భూభాగాన్ని కాపాడుకొనే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. దేశాన్ని కాపాడే విషయంలో సైనిక దళాల శక్తిసామర్థ్యాలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని చెప్పారు. భారత సైనిక దళాలను చూస్తే శత్రువులకు వణుకు తప్పదని అన్నారు. దుష్ట శక్తుల ఆటలు సాగవని హెచ్చరించారు. గుజరాత్ రాష్ట్రం కచ్ జిల్లాలో భారత్–పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలోని సర్ క్రీక్‌లో ప్రధాని మోదీ గురువారం బీఎస్ఎఫ్‌తోపాటు త్రివిధ దళాల సైనికులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన ప్రతిఏటా సైనికులతోపాటు దీపావళి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. సర్ క్రీక్‌లో వేడుకల సందర్భంగా జవాన్లను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని యుద్ధక్షేత్రంగా మార్చడానికి గతంలో ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. శత్రు దేశం ఈ ప్రాంతంపై చాలా ఏళ్లుగా కన్నేసిందని, ఆక్రమించుకొనేందుకు కుట్రలు చేస్తోందని పరోక్షంగా పాకిస్తాన్‌పై మండిపడ్డారు.

'ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్' ఏర్పాటు చేస్తాం

''దౌత్యం పేరుతో సర్ క్రీక్‌ను ఆక్రమించడానికి గతంలో కుట్రలు జరిగాయి. అప్పట్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నేను శత్రుదేశం కుట్రలపై గొంతు విప్పాను. దేశాన్ని రక్షించే విషయంలో మన సైనిక దళాల సామర్థ్యంపై ప్రభుత్వానికి విశ్వాసం ఉంది. మన దేశాన్ని శత్రువుగా భావించేవారి మాటలు మేము నమ్మడం లేదు. సైన్యం, నావికాదళం, వైమానిక దళం వేర్వేరు విభాగాలు. కానీ, ఆ మూడు దళాలు ఒక్కటైతే దేశ సైనిక బలం ఎన్నో రెట్లు పెరిగిపోతుంది. ఇందుకోసమే చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) అనే పదవిని సృష్టించాం. త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం కోసం ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్ ఏర్పాటు చేయబోతున్నాం'' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

30 వారాల గర్భవిచ్ఛిత్తికి బాంబే హైకోర్టు అనుమతి

ముంబై: పదకొండేళ్ల రేప్ బాధితురాలు తన 30 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి బాంబే హైకోర్టు అనుమతించింది. 11 ఏళ్ల చిన్నారి అబార్షన్‌కు మానసికంగా, శారీరకంగా సంసిద్ధంగా ఉందని వైద్య నిపుణుల బృందం చెప్పడాన్ని పరిగణలోకి తీసుకొని 30 వారాల గర్భవిచ్ఛిత్తికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కడుపులో ఇన్‌ఫెక్షన్ కారణంగా చిన్నారి పొత్తికడుపు గట్టిపడిందని భావించామని, థానే ఆసుపత్రిలోనూ డాక్టర్లు అలాగే భావించి మందులు రాసిచ్చారని తండ్రి కోర్టుకు తెలిపారు. అయినా బాలిక పరిస్థితిలో మార్పేమీ రాకపోవడంతో అక్టోబరు 24న ముంబై ఆసుపత్రికి తీసుకెళ్లామని, అక్కడ బాలిక గర్భం దాల్చిందనే విషయాన్ని డాక్టర్లు ధ్రువీకరించారని ఆమె తండ్రి కోర్టుకు విన్నవించారు. గర్భవిచ్ఛిత్తికి అనుమతించాలని కోర్టును కోరడంతో 30 వారాల గర్భాన్ని తొలగించడానికి అనుమతిస్తూ జస్టిస్ షర్మిల దేశ్‌ముఖ్, జస్టిస్ జితేంద్ర జైన్‌ల ధర్మాసనం తీర్పునిచ్చింది.

నేను మీ మాల్‌ను కాను

అరవింద్ సావంత్ వ్యాఖ్యలపై షైనా మండిపాటు


షైనా ఎన్‌సీ


సావంత్

ముంబై: శివసేన(షిండే)వర్గం నేత షైనా ఎన్‌సీపై శివసేన (ఉద్ధవ్) నేత అరవింద్ సావంత్ చేసిన వ్యాఖ్య లు దుమారం రేపుతు న్నాయి. మహిళల మర్యాదకు భంగం కలిగించేలా సావంత్ మాట్లాడారంటూ ఆయనపై షైనా ఎన్‌సీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షైనా ఎన్‌సీ ఇటీవలే బీజేపీని వీడి, ఆ పార్టీ మిత్రపక్షం శివసేన(షిండే)వర్గంలో చేరారు. దీనిపై సావంత్ రెండు రోజుల క్రితం మీడియాతో మాట్లాడుతూ..'షైనా ఎన్‌సీ ఇప్పటి దాకా బీజేపీలో ఉన్నారు. టికెట్ రాకపోయేసరికి మరో పార్టీలో చేరిపోయారు. ఇంపోర్టెడ్ మాల్‌ను మేం తీసుకోం. అసలైనవే తీసుకుంటాం. మా సరుకు ఒరిజినల్'అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై షైనా ఎన్‌సీ భగ్గుమన్నారు. 'గతంలో అరవింద్ సావంత్ ఎన్నికల ప్రచారానికి నన్ను వెంట తీసుకెళ్లేవారు. ఇప్పుడేమో నేను ఇంపోర్టెడ్ సరుకునయ్యా. నేనేమీ మీ మాల్‌ను కాను. మహిళల్ని వస్తువులతో పోలుస్తూ అవమానిస్తారా? ఇప్పుడే నాగ్‌పాడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తా'అని శుక్రవారం చెప్పారు.

210కి పెరిగిన స్పెయిన్ వరద మృతులు


స్పెయిన్‌లో వాలెన్సియా ప్రాంతంలో పికన్యా పట్టణంలో భారీ వరదలో నిలువుగా కూరుకుపోయిన కారు

మాడ్రిడ్: స్పెయిన్‌లో ఆకస్మిక భారీ వరదలకు బలైన వారి సంఖ్య 210 దాటింది. చాలామంది గల్లంతయ్యారు. మృతదేహాలను సహాయ బృందాలు వెలికి తీస్తున్నాయి. శిథిలాలుగా మారిన ఇళ్లు, బురదలో మునిగిన వీధులు, నేలకూలిన చెట్లు, కూలిన విద్యుత్ లైన్లు, గల్లంతైనవారి గురించి ఆత్మీయుల ఆందోళనలు... ఇలా ఎక్కడ చూసినా ఈ విషాద దృశ్యాలే కనబడుతున్నాయి. ఆకస్మిక తుఫాను కలిగించిన భారీ నష్టం సునామీ అనంతర పరిణామాలను తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

హిందువులను విస్మరించారు

బైడెన్, హారిస్‌పై ట్రంప్ ధ్వజం ● బంగ్లాలో మైనారిటీలపై హింసకు ఖండన



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులను వారిద్దరూ పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీలపై హింసను తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అనాగరికమైన చర్యగా పేర్కొన్నారు. ట్రంప్ తన దీపావళి సందేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. హిందూ అమెరికన్లకు రక్షణ కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రిస్టియన్లు, ఇతర మైనారిటీలపై అరాచక మూకల దాడులను, వారి ఆస్తులను దోచుకుంటున్న అనాగరిక హింసను తీవ్రంగా ఖండించారు. ఎక్స్‌లో ఈ మేరకు ఆయన పోస్ట్ చేశారు. తాను అధ్యక్షునిగా ఉంటే ఇలా ఎప్పటికీ జరిగేది కాదన్నారు. ఇజ్రాయెల్ మొదలుకుని ఉక్రెయిన్ మీదుగా అమెరికా దక్షిణ సరిహద్దు దాకా బైడెన్, హారిస్ విధానాలు ఘోరంగా విఫలమయ్యాయంటూ ధ్వజమెత్తారు. మునుపటి కంటే మెరుగైన అమెరికాను తీర్చిదిద్దుతా'' అని ట్రంప్ పేర్కొన్నారు.

కాషాయ జెండా ఎగరేసినందుకు.. బంగ్లాదేశ్‌లో 18 మందిపై దేశ ద్రోహం కేసు

ఢాకా: మైనారిటీ హిందువులే లక్ష్యంగా బంగ్లాదేశ్ యంత్రాంగం వ్యవహరిస్తున్నదనేందుకు తాజా ఉదాహరణ. మైనారిటీలకు రక్షణ కల్పించేందుకు చట్టాలు తేవాలంటూ ఇటీవల చత్తోగ్రామ్‌లో హిందువులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాషాయ జెండా ఎగురవేశారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో 18 మందిపై దేశ ద్రోహ చట్టం కింద కేసు నమోదైంది. మరో 20 మంది వరకు గుర్తు తెలియని వ్యక్తులపైనా అక్టోబర్ 25న కేసు నమోదు చేశారు. తమ 8 డిమాండ్ల అజెండాకు బంగ్లాదేశ్‌లోని అవామీ లీగ్, భారత ప్రభుత్వం సాయంగా నిలిచాయని పుండరీక్ ధామ్ ప్రెసిడెంట్, కేసు బాధితుడు అయిన చిన్మయ్ కృష్ణ దాస్ బ్రహ్మచారి తెలిపారు. తమ నిరసన బంగ్లా ప్రభుత్వానికి వ్యతిరేకం కానే కాదన్నారు. కాగా, ఈ చర్యను అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న డొనాల్డ్ ట్రంప్ సైతం ఎన్నికల ప్రచారంలో ఖండించడం గమనార్హం. ఇలా ఉండగా, హోం మంత్రిత్వ శాఖ అనుమతి ఉంటేనే తప్ప, పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి దేశ ద్రోహం కేసును తనంత తానే నమోదు చేయలేరని పరిశీలకులు అంటున్నారు. నేరం రుజువైతే జీవిత కాల జైలు శిక్ష పడవచ్చు.

సాక్షి
హైదరాబాద్

శనివారం | 2 | నవంబర్ | 2024



హాష్ ఆయిల్ స్మగ్లర్ల అరెస్టు

ఒడిశా నుంచి నగరానికి హాష్ ఆయిల్ తరలిస్తున్న ముగ్గురిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. రూ.13.5 లక్షల విలువైన హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. -8లో



మాటే మంత్రం..

మాటలే మంటలు రేపుతాయి.. చెలరేగిన మంటలను నోటి మాటలే చల్లార్చుతాయి. నోట్ల కట్టల కంటే నోటి మాటకే పదునెక్కువ. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/21.0

నగరంలో శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది . గరిష్ఠంగా 33, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

సదర్.. అదిరెన్







ఖైరతాబాద్‌లో శుక్రవారం నవయుగ యాదవ సంఘం, చౌదరి యాదయ్య యాదవ్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలు సంబరంగా సాగాయి. అందంగా అలంకరించిన దున్నపోతులపై యాదవులు హాకీ స్టిక్‌లు పట్టుకొని నృత్యాలు చేస్తూ, తీన్మార్ స్టెపులు వేశారు. సదర్ ఉత్సవాల్లో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డీసీసీ నేత రోహిన్ రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
– ఖైరతాబాద్

బాణాసంచా కాలుస్తుండగా పలువురికి గాయాలు

సరోజినిదేవి కంటి ఆస్పత్రిలో 48 మందికి చికిత్సలు

గోల్కొండ: దీపావళి సందర్భంగా గురువారం బాణాసంచా కాలుస్తుండగా కళ్లకు గాయాలైన బాధితులు మెహిదీపట్నంలోని సరోజిని దేవి కంటి ఆస్పత్రిలో చికిత్స పొందారు. గురు, శుక్రవారాల్లో మొత్తం 48 మంది కంటి గాయాలతో ఆస్పత్రికి వచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని తెలిపారు. స్వల్ప గాయాలతో వచ్చిన వీరికి ప్రథమ చికిత్స అందించి అప్పటికప్పుడు డిశ్చార్జి చేశామన్నారు. ఇద్దరు యువకులను ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందిస్తున్నామన్నారు. అభిషేక్ అనే యువకుడికి బాణాసంచా కాలుస్తుండగా రాయి వచ్చి ఎడమ కన్నుకు తాకిందన్నారు. వెంకట్ అనే మరో యువకుడికి సైతం కుడి కన్నుకు గాయమైందని, వీరిద్దరినీ ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందిస్తున్నామని ఆమె చెప్పారు. పూర్తి పరీక్షల తర్వాతే గాయాల తీవ్రతను తేల్చవచ్చన్నారు. ఇప్పటి వరకు వచ్చిన బాధితుల్లో ఎవరికీ కనుగుడ్డుకు గాయం కాలేదన్నారు. టపాసులు కాల్చే సమయంలో తీసుకునే జాగ్రత్తలపై అందరికీ అవగాహన కలగడంతో బాధితుల సంఖ్య బాగా తగ్గిందన్నారు. 48 మంది బాధితుల్లో 20 మంది పిల్లలు ఉన్నారని మెడికల్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

కమ్మేసిన కాలుష్యం

గ్రేటర్‌లో దీపావళికి టపాసుల మోత

- పరిమితికి మించి శబ్ద, వాయు పొల్యూషన్
- భారీస్థాయిలో దిగజారిన గాలి నాణ్యత
- కాప్రా, జూపార్క్, బొల్లారం, పటాన్‌చెరు, సోమాజిగూడ, సనత్‌నగర్‌లలో అధిక ప్రభావం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో కాలుష్యం కమ్ముకుంది. పర్యావరణహితంగా దీపావళి పర్వదినాన్ని జరుపుకోవాలని పర్యావరణవేత్తలు, పోలీసులు సూచించినా ఫలితం కనిపించలేదు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో టపాసుల మోత మోగడంతో తీవ్రమైన శబ్ద కాలుష్యంతో పాటు గాలి నాణ్యత విపరీతంగా పడిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగ అలుముకుంది. ఎదురుగా ఉన్న వాహనాలు కనిపించలేని పరిస్థితి నెలకొంది.



ప్రమాదకర స్థాయికి..

దీపావళి సందర్భంగా గురువారం రాత్రి పలుచోట్ల ప్రజలు టపాసులు పేల్చారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ప్రకారం కాప్రా, జూపార్క్, బొల్లారం, పటాన్‌చెరు, సోమాజిగూడ, సనత్‌నగర్ ప్రాంతాలలో అధిక వాయు కాలుష్యం వెదజల్లింది. దీంతో గాలి నాణ్యత (ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి దిగజారింది. రాత్రి 10 గంటల సమయంలో గ్రేటర్‌లోని వాతావరణంలో పర్టిక్యులర్ మ్యాటర్ (పీఎం)–2.5 ప్రమాదకర స్థాయిలో చేరుకుంది. పీఎం–10 సూక్ష్మ ధూళికణాలు, పీఎం–2.5 (అతి సూక్ష్మధూళి కణాలు), ఓజోన్, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్‌డయాక్సైడ్, వంటి పలు కాలుష్య కారకాలు వెలువడ్డాయి.

ఈ ప్రాంతాల్లో గరిష్ఠంగా..

పీసీబీ పరిమితుల ప్రకారం పీఎం–2.5 తీవ్రత 40 మైక్రోగ్రాములకు మించకూడదు. కానీ.. గురువారం రాత్రి గరిష్ఠంగా సనత్‌నగర్‌లో 472 మైక్రోగ్రాములు, కాప్రాలో 454లతో పాటు జూపార్క్, బొల్లారం, పటాన్‌చెరు, సోమాజిగూడ, సనత్‌నగర్‌లలో గాలి నాణ్యత విపరీతంగా పడిపోయింది. రామచంద్రాపురంలో పీఎం–10 మోతాదు అత్యధికంగా 605 మైక్రోగ్రాములుగా నమోదయింది.

శబ్ద కాలుష్యం సైతం..

రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య నివాస సమయాల్లో 55 డెసిబుల్స్ (డీబీ), వాణిజ్య ప్రాంతాల్లో 55 డీబీ, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 డీబీ, సున్నితమైన ప్రాంతాల్లో 40 డీబీలుగా పీసీబీ నిర్దేశించింది. కానీ.. దీపావళి రోజున అన్ని ప్రాంతాల్లోనూ పరిమితికి మించి శబ్ద కాలుష్యం వెలువడిందని పీసీబీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నివాస, వాణిజ్య ప్రాంతాలతో పాటు సున్నితమైన ప్రాంతాల్లోనూ విపరీతమైన ధ్వని కాలుష్యం వెలువడింది. జూబ్లీహిల్స్, సనగర్‌నగర్, కొంపల్లి, గచ్చిబౌలి, ఉప్పల్, రామంతాపూర్, ఎల్బీనగర్, జూపార్క్ వంటి ప్రాంతాల్లో టపాసుల మోతతో పరిమితికి మించి శబ్ద కాలుష్యం ఏర్పడింది.

గండిపేట కాండూట్‌కు కెమికల్ ట్రీట్‌మెంట్

14.5 కిమీ పొడవునా 45 ప్రాంతాల్లో లీకేజీలు

సాక్షి, సిటీబ్యూరో: వందేళ్ల గండిపేట చెరువు కాలువ (కాండూట్) లీకేజీల కట్టడికి జలమండలి చేపట్టిన కెమికల్ ట్రీట్‌మెంట్ విజయవంతమైంది. గండిపేట చెరువు కాండూట్ లీకేజీల కారణంగా సగానికిపైగా నీరు నేల పాలవుతోంది. ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వరకు సుమారు 14.5 కిలోమీటర్ల పొడవున్న కాండూట్ దాదాపు 45 ప్రాంతాల్లో లీకేజీ అవుతోంది. గత పదేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించేందుకు తాత్కాలికంగా చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండాపోయింది. శాశ్వత పరిష్కారం కోసం నీటి సరఫరాను నిలిపివేస్తే గాని పూర్తి స్థాయి మరమ్మతులకు సాధ్యపడని పరిస్థితి. కనీసం నెల రోజులకుపైగా మరమ్మతు పనులకు సమయం పట్టనుండటంతో జలమండలి పనులను వాయిదా వేస్తూ వస్తోంది. తాజాగా జలమండలి యంత్రాంగం గండిపేట కాండూట్ లీకేజీలపై దృష్టి సారించింది.

జర్మనీ సాంకేతికతతో..

గండిపేట నుంచి కాండూట్ ద్వారా నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా లీకేజీలకు మరమ్మతు పనులు చేపట్టాలని జలమండలి చర్యలకు ఉపక్రమించింది. అందుకు అనుగుణంగా టెక్నాలజీలను అన్వేషించగా చెన్నైకి చెందిన ఓ కంపెనీ ముందుకు వచ్చింది. జర్మనీ టెక్నాలజీతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా లీకేజీలు అరికట్టేందుకు సిద్ధమైంది. నెలన్నర క్రితం ప్రయోగాత్మకంగా ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద కాండూట్ లీకేజీలకు 10 మీటర్ల మేరకు గ్రౌటింగ్ కెమికల్ ట్రీట్‌మెంట్‌తో మరమ్మతు పనులు విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో కాండూట్ పొడవునా లీకేజీలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది.

ట్రీట్‌మెంట్ ఇలా..

కాండూట్ లీకేజీలు ఏర్పడిన ప్రాంతంలో మొదట ప్రత్యేక పరికరాలతో నీటిని ఖాళీ చేసి ఆ ప్రదేశంలోకి ప్రత్యేకమైన రసాయనాన్ని పంపిస్తారు. క్షణాల్లో ఆ రసాయనం ఘన పదార్థంగా మారి లీకేజీ ఖాళీ ప్రాంతాల్లో పూడుకుపోతుంది. దీంతో లీకేజీ ఆగిపోతుంది. ఈ పద్ధతి ద్వారా నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండానే మరమ్మతు పనులు కొనసాగించవచ్చు. ప్రస్తుతం ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద కాలువ లీకేజీ మరమ్మతు పనులు పూర్తి కాగా.. గండిపేట్, కోకాపేట్, మణికొండ, సీబీఐటీ కళాశాల, పుప్పాలగూడ, జానకీ నగర్, కొసర్ కాలనీ, ఎంఈఎస్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో సైతం లీకేజీల మరమ్మతులకు జలమండలి సిద్ధమైంది.

పైసా ఖర్చు లేకుండా.. గ్రావిటీ ద్వారా..

వందేళ్ల క్రితం అప్పటి నిజాం నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం గండిపేట జలాశయం నిర్మించారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి జలాశయాల నుంచి కూడా నీటి సరఫరా జరుగుతుండటంతో గండిపేట నుంచి నీటి సరఫరా కొన్ని ప్రాంతాలకు పరిమితమైంది. గండిపేట్ నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్ కాండూట్ ద్వారా నీటి సరఫరా పైసా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారానే కొనసాగుతోంది. ఫిల్టర్ బెడ్‌లో నీటిశుద్ధి అనంతరం వినియోగదారులకు సరఫరా జరుగుతోంది.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండానే పనులు

- ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద మరమ్మతులు సఫలం
- మిగతా ప్రాంతాల్లోనూ చేపట్టేందుకు చర్యలు
- పదేళ్లుగా వెంటాడుతున్న సమస్యకు జలమండలి పరిష్కారం

షట్‌డౌన్ లేకుండానే లీకేజీల మరమ్మతులు



గండిపేట కాండూట్ లీకేజీలను నివారించేందుకు సరికొత్త టెక్నాలజీతో ఉపయోగిస్తున్నాం. నీటి సరఫరాలో ఎలాంటి ప్రభావం పడకుండా మరమ్మతులు చేపట్టాం. లీకేజీల నివారణ పూర్తయితే నీరు వృథా కాకుండా తరలిస్తున్న పూర్తి స్థాయి నీరు వినియోగదారులకు సరఫరా అవుతోంది.
– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ



ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద కాండూట్ లీకేజీలు (ఫైల్)



లీకేజీలకు కెమికల్ ట్రీట్‌మెంట్ పనులు

నేటి నుంచి కీసరగుట్టలో కార్తీక మాసోత్సవాలు



కీసర గుట్టలో సిద్ధమైన క్యూలైన్లు

కీసర: ప్రసిద్ధ శైవ క్షేత్రం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నుంచి కార్తీక మాసోత్సవ ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపోత్సవాలతో కార్తీక మాస పూజలకు అంకురార్పణ చేస్తామని ఆలయ చైర్మన్ తెలిపారు. భక్తులు ప్రతి ఆది, సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజున అభిషేకాలు, ప్రత్యేక దర్శనం టికెట్లను keesaragutta.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని వారు సూచించారు.

సాయి సూర్య డెవలపర్స్ ఎండీ అరెస్ట్

ఫోర్జరీ సంతకాలతో నకిలీ లే అవుట్ సృష్టి

సాక్షి, సిటీబ్యూరో: ఫోర్జరీ సంతకాలతో నకిలీ లే అవుట్ సృష్టించి మోసాలకు పాల్పడిన సాయి సూర్య డెవలపర్స్ యజమానిని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గంలోని సాయి సూర్య డెవలపర్స్ ప్రొప్రయిటర్ కంచర్ల సతీష్‌చంద్ర గుప్తా, భాగ్యనగర్ ప్రాపర్టీస్ ఎండీ నరేందర్ సురానాతో కలిసి సామాన్యులకు ప్లాట్ల విక్రయం పేరిట మోసం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వట్టినాగులపల్లిలోని ఓ అనధికారిక లేఅవుట్‌ను తీసుకొని.. దాన్ని ఫోర్జరీ సంతకాలతో తులసి ఎన్‌క్లేవ్–4, షణ్ముఖ నివాస్ పేర్లతో నకిలీ లేఅవుట్‌ను సృష్టించారు. ప్రీలాంచ్ ఆఫర్ల కింద తక్కువ ధరకే ప్లాట్లను విక్రయిస్తున్నామంటూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేశారు. నాచారం ప్రాంతానికి చెందిన పోతుగంటి గోపాల్ రెడ్డి.. ప్లాట్ కొనేందుకు సతీష్ చంద్రను సంప్రదించారు. రూ.3.25 కోట్లకు గాను.. గతేడాది ఫిబ్రవరిలో అడ్వాన్స్‌గా ఆయన రూ.1.45 కోట్లు చెల్లించారు. ఏడాది గడిచినా ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తుండడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. అసలు విషయం ఆరా తీయగా.. అది నకిలీ లేఅవుట్ అని, తాను మోసపోయాయని గ్రహించిన గోపాల్‌రెడ్డి సైబరాబాద్ పోలీసులు ఆశ్రయించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడు సతీష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే సతీష్ చంద్రపై 11 కేసులున్నాయి. నగరంలోని వందలాది సామాన్యుల నుంచి ప్లాట్ల విక్రయం పేరిట కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు ఇతడిపై ఆరోపణలున్నాయి.

శాంతిని నెలకొల్పడంలో పీస్ కమిటీ సభ్యులు కీలకం

నగర సీపీ సీవీ ఆనంద్



బంజారాహిల్స్: పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు నగరంలో శాంతిని నెలకొల్పడంలో కీలక పాత్ర నిర్వహిస్తున్నారని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నగరంలోని అన్ని జోన్లకు చెందిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేశారు. నగరంలో ఇటీవల జరిగిన మతపరమైన సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడంలో స్థానిక పోలీసులకు పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. హైదరాబాద్ ఖ్యాతిని కాపాడేందుకు అవిశ్రాంత కృషిని కొనసాగించాల్సిందిగా కోరారు. పీస్ వెల్ఫేర్ కమిటీలో యువతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పీస్ కమిటీ సభ్యులకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపడాలని, ఏదైనా శాంతిభద్రతల సమస్య వచ్చినప్పుడు పీస్ వెల్ఫేర్ కమిటీల ద్వారా సమస్యను సులువుగా పరిష్కరించవచ్చని చెప్పారు. వివిధ మత సమూహాల మధ్య అవగాహన, పరస్పర సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ పోలీసులకు మద్దతుగా ఉంటామని, రాబోయే పండగలను శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా, సమాజంలో సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్మూలించడానికి, ప్రజల్లో మత సామరస్య భావన, ఐక్యత నెలకొల్పే విధంగా కమ్యూనిటీ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తామని ఈ సందర్భంగా పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ చైతన్యకుమార్, సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహ్రా, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ జనరల్ సెక్రటరీ కిషన్‌శర్మ, హాఫీజ్ ముజాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చక్కర్లు కొట్టి.. చెట్టుకు ఢీకొట్టి

- మితిమీరిన వేగంతో కారు నడిపిన యువకుడు
- బంజారాహిల్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రాణాలతో బయటపడిన యువ వ్యాపారి
- విచారణ జరుపుతున్న పోలీసులు

డివైడర్‌పైకి ఎక్కి.. కేబీఆర్ పార్కు ఫెన్సింగ్‌ను దాటుకుని..



ఉత్సవ్ దీక్షిత్



నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కారు నడుపుతున్న యువకుడికి గాయాలయ్యాయి. డివైడర్‌పై నుంచి వెళ్లి.. ఫెన్సింగ్‌ను ఢీకొని, చెట్టును ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. అదుపుతప్పిన వేగంతో వచ్చిన కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఎడమ వైపు ముందటి టైర్ ఊడిపోయి 50 మీటర్ల దూరం వెళ్లి పడిపోవడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–6లో నివసించే ఉత్సవ్ దీక్షిత్ (33) ప్లాస్టిక్ వ్యాపారం చేస్తుంటాడు. గురువారం రాత్రి భార్యతో గొడవ పడి రూ.3 కోట్ల విలువ చేసే నంబర్ ప్లేట్ లేని పోర్షే కారులో బయటకు వచ్చాడు. ఫిలింనగర్‌లో రాత్రి 11 గంటల నుంచి తిరుగుతూ ఉన్నాడు. దీపావళి సందర్భంగా తన స్నేహితులకు స్వీట్ బాక్సులు ఇచ్చి తెల్లవారుజాము వరకూ కారులో అతివేగంగా చక్కర్లు కొడుతూ గడిపాడు.

కారు స్టీరింగ్‌కు లాక్ పడటంతో..

శుక్రవారం తెల్లవారుజామున నగరమంతా చక్కర్లు కొట్టి 5 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని అగ్రసేన్ చౌరస్తా, తెలంగాణ భవన్ మీదుగా కారులో దూసుకొచ్చాడు. మితిమీరిన స్పీడ్‌తో వస్తుండగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సమీపంలో తెలంగాణ భవన్ యూ టర్న్ వద్ద స్టీరింగ్‌కు లాక్ పడింది. దీంతో రైట్‌కు కట్ చేస్తుండగా స్టీరింగ్‌కు లాక్ పడడంతో ఎడమ వైపు టర్న్ అయ్యింది. ఇదే స్పీడ్‌లో కారు డివైడర్‌ను ఢీకొని.. దానిపైకెక్కి కేబీఆర్ పార్కు ఫెన్సింగ్‌పై నుంచి దూసుకెళ్లి ఓ చెట్టుకు ఢీకొని ఆగిపోయింది. ముందు టైర్ ఊడి పడిపోవడంతో పాటు ఫుట్‌పాత్ ధ్వంసమై, ఫెన్సింగ్ ఊడిపోయి పార్కు లోపల పడింది. అదృష్టవశాత్తూ భారీ చెట్టు అడ్డుగా ఉండడంతో ప్రమాదం తప్పింది. బెలూన్లు తెరుచుకోవడంతో ఉత్సవ్ దీక్షిత్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇదే ఫుట్‌పాత్‌పై పడుకున్న యాచకులు, నిరాశ్రయులు, బసవతారకం ఆస్పత్రి రోగుల సహాయకులు ప్రమాద ధాటికి భారీ శబ్దాలతో భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. కారులోంచి బయటపడ్డ ఉత్సవ్ దానిని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు.

చాసిస్ నంబర్ ఆధారంగా గుర్తించిన పోలీసులు..

ఘటనా స్థలానికి చేరుకున్న బంజారాహిల్స్ పోలీసులు నుజ్జునుజ్జయిన నంబర్ ప్లేట్ లేని పోర్షే ఎలక్ట్రానిక్ కారు చాసిస్ నంబర్ ఆధారంగా దాని నంబర్‌ను గుర్తించారు. ఉత్సవ్ మామ పర్వత్ శ్రీనివాస్‌రెడ్డి పేరుపై కారు రిజిస్ట్రేషన్ అయి ఉంది. అల్లుడికి గిఫ్ట్‌గా ఇచ్చినట్లు తేలింది. ఈ ఫోన్ నంబర్ ఆధారంగా ఉత్సవ్‌ను ఎస్ఆర్ నగర్‌లో శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా జీరో వచ్చింది. రక్త నమూనాలు సేకరించారు. భయంతోనే తాను పారిపోయినట్లు అతడు పోలీసుల దృష్టికి తీసుకువచ్చాడు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ఉత్సవ్ దీక్షిత్ రాత్రంతా ఎక్కడెక్కడ తిరిగాడు? ఎవరెవరి దగ్గరకు వెళ్లాడు, ఎక్కడైనా మద్యం తాగాడా? ఇతర విందుల్లో పాల్గొన్నాడా? అనే కోణాల్లో విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. కారుకు మరమ్మతు అవసరముందని, గ్యారేజీకి తీసుకురావాలని షోరూం నిర్వాహకులు రెండు నెలల క్రితమే చెప్పగా.. పట్టించుకోకుండా ఉత్సవ్ అందులోనే తిరిగినట్లు తెలిసింది.

గోల్ఫ్ క్రీడకు ఆదరణ పెరుగుతోంది

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గోల్కొండ: ఫిట్‌నెస్‌పై అందరూ దృష్టి సారించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం గోల్కొండ నయాఖిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో శ్రీనిధి యూనివర్సిటీ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ట్రోఫీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేహ దారుఢ్యంపై శ్రద్ధ కనబరచాలని సూచించారు. తెలంగాణలో కొంత కాలంగా గోల్ఫ్ ఆటకు ఆదరణ పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఒకప్పుడు డంపింగ్ యార్డుగా ఉన్న ప్రదేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ వారు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యంత సుందరంగా గోల్ఫ్ కోర్సును సుందరంగా తీర్చిదిద్దడం ఎంతో ముదావహమన్నారు. మునుముందు కూడా ఈ గోల్ఫ్ కోర్సులో మరిన్ని అంతర్జాతీయ టోర్నీలు నిర్వహించే అవకాశం ఉందని గవర్నర్ అభిలషించారు. గోల్ఫ్ అసోసియేషన్‌కు చెందిన అజయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

హాష్ ఆయిల్ స్మగ్లర్ల అరెస్టు

డీబీ స్టాక్ బ్రోకింగ్ మేనేజర్ అరెస్ట్

- అధిక వడ్డీ ఆశ చూపించి డిపాజిట్ల సేకరణ
- హైదరాబాద్‌లోనే రూ.7 కోట్లు వసూలు చేసిన నిందితుడు
- ఇప్పటికే కంపెనీ యజమాని దీపాంకర్ అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: అధిక వడ్డీ ఆశ చూపించి దేశవ్యాప్తంగా సామాన్యుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన డీబీ స్టాక్ బ్రోకింగ్ స్కామ్‌లో హైదరాబాద్ బ్రాంచ్ మేనేజర్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అధిక వడ్డీ ఆశ చూపించి పెట్టుబడిదారులకు రూ.7 వేల కోట్లకు పైగా కుచ్చుటోపి పెట్టింది గౌహతికి చెందిన డీబీ స్టాక్ బ్రోకింగ్. ఇప్పటికే ఈ కేసులో అస్సాంకు చెందిన దీపాంకర్ బర్మన్‌ను అస్సాం పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, గౌహతి వంటి ప్రాంతాలలో కార్యాలయాలను ఏర్పాటు చేసి, అధిక లాభాల ఆశ చూపించి పెట్టుబడులను వసూలు చేశారు. పెట్టుబడులపై ఏడాదికి 120 శాతం, ఆరు నెలలకు 54 శాతం, మూడు నెలలకు 24 శాతం, నెలకు 7 శాతం చొప్పున వడ్డీ అందిస్తామని ఆశ చూపించారు. దీంతో స్థానికులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు డీబీ స్టాక్ బ్రోకింగ్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. ఈక్రమంలో పుప్పాలగూడకు చెందిన షామై పంచాక్షర్ డీబీ స్టాక్ బ్రోకింగ్‌లో రూ.7 కోట్ల పెట్టుబడులు పెట్టారు. వడ్డీ కాదు కదా అసలు కూడా చెల్లించకుండా బిచాణా ఎత్తివేయడంతో లబోదిబోమంటూ బాధితుడు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, అస్సాం పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కూకట్‌పల్లిలోని డీబీ స్టాక్ బ్రాంచ్ మేనేజర్ విజ్జి జగదీష్ చంద్ర ప్రసాద్‌ను అరెస్టు చేశారు.

ఔటర్‌పై అదుపు తప్పిన కారు

ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు

గచ్చిబౌలి: ఔటర్ రింగ్ రోడ్డుపై టైరు పేలడంతో ఇన్నోవా కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహాన్(23) ఆరుగురు స్నేహితులతో కలిసి ఇన్నోవా కారులో గురువారం సాయంత్రం సంగారెడ్డికి బయలుదేరాడు. కారును అబ్దుల్ స్నేహితుడు ఎండీ ఇబ్రహీం అతివేగంగా నడుపుతూ ర్యాష్ డ్రైవింగ్ చేయడంతో ఒత్తిడికి ఎడమ వైపు టైరు పేలిపోయి అదుపు తప్పింది. ఆపై డివైడర్‌ను ఢీ కొట్టడంతో కారులో ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని సిటిజన్ ఆస్పత్రికి తరలించగా..అబ్దుల్ రెహాన్ అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు వెల్లడించారు. ఇబ్రహీంతో పాటు అసీం అహ్మద్ ఖాన్, సయ్యద్ మగ్దూమ్ మసూద్, షేక్ సఫియాన్ అలీ, సయ్యద్ సైఫ్‌లకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గురైన ఇన్నోవా కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

- వెయ్యి కిలోమీటర్లు పల్సర్‌పై ప్రయాణించిన స్మగ్లర్లు
- చాకచక్యంగా పట్టుకున్న బాలానగర్ పోలీసులు

జీడిమెట్ల: ఒడిశా నుండి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్ తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుండి రూ.13 లక్షల 50 వేల విలువ చేసే 2.590 లీటర్ల హాష్ ఆయిల్, ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, అడిషనల్ డీసీపీ టి.సత్యనారాయణ, మేడ్చల్ ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీ పి.శోభన్‌కుమార్, బాలానగర్ ఏసీపీ జి.హనుమంతరావులతో కలిసి వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా దేవరకొండ మండలానికి చెందిన సబావత్ సుమన్, పి.ఎ పల్లికి చెందిన రమావత్ లాలు, నరెగూడెంకు చెందిన కేతావత్ విజయ్‌కుమార్ పాతనేరస్తులు. వేరే కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించారు.

వెయ్యి కిలోమీటర్లు..
నెంబర్‌లేని వాహనంపై..

సుమన్ వైజాగ్ జైలులో ఉన్న సమయంలో ఒడిశా జాలాపుట్‌కు చెందిన కిరణ్‌తో పరిచయం ఏర్పడింది. గత నెల అక్టోబర్ 27వ తేదీన సుమన్, విజయ్, లాలు ముగ్గురు కలిసి పల్సర్ వాహనంపై దేవరకొండ నుండి ఏపీలోని అల్లూరి జిల్లా పాడేరుకు చేరుకున్నారు.

ఒడిశా నుండి హైదరాబాద్‌కు రవాణా


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

అక్కడ వీరికి ఒడిశాకు చెందిన కిరణ్ 2.590లీటర్ల హాష్ ఆయిల్‌ను అందజేశాడు. వీరు ముగ్గురు కలిసి నెంబర్ ప్లేట్‌లేని పల్సర్ వాహనంపై ఆయిల్ తీసుకుని 31వ తేదీన హైదరాబాద్ చేరుకున్నారు. అదే రోజు బాలానగర్‌లోని విమల్ థియేటర్ వద్ద ఆయిల్‌ను విక్రయించేందుకు వేచి ఉన్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌హెచ్‌ఓ నరసింహరాజు సిబ్బంది చాకచక్యంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి హాష్‌ఆయిల్, ఒక పల్సర్ వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం శుక్రవారం ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన కిరణ్‌కుమార్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. కాగా నిందితులు నెంబర్ ప్లేట్ లేని పల్సర్ వాహనంపై రాను..పోను దాదాపు వెయ్యి కిలోమీటర్లు ఎక్కడా పోలీసులకు చిక్కకుండా ప్రయాణించడం ఆశ్చర్యం కలిగించింది.


స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్, సెల్‌ఫోన్లు

అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్ అరెస్టు

రూ.18 లక్షల విలువైన ఎండీఎంఏ స్వాధీనం

చందానగర్: అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్ రాష్ట్రం జాలోర్ జిల్లా సబ్రవాస్ గ్రామానికి చెందిన కిస్నారాం వ్యవసాయం చేస్తున్నాడు.


నిందితుడు కిస్నారాం

సులభంగా డబ్బులు సంపాదించాలని స్మగ్లర్‌గా మారాడు. రాజస్థాన్‌లో లభించే ఎండీఎంఏను ఇక్కడి స్మగ్లర్లకు విక్రయించేందుకు హైదరాబాద్‌కు తీసుకువచ్చాడు. కిస్నారాం బావమరిది రమేష్ రాముల శేరిలింగంపల్లి గుల్‌మోహర్ పార్కు కాలనీలో హార్డ్‌వేర్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. అక్కడి నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులకు డ్రగ్స్‌ను సరఫరా చేశాడు. టీఎస్ న్యాబ్ ద్వారా సమాచారం తెలుసుకున్న చందానగర్ పోలీసులు గురువారం రాత్రి గుల్‌మోహర్ పార్కులోని ఇంటి నెంబర్ 56పై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కిస్నారాం నుంచి 150 గ్రాముల ఎండీఎంఏ, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందన్నారు. కాగా రాజస్థాన్ నుంచి 250 గ్రాముల ఎండీఎంఏ తీసుకువచ్చాడు. రాజస్థాన్‌కు చెందిన చాయల్ సింగ్, సుమీర్ సింగ్‌లకు చెరో 50 గ్రాముల చొప్పున డ్రగ్స్‌ను విక్రయించాడు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గతంలో అనేక సార్లు కిస్నారాం మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు డ్రగ్స్‌ను సరఫరా చేశాడు. కాగా కిస్నారాంను అదుపులోకి తీసుకుని విచారించగా రాజస్థాన్‌కు చెందిన చాయల్ సింగ్, సుమీర్ సింగ్‌లకు అమ్మినట్లు తెలిపాడు. వారి వివరాలు తెలుపడంతో చౌటుప్పల్‌లో ఉన్న వారిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు. డ్రగ్స్ స్మగ్లింగ్‌లో ప్రమేయం ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ జిల్లాకు చెందిన సమీర్ ఖాన్ అలియాస్ సుకూర్, విజయవాడుకు చెందిన విక్రమ్ సింగ్, అనంతపురానికి చెందిన రామ్‌సింగ్, లద్దురాం, పుక్రాజ్ రాజ్‌పురోహిత్‌లు పరారీలో ఉన్నారు.

జలమండలిలో పలువురి ఉద్యోగ విరమణ

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో ఒక డైరెక్టర్‌తో సహా పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావుతో పాటు ఇతర ఉద్యోగులు, సిబ్బందిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో విలువైన సమయం గడపాలని, జీవితం సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాల్ని చెక్కు రూపంలో అందజేశారు. కాగా డైరెక్టర్ విజయరావును జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ (జేఈఏ) ఆధ్వర్యంలో సన్మానించారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



సనత్‌నగర్: రోడ్డు దాటుతూ ప్రమాదవశాత్తూ కింద పడగా అతనిపై నుంచి డీసీఎం వాహనం వెళ్లడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ..గత నెల 31న మూసాపేట శశికళ థియేటర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. అదే సమయంలో డీసీఎం వ్యాన్ వెనుక టైర్లు అతనిపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదు.

ప్రాణం తీసిన మైనర్ డ్రైవింగ్!

- స్నేహితుల సరదాకు బాలుడి బలి
- మరొకరి పరిస్థితి విషమం

శంకర్‌పల్లి: స్నేహితులతో కలిసి సరదా కోసం ఓ మైనర్ కారు డ్రైవింగ్ చేస్తూ బైకును ఢీకొట్టగా ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండల పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన ప్రకారం.. గండిపేట మండలం నెక్నాంపూర్ గ్రామానికి చెందిన సర్వరాజ్(45) శంకర్‌పల్లిలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి తన కుమారుడు అబ్దుల్ గఫార్(14)ను దుకాణానికి తీసుకుని వచ్చాడు. రాత్రి 11.30గంటల ప్రాంతంలో తండ్రీకొడుకులు ఇంటికి వెళ్తుండగా మియాఖాన్‌గడ్డ వద్ద స్పీడ్ బ్రేకర్ ఉండడంతో బైక్‌ను స్లో చేశారు. అంతలోనే వెనుక నుంచి కారులో వస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థి (16) బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో బైక్ వెనుక కూర్చున్న గఫార్ గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తండ్రి సర్వరాజ్‌కు తీవ్రగాయాలవ్వడంతో పోలీసులు, స్థానికులు ఆయన్ను నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగానే ఉంది. కారులో విద్యార్థులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేయగా ఎవరూ మద్యం సేవించినట్లు చూపలేదు. మైనర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఎల్‌బీనగర్ జువైనల్ కోర్టులో హాజరుపరిచారు.

కళాశాలకు సెలవు ఉండడంతో..

కేపీహెచ్‌బీ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థి(16) శుక్రవారం కళాశాలకు సెలవు ఉండడంతో సరదాగా బయటకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో చెప్పకుండా కారు తీసుకుని మరో ఐదుగురు మిత్రులతో కలిసి వేగంగా..నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో మియాఖాన్‌గడ్డ వద్ద ఎదుట బైక్ స్లో చేయగా వీరు వెళ్తున్న కారు వేగాన్ని అదుపు చేయలేక ముందు వెళ్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టారు.

ముంచెత్తిన వాన


గచ్చిబౌలిలోని స్ట్రీట్ నంబర్-1లో వరద ఉధృతి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వరద నీటితో ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లింగంపల్లి రైల్వే అండర్‌పాస్ కింద భారీగా వరద చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వస్తున్న వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్ వైపు మళ్లించారు. మాదాపూర్‌లో అత్యధికంగా 5.8 సెంటీమీటర్లు, గచ్చిబౌలిలో 5.6, చందానగర్‌లో 4.1, లింగంపల్లి, షేక్‌పేటలలో 3.8, హఫీజ్‌పేటలో 3.1, కూకట్‌పల్లిలో 2.9, మియాపూర్‌లో 2.7, ఆర్‌సీపురంలో 2.3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కొండాపూర్, మూసాపేట, నిజాంపేట, మేడ్చల్, కండ్లకోయ, కష్టాపూర్, దుండిగల్, గండి మైసమ్మ, మల్లంపేట్ తదితర ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది.

చుక్కా రామయ్యను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ



సాక్షి, సిటీబ్యూరో: అనారోగ్యంతో బాధపడుతున్న విద్యావేత్త చుక్కా రామయ్యను మాజీ ఎమ్మెల్సీ కపిలాయి దిలీప్ కుమార్, టీపీసీసీ కార్యదర్శి సత్యం గౌడ్, సీనియర్ నాయకుడు రామారావు తదితరులు పరామర్శించారు. శుక్రవారం చుక్కా రామయ్య నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశంలో వేలాది మంది ఐఐటీయన్లను తయారు చేసిన ఘనత చుక్కా రామయ్యకు దక్కుతుందన్నారు. తన పుస్తకాలద్వారా సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. చుక్కరామయ్యకు పద్మభూషణ్ పురస్కారం అందించాలని, ఇందుకు తెలంగాణ ప్రభుత్వం తరుపున ప్రతిపాదనలు పంపడం కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు.

నమ్మించి నట్టేట ముంచేశాడు..

- పెళ్లికి దారితీసిన ఫేస్‌బుక్ పరిచయం..
- లండన్‌లో యువతికి చిత్రహింసలు.. రూ.లక్షల్లో డబ్బు వసూళ్లు
- అట్రాసిటీ కేసు పెడతానని తిరిగి బెదిరింపులు
- యువకుడిపై క్రిమినల్ కేసు

ఫిలింనగర్: ఫేస్‌బుక్‌లో పరిచయం అయిన యువతిని నమ్మించి, ప్రేమిస్తున్నానని నటించి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. ఫోర్జరీ డాక్యుమెంట్లతో పెళ్లి చేసుకుని లండన్‌కు తీసుకెళ్లి అక్కడ చిత్రహింసలు పెట్టాడు. బాధితురాలు ఇండియాకు తిరిగిరాగా ఇక్కడ కూడా వేధింపులకు గురిచేస్తుండడంతో న్యాయం చేయాలంటూ ఓ యువతి ఠాణా మెట్లెక్కింది. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో నివసించే యువతి (24)కి 2020 సెప్టెంబర్‌లో మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం ఎస్సీకాలనీకి చెందిన కొండపాక ఉమాపతి (30)తో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం కుదిరింది. ఈ పరిచయంలోనే ఉమాపతి పలుమార్లు ఆమె నుంచి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయంటూ రూ.10 లక్షల దాకా వసూలు చేశాడు. అయితే ఆ డబ్బును తిరిగి ఇవ్వడంలో ఉమాపతి విఫలమయ్యాడు. దీంతో ఆమె డబ్బులు ఇవ్వడం మానేసింది. ఇదే అదునుగా ఉమాపతి ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడు. తాను అడిగిన డబ్బులు ఇవ్వకపోతే తన వద్ద ఉన్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిలింగ్‌కు దిగాడు. అతడు ఎంతో మంది యువతులకు వల వేసి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసి జల్సారాయుడిలా తిరుగుతూ మోసగిస్తుంటాడని తెలుసుకున్న ఆమె దూరంపెట్టి చదువుల కోసం లండన్ వెళ్లేందుకు వీసా ప్రయత్నాలు ప్రారంభించింది. అదే సమయంలో వీసా ఏజెన్సీలో పనిచేస్తున్న ఉమాపతి స్నేహితులు విశాల్, వంశీలతో కలిసి పథకం వేశాడు. తాను కూడా డిపెండెంట్ వీసా మీద లండన్ వస్తానని, ఇద్దరం పెళ్లి చేసుకుందామని ఆమెను నమ్మించాడు. ఈ ఏడాది ఏప్రిల్ 20న ఆర్యసమాజ్‌లో పెళ్లి కూడా చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆమె ఇంట్లో చెప్పలేదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫ్యాబ్రికేట్ వెడ్డింగ్ కార్డ్స్, నకిలీ రిసెప్షన్ ఫోటోలు పెట్టి మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకుని ఆమెతో కలిసి లండన్ వెళ్లాడు. అక్కడికి వెళ్లాక వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. తన జల్సాల కోసం రూ.1.25 కోట్లు ఆమె నుంచి వసూలు చేశాడు. ఆమె దగ్గర తీసుకున్న డబ్బుతో బీఎండబ్ల్యూ కారు కొనుగోలు చేయడమే కాకుండా గచ్చిబౌలిలో క్లౌడ్ 9 సిటీలాంజ్‌లో డబ్బులు కూడా ఇన్వెస్ట్ చేశాడు. మెల్లమెల్లగా ఆమెకు వాస్తవాలు తెలిసిరావడంతో గత ఆగస్టులో ఇండియాకు వచ్చింది. ఇక్కడకు వచ్చాక కుటుంబ సభ్యులకు తాను అనుభవించిన చిత్రవధను తెలియజేసి తనను బ్లాక్‌మెయిల్ చేసి పెళ్లి చేసుకున్న విషయాన్ని తెలియజేసింది. తనను నమ్మించి మోసగించి డబ్బులు వసూలు చేసిన ఉమాపతిపై చర్యలు తీసుకోవాలని, తన కుటుంబ పరువు ప్రతిష్టలకు నష్టం చేస్తున్న నిందితుడిని అరెస్టు చేయాలంటూ ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా తన తల్లిదండ్రులు ఏదైనా మాట్లాడితే తాను ఎస్సీనని, అట్రాసిటీ కేసు నమోదు చేయిస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 85, 318 (4), 316(2), 308 (2), 3 అండ్ 4 పీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'భావ కవిత్వ సార్వభౌముడు దేవులపల్లి'

చిక్కడపల్లి: దేవులపల్లి కృష్ణశాస్త్రి భావ కవిత్వ సార్వభౌముడు అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. త్యాగరాయ గానసభలో శుక్రవారం ప్రముఖ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భావ కవిత్వ వైతాళికుడు రాయప్రోలు కాగా ఆయన అనంతరం భావ కవిత్వంలో తనదైన శైలితో రచనలు చేసిన దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావం ఉండని వారు ఇప్పుడు లేరన్నారు. కళా వీఎస్ జనార్ధనమూర్తి, గానసభ సభ్యుడు శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్‌కు అమీన్‌పూర్ బాధితుల ఫిర్యాదు

బంజారాహిల్స్: అమీన్‌పూర్ బాధితులు శుక్రవారం హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్-6లో అనుమతులు చూపించి సర్వేనెంబర్-12కు చెందిన ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా విక్రయించారని ఆయనకు మొరపెట్టుకున్నారు. మాధవరెడ్డి, చంద్రశేఖర్, కోటేశ్వరరావు అనే వ్యక్తుల దగ్గర ప్లాట్లు కొని మోసపోయామంటూ ఫిర్యాదు చేశారు. తమను మోసం చేసి అమ్మిన వ్యక్తుల నుంచి నష్టపరిహారం ఇప్పించాలంటూ ఆయనను వేడుకున్నారు. రద్దయిన అనుమతుల విషయాన్ని బయటకు చెప్పకుండా తమను మోసం చేసి ప్లాట్లు అమ్మేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా అమీన్‌పూర్ మండలం పెద్ద చెరువు అలుగులు మూసివేసి ఎగువ వైపు తమ స్థలాల్లోకి చెరువు నీరు వచ్చేలా చేశారంటూ మరికొంతమంది హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పెద్ద చెరువు నీరు కింద ఉన్న బండికుంట చెరువుకు నీరు వెళ్లేలా కాకుండా, అటువైపు అలుగులు మూసేయడంతో ఎగువ వైపు నీరు పారుతుండడంతో తమ ఇళ్ల స్థలాలు కోల్పోయామంటూ ఫిర్యాదులు అందాయి. సర్వే నెంబర్ 153లో హుడా అనుమతి పొందిన లే అవుట్‌లో ఉన్న పార్కు స్థలాన్ని పక్కనే కొత్తగా వెంచర్ వేస్తున్న వారు కబ్జా చేశారంటూ అమీన్‌పూర్ మండలంలోని వెంకటరమణకాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి తమ పార్కుతో పాటు లే అవుట్‌లోని రహదారులను కాపాడాలంటూ విన్నవించారు. భవర్‌లాల్‌జైన్ తమకు 1987లో విక్రయించగా, ఆయన కుమారుడు మహావీర్‌జైన్ సర్వేనెంబర్ 153లోని తమ లేఅవుట్‌లోని పార్కు స్థలాన్ని అమ్మేశారంటూ ఫిర్యాదు చేశారు. పూర్తి సర్వే చేయించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వారికి హామీనిచ్చారు.

ఆరుగురు మోమోస్ విక్రేతల రిమాండ్

బంజారాహిల్స్: విషపూరితమైన ఆహార పదార్థాలతో మోమోస్ తయారుచేసి సంతల్లో విక్రయిస్తూ ఓ మహిళ మృతికి, మరో 50 మంది అస్వస్థతకు కారణమైన ఆరుగురు మోమోస్ విక్రేతలను బంజారాహిల్స్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఐదు రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని సింగాడబస్తీలో రేష్మాబేగం అనే మహిళ మోమోస్ తిని కడుపునొప్పి, వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో కన్నుమూసింది. అదే రోజు నందినగర్, గౌరీశంకర్‌కాలనీ, జహీరానగర్, సింగాడబస్తీ ప్రాంతాల్లో మరో 50 మందికి పైగా మోమోస్ తిని అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు చింతల్ బస్తీలో నివసించే బీహార్ ప్రాంతానికి చెందిన అల్మాస్ అలియాస్ అర్మాన్ (23), సాజిద్ హుస్సేన్ (20), ఎండీ రహీజ్ (23), ఎండీ షారూక్ (29), ఎండీ అనీఫ్ (21), ఎండీ రాదిక్ (19)లను రిమాండ్‌కు తరలించారు. వీరంతా చింతల్ బస్తీలో ఉంటూ వారాంతపు సంతల్లో మోమోస్ విక్రయిస్తుండగా ఇటీవల ఫుడ్‌పాయిజన్ అయ్యి మహిళ మృతి చెంది పలువురు అస్వస్థతకు గురయ్యారు.

ఖైరతాబాద్ ఓటర్లు 3,01,126

పురుషులు 1,55,993, మహిళలు 1,45,098,

- ముసాయిదా ఓటర్ల జాబితాపై రాజకీయ నాయకులతో సమావేశం
- అభ్యంతరాలపై 28వ తేదీ వరకు ఫిర్యాదు చేసే అవకాశం


ఇంటి వద్ద నుంచి ఓటు వేస్తున్న సీనియర్ సిటిజన్ (ఫైల్)


రాజకీయ నాయకుల సమావేశం నిర్వహిస్తున్న అధికారి

బంజారాహిల్స్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నూతన ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు పూర్తి చేసిన అధికారులు ముందస్తుగా గత నెల 29వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించారు. ఈ జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ముసాయిదా జాబితా ప్రకారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,01,126గా తేలింది. ఇందులో పురుషులు 1,55,993, మహిళలు 1,45,098, ఇతరులు 35మంది ఉన్నారు. మొత్తం 109 పోలింగ్ లొకేషన్స్‌లలో 245 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటరు జాబితాపై అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా అర్హులు. నూతన ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, తప్పుల సవరణ, పోలింగ్ కేంద్రాల బదిలీపై దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం..

ముసాయిదా ఓటర్ల జాబితాపై ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28 వరకు సంబంధిత పోలింగ్ కేంద్రం అధికారి లేదా జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

9, 10న ప్రత్యేక అవగాహన

ఈనెల 9, 10 తేదీల్లో నియోజకవర్గంలోని 245 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆయా తేదీల్లో బీఎల్ఓలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. కొత్తగా పేరు నమోదుకు ఫారం-6, పేర్లు తొలగించుకునేందుకు ఫారం-7, పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రాల మార్పునకు ఫారం-8 వంటివి బీఎల్ఓల వద్ద ఉంటాయి. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 20 నుంచి బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపట్టారు. డిసెంబర్ 24 వరకు నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. 2025 జనవరి 6న ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సదానంద

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వి.సదానంద అభినందించారు. దీపావళి పర్వదినం పురస్కరించుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి మరింత కృషి చేయాలని చేస్తారని ఆశాభావంతో పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో ఆత్మీయ సత్కారం చేశారు. దాదాపు పదినెలల కాలంలో విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. దీపావళి కొత్త వివరణతో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఇందిరాగాంధీకి నివాళులు


నివాళులు అర్పిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: భారత ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కొనియాడారు. ఇందిరాగాంధీ 40 వర్ధంతి సందర్భంగా ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా గరీబీ హటావో అనే నినాదంతో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీలో...



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో హేమవతినగర్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఇందిరా గాంధీ దేశం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రవిగౌడ్, మోసిన్ ఖురేషి, కృష్ణకుమార్, గంటమల్లేష్ పాల్గొన్నారు.

రోహిన్‌రెడ్డిని కలిసిన కృష్ణగౌడ్


ఎస్.రోహిన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కృష్ణగౌడ్

కాచిగూడ: దీపావళి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రోహిన్‌రెడ్డిని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి.నరేష్ గౌడ్, నాగభూషణం, వెదురి అరవింద్ రెడ్డి, శ్రీమంతు గిరి, చందు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ టీఅంజయ్యనగర్‌లో సీఎస్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర కోశాధికారి ఓర్సు మల్లయ్య విజ్ఞప్తి మేరకు ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రక్తపోటు, మధుమేహ నిర్ధారణతోపాటు పలు పరీక్షలతో నిర్వహించి చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ (కమాన్ సర్వీస్ సెంటర్) హైదరాబాద్ జిల్లా బాధ్యులు మనోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- పూర్తిగా దగ్ధమైన ఫ్లాట్‌లోని విలువైన సామగ్రి


అపార్ట్‌మెంట్‌లో కాలిపోయిన ఓ ఫ్లాట్

కాచిగూడ: ప్రమాదవశాత్తు ఓ అపార్టుమెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ వీధి నెంబర్ 18లో ఉన్న కీర్తి శిఖర అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో న్యాయవాది చంద్రశేఖర్ తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. దీపావళి పండుగ నేపథ్యంలో గురువారం రాత్రి పూజ గదిలో దీపం పెట్టి బర్కత్‌పురలోని తన కార్యాలయంలో పూజలు చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. వారు వెళ్లిన తరువాత ఆ ఫ్లాట్‌లో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఫ్లాట్‌లో దట్టమైన పొగలతో మంటలు వ్యాపించాయి. పక్క ఫ్లాట్‌లో నివాసం ఉంటే వారు మంటలను గమనించి భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఎస్సై షఫీ సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని అక్కడకు రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఫ్లాట్‌లో ఉన్న విలువైన వస్తు సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బయటకు వెళ్లే సమయంలో బాల్కానీ డోర్‌ను తెరిచివెళ్లారు. దీంతో గాలికి పూజ గదిలో ఉన్న దీపంతోనే మంటలు అంటుకుని ఈ ప్రమాదం జరిగిందా, షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప కృపతో శబరిమల యాత్ర విజయవంతం కావాలి

- స్వాములకు కానుకలు అందించి వీడ్కోలు పలికిన కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్


స్వాములతో మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మరోసారి మతసామరస్యాన్ని చాటుకున్నారు. శబరిమలకు కాలినడకన బయలుదేరిన అయ్యప్పస్వాములకు స్వయంగా వీడ్కోలు పలికారు. అయ్యప్ప స్వామి కృపతో స్వాముల శబరిమల యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. బోరబండ నుంచి శబరిమల యాత్రకు కాలినడకన స్వాములు బృందం గురువారం బయలు దేరింది. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ అయ్యప్పస్వాములకు దీపావళి కానుకలు అందించి స్వయంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో కఠినతరమైన శబరిమలకు కాలినడకన బయలుదేరిన స్వాములకు మణికంఠుడి కృపతో యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు నర్సింహ, మహేష్ గౌడ్, లక్ష్మణ్‌గౌడ్‌తోపాటు గురుస్వాములు పాల్గొన్నారు.

సైట్–2లో ఇందిరాగాంధీకి నివాళి

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ధీర వనితని నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు, బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా బోరబండలోని సైట్–2లోని పార్టీ కార్యాలయం వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

- బాలల దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఏర్పాటు
- అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు : డైరెక్టర్

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఉచిత స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తుంది. శుక్రవారం ప్రారంభమైన ఈ క్యాంపు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతుంది. నిమ్స్ ఆవరణలోని పాత ఓపీడీ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని రూమ్ నెం. 8లో వైద్యున్ని సంప్రదించాల్సి ఉంటుంది. ఈ శిబిరంలో పిల్లల వైద్య ప్లాస్టిక్ శస్త్రచికిత్సలో పిల్లలకు సంబంధించి మొర్రి (క్లెఫ్ట్), క్రానియో ఫేషియల్ అసామాన్యతలు, పుట్టుకతో హస్త విపత్తులు, పక్షవాతం, కాలిపోయిన లేదా ప్రమాదానంతరం ఏర్పడిన వైకల్యతలు, రక్తనాళ అసామాన్యతలు, 12–14 సంవత్సరాల వయస్సులోపు పిల్లలలో ఉన్న ఇతర లోపాలను గుర్తించి ఉచిత శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పార్వతిలు తెలిపారు. ఆరోగ్య శ్రీ, పీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ ద్వారా శస్త్రచికిత్సలు అందించనున్నామన్నారు. ఆయా రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. సమాచారం కోసం 9393835845, 040–23489049ల ద్వారా సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం


నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఎఫ్ఏయూ) కేటాయించవద్దని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. పదెకరాల స్థలం కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసనను కొనసాగించారు. విశ్వవిద్యాలయంలోని సీఎస్‌టీడీ భవనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఎస్‌టీడీ డైరెక్టర్ ఆనంద్ పవార్ డిమాండ్ చేశారు. విశ్వ విద్యాలయంలో గత కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఈ నిరసనను మరింత ఉధృతం చే స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, పుష్పా చక్రపాణి, బోజు శ్రీనివాస్, దయాకర్, యాకేష్ దైదా, అవినాష్, కిషోర్, ప్రమీల కేతావత్, ఎస్‌సీ వేణుగోపాల్, జేఏసీ నేతలు,అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యో గు లు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

వెంగళరావునగర్: ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బోరబండకు చెందిన అబ్దుల్ నవాజ్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మూడురోజుల క్రితం సోహెల్ నవాజ్‌కు ఫోన్‌చేసి తన గర్ల్ ఫ్రెండ్‌తో ఎందుకు మాట్లాడుతున్నావని బెదిరించాడు. మరోసారి మాట్లాడితే చంపేస్తానని హెచ్చరించాడు. ఈ క్రమంలో నవాజ్ ఆటోతో మైత్రీవనం వద్దకు రాగానే సోహెల్, అహ్మద్‌లు ఆటోను ఆపి నవాజ్‌ను తీవ్రంగా కొట్టారు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టీసీ బస్సులో దొంగతనం

వెంగళరావునగర్ : ఆర్‌టీసీ బస్సులో మహిళ నుంచి ఫోన్, ఆభరణాలు దొంగిలించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... మధురానగర్‌కు చెందిన ఎల్. శ్రీవిద్య జెఎన్‌టీయులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈనెల 28న జెఎన్‌టీయు వెళ్ళడానికి మైత్రీవనం వద్ద బస్సు ఎక్కింది. వెంగళరావునగర్ కమాన్ వద్దకు వెళ్ళి పర్స్ చెక్ చేసుకోగా అందులోని ఫోన్, బంగారు చైన్, ఉంగరం కనిపించలేదు. దీంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న ఆటోడ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్: యువతిని వేధింపులకు గురిచేస్తున్న ఆటోడ్రైవర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటగిరికి చెందిన ఓ యువతి (20)కి 2023లో ఆటోడ్రైవర్ నవాజ్ పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో నవాజ్ ఆమె ఫోన్ నెంబర్‌ను కూడా సేకరించాడు. అప్పటి నుంచి ఫోన్‌లో మెసేజ్ చేస్తూ పెళ్లి చేసుకుంటానని వేధింపులకు గురిచేస్తున్నాడు. అయితే నవాజ్‌కు అప్పటికే పెళ్లయిందన్న విషయం తెలుసుకున్న ఆ యువతి అతనితో మాట్లాడేందుకు నిరాకరిస్తూ వస్తోంది. యువతి బయటకు వచ్చిన సమయంలో ఆమెవెంట పడుతున్నాడు. అలాగే ఫోన్లకు విపరీతమైన మెసేజ్‌లు పంపిస్తుండడంతో వేధింపులు భరించలేక ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో డ్రైవర్ నవాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచడం హర్షణీయం

కాచిగూడ: గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి నెలా చెల్లించే డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంపై బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేంధర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, శివాలయంలో ఈ నెల 2 నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీకమాస విశేష పూజలు జరుగుతాయని ఈఓ సత్యనారాయణ తెలిపారు. వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి నిత్య సహస్రనామార్చాన జరుగుతుందన్నారు. ఈనెల 12న కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతములు, 13న క్షీరాబ్ధిద్వాదశి సందర్భంగా సామూహిక సాలగ్రామ–దీప–వస్త్ర–ఫల–స్వయంపాక దానములు జరిపించబడునని పేర్కొన్నారు. 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందని వివరించారు.

క్యాబ్ డ్రైవర్‌పై దాడి

వెంగళరావునగర్: క్యాబ్ డ్రైవర్‌పై ఓ వ్యక్తితోపాటు మహిళ దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వనస్థలిపురం ప్రాంతానికి చెందిన జి.రాములు క్యాబ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. రెండు రోజుల కిందట ఓ మహిళను రహమత్‌నగర్ తీసుకువచ్చి డ్రాప్ చేశాడు. అనంతరం చౌరస్తా వద్ద కారు నిలుపుకొని ఉండగా ఇషాక్ అనే వ్యక్తి బీరు బాటిల్ తీసుకువచ్చి రాములుపై దాడి చేశాడు. ఇంతలో మరో మహిళ కూడా అక్కడకు వచ్చి రాములుపై దాడి చేసింది. ఈ సంఘటనలో గాయాలైన డ్రైవర్ రాములు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్ చేస్తుండగా గుండెపోటు

- సోమాలియా దేశస్తుడి మృతి


రెగేఅలీ అహ్మద్

బంజారాహిల్స్: వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన సోమాలియా దేశస్తుడు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సోమాలియాకు చెందిన రెగే అలీ అహ్మద్ (54) వైద్య చికిత్స నిమిత్తం సెప్టెంబర్ 10వ తేదీన హైదరాబాద్‌కు వచ్చాడు. టోలిచౌకి పారామౌంట్ కాలనీలో తన దేశానికి చెందినవారితో కలిసి ఉంటున్నాడు. ప్రతిరోజూ సోమాలియా దేశానికే చెందిన నలుగురు సన్నిహితులతో కేబీఆర్ పార్కుకు వాకింగ్‌కు వస్తున్నాడు. గురువారం సాయంత్రం కూడా పార్కులో వాకింగ్ చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపడిపోయాడు. ఆందోళన చెందిన సన్నిహితులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంటలు అంటుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


వివరాలు సేకరిస్తున్న బంజారాహిల్స్ ఎస్ఐ రవీందర్

బంజారాహిల్స్: మంటలంటుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం బంజారాహిల్స్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ప్రధాన రహదారిలోని హిందూ శ్మశానవాటిక నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి (35)కి మంటలు అంటుకోవడంతో కేకలు పెడుతూ రోడ్డుపైకి పరుగులు తీశాడు. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఆధారాలు సేకరించారు. సదరు వ్యక్తి ఎక్కడి నుంచి వచ్చాడన్న దానిపై ఆరా తీశారు. అయితే స్థానికంగా యాచిస్తూ పొట్ట పోసుకుంటున్నట్లుగా తేలింది. దీపావళి పండుగ సందర్భంగా శ్మశానవాటికలో సమాధుల వద్ద దీపాలు వెలిగించడంతో అక్కడ ఉన్న చెత్తాచెదారం వల్ల మంటలు అంటుకొని మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. కాగా మృతుడికి సంబంధించిన వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు


పూజలు చేస్తున్న ఆదినారాయణ దంపతులు

బంజారాహిల్స్:

దీపావళి వేడుకలను ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం దీపాలు వెలిగించి కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాల్చారు. ఈ క్రమంలోనే నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కుటుంబసభ్యులతో కలిసి క్రాకర్స్ కాల్చి పండుగ ఆనందాలను ఆస్వాదించారు. అలాగే సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన కుమారుడు సాయికిరణ్‌యాదవ్, మనువడు తారక్‌లతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.

దీపావళి ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలి

లిబర్టీ: ప్రతి ఇంట్లో దీపావళి వెలుగులు నిండాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ ఆకాంక్షించారు. నిత్యం వెలుగులతో ప్రతి ఇల్లు ప్రతి వ్యక్తి జీవితం కళకళలాడాలని అన్నారు. దీపావళి పర్వదినం పురస్కరించుకొని ఆదిలీలా ఫౌండేషన్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి మానవాళిలో కొత్త వెలుగు నింపాలని ఆకాంక్షించారు.

ఐకమత్యానికి పండుగలు దోహదం

ఐకమత్యానికి పండుగలు దోహదం చేస్తాయని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రుకుమారస్వామి అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని దళ్ కార్యాలయంలో దీపావళి మిలాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో కొత్త కాంతులు నిండాలని అన్నారు. మంచినిపెంచి మానవత్వాన్ని పంచాలని అప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


క్రాకర్స్ కాలుస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


మనువడు తారక్‌తో దీపావళి వేడుకలు చేసుకుంటున్న శ్రీనివాస్‌యాదవ్

ఆ ఇద్దరి స్ఫూర్తితో చారిటబుల్ ట్రస్ట్

సాక్షి, సిటీబ్యూరో: సినీనటుడు చిరంజీవితో పాటు తన తండ్రి, సాహితీవేత్త, ప్రొఫెసర్ అమరేశం రాజేశ్వరశర్మ స్ఫూర్తితో ఎస్సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశామని ట్రస్ట్ నిర్వాహకురాలు భారతీ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమకు వీలైనంత మేరకు సమాజానికి సాయం చేద్దామనే ఉద్దేశంతో తన భర్త ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌తో పాటు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఇచ్చిన అవార్డుల నగదును ట్రస్ట్‌కు బదిలీ చేశామని పేర్కొన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్‌గా, కేంద్రంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగపు కార్యదర్శిగానూ పనిచేసిన డా.శ్రీవారి చంద్రశేఖర్ పేరున ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. నిన్న మొన్నటి వరకూ ఉద్యోగంలో ఉండగా అవసరమైన వారికి సాయం అందించేవాళ్లమన్నారు. ఇప్పటివరకూ అంతా గుప్త దానంగానే చేశామని వివరించారు. తోటివారు అందించే సాయం తమలో బాధ్యత, జవాబుదారితనాన్ని పెంచుతుందన్న ఉద్దేశంతో మాత్రమే విరాళాలు కోరుతున్నామని స్పష్టం చేశారు.

సంస్కార భారతి జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ మంజునాథ్

లక్డీకాపూల్: సంస్కార భారతి జాతీయ అధ్యక్షుడిగా మైసూర్‌కి చెందిన డాక్టర్ మంజునాథ్ ఎన్నికయ్యారని సంస్కార భారతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కేకేవీ శర్మ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వాడ్రేవ్ శివాజీ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన జాతీయ సమావేశంలో ఎన్నిక జరిగినట్లు పేర్కొన్నారు. 2025 జనవరి 22న ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంబ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి శోభాయాత్రలు కొనసాగుతాయన్నారు.

డాక్టర్ విజయ్‌రావుకు 'ఐఎంఏ' అప్రిసియేషన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న డాక్టర్ విజయ్‌రావు

సుల్తాన్‌బజార్: ప్రతిష్టాత్మక తెలంగాణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్స్ అప్రిసియేషన్ అవార్డును ఈ సంవత్సరం ప్రముఖ వైద్యుడు డాక్టర్ జక్కుల విజయ్‌రావు అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఐఎంఏ తెలంగాణ చాప్టర్ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దిలీప్ బానుషాలి, డాక్టర్ కత్తుల సతీష్ అవార్డును విజయ్‌రావుకు ప్రదానం చేశారు. అనంతరం ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కాళి ప్రసాద్‌రావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు, ఆవో గావ్ ఛలే కార్యక్రమంలో గ్రామాలను దత్తత తీసుకొని హెల్త్ క్యాంప్‌లు, హెల్త్ ఎడ్యుకేషన్, టీబీ ప్రోగ్రామ్‌ల ద్వారా హెల్త్ కేర్‌ను అందించడం, రక్తదాన శిబిరాలతో ప్రాణదాతగా డాక్టర్ విజయ్‌రావు ఎన్నో సేవలందించారని అభినందించారు. రఘుపతిరెడ్డి నాగమోహన్, డాక్టర్ వీఎస్ఎస్ రాజు, డాక్టర్ అశోక్, డాక్టర్ జగదీష్, రవీందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేడు నారాయణగూడలో సదర్ వేడుకలు



కాచిగూడ: యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి 8 గంటలకు నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో యాదవ సదర్ సమ్మేళన వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సభ్యులు సి.వినోద్ యాదవ్, మదన్ యాదవ్, వెంకటేష్ యాదవ్ తెలిపారు. కాచిగూడ, చెప్పల్‌బజార్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 17 సంవత్సరాలుగా యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నారాయణగూడలో స్వాగత వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ బండారు దత్తాత్రేయ, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ కె.లక్ష్మణ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఈటల రాజేందర్, రఘునందన్, ధర్మపురి అరవింద్, కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, రాజాసింగ్, యాదవ కార్పొరేటర్లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సురేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, అనిల్ యాదవ్, లల్లు యాదవ్, రవి యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావం, క్రమశిక్షణతో కరెంటు సరఫరా చేయాలి: ఎస్ఈ వెంకన్న


యాదగిరి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మనిషి బతకడానికి గాలి, నీరు అవసరమని, ఈ రెండు కావాలంటే కరెంటు ఎంతో అవసరమని విద్యుత్ పంపిణీ సంస్థ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆజామాబాద్ విద్యుత్ అసిస్టెంట్ అకౌంట్ అధికారి(ఏఏఓ) వి.యాదగిరి ఉద్యోగ విరమణ సభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఈ వెంకన్న మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు అంకితభావం, క్రమశిక్షణతో కరెంటును సరఫరా చేయాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ అధికారి వి.యాదగిరి, శ్రీదేవి దంపతులను సత్కరించారు. డీఈ కమల్ కుమార్, ఏఓలు శ్రీకాంత్, చంద్రుడు, కర్ణాకర్‌రెడ్డి, సమ్మయ్య, ప్రభాకర్, ఏఈ రాజేష్, 104 యూనియన్ డిస్కం అధ్యక్షుడు ఏ.వేణు, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



భాగ్యలక్ష్మి అమ్మవారి సేవలో..

దీపావళి పండుగ సందర్భంగా నగరం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి వేలాది మంది భక్తులు క్యూలో నిలబడి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారిని దర్శించుకుంటామని, అమ్మవారి ఆశీస్సులతో ఏడాదంతా మంచి జరుగుతోందని పలువురు భక్తులు అన్నారు.



ఈసీఐఎల్‌లో నర్సింగ్ కాలేజీ

కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఏర్పాటు

- ప్రైవేట్ భవనంలో త్వరలో మెడికల్ కాలేజీ తరగతులు
- మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో 70 నుంచి 220కి పడకలు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏడు ప్రైవేట్ మెడికల్ కాలేజీలు
- జిల్లా ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యసేవలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఈసీఐఎల్‌లో కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వంద సీట్ల కెపాసిటి కలిగిన నర్సింగ్ కాలేజీ తరగతులను నిర్వహించేందుకు స్థానికంగా ఒక ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకునేందుకు సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఈసీఐఎల్‌లో తాత్కాలికంగా ఒక ప్రైవేట్ భవనంలో కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ తరగతులను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్ఎంసీ అనుమతితో కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలో 2024–25 సంవత్సరానికి సంబంధించి 50 ఎంబీబీఎస్ సీట్లతో అడ్మిషన్ల ప్రక్రియ కార్యక్రమాన్ని కూడా సంబంధిత వైద్య శాఖ యంత్రాంగం కొనసాగిస్తోంది. మెడికల్ కాలేజీలో అడ్మిషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకోవటంతో.. ఈ కాలేజీకి అనుబంధంగా ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వ నర్సింగ్(పారా మెడికల్) కళాశాలను ఈసీఐఎల్‌లో ఏర్పాటు చేసే ప్రక్రియను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వేగవంతం చేసింది. త్వరలో నర్సింగ్ కళాశాల తరగతుల నిర్వహణ ప్రక్రియ కూడా కొనసాగేలా చర్యలు తీసుకుంటోంది.

ప్రైవేట్ రంగంలో 7 మెడికల్ కాలేజీలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేట్ రంగంలో ఏడు మెడికల్ కాలేజీలు కొనసాగుతున్నాయి. కండ్లకోయలో సీఎంఆర్ మెడికల్ కాలేజీ, సూరారం ప్రాంతంలో మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, మల్లారెడ్డి మెడికల్ కాలేజీ ఫర్ ఉమెన్, దుండిగల్‌లో అరుంధతి మెడికల్ కాలేజీ, బాచుపల్లిలో మమత మెడికల్ కాలేజీ, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్‌లో నీలిమా మెడికల్ కాలేజీ, మెడిసిటీ మెడికల్ కాలేజీలు కొనసాగుతున్నాయి. వీటికి అనుబంధంగా ప్రైవేట్ ఆస్పత్రులు కూడా పెరిగాయి.

మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో 220 పడకలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రిని ఎంపిక చేసిన వైద్యారోగ్య శాఖ అధికార యంత్రాంగం పడకల సంఖ్యను పెంచింది. మల్కాజిగిరి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం 70 పడకలుగా ఉన్న ఆ సంఖ్యను 220 పడకలకు పెంచారు. మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో పెరిగిన పడకల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన అన్నీ సదుపాయాలు, కావాల్సిన పరికరాలు, డాక్టర్లు, సిబ్బంది సంఖ్యను కూడా పెంచారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్వహణకు నియమింపబడిన ప్రిన్సిపాల్‌తో సహా అధ్యాపకులు, ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నారు.

దీంతో జిల్లా ప్రజలకు వైద్యం అందుబాటులోకి వచ్చింది.

ఈసీఐఎల్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ

ఈసీఐఎల్‌లో ప్రస్తుతం తాత్కాలికంగా ప్రైవేట్ భవనంలో 50 ఎంబీబీఎస్ సీట్లతో కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే, మెడికల్ కాలేజీ తరగతుల నిర్వహణకు సంబంధించి అన్ని సదుపాయాలు ఉన్న భవన సముదాయంలో విద్యార్థులకు వైద్య బోధనకు సంబంధించి అవసరమైన అన్ని సదుపాయాల కల్పనకు ఏర్పాట్లు చేయడంతో పాటు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌తో సహా పలు మెడికల్ విభాగాలకు సంబంధించిన అధ్యాపకుల నియామకాల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఫర్నిచర్, ల్యాబ్‌లతో సహా మెడికల్ కాలేజీకి కావాల్సిన పరికరాలను అధికార యంత్రాంగం సమకూర్చారు. క్రమంగా ఈ మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్యను కూడా పెంచనున్నారు. దీంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెరగనున్న వైద్యసేవలు



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్ రంగంలో ఏడు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఈసీఐఎల్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు వైద్య సేవలు మరింత పెరిగే అవకాశముంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 70 పడకలు ఉన్న సంఖ్యను 220కి పెంచారు. దీంతో మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. అలాగే, ఈసీఐఎల్‌లో మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు అవుతోంది. – డాక్టర్ రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్ఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

నగరంలో నేడు



- నిమ్స్ ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని పాత ఓపీడీ బ్లాక్‌లోని రూమ్ నంబర్–8లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత స్క్రీనింగ్ క్యాంపు జరుగుతుంది. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు.
- ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో బేగంపేట్‌లోని ది ప్లాజా పర్యాటక భవన్‌లో ఉదయం 11.15 గంటలకు ఎఫ్ఈఎస్ఏ 2024 ఫర్ ఫార్మా పేరిట నేషనల్ సెమినార్ ఆన్ ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ, ఆటోమేషన్ కార్యక్రమం ఉంటుంది.
- యాదవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నారాయణగూడలోని వైఎంసీఏ చౌరస్తాలో రాత్రి 8 గంటలకు సదర్ సమ్మేళనం వేడుకలు జరుగుతాయి.



గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మత్తుకు దూరంగా ఉంటే బంగారు భవిష్యత్


అవగాహన సదస్సులో అధికారులు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉంటే బంగారు భవిష్యత్ ఉంటుందని, లేదంటే జీవితంలో అంధకారం నెలకొంటుందని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్ అన్నారు. విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాల నివారణపై మేరా యువ భారత్ రంగారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ ప్రధాన సమస్యగా మారింది, తాత్కాలిక ఆనందం కోసం విలువైన జీవితాన్ని క్షణిక కాలంలో కోల్పోతున్నారని అన్నారు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాలు విస్తరించి సవాల్‌గా నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ కె క్యాస్ట్రో మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని, వాటిని రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. విశ్వవిద్యాలయం అధికారులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రతిమ, బాలకృష్ణ, వేణుగోపాల్, సీడీపీఓ కవిత, జిల్లా యూత్ అధికారి ఐషయ్య తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం కచ్చితత్వంతో సర్వే

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్


సర్వేపై సూచనలు చేస్తున్న దాన కిషోర్

బంజారాహిల్స్: వంద శాతం కచ్చితత్వంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్రంగా చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ సూచించారు. ఖైరతాబాద్ జోన్‌లో చేపట్టనున్న సమగ్ర ఇంటి కుటుంబ సర్వేపై శుక్రవారం సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు బంజారాహిల్స్‌లోని గౌరీశంకర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన దాన కిషోర్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి ప్రారంభమయ్యే సర్వేలో వివిధ వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. గ్రేటర్ పరిధిలో సర్వే చేపట్టేందుకు 21 వేల మంది ఎన్యూమరేటర్లను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. ఆర్పీలను కూడా సర్వేలో భాగం చేశామన్నారు. ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించామని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేద వారికి చేరేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సర్వే వివరాలు నమోదు చేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టే ముందు ప్రతి ఎన్యూమరేటర్ జిరాక్స్ సర్వే పత్రాలతో ప్రాక్టీసు చేసేలా చూడాలని, అప్పుడే వారికి అవగాహన వస్తుందని మున్సిపల్ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శివకుమార్, జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతి తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి పీఏసీఎస్ చైర్మన్‌గా కృష్ణ


చైర్మన్, వైస్ చైర్మన్లకు ఎన్నిక పత్రాలను అందిస్తున్న అధికారి

మణికొండ: నార్సింగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌గా ఖానాపూర్ గ్రామానికి చెందిన టి.కృష్ణ ఎన్నికయ్యారు. జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ అధికారులు ఖానాపూర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. గతంలో చైర్మన్‌గా ఎన్నికైన మంచిరేవుల మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి ఆ పదవికి రాజీనామా చేయడంతో అప్పటి నుంచి టి.కృష్ణను ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి చైర్మన్‌ను ఎన్నుకోవాలనే ఉద్దేశంతో శుక్రవారం డైరెక్టర్లతో ఎన్నిక నిర్వహించారు. అందులో చైర్మన్ పదవికి టి.కృష్ణతో పాటు మంచిరేవుల గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి పోటీ పడగా కృష్ణకు ఐదు ఓట్లు, విష్ణువర్ధన్‌రెడ్డికి నాలుగు ఓట్లు వచ్చాయి. అనంతరం వైస్ చైర్మన్‌కు మంచిరేవులకు చెందిన లంకల అశోక్‌రెడ్డి, నెక్నాంపూర్‌కు చెందిన సత్యనారాయణ పోటీ పడగా 5, 4 ఓట్లతో అశోక్‌రెడ్డి గెలుపొందారు. వీరి పదవీ కాలం 2025 ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఉంది. చైర్మన్, వైస్ చైర్మన్లను ఖానాపూర్ కౌన్సిలర్ జి.అమరేందర్ రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి, ఖానాపూర్ మాజీ సర్పంచ్‌లు మన్నె గండయ్య, ఆర్. నర్సింహతో పాటు డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అయోధ్య రామ యంత్రానికి ప్రత్యేక పూజలు

పద్మారావునగర్: అయోధ్యలో ప్రతిష్ఠించనున్న రామ యంత్రం నగరానికి చేరుకుంది. రామ యంత్ర రథం సికింద్రాబాద్‌లోని సుప్రసిద్ధ స్కందగిరి సుబ్రహ్మణ్యం దేవాలయానికి గురువారం రాత్రి చేరుకుంది. గతనెల 27న తిరుపతిలో ప్రారంభమైన రామ యంత్ర మహా రథయాత్ర 5 రాష్ట్రాల మీదుగా 1800 కిలో మీటర్ల మేరకు సాగింది. ఈనెల 16న అయోధ్యకు చేరుకుంటుంది. స్కందగిరి దేవాలయంలో శుక్రవారం ఉదయం నుంచి వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కంచి కామకోటి హిందూ ప్రచార రథంలో రామ యంత్రాన్ని పద్మారావునగర్ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఏసీపీ జైపాల్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ఎస్పీనగర్‌లో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కృషి


రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్దార్ పటేల్‌నగర్‌లో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఎస్పీనగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద ఆయన కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయడం వలన కలిగే ఉపయోగాలను ఆయనకు స్థానిక నాయకులు వివరించారు. రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. చర్లపల్లిలో మరో టెర్మినల్ ఏర్పాటు అందుబాటులోకి రానుండటంతో అక్కడి నుంచి ప్రయాణికులు సులువుగా ఇంటికి చేరేందుకు ఎంఎంటీఎస్ ట్రైన్లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వీకే మహేష్, బాలచందర్‌గౌడ్, రామకృష్ణ, నర్సింహగౌడ్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

మంత్రి శ్రీధర్‌బాబు

బోడుప్పల్: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బోడుప్పల్‌లో రూ.6.68 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం 15వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో చేయలేని పనులను తమ ప్రభుత్వం చేస్తోందన్నారు. బోడుప్పల్‌లో దళితుల భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సున్నితంగా డీల్ చేస్తామన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పెద్దది కావడంతో ఎన్ని నిధులు ఇచ్చినా సరిపోవడం లేదన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరాలు పెరుగుతున్నాయని, అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిధులు కేటాయిస్తామన్నారు. కులగణనతో బలహీన వర్గాలకు న్యాయం చేసస్తామని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కలెక్టర్ గౌతమ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.


అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

కలిసికట్టుగా కార్యక్రమాల నిర్వహణ గర్వకారణం


రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత తదితరులు

జగద్గిరిగుట్ట: వాసవి సేవా సమితి కమిటీ ఆధ్వర్యంలో 33వ నెల అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు కలిసికట్టుగా నిర్వహించడం ఎంతో గర్వకారణమని, ప్రతి కార్యక్రమానికి ముందుండి చేయూత అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు బీరెల్లి చంద్రశేఖర్ గుప్తా, సెక్రటరీ గజ్జి ఉపేందర్ గుప్తా, ట్రెజరర్ ఇమ్మడి రవికుమార్ గుప్తా, చైర్మన్ ఉప్పల రమేష్‌గుప్తా, కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, షాపూర్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాసా శ్రీనివాసులు, డిస్ట్రిక్ ఇన్‌చార్జి ఆకుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శనివారం, 2, నవంబర్, 2024





తెలంగాణతో మెటా ఏఐ ఆధారిత సేవలు



సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక రంగానికి సారథ్యం వహిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా మన దేశంలోని పలు రంగాలను బలోపేతం చేయనుందని ప్రముఖ ఆన్‌లైన్ సామాజిక మాధ్యమ వేదిక మెటా సారథులు అభిప్రాయపడ్డారు. ఏఐ ఆధారిత ఉత్పత్తులతో మెటా తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయనుందని, ఏఐ ఆధారిత ఎల్‌లామా మోడల్ ద్వారా ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల పౌర సేవల పంపిణీ వ్యవస్థలను మరింత పటిష్టం చేయనుందని తెలిపారు. ఏఐ ద్వారా ప్రభుత్వ ప్రైవేటు రంగాలతో పాటు వ్యవసాయం ఇతరత్రా అన్ని అవసరమైన రంగాల్లోనూ మెటా కీలకపాత్ర పోషించనుందని మెటా నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలియజేశారు.

మాటే మంత్రం..

తడబడే మాటకు తర్ఫీదు ఇస్తున్నారు

- నలుగురిలోనూ మాట్లాడాలన్న కుతూహలం
- ఆకట్టుకునే వాక్చాతుర్యం కోసం ఆరాటం
- రాజకీయ, విద్యార్థి, ఉద్యోగుల ఆసక్తి
- నగరంలో పెరుగుతున్న శిక్షణ కేంద్రాలు



మాటలే మంటలు రేపుతాయి.. చెలరేగిన మంటలను నోటి మాటలే చల్లార్చుతాయి. నోట్ల కట్టల కంటే నోటి మాటకే పదునెక్కువ. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. ఇందులో ప్రతి ఒక్కటీ తీసిపడేయలేని నిత్యసత్యాలే. మనం మాట్లాడే మాటకున్న విలువను తెలియజేసే సామెతలు. మనిషికి ఉన్న 64 కళల్లో వాక్చాతుర్యం ఒకటి. మాటలే కదా ఎన్నయినా మాట్లాడతాం అనుకుంటే పొరపడినట్లే.. మైక్ పట్టుకుని నలుగురిలో అనర్గళంగా మాట్లాడటం అందరికీ సాధ్యం కాదు. ప్రపంచంలో 514 రకాల భయాలు ఉండగా.. అందులో ప్రథమ స్థానంలో పబ్లిక్ స్పీచ్ నిలిచింది. రెండో స్థానంలో మరణం ఉందని అమెరికాకు చెందిన పలు సర్వే సంస్థలు తెలియజేస్తున్నాయి.
- సాక్షి, సిటీబ్యూరో

నలుగురిలో ప్రసంగించాలంటే.. మనసులో ఏదో తెలియని భయం. మైక్ పట్టుకున్న చేతికి వణుకు మొదలవుతుంది. వీటిని అధిగమించిన వారికే ఏ రంగంలోనైనా ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. మనలో చాలా మందికి ఎన్నో చెప్పాలని మనసులో ఉంటుంది. అయితే బయటకు చెప్పడానికి మాటలు రావడంలేదు అంటారు. అధికారం కోసం రాజకీయ నాయకులు, ఉద్యోగం, పదోన్నతి కోసం ఇంటర్వ్యూను ఎదుర్కొనాల్సిన అభ్యర్థులు, విద్యార్థులు, తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడంలో వ్యాపార సంస్థలు, తాను తీసుకున్న కేసును గెలిపించడం కోసం న్యాయవాది తదితర రంగాల్లోని వ్యక్తులకు వాక్చాతుర్యం ఎంత ముఖ్యమో అందరికీ తెలిసిందే. ఇటువంటి వారిలో అవసరమైన వారికి మాటలు నేర్పించడానికి నగరంలో పదుల సంఖ్యలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఏ రంగంలోని వారికైనా సమయం, సందర్భానుసారం మాట్లాడే మెళకువలు నేర్పిస్తామంటున్నారు.

ఆకట్టుకున్న వారికే అందలం..

మాట్లాడే సబ్జెక్ట్‌పై పట్టుండాలి. చెప్పే మాటల్లో కొత్తదనం కనిపించాలి. మాట్లాడే సమయంలో హావభావాలు, శారీరక కదలికలు ఇతరులను ఆకర్షించాలి. మన మాటలకు ఎదుటి వ్యక్తి ఫీలింగ్స్ పసిగట్టాలి. సందర్భానుసారం అందరినీ ఆకట్టుకునేందుకు ప్రయత్నించాలి. ఈ అంశాల్లో పట్టున్న వారిని మాత్రమే ప్రజలు ఆదరిస్తారు. నాయకుడనే కిరీటం అందిస్తారు. అధికారం కట్టబెడతారు.

ఆ భయం ఎందుకు?

వేదికపై మైక్ పట్టుకుని మాట్లాడాలంటే భయంతో కాళ్లు చేతులు ఎందుకు వణుకుతున్నాయి. నలుగురిలో మాట్లాడాలంటే మాట ఎందుకు తడబడుతోంది. మనసులోని భావాన్ని చెప్పడంలో వెనుకడటానికి కారణం.. ఇలా ఎన్నో ప్రశ్నలకు అనుభవం లేకపోవడం, సిగ్గు, బిడియం మొదలైనవి కారణాలుగా కనిపిస్తున్నాయి. ఈ కారణాలే మాటల తడబాటుకు కారణాలట. ఒక్కోసారి నలుగురిలో నవ్వులపాలవుతున్నారు. ఆ భయం పోవాలంటే ఏం చేయాలనే అంశాలపై ఫోకస్ చేస్తున్నారు. బృందాలుగా ఏర్పాటు చేసి ఒక అంశంపై చర్చలు పెడుతున్నారు. మైక్ పట్టుకుని తనకు నచ్చిన అంశంపై ధారాళంగా మాట్లాడాలని ఆహ్వానిస్తున్నారు. మనసులో మాటను స్వేచ్ఛగా ప్రకటించేందుకు అవసరమైన టిప్స్ ఇస్తున్నారు. నాలుగు రోజుల నుంచి 10 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. దీనికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఫీజు తీసు



మాటలతోనే గుర్తింపు..



తొలినాళ్లలో నలుగురిలో మాట్లాడటానికి ఇబ్బందిపడాల్సి వచ్చేది. దీన్ని అధిగమించేందుకు శిక్షణ తీసుకున్నాను. ప్రొఫెషన్ పరంగా ఇప్పుడు వేలాది మంది ఉన్న సభల్లో డయాస్‌పై అనర్గళంగా మాట్లాడగలుగుతున్నాను. టీవీ షోల్లో పాల్గొంటున్నా. ఎదుటి వ్యక్తి ఎలా చెబితే వింటాడో మనం గుర్తించగలగాలి. మన ఆలోచనలను వరుసక్రమంలో పెట్టుకోవాలి. సందర్భానుసారం ఆకట్టుకునే విధంగా మాట్లాడితే మనకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.
- పల్లవి, సైకాలజిస్టు, హైదరాబాద్

సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరిగింది..



పబ్లిక్ స్పీచ్ అందరికీ అవసరమే. ఉద్యోగంలో భాగంగా కాన్ఫరెన్స్‌లో మాట్లాడాల్సి ఉంటుంది. గతంలో అనుకున్నంత గొప్పగా మాట్లాడలేకపోయాననే ఆలోచన ఉండేది. శిక్షణ తీసుకున్నప్పుడు చాల విషయాలు నేర్పించారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ మన కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది. స్పీచ్‌కి సబ్జెక్ట్ ఎంత ముఖ్యమో.. ఆరంభం, ముగింపు రెండూ అంతే ముఖ్యం.
- కిరణ్‌రెడ్డి, పోలీసు పీఆర్‌ఓ, సైబరాబాద్

మాటలు వెనక్కి వచ్చేవి..



నాకు కమ్యూనికేషన్ ఫీల్డ్ అంటే ఇష్టం. పది మందిలో మాట్లాడాలంటే నా మనసులో మాటలు వెనక్కి వచ్చేవి. ట్రైనింగ్‌లో చేరినప్పుడు ఎలా ఉంటుందోనని భయపడ్డాను. లెక్చర్ ఇస్తారని ఊహించుకున్నాను. ఇక్కడ ప్రాక్టికల్‌గా నేర్పిస్తున్నారు. మైక్ ముందు ఐదు నిమిషాలు మాట్లాడితే బోలెడు తప్పులుండేవి. వాటిని సరిదిద్దుకుంటున్నా. పది నిమిషాలు మాట్లాడగలుగుతున్నాను. - సింధుశ్రీ, విద్యార్థిని

అవకాశాలు కోల్పోతున్నారు..




ఆకట్టుకునే విధంగా మాట్లాడటం తెలియక చాలామంది అవకాశాలు కోల్పోతున్నారు. 15 ఏళ్ల విద్యార్థి నుంచి 70 ఏళ్ల వయసు వారికీ వాక్చాతుర్యం అవసరం. స్కిల్ అనేది జీవితాంతం ఉంటుంది. ఎక్కువగా రాజకీయ నాయకులు, విద్యార్థులు, ఉద్యోగులు వస్తున్నారు. సుమారు 800 బ్యాచ్‌లలో ఐదువేల మందికిపైగా శిక్షణ ఇచ్చాం. శిక్షణ అనంతరం తమలో మార్పు కనిపించింది అంటున్నారు.
- దన్నారపు కల్పన, మీడియా జంక్షన్ డైరెక్టర్



పదిలమే..

ఆ నాణెం నాణ్యమైనదేనని ప్రచారం

- గతంలో సోషల్ మీడియాలో నకిలీదని పుకార్లు
- సిటీలో ఎక్కడికక్కడే మిగిలిపోతున్న 10 నాణేలు
- అవగాహన కల్పించాలని బ్యాంకులకు సూచించిన ఆర్బీఐ



గత కొంతకాలంగా నగరంలోని షాపింగ్ మాల్స్, దుకాణాలు, మెడికల్ షాపులు ఇతర వ్యాపార వేదికల్లో 'పది రూపాయల నాణెం చెల్లబడును, 10 రూపాయల కాయిన్ ఇవ్వబడును-తీసుకోబడును' అనే బోర్డులు కనిపిస్తున్నాయి. పది రూపాయల నాణెం పదిలమే, నిత్య జీవన లావాదేవీల్లో భాగమే, ఈ కాయిన్ నకిలీ కాదు, బ్యాన్ చేయలేదు అని ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ పది రూపాయల నాణెంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో

కొన్ని సంవత్సరాల క్రితం సోషల్ మీడియాలో వ్యాపించిన పుకార్ల ఫలితంగా పది రూపాయల కాయిన్ కనిపిస్తే చాలు.. ఇది చెల్లదు, ఇది బ్యాన్ అయ్యిందని నిరాకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పది రూపాయల కాయిన్ నిషేధించలేదని, దీనిని నిరాకరించినవారు చట్ట రిత్యా చర్యార్హులని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయంగా ప్రకటించింది. సదరు బ్యాంకులకు కూడా దీనిపై అవగాహన కల్పించాలని సూచించింది.

2008 ముద్రణ నకిలీదని పుకార్లు..

దేశంలో 10 రూపాయల నాణేలను 2005లో మొదటిసారి ముద్రించారు. అయితే 2008లో రెండో సారి మళ్లీ ముద్రించిన నాణెం విషయంలోనే గందరగోళం ఏర్పడింది. అనుకోకుండా ఇవి నకిలీవని సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పుకార్లతో వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు ఈ 10 రూపాయల కాయిన్స్‌పై విముఖత ప్రదర్శించారు. 2016 జులైలో భారతదేశంలోని కొంతమంది దుకాణదారులు రూ.10 నాణేన్ని పూర్తిగా స్వీకరించడానికి నిరాకరిస్తున్నట్లు నివేదించబడింది. 2011లో మూడో సారి, చివరగా 2019లో మరో ముద్రణ చేపట్టినప్పటికీ 2008లో ముద్రించిన కాయిన్ ‌పై వచ్చిన వదంతులు మాత్రం తొలగట్లేదు. ఈ సమస్యపై ఆర్‌బీఐ ఇచ్చిన సూచన మేరకు నగరంలోని పలు బ్యాంకులు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాయి. వీధుల్లోని దుకాణాలు మొదలు, షాపింగ్ మాల్స్ వరకూ అవగాహన కల్పిస్తున్నారు. కొందరు సెలబ్రిటీలు సైతం దీనిపై పాజిటీవ్‌గా ప్రచారం చేస్తున్నారు.



సిటీకి డీజే ఒమెన్..

జూబ్లీహిల్స్‌లోని ఇల్యూజన్ క్లబ్ ఆవరణలో..

సాక్షి, సిటీబ్యూరో: ముంబయి నైట్‌లైఫ్‌కి స్టార్ డీజేగా చిరపరిచితమైన ఒమెన్ నగరంలోని పార్టీ లవర్స్‌ని అలరించనున్నాడు. జూబ్లీహిల్స్‌లోని ఇల్యూజన్ క్లబ్ అండ్ కిచెన్ ఆవరణలో శనివారం డీజే ఒమెన్ మ్యూజిక్ వీనుల విందు చేయనుంది. ఎమ్‌టీవీ కార్యక్రమాలతో పాటు పలు సొంత ట్రాక్స్, అలాగే విభిన్న రకాల సంగీతాలను ప్లే చేయడం ద్వారా ప్రాచుర్యం పొందిన డీజే ఒమన్ సిటీ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటాడని నిర్వాహకులు అంటున్నారు.

క్రీడాకారుల కేళి.. దీపావళి

- దీపావళి సంబరాలతో సందడి చేసిన ప్రో కబడ్డీ లీగ్ ప్లేయర్లు
- తెలుగు టైటాన్స్, బెంగాల్ వారియర్స్ తదితర జట్ల వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఓ వైపు దీపావళి సందడితో పాటు పండుగకు ముందే ప్రారంభమైన ప్రో కబడ్డీ లీగ్ పోరు కూడా కొనసాగుతోంది. అయితే దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రో కబడ్డీ ప్లేయర్స్ తమ బిజీ షెడ్యూల్‌లో కూడా పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా తెలుగు టైటాన్స్ టీమ్ దీపావళి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. పవన్ సెహ్రావత్ కెప్టెన్‌గా, క్రిషన్ హుడా నేతృత్వంలో శిక్షణ పొందిన తెలుగు టైటాన్స్ క్రిషన్ ధుల్, ఆశిష్ నర్వాల్ వంటి ఇతర ఆటగాళ్లతో కలిసి దీపావళి వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో బెంగాల్ వారియర్స్ కూడా పాల్గొన్నారు. కెప్టెన్ ఫాజెల్ అత్రాచలి, మణీందర్ సింగ్, నితిన్ ధంఖర్, సుశీల్ కాంబ్రేకర్‌లతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా క్రీడాకారులు . దరించిన సాంప్రదాయ దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.







సెటిల్‌మెంట్ అని పిలిపించి..

కారుతో తొక్కించి

మాజీ కానిస్టేబుల్ ఈశ్వర్‌పై హత్యాయత్నం



- ఏళ్లుగా జేబుదొంగల గ్యాంగ్‌లు నిర్వహిస్తున్న ఈశ్వర్
- నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీలు
- ఈ వ్యవస్థీకృత దందాలో ఇతడిదే పూర్తి ఆధిపత్యం..
- దీంతో ముఠా నాయకుల మధ్య తలెత్తిన విభేదాలు

'దొంగలతో దోస్తీ' ఆరోపణలపై పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోయిన మేకల ఈశ్వర్‌పై గురువారం రాత్రి హత్యాయత్నం జరిగింది. వ్యవస్థీకృతంగా జేబు దొంగల ముఠాలు నడిపే ఈశ్వర్‌కు, ఆ ముఠాలకు చెందిన మరికొందరు నాయకుల మధ్య ఆధిపత్య పోరే దీనికి కారణమని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొన్నాళ్లుగా తమిళనాడులో ఉంటూ తెలంగాణ వ్యాప్తంగా సెల్‌ఫోన్ జేబు దొంగల ముఠాలు నిర్వహిస్తున్న ఇతడిని సెటిల్‌మెంట్ కోసమని పిలిచిన నలుగురు కీలక నిందితులు కారుతో ఢీ కొట్టారు. అతడి పైనుంచి రెండుసార్లు వాహనాన్ని నడపటంతో ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. మీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని మందమల్లమ్మ చౌరస్తా వద్ద ఈ ఘటన జరగ్గా.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలిసింది.

– సాక్షి, హైదరాబాద్

క్రైమ్ వర్క్ చేస్తూ క్రిమినల్స్‌తో నెట్‌వర్క్

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మేకల ఈశ్వర్ 2010లో కానిస్టేబుల్‌గా పోలీసు విభాగంలో అడుగుపెట్టాడు. ఎస్సార్‌నగర్, చిక్కడపల్లి, బేగంపేట పోలీసుస్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్‌లోనూ పని చేశాడు. మొదట్నుంచీ నేరాలకు సంబంధించిన విధులే నిర్వర్తించిన ఇతను.. అప్పట్లో చోరీ చేసిన ఫోన్లు ఖరీదు చేసే వాళ్లను బెదిరిస్తూ దందా మొదలెట్టాడు. తనకున్న పరిచయాలను వినియోగించుకుని చోరీకి గురైన ఫోన్ల ఐఎంఈఐ నంబర్లు సేకరించేవాడు. వాటి ఆధారంగా అవి ప్రస్తుతం ఎవరు వాడుతున్నారో గుర్తించేవాడు. విషయం తెలియక సెకండ్ హ్యాండ్ మార్కెట్లలో చోరీ ఫోన్లు కొనుగోలు చేసి వాడుతున్న వారిని పిలిచి బెదిరించేవాడు. ఫోన్ తీసుకోవడంతో పాటు కేసు పేరుతో భయపెట్టి కనీసం రూ.25 వేలు వసూలు చేసేవాడు. రికవరీ చేసిన ఫోన్‌ను అమ్ముకుని సొమ్ము చేసుకునే వాడు. ఇలా మొదలైన ఈశ్వర్ దందా పెద్ద నెట్‌వర్క్‌గా మారింది.



ఈశ్వర్

వసతులు, 'జీతాలు' ఇచ్చి నేరాలు

చోరీ ఫోన్ల మార్కెట్‌పై పట్టు లభించడంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఉన్న స్నాచర్లు, దొంగలతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఓ ప్రాంతానికి చెందిన వారిని మరోచోటుకు పంపేవాడు. అక్కడ వారికి అద్దె ఇంటిలో వసతి కల్పించేవాడు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం నాలుగు ఫోన్లు కొట్టేయాలనే టార్గెట్ పెట్టేవాడు. వీటిలో ఒక ఫోన్‌ను విలువను లెక్కించి ఆ మొత్తాన్ని జీతం కింద వారికి ఇచ్చేవాడు. ఇక ఈ ఫోన్లను విక్రయించడానికి ఈ నాలుగు రాష్ట్రాల్లో ఉన్న సెకండ్ హ్యాండ్ మార్కెట్లలోని వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్నాడు. వీరినుంచి ప్రతినెలా మామూళ్లు కూడా వసూలు చేసేవాడని తెలిసింది. మరోవైపు సెల్‌ఫోన్లతో పాటు బంగారు నగలనూ స్నాచింగ్ చేయించేవాడు. 2022లో నల్లగొండ పోలీసులు ఈ తరహా ఓ కేసులో ఈశ్వర్‌ను అరెస్టు చేయడంతో హైదరాబాద్ పోలీసులు అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు.

తల్లిదండ్రులకు అప్పులిచ్చి పిల్లలతో దందా

హైదరాబాద్‌లో ఫోన్ల దొంగతనం, విక్రయం దందా చేసే ముఠాలు ఎన్నో ఉన్నాయి. కొన్నాళ్లుగా వీళ్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో ప్రత్యేకంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. తల్లిదండ్రులకు భారీ మొత్తం అప్పు ఇవ్వడం ద్వారా వారి పిల్లలతో హైదరాబాద్ సహా దక్షిణాదిలోని ఇతర ప్రధాన నగరాల్లో దందా చేయిస్తున్నారు. వీరికి వసతి కల్పించడంతో పాటు ఆహారం, మద్యం సరఫరా చేయడమే కాకుండా ప్రతిరోజూ రూ.300 ఖర్చుల కోసం ఇస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, బస్సులు, సభలు, సమావేశాల్లో సెల్‌ఫోన్ల చోరీ వీరి పని. ఈ ముఠాల్లో అప్పులు తీసుకున్న మహిళలు కూడా ఉన్నారు. వీరు తమ చిన్నారులతో కలిసి బంగారం, ఇతర దుకాణాలకు వెళ్లి, యజమానులు వర్కర్ల దృష్టి మళ్లించి చోరీలు చేస్తుంటారు. వీరు ప్రతిరోజూ నిర్దిష్ట సంఖ్యలో చోరీలు చేయాలనే షరతు ఉంది. కాగా చోరీ చేసిన సొత్తులో కొంత మొత్తం వారి అప్పులో అసలు, వడ్డీ జమ చేసుకుంటారు. ఇలా అప్పు తీరే వరకు వీరంతా ముఠా నాయకుల కోసం పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటివి నగరంలో పలు ముఠాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కక్ష కట్టి, సెటిల్‌మెంట్ అంటూ పిలిచి..

ఇలాంటి కొన్ని ముఠాలపై ఈశ్వర్ గుత్తాధిపత్యం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నగరంలో మరే ఇతర ముఠాకు 'పనివారు' దొరకుండా చేస్తున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆధిపత్య పోరు పెరిగిపోగా ఎవరైనా అతికష్టమ్మీద వేరే ప్రాంతం నుంచి దొంగల్ని పట్టుకుని వస్తే, ఈశ్వర్ తనకున్న పాత పరిచయాల ద్వారా పోలీసులకు సమాచారం చేరవేస్తూ వాళ్లు అరెస్టు అయ్యేలా చేస్తున్నాడు. దీంతో కక్షకట్టిన నాలుగు ముఠాలకు చెందిన నాయకులు అతనిపై హత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోని ఓ బార్‌కు అతన్ని పిలిచిన నలుగురు నిందితులు.. కొద్దిసేపు వాగ్వాదం తర్వాత తమ ప్రతిపాదనల్ని తిరస్కరించి, బెదిరించి వెళ్లిపోతున్న ఈశ్వర్‌పై కారుతో ఢీ కొట్టి హత్యాయత్నం చేసినట్లు తెలిసింది. అయితే కొందరు వ్యక్తులు చిట్టీల వ్యాపారంలో విభేదాల వల్లే ఈశ్వర్‌పై హత్యాయత్నం చేశామంటూ మీర్‌పేట పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలుస్తోంది. దీంతో రాచకొండ పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

పదేళ్లు.. రూ. 2 వేల కోట్ల వృద్ధి

- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో భారీగా పెరిగిన పశుసంపద
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో భారీగా పెరిగిన పశుసంపద



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పశుసంపద గణనీయంగా వృద్ధి చెందిందని, వాటి విలువ దాదాపు రూ.2 వేల కోట్లు పెరిగిందని కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు శాఖ వెల్లడించింది. మాంసం, గుడ్లు, పాలు ఉత్పత్తుల్లోనూ రాష్ట్రం వృద్ధి సాధించిందని తెలిపింది. ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. పశుసంపద, గుడ్లు, పాలు, మాంస ఉత్పత్తులకు సంబంధించిన గణాంకాలను ఇందులో పొందుపరిచింది. ఈ గణాంకాల ప్రకారం.. 2022–23 నాటికి తెలంగాణలో పశు సంపద విలువ రూ.4,789.09 కోట్లుగా నమోదైంది. అయితే రాష్ట్రం ఏర్పాటైన 2014–15లో ఇది రూ.2,824.57 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. కాగా గుడ్ల ఉత్పత్తిలోనూ రాష్ట్రం మంచి ఫలితాలను సాధించింది. 2014–15లో రూ. 228.97 కోట్ల విలువైన గుడ్లను తెలంగాణ ఉత్పత్తి చేస్తుండగా, 2022–23 నాటికి అది రూ.381.04 కోట్లకు చేరింది. ఇక మాంసం ఉత్పత్తుల విలువ పదేళ్ల కాలంలో గణనీయ వృద్ధి సాధించింది. 2014–15లో అన్ని రకాల మాంసం ఉత్పత్తుల విలువ రూ.1,484.05 కోట్లు కాగా, 2022–23 నాటికి అది ఏకంగా రూ.5,531.85 కోట్లకు చేరింది. పశుసంపద గణనీయంగా పెరిగినప్పటికీ పాల ఉత్పత్తిలో మరింత వృద్ధి నమోదు కావలసి ఉందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. 2014–15లో రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి తెలంగాణలో పాల ఉత్పత్తి విలువ రూ.1,350.69 కోట్లు కాగా, 2022–23లో అది రూ.1,874.28 కోట్లకు మాత్రమే పెరిగినట్టు వెల్లడిస్తున్నాయి.



సిరిసిల్ల జిల్లా రంగంపేటలో గ్రామంలో తడిసిన వరి ధాన్యం



మంచిర్యాల జిల్లా మామిడిపల్లి శివారులో నేలవాలిన వరిపైరు



దుబ్బాక మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

నోటికందే కూడు నీటిపాలు!

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలతో నేలవాలిన వరి

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యం.. ఇరవై రోజులుగా కొనుగోళ్లు లేక ఎక్కడికక్కడ ధాన్యం కుప్పలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- పిడుగుపాటుతో ఇద్దరు మృతి

మెదక్/ సిరిసిల్ల/ వీర్నపల్లి/ రుద్రంగి/ నిర్మల్/ వాజేడు: ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చాయి. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నీటి పాలవగా.. కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరిపంట పొలాల్లోనే నేలకొరిగింది. దీనితో అన్నదాతలు ఆందోళనలో పడిపోయారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి ఇన్నిరోజులైనా ఇంకా కొనుగోళ్లు ఊపందుకోలేదని.. వర్షాలతో తమ ధాన్యం తడిసి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆరిపోయి తేమశాతం తగ్గిన వడ్లు కూడా వర్షానికి తడిశాయని, మళ్లీ ఆరబెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రతీ గింజ కొంటామని ప్రభుత్వం ప్రకటించిందని.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని మండిపడుతున్నారు.

తడిసిపోయిన ధాన్యం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే 156 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు మాత్రం మొదలుకాలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా కురిసిన వర్షంతో రైతులు ఆగమాగమయ్యారు. వీర్నపల్లి, రుద్రంగి మండల కేంద్రాల్లో టార్పాలిన్లు లేకపోవడంతో వడ్లు తడిసిపోయాయి. రుద్రంగి మండలం పరిధిలో రైస్‌మిల్లర్లు ధాన్యం దింపుకోబోమని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు.

- మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. దుబ్బాక, మెదక్, నర్సాపూర్, కొల్చారం, చిన్నశంకరంపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్, నిజాంపేట, హత్నూర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం నీటిపాలైంది. వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.
- నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో శుక్రవారం గంటకుపైగా వాన కురిసింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి వరద చేరింది. కుంటాల మండలంలో కోతకు వచ్చిన వరి నేలవాలింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి, జైపూర్ మండలాల్లో సుమారు 4000 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. భీమిని, కన్నెపల్లి మండలాల్లో వందల ఎకరాల్లో పత్తి తడిసిపోయింది.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

రాష్ట్రంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం దమ్మన్నపేటలో పత్తి ఏరుతుండగా పిడుగుపడి గడ్డం నాగమ్మ (26) అనే మహిళ మృతి చెందింది. ఇక ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురంలో వ్యవసాయ భూమిలో ఎడ్లను మేపుతుండగా పిడుగుపాటుకు గురై సొనప నవీన్ (24) మృతి చెందాడు.

'బండ' మోసం

అరకోటి కుటుంబాలకు 'గ్యాస్'.. ఎగ్గొట్టిన బాబు

'గ్యాస్' కనెక్షన్లతో ఏటా 3 ఉచిత సిలిండర్లకయ్యే ఖర్చు రూ.4 వేల కోట్లు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విదేశీ మద్యం ఎలా తెచ్చారు?

- పార్టీకి మద్యం ఎవరు సరఫరా చేశారు..?
- చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డిల విచారణ



విచారణకు వచ్చిన రాజ్ పాకాల

చేవెళ్ల: రాయల్టీ చెల్లించకుండా విదేశీ మద్యం ఎలా తీసుకొచ్చారు..స్టాంప్ డ్యూటీ చెల్లించారా ? పార్టీకి మద్యం సరఫరా ఎవరు చేశారు..ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? పార్టీలో డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? పార్టీలో మద్యం పంపిణీ చేసినా పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు అంటూ పలు అంశాలపై కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను ప్రశ్నించినట్టు తెలిసింది. అనుమతి లేకుండా పార్టీ నిర్వహించాడనే కేసులో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల శుక్రవారం విచారణ నిమిత్తం చేవెళ్లలోని ఎక్సైజ్ కార్యాలయానికి హాజరయ్యారు. జన్వాడలోని ఆయన ఇంటి పక్కనే ఉండే నాగేశ్వర్‌రెడ్డి విల్లాలోనూ విదేశీ మద్యం దొరకడంతో ఆయనకూ నోటీసులు అందజేయగా, ఆయన కూడా చేవెళ్లకు వచ్చారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్, చేవెళ్ల సీఐ శ్రీలత తదితరులు రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డిలను విచారించారు. అడ్వొకేట్ల ఎదుట నిర్వహించిన విచారణకు సంబంధించిన వీడియోలు తీసుకున్నట్టు సమాచారం. మధ్యాహ్నం 1:40 నుంచి రాత్రి 8:10 వరకు విచారణ కొనసాగింది. సాయంత్రం 5గంటల వరకు రాజ్ పాకాలను, ఆ తర్వాత నాగేశ్వర్ రెడ్డిని విచారించారు. అనంతరం రాజ్‌పాకాల, నాగేశ్వర్‌రెడ్డి ఒకేసారి న్యాయవాదులతో కలిసి బయటకు వచ్చారు. అయితే ఇంట్లో నిర్వహించే చిన్నపాటి దావత్ అయినందున.. తమ మేనేజర్ ఈ విషయాలు చూసుకున్నారని రాజ్‌పాకాల చెప్పినట్టు సమాచారం. విచారణ జరిగినంత సేపు మీడియాతోపాటు ఇతరులెవరినీ లోనికి అనుమతించలేదు. బయటకు వచ్చిన అనంతరం రాజ్ పాకాల మాట్లాడుతూ.. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాం. ఇంట్లో నిర్వహించిన చిన్నపాటి దావత్‌ను మా మేనేజర్ చూసుకున్నారు. పార్టీలో లోకల్ మద్యం సర్వ్ చేశామన్నారు.

కేసు ఇన్వెస్టిగేషన్‌లో ఉంది

ఈ కేసు ప్రస్తుతం ఇన్వెస్టిగేషన్‌లో ఉంది. రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డి విచారణకు సహకరించారు. కేసు కంటిన్యూ అవుతోంది. కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకు మించి వివరాలేవీ చెప్పలేం. **–దశరథ్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్**

'భద్రాద్రి.. యాదాద్రి'పై సర్కారుకు నివేదిక

▶ మొదటి పేజీ తరువాయి

టెండర్లకు వెళ్లకుండా ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకోవడంలో చోటు చేసుకున్న విధానపరమైన అవకతవకలు, వీటితో రాష్ట్ర ఖజానాకు జరిగిన నష్టాన్ని కమిషన్ లెక్కగట్టినట్లు తెలిసింది. వీటికి సంబంధించిన నిర్ణయాలన్నీ నాటి సీఎం కేసీఆర్ తీసుకున్నారని కమిషన్ నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. ఆయనతో పాటు గత ప్రభుత్వంలోని ఇతర మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులూ బాధ్యులని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ విషయంలో తదుపరి దర్యాప్తు కోసం తీసుకోవాల్సిన చర్యలను కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కాగా దీని ఆధారంగా ప్రభుత్వం కేసీఆర్‌తోపాటు ఇతరులపై కేసు నమోదు చేసి తదుపరి విచారణకు ఆదేశించాలని భావిస్తున్నట్టు తెలిసింది.

కేసీఆర్‌ను విచారించకుండానే నివేదిక!..: తొలుత జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిషన్ ఏర్పాటు కాగా, ఆయన గత ప్రభుత్వంలోని మాజీ ప్రజాప్రతినిధులు, విద్యుత్ సంస్థల సీఎండీలు, ఇతర అధికారులు, ప్రస్తుత రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, ఇతర సాక్షుల అభిప్రాయ సేకరణ ప్రక్రియను పూర్తి చేశారు. పలువురికి క్రాస్ ఎగ్జామినేషన్ సైతం నిర్వహించారు. రాతపూర్వకంగా లేదా వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయగా, ఆయన్నుంచి రాత పూర్వక సమాధానం అందింది. నిర్ణయాలను తీసుకోవడానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూనే..విచారణ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలగాల్సిందిగా జస్టిస్ నరసింహారెడ్డిని అప్పట్లో కేసీఆర్ కోరారు. కాగా విలేకరుల సమావేశంలో కేసీఆర్‌పై జస్టిస్ నరసింహారెడ్డి చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు..విచారణ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సిందిగా జస్టిస్ నరసింహారెడ్డిని ఆదేశించింది. ఆయన స్థానంలో నియమితులైన జస్టిస్ లోకూర్..సాక్ష్యాలు, నివేదికల పరిశీలన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. కేసీఆర్ ఇచ్చిన జవాబును ఆయన పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం.

సీఎం రేవంత్ సమీక్ష..: గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ నిర్ణయాలకు సంబంధించి అందిన నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. నివేదికలోని అంశాలను అధికారులు సీఎంకు వివరించారు.

సాక్షి రియల్టీ

'లేక్' భయాలొద్దు!

అనుమతులున్న ప్రాజెక్టులలో ధైర్యంగా కొనొచ్చు



సాక్షి, హైదరాబాద్: చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా.. నగర స్థిరాస్తి రంగాన్ని కుదిపేసింది. ఇన్నాళ్లు లేక్ వ్యూ, లేక్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌ల కోసం పరుగులు పెట్టిన కస్టమర్లకు ఇప్పుడు 'లేక్' పేరు వింటే చాలు భయపడిపోతున్నారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు, ఎన్‌వోసీ ఉన్న ప్రాజెక్ట్‌లను కూల్చబోమని ప్రభుత్వమే స్పష్టం చేసింది. దీంతో హైడ్రా అంటే ఎలాంటి భయాలు అక్కర్లేదు. చెరువులు, నాలాల వద్ద ఉన్న ప్రాజెక్ట్‌లు అయినా సరే వాటికి అన్ని రకాల నిర్మాణ అనుమతులు ఉంటే నిరభ్యంతరంగా, ధైర్యంగా కొనుగోలు చేయవచ్చని డెవలపర్ల సంఘాలు సూచిస్తున్నాయి.

- హైదరాబాద్‌లో చెరువులు, నాలాల పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్తు తరాలకు హైదరాబాద్ అంటే చిన్నపాటి వానకే చిత్తడయ్యే నగరంగా మారొద్దు అంటే జలాశయాలను పరిరక్షించాల్సిందే. నగరంలో 99.5 శాతం డెవలపర్లు పారదర్శకంగానే నిర్మాణాలు చేపడుతుంటారు. ఎవరో ఒకరిద్దరి మూలంగా మొత్తం వ్యవస్థను తప్పుబట్టడం సరైంది కాదు. నమ్మకమైన, పారదర్శకమైన బిల్డర్లు జల వనరులను కబ్జా చేసి, వాటిలో నిర్మాణాలు చేపట్టరు.

బృహత్తర ప్రాజెక్ట్‌లతో డిమాండ్...



మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ వంటి బృహత్తర ప్రాజెక్ట్‌లతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోవడం ఖాయం. ఆయా ప్రాజెక్ట్‌లు కార్యరూపంలోకి వస్తే ఒక్కసారిగా భూముల ధరలు పెరిగిపోతాయి. దీంతో డెవలపర్లు మళ్లీ అపార్ట్‌మెంట్ల ధరలను పెంచడం ఖాయం. అందుకే ఇప్పుడు ఇళ్లను కొనుగోలు చేయడమే సరైన సమయం.

– రవి కుమార్, సలహాదారుడు, నరెడ్కో తెలంగాణ

- వాస్తవానికి జలాశయాల వద్ద ఇళ్లు ఉండాలని ప్రతీ ఒక్కరూ భావిస్తుంటారు. మన దగ్గరే కాదు ప్రపంచ దేశాల్లోనూ లేక్ వ్యూ గృహాలకు డిమాండ్ ఎప్పటికీ ఉంటుంది. నిత్యం నీటి పరవళ్లు, చుట్టూ పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, ధారాళమైన వెలుతురుతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. జలాశయాల వద్ద ఉన్న ప్రాజెక్ట్‌లు అయినా సరే ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు ఉంటే ఎలాంటి సందేహాలు లేకుండా కొనుగోలు చేయవచ్చు.


అమరావతి రైలు కనెక్టివిటీ కోసం భూ సేకరణ షురూ

సాక్షి, న్యూఢిల్లీ: ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు మధ్య కొత్త బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ త్వరలో జరగనుంది. దీనికి సంబంధించి కేంద్ర రైల్వేశాఖ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజా ప్రయోజనం కోసం ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం, కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో భూసేకరణకు సంబంధించిన షెడ్యూల్‌ని ప్రచురించారు. భూమిని స్వాధీనం చేసుకోవడం, ఉపయోగించడంపై అభ్యంతరాలు ఉన్నవారు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన 30 రోజుల్లోగా ఖమ్మం జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు తమ అభ్యంతరాలు తెలియచేయాలని సూచించారు.

కుట్ర రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగానే..

- 2022లో విజయమ్మ వాహనం టైర్ పంక్చర్‌నూ రాజకీయంగా వాడుకున్న వైనం
- టీడీపీ ట్విటర్ హ్యాండిల్ వేదికగా దుష్ప్రచారం
- మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ
- నీ సొంత చెల్లెలికి తిరుపతిలో యాక్సిడెంట్ చేయించింది నువ్వేనా?
- మీ బావమరిది నందమూరి హరికృష్ణ, జానకీరామ్‌లను చంపించింది నువ్వేనా? జూనియర్ ఎన్టీఆర్‌ను కూడా కారు యాక్సిడెంట్‌లో చంపాలనుకున్నావా?
- నీ తమ్ముడు రామ్మూర్తినాయుడిని గొలుసులతో కట్టేసి చంపాలనుకున్నావా?



సాక్షి, అమరావతి: చంద్రబాబు తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక కుటుంబాల్లో కుంపట్లు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ నిప్పులు చెరిగింది. 2022లో వైఎస్ విజయమ్మ వాహనం టైర్ పంక్చరైన ఘటన ఇటీవలే జరిగినట్లుగా.. 'ఎక్స్'లో వీడియో అప్‌లోడ్ చేసి, ఆ ప్రమాదం వెనుక కుట్ర ఉందంటూ.. దానిని వైఎస్ జగన్‌కు ఆపాదిస్తూ నీచమైన కుతంత్రానికి పాల్పడింది. దీనిపై వైఎస్సార్‌సీపీ శుక్రవారం 'ఎక్స్' వేదికగా గట్టిగా కౌంటర్ ఇచ్చింది. చంద్రబాబును ట్యాగ్ చేస్తూ 'పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అన్నట్టు.. వెన్నుపోటు రాజకీయాలు, హత్యా రాజకీయాలకు అలవాటుపడ్డ శాడిస్ట్ సీబీఎన్‌కు ఎక్కడ ఏం జరిగినా అలాగే కనిపిస్తుంది. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక కుటుంబాల్లో చంద్రబాబు చిచ్చు పెడుతూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నాడు. ఈ సందర్భంగా చంద్రబాబును కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాం. ఇవి మా అనుమానాలే కాదు.. ప్రజల అనుమానాలు కూడా. ''చంద్రబాబూ.. నీ సొంత చెల్లెలుకు తిరుపతిలో యాక్సిడెంట్ చేయించింది నువ్వేనా? మీ బావమరిది నందమూరి హరికృష్ణ బతికకుంటే నీకు ఎప్పుడైనా ఇబ్బందే అనుకుని నువ్వే కారు యాక్సిడెంట్ చేయించి చంపించావా? నందమూరి హరికృష్ణ కొడుకు నందమూరి జానకీరామ్‌ని కూడా నువ్వే యాక్సిడెంట్ చేయించి చంపించావా? జూనియర్ ఎన్టీఆర్‌ను కూడా కారు యాక్సిడెంట్‌లో చంపాలనుకున్నావా? నీ తమ్ముడు రామ్మూర్తినాయుడిని గొలుసులతో కట్టేసి, రూంలో బంధించి చంపాలనుకున్నావా?'' అని నిలదీసింది. చంద్రబాబుకు దమ్ముంటే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది.

ఏ పార్టీ దిగజారని నీచ స్థాయికి టీడీపీ

నీచమైన ఆరోపణ చేయడం, దాన్ని టీడీపీ అధికారిక ట్విటర్ హ్యాండిల్‌లో పోస్ట్ చేయడం చూస్తుంటే.. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా ఇంత నీచ స్థాయికి దిగజారనంత పాతాళానికి టీడీపీ దిగజారి పోయిందని నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఎన్టీఆర్ మరణం వెనక ఉన్న కుట్ర ప్రపంచానికంతటికీ తెలుసు. దాని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నందమూరి హరికృష్ణ మరణం వెనక కుట్ర ఉందని, ఆయన శవం వద్ద చంద్రబాబు రాజకీయాలు మాట్లాడిన తీరే అందుకు నిదర్శనం అని నెటిజన్లు కౌంటర్లు ఇస్తున్నారు. ఇదే విషయాన్ని కేటీఆర్ కూడా చెప్పారని గుర్తు చేస్తున్నారు. ఎన్టీఆర్‌కు అసలైన వారసుడు జూనియర్ ఎన్టీఆర్‌కు యాక్సిడెంట్ జరగడం వెనక.. 'కొడుకు రాజకీయ భవిష్యత్'ను వెలిగించే కుట్ర ఉందనే విషయం చంద్రబాబు 'రాజకీయం' గమనిస్తున్న పరిశీలకులందరికీ తెలుసని చెబుతున్నారు. సొంత తమ్ముడు రామ్మూరి నాయుడిని ఇంట్లో బంధించడం వెనుకా కుట్ర ఉందనే అనుమానాలు సోషల్ మీడియా వేదికగా వ్యక్తమయ్యాయి. ఇంతకంటే దిగువకు చంద్రబాబు దిగజారడు అని అనుకున్న ప్రతిసారీ.. అలాంటి అభిప్రాయం తప్పు అని నిరూపించుకుంటారనే వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి.

'శక్తి' అనే మాటకు ఎన్నో కోణాలలో ఎన్నో నిర్వచనాలు ఉన్నాయి. ఆర్నాల్డ్ స్క్వార్జ్‌నెగ్గర్ మాటల్లో 'శక్తి'కి నిర్వచనం 'లక్ష్యం కోసం ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకపోవడం'. అలాంటి 'శక్తి' సయ్యద్ ఆసిఫాలో ఉంది. బాడీ బిల్డింగ్‌లో 'రాణి'స్తున్న ఆసిఫా ఎంతోమంది యువతులకు స్ఫూర్తిని ఇస్తోంది. ఈ నెల 5 నుంచి 11 వరకు మాల్దీవులలో జరిగే వరల్డ్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఛాంపియన్‌షిప్-2024లో 52 దేశాలు పాల్గొనబోతున్నాయి. ఈ పోటీకి తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక మహిళ సయ్యద్ ఆసిఫా...


సయ్యద్ ఆసిఫా

దీపస్తంభం

'పెళ్లికి ముందు ప్రపంచాన్ని జయించాలని కలకంటాం. పెళ్లయిన తరువాత ఇల్లే ప్రపంచం అవుతుంది' అనేది చాలామంది గృహిణుల నోటి నుంచి నిరాశ నిండిన చమత్కారంతో వినిపించే మాట. ఆ చమత్కారం మాట ఎలా ఉన్నా... ఎంతోమంది ప్రతిభావంతులైన మహిళలు పెళ్లి తరువాత కలలకు తెర వేసి, ఇంటి నాలుగు గోడలకే పరిమితం అవుతున్నారనేది అక్షర సత్యం. అయితే కొందరు మాత్రం'ఇలాగే జరగాలని లేదు. ఇలా కూడా జరుగుతుంది' అని తమ విజయాలతో నిరూపిస్తారు. సయ్యద్ ఆసిఫా ఈ కోవకు చెందిన మహిళ.

ప్రకాశం జిల్లా కంభం పట్టణానికి చెందిన ఆసిఫా పెళ్లయిన తరువాత ఇల్లే లోకం అనుకోలేదు. ఒక కల కన్నది. ఆ కలను నిజం చేసుకుంది. బీ ఫార్మసీ చేస్తున్నప్పుడు కంభం పట్టణానికి చెందిన మిలిటరీలో పనిచేసే మొఘల్ అన్వర్ బేగ్‌తో ఆసిఫా వివాహం జరిగింది. చదువుపై ఆమె ఇష్టం బీఫార్మసీ పూర్తి చేసేలా చేసింది. ఆ తరువాత ఎంబీఏ పూర్తి చేసింది.

చదువుల విషయంలో భర్త ఏరోజూ అభ్యంతరం చెప్పలేదు. తానే చదువుతున్నంత సంతోష పడేవాడు.

'పెళ్లికిముందు తల్లిదండ్రులు ప్రోత్సహించినట్లుగా, పెళ్లయిన తరువాత భర్త ప్రోత్సాహం ఉండాలి. ఆ ఉత్సాహంతో ఎన్నో విజయాలు సాధించవచ్చు' అంటుంది ఆసిఫా.

చదువు పూర్తయిన తరువాత ఒక ప్రముఖ ఫార్మా కంపెనీలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించింది. 'ఇక చాలు' అనుకొని ఉంటే ఆసిఫా దేశదేశాలకు వెళ్లేది కాదు. విజేతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇచ్చి ఉండేది కాదు.

ఒకానొక రోజు 'బాడీ బిల్డింగ్'పై తన ఆసక్తిని భర్తకు తెలియజేసింది ఆసిఫా. 'ఇప్పుడు ఎందుకు ... ఉద్యోగ బాధ్యతలు, మరోవైపు బాబును చూసుకోవాలి' అని ఆయన నిరాశపరిచి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో తెలియదుగానీ 'నువ్వు కచ్చితంగా సాధించగలవు' అని ధైర్యాన్ని ఇచ్చాడు. ఆ ధైర్యంతోనే ముందడుగు వేసింది ఆసిఫా.

ప్రముఖ అమెరికన్ బాడీ బిల్డింగ్ చాంపియన్ కొరినా ఎవర్సన్ గ్రాడ్యుయేషన్ చేసింది. పెళ్లయిన తరువాత 'బాడీ బిల్డింగ్' వైపు వెళ్లింది. 'ఇప్పుడు ఏమిటీ! బాడీ బిల్డింగ్ ఏమిటీ!!' అన్నట్లుగా మాట్లాడారు చాలామంది. వీలైనంతగా వెటకారాలు కూడా చేశారు. 'రెస్పాన్స్ ఇలా వస్తుంది ఏమిటీ' అని ఆమె వెనకడుగు వేయలేదు. జిమ్ వైపే అడుగులు వేసింది.

'నేను కూడా వస్తాను' అంటూ భర్త ఆమెతో పాటు మాడిసన్‌లోని 'ఎర్నీ' జిమ్‌కు వెళ్లి ప్రాక్టీస్ చేసేవాడు. ఆమె శ్రమ వృథా పోలేదు. 1980లో 'మిస్ మిడ్ అమెరికా'గా మొదలైన ఆమె విజయ పరంపర రిటైరయ్యే వరకు అజేయంగా కొనసాగింది.

కొరినా ఎవర్సన్‌లాంటి ఎంతోమంది విజేతలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లిన ఆసిఫా వెటకారాలను పట్టించుకోలేదు. ఆమె సాధన వృథా పోలేదు. బాడీబిల్డింగ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి తిరుగులేని విజేతగా నిలిచింది.

బాడీ బిల్డింగ్‌లోకి అడుగు పెట్టకముందు ఎంబీఏ చదివే రోజుల్లో జైపూర్‌లో జరిగిన ఈత పోటీల్లో వెండి పతకం సాధించింది ఆసిఫా. ఆ సమయంలో ఎంతోమంది నోటినుంచి వినిపించిన 'కంగ్రాచ్యులేషన్స్' అనే మాట తనకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆనాటి ఆ ఉత్సాహమే శక్తిగా మారి నలుగురు గొప్పగా మాట్లాడుకునేలా 'బాడీ బిల్డింగ్ ఛాంపియన్'ను చేసింది.

– ఖాదర్ బాష, సాక్షి, కంభం, ప్రకాశం జిల్లా


భర్త, కుమారుడితో ఆసిఫా

అర్జున కల

అర్జున అవార్డు సాధించడమే లక్ష్యంగా కష్టపడుతున్నాను. అర్జున అవార్డు సాధించాలంటే మూడు సార్లు వరల్డ్ చాంపియన్‌షిప్ సాధించాల్సి ఉంటుంది. అందుకోసం కష్టపడి సాధన చేస్తున్నాను. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కావాలి. పెళ్లి తర్వాత భర్త ప్రోత్సహించాలి. నా భర్త ప్రోత్సాహంతో నేను ఈ స్థాయికి రాగలిగాను. అందరూ ప్రోత్సహిస్తే ప్రతి ఇంటికి ఒక మెడల్ వచ్చే అవకాశం ఉంటుంది.

– సయ్యద్ ఆసిఫా



ట్రాక్ రికార్డ్

- 2019లో ఆసిఫా బాడీ బిల్డింగ్‌లో శిక్షణ మొదలు పెట్టింది
- 2023లో తెలంగాణలో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచింది
- 2023లో గోవా, పంజాబ్ రాష్ట్రాల్లో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీలలో పతకాలు గెలుచుకుంది
- 2024లో 'సౌత్ ఇండియన్ చాంపియన్ షిప్'లో ప్రథమ స్థానంలో నిలిచింది.

స్త్రీ శక్తి

'చీకటి తరువాత వెలుగు' అనేది ప్రకృతి సూత్రం. అయితే బేగం అఖ్తర్ విషయంలో ఈ సూత్రం తిరగబడింది. చీకటి తరువాత చీకటి... మరింత చీకటి... ఆమె జీవితం. అంత అంధకారంలోనూ వెయ్యి దీపకాంతులతో సంగీతంతో వెలిగిపోయింది. అందుకే అఖ్తర్ బేగం 'క్వీన్ ఆఫ్ గజల్స్' అయింది. 'అమ్మీ' నాటకంతో మరోసారి వార్తల్లోకి వచ్చింది. ప్రముఖ నటి పద్మిని కొల్హాపురి అక్తర్ బేగం పాత్ర పోషించిన 'అమ్మీ' నాటక ప్రదర్శన వివిధ నగరాలలో ప్రారంభమైన సందర్భంగా...

రంగస్థలంపై గజల్ మారాణి

జీవన నాటకం



వన్స్ అపాన్ ఏ టైమ్... ఇన్ ఫైజాబాద్

న్యాయవాది అస్ఘర్ హుస్సేన్‌కు ముస్తారీ రెండవ భార్య. కొద్దికాలం తరువాత భార్య, కవల కుమార్తెలు జోహ్రా, బిబ్బీలను దూరం పెట్టాడు. నాలుగేళ్ల వయసులో అక్కాచెల్లెళ్లపై విష ప్రయోగం జరిగింది. మిఠాయిలు తిన్న అక్కాచెల్లెళ్లు అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో జోహ్రా చనిపోయింది. విషయం తెలియని బిబ్బీ 'జోహ్రా ఎక్కడ?' అని అడిగింది.

'దేవుడి ఇంటికి వెళ్లింది' అని చెప్పింది కళ్లనీళ్లతో అమ్మ.

అప్పుడు బిబ్బీకి ఏం అర్థం కాలేదు. ఆ తరువాత మెల్లగా అర్థం కావడం మొదలైంది. అక్కతో మాట్లాడడం మిస్ అయింది. అక్కతో కలిసి నవ్వులు పంచుకోవడం మిస్ అయింది. జోహ్రా వీపు మీద కూర్చొని గుర్రంలా స్వారీ చేస్తూ బిగ్గరగా అరవడం మిస్ అయింది. క్రమంగా బిబ్బీ నిశ్శబ్దంలోకి వెళ్లిపోయింది.

ఎప్పుడూ మౌనంగా ఉండే అమ్మాయి అయింది. ఎప్పుడూ ఏదో కోల్పోయినట్లుగా ఉండేది. ఇది గమనించిన తల్లి బిబ్బీని సంగీత తరగతులకు పంపించింది. ఆ తరగతులకు ఇష్టంతో వెళ్లిందా, తల్లి బలవంతం మీద వెళ్లిందా అనేది తెలియదుగానీ ఏడేళ్ల వయసులో చంద్రబాయి అనే ఆర్టిస్ట్ సంగీతానికి ఫిదా అయిపోయింది బిబ్బీ. ఇక అప్పటి నుంచి సంగీతం వైపు ఇష్టంగా అడుగులు మొదలయ్యాయి. పట్నాకు చెందిన ప్రసిద్ధ సారంగి విద్వాంసుడు ఉస్తాద్ ఇమ్దాద్‌ఖాన్ దగ్గర సంగీతంలో శిక్షణ పొందింది. తల్లితో కలిసి కోల్‌కతాకు వెళ్లి లాహోర్‌కు చెందిన మహ్మద్ ఖాన్, అబ్దుల్ వహీద్‌ఖాన్‌లాంటి శాస్త్రీయ సంగీత దిగ్గజాల దగ్గర సంగీతం నేర్చుకుంది.

బిబ్బీ 'బేగం అఖ్తర్' అయింది

పదిహేనేళ్ల వయసులో తొలిసారిగా వేదిక మీద కనిపించింది. నేపాల్–బిహార్ భూకంప బాధితుల సహాయంకోసం ఏర్పాటు చేసిన ఈ కచేరిలో బేగం అఖ్తర్ గానాన్ని సరోజినీనాయుడు ప్రశంసించింది. ఆ ప్రశంస తనకు ఉత్సాహాన్ని ఇచ్చింది. గజల్స్, దాద్రాలు, ఠుమ్రీల గ్రామ్‌ఫోన్ రికార్డులతో బేగం అఖ్తర్ పేరు మారుమోగిపోయింది. వినేకొద్దీ వినాలనిపించే స్వరం, అందమైన రూపం ఆమెను సినిమా రంగానికి తీసుకెళ్లింది. మన దేశంలో టాకీ శకం మొదలైన తరువాత కొన్ని హిందీ చిత్రాలలో నటించింది. తాను నటించిన అన్ని సినిమాల్లోని పాటలను స్వయంగా పాడింది.

లక్నోకు చెందిన ఇష్తియాక్ అహ్మద్ అబ్బాస్ అనే బారిస్టర్‌తో అఖ్తర్‌కు వివాహం అయింది. వివాహానంతరం భర్త ఆంక్షల కారణంగా దాదాపు ఐదేళ్ల పాటు గానానికి దూరం అయింది. దీనికి తోడు తల్లి చనిపోవడంతో అఖ్తర్ మానసికంగా, శారీరకంగా బాగా కుంగిపోయింది. 'మీరు దుఃఖం నుంచి బయటపడే మార్గం సంగీతం మాత్రమే' అని వైద్యులు సలహా ఇచ్చారు. అలా వారి సలహాతో సంగీతానికి మళ్లీ దగ్గరైంది.

సంగీతం వైపు తిరిగిరావడం బేగం అఖ్తర్‌కు రెండో జీవితం అయింది.

ఆల్ ఇండియా రేడియో ద్వారా తన తీపి గళాన్ని దేశం నలుమూలలా వినిపించింది.

60 ఏళ్ల వయసులో గుండెపోటుతో మరణించిన బేగం అఖ్తర్ అభిమానుల గుండెల్లో 'క్వీన్ ఆఫ్ గజల్స్'గా నిలిచింది.

'ఏ మొహబ్బతే' పుస్తకం రాసిన రీటా గంగూలి మాటల్లో... 'బేగం అఖ్తర్ అంటే ఏళ్ల తరబడి ఒంటరితనం. నీడలా వెంటాడే బాధ. విషాదం అనేది తన జీవితంలో విడదీయని భాగం అయింది. జీవితంలో లోతైన శూన్యాన్ని అనుభవించిన బేగం అఖ్తర్ దేవుడా, తర్వాత ఏమిటి అనే భయంతోనే జీవించింది. ప్రకాశవంతమైన చిరునవ్వుతో అత్యంత విషాదకరమైన పాటను పాడే సామర్థ్యం ఆమెలో ఉంది'.


పద్మిని కొల్హాపురి


బేగం అఖ్తర్



'అమ్మీ'గా రంగస్థలం పైకి...

నాటకరంగాన్ని తన కాలింగ్ అండ్ కంఫర్ట్‌జోన్‌గా పిలిచే నటి పద్మిని కొల్హాపురి గత కొన్ని నెలలుగా ఉర్దూ మాట్లాడే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించింది. దీనికి కారణం అమ్మీ. ఈ నాటకంలో ఆమె బేగం అక్తర్‌గా కనిపిస్తుంది. 'బేగం అక్తర్ పాత్ర పోషించడంతో నా కల సాకారమైంది' అంటుంది పద్మిని కొల్హాపురి.

పద్మిని గతంలో కొన్ని నాటకాల్లో నటించినా 'అమ్మీ' నాటకం మాత్రం ఆమెకు నిజంగా సవాలే.

'బేగం అక్తర్ పాత్రను పోషించడం అనేది కత్తి మీద సాములాంటిది. ఈ పాత్ర ఒకే సమయంలో ఉత్తేజపరుస్తుంది. ఆందోళనలోకి నెడుతుంది. విషాదంలోకి తీసుకువెళుతుంది' అంటుంది పద్మిని కొల్హాపురి.

నగధగలు

వజ్రం... ఎప్పటికీ నిలిచి ఉండాలంటే...




– విశేషిణి రెడ్డి, జిఐఏ జెమాలజిస్ట్

- స్నానం చేసేటప్పుడు డైమండ్ ఆర్నమెంట్స్‌ను తీయాలి. మైల్డ్ సోప్, మైల్డ్ షాంపూ అయితే ఫరవాలేదు. కానీ గాఢత ఉన్న సబ్బులు, షాంపూలతో స్నానం చేస్తే వాటిలోని రసాయనాల దుష్ప్రభావం ఆభరణాల మీద పడుతుంది.
- రోజువారీ ధరించే చెవి దిద్దులు, ఉంగరాలు, లాకెట్, బ్రేస్‌లెట్‌లు ఎక్కువగా పొల్యూషన్ బారిన పడుతుంటాయి. వాతావరణంలో పొల్యూషన్ కారణంగా ఆభరణాల్లో అమర్చిన డైమండ్ మీద మురికి పేరుకుంటుంది. జిడ్డుగా కూడా మారుతుంది. దాంతో డైమండ్ మెరుపు తగ్గుతుంది. వేడి నీటిలో లిక్విడ్ సోప్ నాలుగు చుక్కలు కలిపి అందులో ఆభరణాన్ని పది నిమిషాల సేపు నాన పెట్టి ఆ తర్వాత మెత్తటి బ్రష్‌తో సున్నితంగా రుద్దాలి. సబ్బు అవశేషాలు ఆభరణం మీద మిగలకుండా శుభ్రమైన నీటిలో ముంచి కడగాలి. నీటిలో నుంచి తీసి మెత్తని నూలు వస్త్రం మీద పెట్టి మెల్లగా అద్దినట్లు తుడవాలి.
- బేకింగ్ సోడా మంచి క్లీనింగ్ ఎలిమెంట్. కానీ తక్కువ క్వాలిటీ డైమండ్ ఆభరణాలను శుభ్రం చేయడానికి బేకింగ్ సోడా వాడకూడదు.
- పైన చెప్పుకున్నవి కట్ డైమండ్స్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు. అన్‌కట్ డైమండ్స్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆభరణం తయారీలో అన్‌కట్ డైమండ్ వెనుక సిల్వర్ ఫాయిల్ అమరుస్తారు. వెండి వస్తువులు గాలి తగిలితే నల్లబడినట్లే అన్‌కట్ డైమండ్ ఆర్నమెంట్స్ కూడా అంచులు నల్లబడతాయి. వాటిని గాలి దూరని బాక్సులో భద్రపరచాలి. ఇటీవల వేడుకల్లో ఎయిర్‌కూలర్‌లో పెర్‌ఫ్యూమ్ కలుపుతున్నారు. వాటి ప్రభావంతో కూడా అన్‌కట్ డైమండ్ ఆర్నమెంట్స్ నల్లబడే ప్రమాదముంది. అన్‌కట్ డైమండ్ ఆర్నమెంట్ మెరుపు విషయంలో ఇంట్లో ఏ ప్రయత్నమూ చేయకూడదు. అవి చాలా డెలికేట్‌గా ఉంటాయి కాబట్టి ఆభరణాల తయారీదారులతో పాలిష్ చేయించుకోవాలి.
- ఆభరణాలు పెట్టే ప్లాస్టిక్ బాక్సులకు ముఖమల్ క్లాత్‌ని గమ్‌తో అతికిస్తారు. డైమండ్ ఆర్నమెంట్స్‌ను బీరువాలో భద్రపరిచేటప్పుడు ఈ గమ్ బాక్సుల్లో పెట్టకూడదు. ఇంటికి తెచ్చుకున్న తర్వాత ఆ బాక్సు నుంచి తీసి మెత్తని తెల్లని క్లాత్ మీద అమర్చి భద్రపరుచుకోవాలి.

నా కూతురే నా అందం


కుమార్తె మసాబాతో నీనా

ఈ విషయం వింటే మీరు నిజంగా ఆశ్చర్యపోతారు. నీనా గుప్తా కు బ్యూటీ పార్లర్ లకు వెళ్లే అలవాటు లేదు. 'అవునా!! గ్లామర్ ఫీల్డ్ లో ఉన్న వారు తరచూ పార్లర్ లకు వెళ్తుంటారు కదా! అందమే కదా అసలు ఎవరికైనా ఆనందం?' అని మీరు అడిగి చూడండి... నీనా చెప్పే సమాధానం మిమ్మల్ని మరింతగా ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. 'నా కూతురే నా ఆనందం' అంటారు నీనా!

ఆనందం అందాన్నిస్తుంది. ఆ ఆనందం కూతురు మసాబా రూపంలో నీనా కళ్లెదుట ఉంది. ఇక ఆమెకు ఫేషియల్స్ ఎందుకు? పార్లర్‌లు ఎందుకు?

నీనా వయసు 65. సింగిల్ మదర్‌కి స్ట్రెస్ ఉంటుంది. కూతురు ఉన్న సింగిల్ మదర్‌కి మరింత స్ట్రెస్ ఉంటుంది. ఈ స్ట్రెస్, మరింత స్ట్రెస్ లను మించిన మూడో స్ట్రెస్ కూడా ఉండేది నీనాకు. అదేమిటో అందరికీ తెలిసిందే. ఆమె కూతురి తండ్రి ఇండియన్ కాదు. 1980ల నాటి వెస్ట్ ఇండీస్ క్రికెట్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్. నీనా, రిచర్డ్స్‌కు పుట్టిన అమ్మాయే మసాబా. రిచర్డ్స్ కు అప్పటికే పెళ్లి అయి ఉండటంతో ఆయన్ని పెళ్లి చేసుకోకుండా, మసాబా పెరిగి పెద్దయ్యేవరకు – ఒంటరిగానే ఉండిపోయారు నీనా. ప్రస్తుతం మసాబా వయసు 35 ఏళ్లు. ఇప్పటికీ మసాబానే నీనా కంటి వెలుగు. మసాబానే ఆమె అందం, ఆనందం.

'ఎదుగుతున్న వయసులో నా కూతురి కోసం నేను రెండు పనులు ఎప్పటికీ చేయకూడదు అని ఒట్టు పెట్టుకున్నాను. ఒకటి: ఆమె చదువు కోసం 'ఎవరినీ డబ్బు సాయం అడగకూడదు.' రెండు : తండ్రి (దగ్గర) లేని పిల్లగా ఆమె కోసం 'ఎవరి ఎమోషనల్ సపోర్టూ తీసుకోకూడదు.' ఈ రెండిటిపై గట్టిగా నిలబడ్డాను. మనం డబ్బు, సపోర్ట్ అడగం అని తెలిస్తే ఎవరైనా ధైర్యంగా మన దగ్గరకు వస్తారు. మనమూ అంతే.. ఎవరి దగ్గరకైనా ధైర్యంగా వెళ్లగలం అని 'బ్రట్ ఇండియా'కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో కుషా కపిల్‌తో చెప్పారు నీనా గుప్తా.

కూతురు మాత్రమే కాదు, సింగిల్ మదర్‌గా తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ రావటం కూడా నీనా అందానికి కారణం అయి ఉంటుంది

వంటిల్లు



కొసరి ఉసిరి

దీపావళి వెళ్లింది... కార్తీక మాసం వచ్చింది. అంతకంటే ముందు ఉసిరికాయ వచ్చేసింది. ఊరగాయలు మెల్లగా పెట్టుకోవచ్చు. ఉసిరితో వనభోజనానికి సిద్ధమవుదాం. ఉసిరితో ఇన్‌స్టంట్‌గా ఇలా వండుదాం. రోటి పచ్చడి... వేడి వేడి చారు... ఈ వారానికి ఇవి చాలు.



ఉసిరి చారు

కావలసినవి: ఉసిరికాయ గుజ్జు – 5 లేదా 6 (100 గ్రాముల గుజ్జు రావాలి); కందిపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు; మిరియాలు – 4–5 గింజలు; జీలకర్ర – అర టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; నీరు – 2 కప్పులు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: నెయ్యి లేదా నూనె – టీ స్పూన్; ఆవాలు – అర టీ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; ఎండుమిర్చి – 2; పచ్చిమిర్చి–2; కరివేపాకు రెమ్మలు –2.

తయారీ:
- ఉసిరి కాయలను కడిగి తరిగి గింజలు తొలగించాలి. ఆ ముక్కలను, మిరియాలు, జీలకర్ర మిక్సీలో వేసి పలుకుగా గ్రైండ్ చేయాలి
- ప్రెషర్ కుకర్‌లో కందిపప్పును ఉడికించి, వేడి తగ్గిన తర్వాత మెదిపి పక్కన పెట్టాలి
- మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి నెయ్యి వేసి వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి నిమిషం పాటు వేయించాలి. వేగిన తర్వాత ఉసిరికాయ గుజ్జు వేసి రెండు నిమిషాల పాటు కలుపుతూ వేయించాలి. ఇప్పుడు కందిపప్పు, పసుపు, ఉప్పు వేసి, ఆ తర్వాత నీటిని పోసి కలిపి మూత పెట్టాలి. నీళ్లు మరగడం మొదలైన తర్వాత స్టవ్ ఆపేసి మూత పెట్టి, ఐదు నిమిషాల సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ రసం అన్నంలోకి రుచిగా ఉంటుంది.

ఉసిరి రోటి పచ్చడి

కావలసినవి: ఉసిరి కాయలు – 6; ఎండుమిర్చి– 10; జీలకర్ర – టీ స్పూన్; పచ్చి శనగపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు; మినప్పప్పు– టేబుల్ స్పూన్; మెంతులు – అర టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 7; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ధనియాలు – 2 టీ స్పూన్‌లు; నూనె టీ స్పూన్.

పోపు కోసం: నూనె – టేబుల్ స్పూన్; ఆవాలు – అర టీ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; ఎండుమిర్చి– 2; కరివేపాకు– 2 రెమ్మలు; పసుపు – అర టీ స్పూన్.

తయారీ:
- ఉసిరి కాయలను కడిగి తరిగి గింజలను తొలగించాలి
- పెనంలో నూనె వేడి చేసి అందులో పచ్చిశనగపప్పు, మినప్పప్పు వేసి వేయించాలి. అవి దోరగా వేగిన తర్వాత ధనియాలు, జీలకర్ర, మెంతులు, ఎండుమిర్చి వేసి అవి వేగుతుండగా స్టవ్ ఆపేయాలి. స్టవ్, పెనం వేడికి మెల్లగా వేగి అమరుతాయి. వేడి తగ్గిన తరవాత మిక్సీ జార్‌లో వేసి గ్రైండ్ చేయాలి. ఆ పొడిలో వెల్లుల్లి రేకలు వేసి మళ్లీ గ్రైండ్ చేయాలి. ఇప్పుడు ఉసిరికాయ ముక్కలను వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి
- పోపు కోసం బాణలిలో నూనె వేడి చేసి పోపు దినుసులన్నీ వేసి వేయించాలి. అందులో గ్రైండ్ చేసిన ఉసిరి పచ్చడి వేసి కలిపి, స్టవ్ ఆపేయాలి.

పైథాగరస్ వర పుత్రికలు!


కాల్సియా జాన్సన్, నేకియా జాక్సన్

మేథ్స్ సబ్జెక్ట్ కష్టం. అందులోని ట్రిగొనమెట్రీ మరింత కష్టం. ట్రిగొనమెట్రీ లోని పైథాగరస్ సిద్ధాంతం ఇంకాస్త కష్టం. ప్లస్ లు, మైనస్ లను ఎలాగో లాగించేయొచ్చు. త్రిభుజాలు, త్రికోణాల ట్రిగొనమెట్రీ (త్రికోణమితి) ని, పైథాగరస్ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోటానికి, ఆ లెక్కల్ని పరిష్కరించటానికి ఒక గణిత శాస్త్రవేత్తకు ఉండేంత ఐ.క్యూ.లో పిసరంతైనా లేకుంటే బుర్ర తిరిగి పోతుంది. అలాంటిది ఈ అమ్మాయిలను చూడండి, త్రికోణమితిని ఉపయోగించి పైథాగరస్ సిద్ధాంతాన్ని రుజువు చేసే ఐదు కొత్త సూత్రాలను కనుక్కున్నారు! లూసియానా లోని న్యూ ఆర్లీన్స్ కాలేజ్ విద్యార్థినులు... కాల్సియా జాన్సన్, నేకియా జాక్సన్ వీళ్లు.

మొదటిసారి 2022లో ఈ అమ్మాయిలు పైథాగరస్ సిద్ధాంతాన్ని రుజువు చేసే కొన్ని సూత్రాలను ఆవిష్కరించారు. ఆ హద్దులను కూడా దాటి ఇప్పుడు ఐదు అదనపు రుజువులకు దారి తీసే ఐదు ప్రత్యక్ష రుజువులు కనిపెట్టారు. వీటివల్ల ట్రిగ్నామెట్రీని అర్థం చేసుకోవటం మరింత తేలిక అవుతుంది.

వీరు సాధించిన ఈ ఘనతను ప్రఖ్యాత 'అమెరికన్ మేథమేటికల్ మంత్లీ' తన తాజా సంచికలో గొప్పగా ప్రచురించింది. అబ్బాయిలూ... మీరింకా ఫుట్ బాల్ గ్రౌండ్ లోనే ఉన్నారా.. మేథ్స్ పరిశోధనలో అమ్మాయిలు ఇంత పెద్ద గోల్ కొట్టారని తెలిసినా కూడా!!

● డెస్క్ జాబ్

సిట్ ఫర్ ఫ్యాట్

డెస్క్ జాబ్ చేసేవాళ్లు ఎక్కువ పని గంటలు కూర్చోనే ఉండాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు నడుము, పొట్ట దగ్గర కొవ్వు పేరుకుపోవడం సహజం. చెయిర్‌లో లేదా యోగా మ్యాట్ మీద కూర్చుని చేసే వ్యాయామాలు కొన్ని ఉంటాయి. వీటిని సాధన చేయడం వల్ల పొట్ట భాగం చదునుగా అవుతుంది. దీంతో పాటు వెన్నుకు, కండరాలకు బలం చేకూర్చే వ్యాయామాల గురించి తెలుసుకొని, ఆచరణ లో పెడదాం..



సీటెడ్ లెగ్ లిఫ్ట్స్

కుర్చీలో నిటారుగా కూర్చోవాలి. కుర్చీ సీటు భాగాన్ని రెండు చేతులతో పట్టుకోవాలి. పాదాలను నేలకు ఆనించి, మోకాళ్లను వంచకుండా నిటారుగా ఉంచాలి. ఒక కాలిని నేలపై అలాగే ఉంచి, మరొక కాలును పైకి ఎత్తాలి. కుర్చీ సీటుకు సమంగా ఉండేలా కాలిని ఎత్తి, కొన్ని సెకన్లు ఉంచి, తిరిగి నేల మీద ఉంచాలి. ఆ తర్వాత మరో కాలిని కూడా అదేవిధంగా చేయాలి. ఈ వ్యాయామం వల్ల తొడల భాగం బలంగా అవుతుంది.

కుర్చీ హ్యాండిల్స్‌ను చేతులతో పట్టుకొని, దానిపైన కూర్చోవాలి. మోకాళ్లను మడిచి, ఛాతీ వరకు తీసుకొని, పాదాలను కుర్చీకి సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి. వెన్నును నిటారుగా ఉంచాలి. మోకాళ్లను కొన్ని సెకన్ల పాటు అదే పొజిషన్‌లో ఉంచాలి. దీనివల్ల పొట్ట కింది భాగం కండరాలు ఫిట్‌గా అవుతాయి. అదనపు కొవ్వు తగ్గుతుంది. ఈ ఎక్సర్‌సైజులు చేసేటప్పుడు చెయిర్ గట్టిగా, ఎలాంటి లోపాలు లేకుండా ఉండేలా చూసుకోవాలి.

ఆబ్లిక్ ట్విస్ట్

నిటారుగా కూర్చొని, రెండు చేతులతో తలకు రెండువైపులా సమాంతరంగా, భుజాలను నిటారుగా ఉంచాలి. అదే భంగిమలో ఉండి, ఒకసారి కుడి వైపుకి తిరిగి, కొన్ని సెకన్లు అలాగే ఉండాలి. మరోసారి ఎడమ వైపుకు తిరిగి కొన్ని సెకన్లు ఉండాలి. నడుము భాగంలో ఉన్న కండరాలకు తగినంత శక్తి లభిస్తుంది.



సీటెడ్ క్రంచెస్

చెయిర్ పైన కూర్చొని, దాని హ్యాండిల్స్‌ను బలంగా పట్టుకోవాలి. కాళ్లను, వెన్నును నిటారుగా ఉంచి, చెయిర్ మీద నుంచి అదే భంగిమలో కొద్దిగా పైకి లేవాలి. కొన్ని సెకన్లలో తిరిగి యథాస్థితికి రావాలి. ఇదేవిధంగా ఐదారుసార్లు ఈ వ్యాయామాన్ని చేయచ్చు. ఈ వ్యాయామం వల్ల పొత్తికడుపు, పై భాగం కండరాల పనితీరులో వేగం పెరుగుతుంది.





టో టచెస్

కూర్చొని పాదాలను నిటారుగా నేలకు ఉంచాలి. నడుము భాగాన్ని వంచుతూ తలను మోకాళ్లవైపుగా తీసుకువచ్చి, చేతులను పాదాలకు ఆనించాలి. కొన్ని సెకన్లు అలాగే ఉండి, తిరిగి యథాస్థితికి రావాలి. ఈ వ్యాయామం ద్వారా శరీరానికి స్ట్రెచింగ్, ఫ్లెక్సిబిలిటీ ఏర్పడుతుంది.



సీటెడ్ బైస్కిల్ పెడల్స్

చెయిర్‌లో ముందుకు వచ్చి కూర్చోవాలి. పూర్తి బ్యాలెన్స్ చూసుకొని, కాళ్లను సైకిల్ పెడల్ తొక్కినట్టుగా కదలికలు చేయాలి. ఈ వ్యాయామ లక్ష్యం కాలి కండరాలకు బలం చేకూర్చడం అని దృష్టిలో పెట్టుకోవాలి. వీలైనన్ని సార్లు ఈ వ్యాయామం చేయచ్చు.

ఏళ్లు గడుస్తున్నా యంగ్‌గానే!



వయసు పెరుగుతున్న కొద్దీ చర్మంలో వచ్చే మార్పులతో అది యౌవ్వనంలో ఉండే మెరుపును, బిగుతును కోల్పోతుంది. చర్మంలోని బిగుతూ, మిసమిస పది కాలాల పాటు ఉండాలంటే ఏం చేయాలో చూద్దాం...

● చర్మంపై వయసు ప్రభావం కనపడనివ్వకుండా చేసుకోడానికి అన్నిరకాల పోషకాలు ఉండే సమతుల ఆహారాన్ని తీసుకోండి. అందులో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఆకుకూరలు, పండ్లు, బాదం వంటి డ్రై ఫ్రూట్స్‌లో ఈ పోషకాలు ఎక్కువ. ● ద్రవాహారం ఎక్కువగా తీసుకుంటూ ఉండటంతో పాటు శరీరంలోని లవణాలను కోల్పోకుండా చూసుకోండి. దీనివల్ల హైడ్రేటెడ్‌గా ఉంటారు. ఫలితంగా చర్మం ఆరోగ్యకరమైన మేని మెరుపుతో నిగారిస్తూ ఉంటుంది.

● గోరువెచ్చని నీళ్లతో... తక్కువ గాఢత ఉన్న మైల్డ్ సోప్‌లు వాడటమే మంచిది.

● మంచి మాయిశ్చరైజేషన్ లోషన్స్‌తో చర్మాన్ని పొడిబారకుండా చూసుకోవాలి. ● రోజూ ఎండకు వెళ్లే వారు మంచి సన్‌స్క్రీన్ లోషన్స్ ఉపయోగించాలి. ● శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా సౌకర్యవంతమైన దుస్తులు ధరించాలి. ● చర్మంపై వచ్చే ఇన్ఫెక్షన్స్‌ను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స తీసుకోవాలి.

ఈ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటే వయసు పెరుగుతున్నప్పటికీ చర్మం ఏజింగ్ ప్రభావానికి గురికాకుండా ఉంటుంది.

లైఫ్@360

● నాన్నకోసం

నొవోకారీ... కేరాఫ్ కోమల



డయాబెటిస్ ఉన్న తన తండ్రి, కొందరు స్నేహితులు తమ ఇన్సులిన్ వయల్స్‌ను సరైన ఉష్ణోగ్రత దగ్గర ఉంచడానికి ఇబ్బంది పడడాన్ని చూసింది కోమల్ పాండా. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'నొవోకారీ'కి రూపకల్పన చేసింది.

ఇన్సులిన్ వయల్స్ రెండు నుంచి ఎనిమిది డిగ్రీల సెల్సియస్ వద్ద నిల్వ చేయాల్సి ఉంటుంది. అంతకుమించితే ఔషధం తన సామర్థ్యాన్ని కోల్పోతుంది.

'ఎన్‌ఐడీ'లో ఇండస్ట్రియల్ డిజైన్ కోర్సు చేస్తున్న కోమల్ క్లాస్‌రూమ్ ప్రాజెక్ట్‌గా 'నొవోకారీ'ని చేపట్టింది.



టిఫిన్‌బాక్స్ సైజ్ నుంచి ఆకట్టుకునేలా ఉన్న వెర్షన్‌కు తీసుకు రావడానికి ఎంతో శ్రమించింది. 'పోర్టబుల్ కూలింగ్ సొల్యూషన్' అయిన 'నొవోకారీ' ప్రయాణాల సమయంలో శీతలీకరణ అవసరమయ్యే ఇన్సులిన్‌లాంటి మందులను నిల్వ చేయడానికి అనువుగా, సౌకర్యంగా ఉంటుంది. అడ్వాన్స్‌డ్ థర్మోఎలక్ట్రిక్ కూలింగ్(టీఈసి) టెక్నాలజీతో దీన్ని రూపొందించింది. డిజైన్ అవార్డ్స్‌లో 'జేమ్స్ డైసన్'ను అత్యున్నత అవార్డ్‌గా పరిగణిస్తారు. హరియాణాలోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్' స్టూడెంట్ అయిన కోమల్ తన ఆవిష్కరణకు ప్రతిష్ఠాత్మకమైన 'జేమ్స్ డైసన్' అవార్డ్ అందుకుంది.

కోమల్ ఆవిష్కరణపై ఆమె తండ్రి సంతోషం వ్యక్తం చేశాడు. 'నాలాంటి వాళ్లకు ఇది కచ్చితంగా ఉపశమనం. నేను కొత్త ప్రాడక్ట్‌తో వచ్చినప్పుడల్లా అది బాగా పనిచేస్తుందో లేదో పరీక్షించేది. అలాగే నేను పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకునేది. నాలాంటి వాళ్ల ఎంతోమంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నొవోకారీ రూపొందించినందుకు సంతోషంగా ఉంది' అంటున్నాడు కోమల్ తండ్రి.

'మన దేశంలో లక్షలాదిమంది డయాబెటిస్‌తో పోరాడుతున్నారు. ఇలాంటి వారికి నొవోకారీ ఉపశమనాన్ని ఇస్తుంది' అంటుంది కోమల్.

బీట్‌రూట్‌తో మెదడు చురుకు

బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందని తేలింది. అమెరికాలోని వేక్ ఫారెస్ట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని కనుగొన్నారు. నిత్యం వ్యాయామం చేసే అలవాటు లేనివారు, అధిక రక్తపోటుతో బాధ పడుతూ... ఇందుకోసం రెండు కంటే ఎక్కువగా మందులు వాడుతున్న వారిని దాదాపు 55 ఏళ్ల వయసున్న కొంతమంది స్త్రీ, పురుషులను ఈ అధ్యయనం కోసం ఎంపిక చేశారు. వీళ్లకు వారానికి కనీసం మూడుసార్లు చొప్పున ఆరు వారాల పాటు నడక మొదలుపెట్టే గంట ముందుగా బీట్‌రూట్ జ్యూస్ ఇచ్చి చూడగా మెదడు భాగానికి రక్తసరఫరా బాగా జరిగినట్లు గుర్తించారు. బీట్‌రూట్‌లో అధిక మోతాదులో డయటరీ నైట్రేట్ ఉంటుంది. మనం బీట్‌రూట్‌ను తీసుకున్నప్పుడు అది నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి మన శరీర భాగాలకు రక్తసరఫరాను అధికం చేస్తుంది. అలాగే మెదడుకు కూడా. అందువల్లనే మెదడుకు చురుకుదనం అని ఆ అధ్యయనంలో తేలింది.



జర భద్రం!



స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడపడం అనేది అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్(ఏడీహెచ్‌డి)కి కారణం అవుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మన దేశంలో 5–8 శాతం మంది 'ఏడీహెడీ' సమస్యతో బాధ పడుతున్నారు.

'స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడపడం వల్ల పిల్లల్లో హైపర్‌యాక్టివిటీ, ఇంపల్సివిటీ తో పాటు ఏకాగ్రత లోపించడంలాంటి ఏహెచ్‌డీ లక్షణాలు మరింత తీవ్రతరం అవుతాయి' అంటున్నాడు గురుగ్రామ్‌లోని 'మదర్ హుడ్ హాస్పిటల్' పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ వజీర్.

'ఏడీహెడీ'కి సంబంధించి కొన్ని లక్షణాలు

● హోంవర్క్ చేయడానికి ఇబ్బంది పడడం ● తరచుగా మరచిపోవడం. ఒక పద్ధతి ప్రకారం పనులు చేసుకోలేకపోవడం ● సంభాషణల్లోకి దూరి అంతరాయం కలిగించడం ● అతిగా మాట్లాడడం ● అనాలోచితంగా పని చేయడం ● వారి వంతు కోసం వేచి ఉండలేకపోవడం ● అధిక స్క్రీన్ టైమ్ వల్ల పిల్లలపై కలిగే ప్రతికూల ప్రభావం గురించి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. పిల్లల స్క్రీన్ టైమ్‌పై పరిమితులు విధించాలని, వారు బయటికి వెళ్లి ఆటలు ఆడేలా చూడాలని, పిల్లలకు శారీరక శ్రమ ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించాలని నిపుణులు చెబుతున్నారు.

సినిమా

కొత్త లుక్స్. విడుదల తేదీల ప్రకటనలతో దీపావళి సందడి తెలుగు పరిశ్రమలో బాగానే కనిపించింది. మాస్ లుక్, క్లాస్ లుక్, భయంకరమైన లుక్, కామెడీ లుక్... ఇలా పండగ వేళ పసందైన వెరైటీ లుక్స్‌లో కనిపించారు స్టార్స్. ఆ వివరాల్లోకి వెళదాం.


● నాగార్జున, ధనుష్, రష్మిక


● ఐశ్వర్య, వెంకటేశ్, మీనాక్షి చౌదరి


● రామ్‌చరణ్

పండగ వేళ పసందుగా...


● తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లోని స్టార్ హీరోలైన అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న పాన్ ఇండియన్ మల్టీస్టారర్ చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా ధనుష్, నాగార్జున, రష్మికా మందన్నల పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. టీజర్‌ని ఈ నెల 15న విడుదల చేయనున్నారు. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది.


● హీరో వెంకటేశ్ వచ్చే సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయనున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్‌ని ఖరారు చేసి టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. అనిల్ రావిపూడి ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్ భార్య పాత్రలో ఐశ్వర్యా రాజేష్, మాజీ ప్రేయసిగా మీనాక్షీ చౌదరి నటిస్తున్నారు. దీపావళిని పురస్కరించుకుని ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడంతో పాటు సినిమాని సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. యూనిక్ ట్రయాంగిలర్ క్రైమ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం రూపొందుతోంది.


● నితిన్


● నాని

● సంక్రాంతికి ఆట ప్రారంభించనున్నారు రామ్‌చరణ్. ఆయన హీరోగా నటిస్తున్న పాన్ ఇండియన్ మూవీ 'గేమ్ ఛేంజర్'. దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 10న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. కాగా ఈ మూవీ టీజర్‌ని ఈ నెల 9న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, రామ్‌చరణ్ లుక్‌ని రిలీజ్ చేశారు.


● నవీన్ చంద్ర


● రాజా గౌతమ్

● అర్జున్ సర్కార్‌గా ఛార్జ్ తీసుకున్నారు హీరో నాని. 'హిట్: ది ఫస్ట్ కేస్', 'హిట్: ది సెకండ్ కేస్' వంటి చిత్రాల తర్వాత ఆ ఫ్రాంచైజీలో రూపొందుతున్న చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. తొలి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలను 'హిట్: ది థర్డ్ కేస్'ని కూడా తెరకెక్కిస్తున్నారు. శ్రీనిధీ శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్‌పై ప్రశాంతి తిపిర్నేని ఈ మూవీ నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఈ మూవీ నుంచి నాని యాక్షన్ ప్యాక్డ్ పోస్టర్ రిలీజ్ చేశారు. 2025 మే 1న ఈ సినిమా విడుదల కానుంది.

● నితిన్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'రాబిన్ హుడ్'. ఇందులో శ్రీలీల హీరోయిన్. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నితిన్ లుక్ విడుదలైంది. త్వరలో టీజర్ రిలీజ్ కానుంది. యునిక్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబర్ 20న రిలీజ్ కానుంది.

● నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్లస్ దర్శకత్వంలో రూపొందిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'లెవెన్'. రేయా హరి కథానాయికగా నటించారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో అజ్మల్ ఖాన్, రేయా హరి ఈ చిత్రాన్ని నిర్మించారు. కాగా ఈ చిత్రంలోని 'ది డెవిల్ ఈజ్ వెయిటింగ్..' అంటూ శ్రుతీహాసన్ పాడిన పాట చాలా పాపులర్ అయింది. 'లెవెన్'ని నవంబర్ 22న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.

● బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాత–మనవళ్లుగా నటిస్తున్న చిత్రం 'బ్రహ్మ ఆనందం'. నూతన దర్శకుడు ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బ్రహ్మానందంగా రాజా గౌతమ్ పోషిస్తున్న పాత్ర ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ప్రియా వడ్లమాని, ఐశ్వర్యా హోలక్కల్ హీరోయిన్లు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

● నాగ సాధువుగా తమన్నా లీడ్ రోల్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఓదెల 2'. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై బహు భాషా చిత్రంగా రూపొందుతోంది. ఈ డివోషన్ యాక్షన్ థ్రిల్లర్‌లో విలన్ తిరుపతి పాత్రలో వశిష్ఠ ఎన్. సింహ నటిస్తున్నట్లు పేర్కొని, లుక్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో హెబ్బా పటేల్ మరో కీలక పాత్రధారి. దర్శకుడు సంపత్ నంది సూపర్ విజన్‌లో ఈ చిత్రాన్ని డి. మధు నిర్మిస్తున్నారు.


● వశిష్ఠ

కృతజ్ఞత అనేది చాలా చిన్న మాట

– సూర్యదేవర నాగవంశీ

''లక్కీ భాస్కర్' సినిమా గురించి సోషల్ మీడియాలో ఎక్కడా ఒక్క నెగటివ్ కామెంట్ కూడా కనిపించలేదు.. అంతలా పాజిటివ్ టాక్ వచ్చింది. అందుకు ప్రేక్షకులకు థ్యాంక్స్ చెప్పడం కోసం మీడియా ముందుకి వచ్చాం. కృతజ్ఞత అనేది చాలా చిన్న మాట. సినిమా పట్ల వారు చూపిస్తున్న ప్రేమకు మాటల్లో చెప్పలేనంత సంతోషం కలుగుతోంది'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జోడీగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ అక్టోబరు 31న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకీ అట్లూరి మాట్లాడుతూ–''లక్కీ భాస్కర్'కి ఎక్కడైనా నెగటివ్ కామెంట్ వస్తే అడగండి అంటూ నాగవంశీగారు అన్నారు. ఆయన అన్నట్లే ఒక్కటి కూడా రాలేదు. దర్శకుడిగా ఇంత మంచి పేరు రావడం చాలా అరుదైన విషయం. మలయాళ ప్రేక్షకులు కూడా డబ్బింగ్ సినిమాలా కాకుండా సొంత సినిమాగానే ఆదరిస్తున్నారు. ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని ప్రేక్షకులు సంతృప్తి చెందుతున్నారు'' అని పేర్కొన్నారు. నటుడు రాజ్‌కుమార్ కొరెడ్డి మాట్లాడారు.


● వెంకీ, నాగవంశీ

దేశం కోసం పోరాటం

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాష్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఈ మూవీ ట్రైలర్‌కి మంచి స్పందన వస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ''1980లో జగిత్యాల ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన సినిమా 'జితేందర్ రెడ్డి'. కాలేజీ రోజుల నుంచే ప్రజా సమస్యల కోసం పోరాడుతూ దేశం కోసం, ధర్మం కోసం నక్సలైట్లతో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని, ఆయన రాజకీయ జీవితాన్ని ఈ సినిమాలో చూపించాం. యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో తన పాత్ర చక్కగా వచ్చేందుకు రాకేష్ వర్రె ఎంతో కష్టపడ్డారు''అని చిత్రయూనిట్ పేర్కొంది.


● రాకేష్ వర్రె

ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేం

– సుజీత్, సందీప్

''క' కథ అనుకున్నప్పుడు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోనని భయపడ్డాం. కానీ, కథకు చాలా కనెక్ట్ అవుతున్నారు. ప్రత్యేకించి పతాక సన్నివేశంలో నిలబడి అభినందిస్తున్నారు. సినిమాకు వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఈ అనుభూతిని మాటల్లో చెప్పలేకపోతున్నాం'' అని డైరెక్టర్స్ సుజీత్, సందీప్ అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'క'. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమాని డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి అక్టోబరు 31న విడుదల చేశారు. ఈ సందర్భంగా సుజీత్ మాట్లాడుతూ–''నేను, సందీప్ బ్రదర్స్. మాకు ఇండస్ట్రీలో ఏ పరిచయాలూ లేవు. ఇక్కడ విజయం సాధిస్తేనే మనుగడ అనుకున్నాం. అందుకే పట్టుదలగా 'క' చేసి, హిట్ సాధించాం. 'క' సినిమాకు ప్రీక్వెల్ ఉంటుంది'' అన్నారు. సందీప్ మాట్లాడుతూ– ''క' సినిమా గురించి సోషల్ మీడియాలో ఎక్కడైనా నెగటివ్‌గా వస్తే ప్రేక్షకులే వాటికి సమాధానాలు ఇస్తున్నారు. ఇక థియేటర్స్ హౌస్‌ఫుల్స్ కావడం గొప్ప అనుభూతినిస్తోంది. బడ్జెట్ కాదు సబ్జెక్ట్ బాగుంటే అంతర్జాతీయ స్థాయికి సినిమాలు తీసుకెళ్లవచ్చని డైరెక్టర్ రాజమౌళిగారు చెప్పారు. ఆయన స్ఫూర్తితో మా తర్వాతి సినిమాలను సరికొత్తగా రూపొందించే ప్రయత్నం చేస్తాం'' అని చెప్పారు.


● సందీప్, సుజీత్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
335	99
79,724	24,304

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	18,261	▲	166
డోజోన్స్	42,081	▲	317
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,177	▲	67
డాక్స్	19,255	▲	177
షాంఘై	3,272	▽	8
నికాయ్	38,054	▽	1,028

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.61	110.46
€	యూరో	ఎస్‌బీఐ	89.62	93.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.55	66.32
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.04	23.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.81	12.65

జీఎస్‌టీ వసూళ్ల రికార్డ్

- అక్టోబర్‌లో రూ.1.87 లక్షల కోట్లు
- ప్రారంభం తర్వాత ఇవి రెండో అతి భారీ వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు అక్టోబర్‌లో రికార్డు సృష్టించాయి. సమీక్షా నెలలో 9 శాతం పురోగతితో (2023 ఇదే నెలతో పోల్చితే) రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2017 జూలైలో జీఎస్‌టీ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఒక నెలలో ఈ స్థాయి వసూళ్లు ఇది రెండవసారి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్ల జీఎస్‌టీ వసూళ్లు ఇప్పటి వరకూ ఆల్‌టైమ్ రికార్డు. దేశీయ అమ్మకాలు, పన్ను పరిధి విస్తృతి తాజా రికార్డుకు కారణమని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

రిఫండ్స్ రూ.19,306 కోట్లు

కాగా, మొత్తం అక్టోబర్ జీఎస్‌టీ వసూళ్లు రూ.1,87,346 కోట్లలో రూ.19,306 కోట్ల రిఫండ్స్ జరిగాయి. 2023 అక్టోబర్‌తో పోల్చితే ఇది 18.2 శాతం అధికం. రిఫండ్స్ మినహాయిస్తే, నికర జీఎస్‌టీ వసూళ్లు 8 శాతం వృద్ధితో రూ.1.68 లక్షల కోట్లుగా ఉన్నాయి.

విభాగాల వారీగా

- ➤ మొత్తం వసూళ్లు రూ. 1,87,346 కోట్లు
- ➤ సెంట్రల్ జీఎస్‌టీ రూ.33,821 కోట్లు
- ➤ స్టేట్ జీఎస్‌టీ రూ.41,864 కోట్లు
- ➤ ఇంటిగ్రేటెడ్ ఐజీఎస్‌టీ విలువ రూ.99,111 కోట్లు
- ➤ సెస్ రూ.12,550 కోట్లు

మూరత్ మురిపించెన్..

- సంవత్ 2081కు లాభాలతో స్వాగతం...
- సెన్సెక్స్ 335 పాయింట్లు.. నిఫ్టీ 99 పాయింట్లు అప్

ముంబై: దీపావళి రోజు గంటసేపు జరిగిన మూరత్ ప్రత్యేక ట్రేడింగ్ మురిపించింది. స్టాక్ సూచీలు సంవత్ 2081 ఏడాదికి లాభాలతో స్వాగతం పలికాయి. సెన్సెక్స్ 335 పాయింట్లు పెరిగి 79,724 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99 పాయింట్లు బలపడి 24,304 వద్ద నిలిచింది. ఇన్వెస్టర్లు బ్యాంకులు, ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లను కొనేందుకు ఆసక్తి చూపారు. రెండురోజుల వరుస నష్టాలకు చెక్‌పెడుతూ శుక్రవారం సాయంత్రం 6:00 నిమిషాలకు సెన్సెక్స్ 635 పాయింట్ల లాభంతో 80,024 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 79,656 – 80,024 మధ్య ట్రేడైంది. ఈ ఇండెక్స్‌లోని 30 షేర్లలో హెచ్‌సీఎల్ టెక్ (–0.60%), టెక్ మహీంద్రా (–2.75%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 28 షేర్లూ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ 50 సూచీలోని 47 స్టాక్స్ లాభాలలో ముగిశాయి. ఐటీ షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

- సెన్సెక్స్ దాదాపు అరశాతం లాభపడడంతో ఇన్వెస్టర్ల సంపద శుక్రవారం ఒక్కరోజే రూ.3.26 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్‌ఈ మార్కెట్ విలువ రూ.447.97 లక్షల కోట్లకు చేరింది.



మూరత్ ట్రేడింగ్ సెషన్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి రాశీ ఖన్నా తదితరులు

2080 సంవత్ సూపర్

సంవత్ 2080 గురువారంతో ముగిసింది. ఈ ఏడాది కాలంలో సెన్సెక్స్ 14,484 పాయింట్లు (22.31%), నిఫ్టీ 4,780 పాయింట్లు(24.60%) చొప్పున లాభాలు నమోదు చేశాయి. ఇదే కాలంలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.124.42 కోట్లకు పెరిగి రూ.444.71 లక్షల కోట్లకు చేరింది.

- అక్టోబర్‌లో వాహన విక్రయాలు పెరగడంతో ఆటో కంపెనీల షేర్లు ఎంఅండ్‌ఎం 3%, టాటా మోటార్స్ ఒకశాతం పెరిగాయి. అంతంత మాత్రంగానే అమ్మకాలు జరిగినా మారుతీ సుజుకీ సుజుకీ షేరు స్వల్పంగా 0.25% లాభపడింది.
- కాగా 2080 సంవత్ చివరి రోజైన గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలు చవిచూశాయి. ఐటీ షేర్లలో అమ్మకాలు విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు ట్రేడింగ్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 553 పాయింట్లు నష్టపోయి 79,389 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 654 పాయింట్లు క్షీణించి 79,288 వద్ద కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 135 పాయింట్లు పతనమై 24,205 వద్ద నిలిచింది.

అపోలో హాస్పిటల్స్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అపోలో హాస్పిటల్స్ తమ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ముంబైలోని వర్లిలో 500 పడకల ఆస్పత్రి నిర్మాణం, నిర్వహణకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. ఇది నాలుగేళ్లలో అందుబాటులోకి రానుందని సంస్థ తెలిపింది. దీనితో పాటు లక్నో ఆస్పత్రిని కూడా విస్తరిస్తున్నట్లు పేర్కొంది. ఇందులో మరో 200 పడకలు జోడించడం ద్వారా బెడ్స్ సంఖ్యను మొత్తం 500కి పెంచనున్నట్లు అపోలో హాస్పిటల్స్ పేర్కొంది. ఈ విస్తరణ మూడేళ్లలో పూర్తి కాగలదని వివరించింది. వచ్చే నాలుగేళ్లలో 11 ప్రాంతాల్లో మొత్తం మీద 3,512 పడకల సామర్థ్యాన్ని అదనంగా జోడించుకోవాలని నిర్దేశించుకున్నట్లు అపోలో హాస్పిటల్స్ పేర్కొంది. ఇందుకోసం సుమారు రూ. 6,100 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే స్థల సమీకరణ, సెక్యూరిటీ డిపాజిట్ మొదలైన వాటికి రూ. 1,700 కోట్లు వెచ్చించినట్లు సంస్థ తెలిపింది. ప్రపంచ స్థాయి వైద్యాన్ని భారతీయులందరికీ అందుబాటులోకి తేవాలనే లక్ష్యం సాధన దిశగా విస్తరణను చేపట్టినట్లు అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి తెలిపారు.




వాహన అమ్మకాలు అంతంతే..!

- నిరాశపరిచిన పండుగ సీజన్
- తగ్గిన మారుతీ సుజుకీ, హ్యుందాయ్ విక్రయాలు
- ఎంఅండ్‌ఎం, ఎంజీ మోటార్స్, టయోటా అమ్మకాల్లో వృద్ధి

ముంబై: పేరుకుపోయిన వాహన నిల్వలను కరిగించే చర్యల్లో భాగంగా డీలర్లకు పంపిణీ తగ్గించడంతో మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్స్ అక్టోబర్ అమ్మకాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. మారుతీ సుజుకీ ప్యాసింజర్ వాహనాల దేశీయ అమ్మకాలు క్రితం ఏడాదితో పోలిస్తే 1,68,047 యూనిట్ల నుంచి 1,59,591 యూనిట్లకు తగ్గాయి. అమ్మకాలు 5% క్షీణించాయి. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్–ప్రెసో విక్రయాలు 14,568 నుంచి 10,687కు తగ్గాయి. కాంపాక్ట్ కార్ల విభాగంలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, టూర్ ఎస్, వేగనార్, అమ్మకాలు 80,662 నుంచి 65,948 యూనిట్లతో సరిపెట్టుకుంది. అయితే యుటిలిటీ వాహన విభాగంలోని బ్రెజా, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎక్స్‌ఎల్6 విక్రయాలు 59,147 నుంచి 70,644కు పెరిగాయి.

- హ్యుందాయ్ మోటార్ ఇండియా వాహనాల దేశీ పంపిణీ(హోల్‌సేల్) స్వల్పంగా 1 శాతం పుంజుకుని 55,568 వాహనాలకు చేరింది. 2023 అక్టోబర్ నెలలో 55,128 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. పండుగ సీజన్‌లో తమ ఎస్‌యూవీ కార్లకు మంచి గిరాకీ ఏర్పడిందని కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ తెలిపారు. హ్యుందాయ్ క్రెటా కార్లు 17,497 యూనిట్లతో పాటు ఎస్‌యూవీ కార్లు 37,902 యూనిట్లు విక్రయించామని, ఒక నెలలో ఇదే గరిష్టం అని అన్నారు. హ్యుందాయ్ కార్లలో 68 శాతం ఎస్‌యూవీలే ఉండటం విశేషమన్నారు.
- మహీంద్రాఅండ్‌మహీంద్రా ఎస్‌యూవీ దేశీయ విక్రయాలు 25% పెరిగి 54,504కు చేరాయి. ఈ పండుగ సీజన్‌లో తొలి 60 నిమిషాల్లో 5–డోర్ ఆఫ్ రోడ్ ఎస్‌యూవీ థార్ రాక్స్ 1.7 లక్షల బుకింగ్స్ అయ్యాయి.
- టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దేశీ విక్రయాలు 48,337 నుంచి 48,131కు తగ్గాయి. టయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 20,542 నుంచి 37% పెరిగి 28,138కు చేరాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ అమ్మకాలు 31% పెరిగి 7,045 యూనిట్లకు చేరాయి.



అక్టోబరులో ఆటో అమ్మకాల తీరిదీ (ఎగుమతులతో సహా)

కంపెనీ	అక్టోబర్ 2024	అక్టోబర్ 2023	(%లో)
మారుతీ సుజుకీ	2,06,434	1,99,217	(+)4
హ్యుందాయ్ మోటార్స్	70,078	68,728	(+)2
టాటా మోటార్స్	82,594	82,682	(–)0.1
టయోటా కిర్లోస్కర్	30,845	21,879	(+)41
హోండా కార్స్	10,083	13,080	(–)23
ఎంఅండ్‌ఎం	96,648	80,679	(+)20
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటార్స్	4,89,015	4,34,714	(+)13
రాయల్ ఎన్‌ఫీల్డ్	1,10,574	84,435	(+) 31
ఓలా ఎలక్ట్రిక్	41,605	--	--
హీరో మోటోకార్ప్	6,79,091	5,74,930	(+)18
వాణిజ్య వాహనాలు			
వీఈ కమర్షియల్	7,112	7,486	(–)5
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	18,110	15,113	(+)20

ఆల్‌టైం గరిష్టానికి మారుతీ సేల్స్...

మారుతీ సుజుకీ మొత్తం విక్రయాలు(ఎగుమతులతో కలిపి) అక్టోబర్‌లో రికార్డు గరిష్టానికి చేరాయి. టోకు విక్రయాలు గత నెలలో 2,06,434 యూనిట్లుగా నమోదయ్యాయి. కంపెనీ నెలవారీ విక్రయాల్లో ఇవే ఇప్పటివరకు అత్యధికం. క్రితం ఏడాది ఇదే అక్టోబర్‌లో 1,99,217 యూనిట్లను డీలర్లకు సరఫరా చేసింది.

ఏవో స్మిత్ చేతికి ప్యూరిట్

కొనుగోలు ప్రక్రియ పూర్తి

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) నీటి శుద్ధి బిజినెస్‌ను గ్లోబల్ వాటర్ టెక్నాలజీ కంపెనీ ఏవో స్మిత్ కార్పొరేషన్ సొంతం చేసుకుంది. ప్యూరిట్ బ్రాండ్ వాటర్ ప్యూరిఫికేషన్ (నీటి శుద్ధి) బిజినెస్ విక్రయ ప్రక్రియను పూర్తి చేసినట్లు హెచ్‌యూఎల్ తాజాగా వెల్లడించింది. నీటి శుద్ధి బిజినెస్‌ను 7.2 కోట్ల డాలర్ల (రూ.600 కోట్లు)కు విక్రయించేందుకు ఏవో స్మిత్ ఇండియా వాటర్ ప్రొడక్ట్స్‌తో ఈ ఏడాది జులైలో హెచ్‌యూఎల్ ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. మాతృ సంస్థ యూనిలీవర్ ప్రపంచవ్యాప్త విక్రయంలో భాగంగా ప్యూరిట్‌ను హెచ్‌యూఎల్ ఏవో స్మిత్‌కు అమ్మివేసింది. ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, వియత్నాం, మెక్సికో తదితర ప్రాంతాలలో ప్యూరిట్.. వాటర్ ప్యూరిఫికేషన్ బిజినెస్‌ను నిర్వహిస్తోంది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్‌లో మరిన్ని యాపిల్ స్టోర్స్
ఫేస్‌బుక్ ఇండియా ఆన్‌లైన్ లాభం జూమ్



కాంస్యం నెగ్గిన మాన్సి

ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఏకైక కాంస్య పతకం లభించింది. నాన్ ఒలింపిక్ వెయిట్ కేటగిరీల్లో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించారు. అల్బేనియా రాజధాని టిరానాలో ముగిసిన ఈ టోర్నీలో మహిళల ఫ్రీస్టయిల్ 59 కేజీల విభాగంలో మాన్సి అహ్లావత్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక బౌట్‌లో మాన్సి 5–0తో కెనడా రెజ్లర్ లారెన్స్ బ్యూరెగార్డ్‌ను ఓడించింది. సెమీఫైనల్లో మాన్సి 1–4తో సుఖి సెరెన్‌చిమెడ్ (మంగోలియా) చేతిలో ఓడిపోయింది. 65 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో మనీషా భన్వాలా 2–8తో మివా మొరికావా (జపాన్) చేతిలో పరాజయం పాలైంది.

బోపన్న జోడీ ఓటమి

పారిస్ ఓపెన్ మాస్టర్స్–1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం కథ ముగిసింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ జోడీ 6–7 (13/15), 5–7తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)–మెక్‌టిక్ (క్రొయేషియా) జంట చేతిలో ఓడింది.


దేవ్‌దత్

పడిలేచిన భారత్ 'ఎ'

- తొలి ఇన్నింగ్స్‌లో 107కే ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో 208/2
- ఆస్ట్రేలియా 'ఎ'తో తొలి అనధికారిక టెస్టులో 120 పరుగుల ఆధిక్యం
- రాణించిన దేవ్‌దత్, సాయి సుదర్శన్

మెకే (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియా 'ఎ'తో ఆరంభమైన మొదటి అనధికారిక టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో కూలిన భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో నిలబడింది. మ్యాచ్‌లో భారత్ నిలిచేందుకు సాయి సుదర్శన్ (185 బంతుల్లో 96 బ్యాటింగ్; 9 ఫోర్లు), దేవ్‌దత్ పడిక్కల్ (167 బంతుల్లో 80 బ్యాటింగ్; 5 ఫోర్లు) చక్కని పోరాటం చేశారు. దీంతో భారత్ 'ఎ' ప్రస్తుతం 120 పరుగుల ఆధిక్యంలో ఉంది. రెండో రోజు ఆటముగిసే సమయానికి భారత్ 64 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. గురువారం మొదటి రోజు ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'ఎ' 47.4 ఓవర్లలో 107 పరుగులకే ఆలౌటైంది. దేవ్‌దత్ పడిక్కల్ (36; 2 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, ఆసీస్ 'ఎ' బౌలర్ బ్రెండన్ డగెట్ 6 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 'ఎ' 62.4 ఓవర్లలో 195 పరుగుల వద్ద ఆలౌటైంది. ముకేశ్ కుమార్ (6/46), ప్రసిధ్ కృష్ణ (3/59) ఆసీస్‌ను 136/7 స్కోరు వద్ద కట్టడి చేసినప్పటికీ మర్ఫీ (33), ఓనీల్ (13) ఎనిమిదో వికెట్‌కు 41 పరుగులు జోడించడంతో ఆతిథ్య జట్టు 88 పరుగుల ఆధిక్యం సంపాదించింది. శుక్రవారం రెండో రోజు ఆటలో భారత్ రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టగానే ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ (5), అభిమన్యు ఈశ్వరన్ (12) వికెట్లను కోల్పోయింది. ఆ దశలో సుదర్శన్, పడిక్కల్ జట్టును ఒడ్డున పడేసే ఆట ఆడారు. ఇద్దరు కలిసి అబేధ్యమైన మూడో వికెట్‌కు 178 పరుగులు జోడించారు.

క్లాసెన్‌కు రూ. 23 కోట్లు
భారీ మొత్తం చెల్లించి అట్టిపెట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్. ఐపీఎల్ రీటెయిన్ ఆటగాళ్ల జాబితా, పూర్తి వివరాలు...
మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

వాంఖెడే మైదానంలో తొలి రోజు 84.4 ఓవర్లు పడ్డాయి. 82.5 ఓవర్ల వరకు భారత్‌దే పైచేయి... కానీ తర్వాతి 8 బంతుల వ్యవధిలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. టీమిండియా అనూహ్యంగా 3 వికెట్లు చేజార్చుకొని వెనుకంజ వేసింది. అప్పటి వరకు చక్కగా ఆడిన యశస్వి జైస్వాల్‌తో పాటు టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లి రనౌట్ ఇందులో ఉండగా, ఒక కీలక రివ్యూ కూడా కోల్పోవడంతో భారత్ నిరాశగా ఆటను ముగించింది. అంతకు ముందు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ధాటికి 235 పరుగులకే పరిమితమై నిరాశ చెందిన న్యూజిలాండ్ ఆ తర్వాత 4 వికెట్లు కూడా పడగొట్టి పైచేయి సాధించింది. రెండో రోజు మన బ్యాటర్లు ఎంత వరకు స్కోరును తీసుకెళ్లి ఆధిక్యం అందించగలరనే అంశంపైనే భారత విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.


కోహ్లి రనౌట్ దృశ్యం

పడగొట్టి... ఆపై తడబడి!


సుందర్, జడేజా

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 86/4

- న్యూజిలాండ్ 235 ఆలౌట్
- జడేజాకు 5 వికెట్లు, సుందర్‌కు 4 వికెట్లు

ముంబై: భారత్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా మొదలైంది. బౌలర్లు తొలి రోజు నేలకూల్చిన 14 వికెట్లు మ్యాచ్‌లో తర్వాతి రోజులు ఎలా సాగనున్నాయనే దానికి సంకేతంగా నిలిచింది. మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 65.4 ఓవర్లలో 235 పరుగులకే ఆలౌటైంది. డరైల్ మిచెల్ (129 బంతుల్లో 82; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), విల్ యంగ్ (138 బంతుల్లో 71; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. మిగతా వారంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా (5/65) ఐదు వికెట్లతో సత్తా చాటగా... వాషింగ్టన్ సుందర్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (38 బంతుల్లో 31 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్), రిషభ్ పంత్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత్ మరో 149 పరుగులు వెనుకబడి ఉంది. తుది జట్టులో భారత్ ఒక మార్పు చేసింది. బుమ్రాకు విశ్రాంతినిచ్చి సిరాజ్‌ను ఆడించగా... న్యూజిలాండ్ రెండు మార్పులతో బరిలోకి దిగింది. గత మ్యాచ్ హీరో సాంట్నర్ పక్కటెముకల గాయంతో టెస్టుకు దూరం కాగా... అతని స్థానంలో సోధి వచ్చాడు. పేసర్ టిమ్ సౌతీకి బదులుగా హెన్రీని కివీస్ ఎంచుకుంది.

భారీ భాగస్వామ్యం...

కివీస్ ఇన్నింగ్స్ మూడు భిన్న దశలుగా సాగింది. ఫామ్‌లో ఉన్న కాన్వే (4) ఆరంభంలోనే వెనుదిరగ్గా... కెప్టెన్ టామ్ లాథమ్ (44 బంతుల్లో 28; 3 ఫోర్లు) కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. అయితే లాథమ్‌తో పాటు రచిన్ రవీంద్ర (5)లను సుందర్ క్లీన్‌బౌల్డ్ చేయడంతో 72/3 వద్ద కివీస్ కష్టాల్లో పడింది. ఈ దశలో యంగ్, మిచెల్ భాగస్వామ్యం జట్టును ఆదుకుంది. వీరిద్దరు తర్వాతి 25 ఓవర్ల పాటు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 87 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యంతో స్కోరును 159/3 వరకు తీసుకెళ్లారు. అయితే ఇక్కడే ఆట మళ్లీ మలుపు తిరిగింది. జడేజా వేసిన ఈ ఓవర్లో యంగ్, బ్లన్‌డెల్ (0) వెనుదిరిగారు. ఆ తర్వాత వరుసగా మరో మూడు వికెట్లు కూడా అతని ఖాతాలోనే చేరాయి. సుందర్ మూడు ఓవర్లలో ఒక్కో సిక్సర్ చొప్పున బాది జోరు ప్రదర్శించిన మిచెల్ ఎట్టకేలకు సుందర్ బౌలింగ్‌లోనే పెవిలియన్ చేరగా... మరో మూడు బంతుల తర్వాత కివీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

కోహ్లి రనౌట్...

రోహిత్ శర్మ (18) ఎప్పటిలాగే ధాటిగా మొదలు పెట్టినా, మరోసారి అతను తక్కువ స్కోరుకే పరిమితమయ్యాడు. అయితే యశస్వి జైస్వాల్ (52 బంతుల్లో 30; 4 ఫోర్లు), గిల్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. 6 పరుగుల వద్ద గిల్ ఇచ్చిన క్యాచ్‌ను కీపర్ బ్లన్‌డెల్ అందుకోలేకపోయాడు. వీరిద్దరి భాగస్వామ్యం 53 పరుగులకు చేరింది. మరో రెండు ఓవర్ల ఆట మాత్రమే మిగిలి ఉంది. ఈ సమయంలో అంతా మారిపోయింది. ఎజాజ్ బౌలింగ్‌లో అనవసరపు రివర్స్ స్వీప్‌నకు ప్రయత్నించి జైస్వాల్ బౌల్డ్ కాగా... నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన సిరాజ్ (0) తర్వాతి బంతికే ఎల్బీగా అవుటయ్యాడు. అయితే దీనికి కూడా అతని 'రివ్యూ' తీసుకొని దానిని వృథా చేశాడు! భారత్‌కు మరో షాక్ చివరి ఓవర్లో తగిలింది. డిఫెన్స్ ఆడి రోజును ముగించాల్సిన సమయంలో కోహ్లి (4) సాహసం చేశాడు. రచిన్ బౌలింగ్‌లో మిడాన్ దిశగా ఆడిన అతను అతి విశ్వాసంతో సింగిల్‌కు ప్రయత్నించాడు. హెన్రీ డైరెక్ట్ త్రో వికెట్లను పడగొట్టడంతో నిరాశగా వెనుదిరిగాడు.


మిచెల్


విల్ యంగ్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (బి) సుందర్ 28; కాన్వే (ఎల్బీ) (బి) ఆకాశ్‌దీప్ 4; యంగ్ (సి) రోహిత్ (బి) జడేజా 71; రచిన్ (బి) సుందర్ 5; మిచెల్ (సి) రోహిత్ (బి) సుందర్ 82; బ్లన్‌డెల్ (బి) జడేజా 0; ఫిలిప్స్ (బి) జడేజా 17; సోధి (ఎల్బీ) (బి) జడేజా 7; హెన్రీ (బి) జడేజా 0; ఎజాజ్ (ఎల్బీ) (బి) సుందర్ 7; రూర్కే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (65.4 ఓవర్లలో ఆలౌట్) 235. వికెట్ల పతనం:** 1–15, 2–59, 3–72, 4–159, 5–159, 6–187, 7–210, 8–210, 9–228, 10–235. **బౌలింగ్:** సిరాజ్ 6–0–16–0, ఆకాశ్‌దీప్ 5–0–22–1, అశ్విన్ 14–0–47–0, వాషింగ్టన్ సుందర్ 18.4–2–81–4, జడేజా 22–1–65–5.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) ఎజాజ్ 30; రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 18; గిల్ (బ్యాటింగ్) 31; సిరాజ్ (ఎల్బీ) (బి) ఎజాజ్ 0; కోహ్లి (రనౌట్) 4; పంత్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (19 ఓవర్లలో 4 వికెట్లకు) 86. వికెట్ల పతనం:** 1–25, 2–78, 3–78, 4–84. **బౌలింగ్:** హెన్రీ 5–1–15–1, రూర్కే 2–1–5–0, ఎజాజ్ 7–1–33–2, ఫిలిప్స్ 4–0–25–0, రచిన్ 1–0–8–0.

ఆరు నెలల గరిష్టానికి జీఎస్టీ వసూళ్లు

- దేశవ్యాప్తంగా రూ.1.87 లక్షల కోట్ల ఆదాయం
- తెలంగాణలో రూ.5,211 కోట్లు, ఏపీలో రూ.3,815 కోట్లు జీఎస్టీ రాబడి

సాక్షి, న్యూఢిల్లీ: అక్టోబర్ నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు సరికొత్త రికార్డు నెలకొల్పాయి. జీఎస్టీ వసూళ్లు గత నెల 8.9% పెరిగి రూ.1,87,346 కోట్లకు చేరాయి. గత ఆరు నెలల్లో ఇది గరిష్టం కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇది రెండో గరిష్టమని కేంద్ర ఆర్థికశాఖ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. గత నెల జీఎస్టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.33,821 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.41,864 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎస్టీ రూ.99,111 కోట్లు, సెస్ రూ.12,550 కోట్లుగా ఉన్నాయి. గతేడాది దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలలో రూ.1.72 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.

తెలంగాణలో 7% వృద్ధి: కాగా గతేడాదితో పోలిస్తే తెలంగాణలో 7% వృద్ధితో రూ.5,211 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో 12% వృద్ధితో రూ.3,815 కోట్లు వసూల య్యాయి. మరోవైపు తెలంగాణకు ప్రీసెటిల్ మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.12,089 కోట్లు, పోస్ట్ సెటిల్‌మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.25,306 కోట్లుగా ఉన్నాయి. ఇక ఏపీకి ప్రీసెటిల్‌మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.8,416 కోట్లు, పోస్ట్ సెటిల్‌మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.19,171 కోట్లుగా ఉన్నాయి.

ఎయిర్‌పోర్టులో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత



శంషాబాద్: దీపావళి పండుగ సమయంలో ఇద్దరు భారతీయులు బ్యాంకాక్ నుంచి తీసుకొచ్చిన డ్రగ్స్‌ను డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. గురువారం రాత్రి బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులు శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. తనిఖీల సందర్భంగా వారి వద్ద ఉన్న 13 కెల్లాస్ చాకోలెట్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ అధికారులు.. ప్యాకెట్లలో ఆకుపచ్చరంగులో ఉన్న ముద్దల్లాంటి పదార్థాలను బయటకు తీసి ప్రత్యేక కిట్ల ద్వారా పరిశీలించి చూశారు. ప్యాకెట్లలో ఉన్న 7.096 కిలోల పదార్థాన్ని హైడ్రో పోనిక్ వీడ్ (మత్తు పదార్థం)గా గుర్తించి సీజ్ చేశారు. దాని విలువ సుమారు రూ.7 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. అధికారులు మత్తు పదార్థాన్ని తీసుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.



ఇటేమో ఎండ.. అల్లంత దూరాన నల్లటి మబ్బులు.. మబ్బుల మధ్యలో విరిసిన ఇంద్రధనస్సు.. అంతలోనే కురిసిన వర్షం.. ఫొటో సూపర్‌గా ఉంది కదూ.. ఈ చిత్రం వెదర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీలో మూడో బహుమతితో పాటూ పీపుల్స్ చాయిస్ విభాగంలో రెండో బహుమతిని గెలుచుకుంది. ఈ చిత్రాన్ని జేమీ రసెల్ అనే ఫొటోగ్రాఫర్ యూకేలోని ఐల్ ఆఫ్ వైట్ వద్ద తీశారు.

ఆవు దూడకు కృత్రిమ కాలు



కృష్ణాజిల్లా మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెంకి చెందిన గోపాల మిత్ర మత్తి శ్రీనివాసరావు పెరట్లో ఓ ఆవు ఇటీవల కోడెదూడకు జన్మనిచ్చింది. పుట్టుకతో ఒక కాలు లేదు. దీంతో శ్రీనివాసరావు పశువైద్యుడు డాక్టర్ నంద కిశోర్‌ను సంప్రదించారు. ఆయన సూచనలతో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని చైతన్య కృత్రిమ అవయవాల కేంద్రం అధినేత వేదాంతం సదా శివమూర్తిని కలిశారు. ఆయన 30 గంటల పాటు శ్రమించి కృత్రిమ కాలు అమర్చారు. రూ.20 వేలు ఖర్చయ్యింది.

\- మోపిదేవి (అవనిగడ్డ)

ఆదివాసీల రుతురాగం.. దండారీ

- రుతువులను స్వాగతిస్తూ సంబురం
- దీపావళి ముందు ప్రారంభమై పదిరోజులు కొనసాగే పండుగ
- గుస్సాడీ దీక్షలతో గూడేల్లో కళకళ
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఈ వేడుక ప్రత్యేకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆదివాసీలు తమ జీవన విధానంలో కాలానుగుణంగా వచ్చే మార్పులను స్వాగతించడం ఆనవాయితీగా వస్తోంది. దీనినే దండారీ అని పిలుస్తూ సంబురాలు జరుపుకుంటారు. దీపావళికి ముందు మొదలై.. పండుగ తర్వాత కొన్నిచోట్ల రెండుమూడురోజులకు, మరికొన్ని చోట్ల పదిరోజుల వరకు దండారీ సంబురాలు జరుగుతాయి. దీంతో ఆదివాసీ గూడెంల్లో సందడి నెలకొంది. ఈ దండారీ ఆదివాసీలకు ఎంతో ప్రత్యేకం. దీపావళి ముందు వచ్చే భోగితో మొదలై కోలబోడితో సంబురాలు ముగుస్తాయి. చివరి రోజున జమ్మి చెట్టుకు పూజలు చేసి తమ ఆభరణాలు, ఆయుధాలు సమర్పిస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ పండగ వైభవంగా జరుగుతోంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి గుడిరేవు పద్మల్‌పూరికాకో మూల ఆలయం కాగా, ఇంద్రవెల్లి, కెరమెరి, జైనూరు, ఉట్నూరు, నార్నూరు తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున దండారీ సంబురాలు జరుగుతాయి. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాలకు నిధులు విడుదల చేస్తోంది. ఈ ఏడాది ఒక్కో దండారీ సంబురానికి రూ.15 వేలు కేటాయించింది.

ఎత్మసూర్‌ను కొలుస్తూ..

దండారీ సంబురాల్లో భాగంగా ఆదివాసీలు తమ ఆరాధ్యదైవమైన ఎత్మసూర్‌ను కొలుస్తారు. ఏటా చలికాలం ఆరంభంలో తమ గూడేలు, పంటపొలాలు, పశు, సంపద అన్నింటికీ మంచి జరగాలని వేడుకుంటారు. ఎత్మసూర్ పూజలో కొన్ని వంశాల పురుషులు ఆచారంగా 'గుస్సాడీ' దీక్ష తీసుకుంటారు. దండారీ పూర్తయ్యే వరకు నిష్ఠతో కఠిన నియమాలు పాటిస్తారు. కనీసం ఐదు రోజుల నుంచి గరిష్టంగా 30 రోజుల వరకు దీక్షలో ఉంటారు. ఏటా వెయ్యికి పైగా గుస్సాడీలు దీక్షలో ఉంటున్నారు. తలపై(మాల్ బూర) నెమలి టోపీ, చేతిదండం(కర్ర), భుజానికి జింక తోలు, బూడిదను ఒళ్లంతా రాసుకొని తమను తామే దైవత్వమనే భావనతో ఉంటారు. చేతికి పూసలు, రుద్రాక్షలు, కంకణాలు, గుబురు మీసాలు, గడ్డాలతో దీక్షలో ఉండి, దండారీ పూర్తయ్యే వరకు గుస్సాడీలు స్నానం చేయరు.

ఖరీదైన 'గుస్సాడీ'

గుస్సాడీ దీక్షకు ప్రస్తుత పరిస్థితుల్లో ఆదివాసీలు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అడవుల్లో నెమలీకలు విరివిరిగా దొరికేవి. ప్రస్తుతం వాటి సేకరణ ఇబ్బందిగా మారింది. వెయ్యికిపైగా ఈకలతో చేసే టోపీని నేర్పరి ఉన్న నిపుణులే చేస్తారు. తయారీదారులకు ముడిసరుకులు లేక ఒక్కో టోపీ రూ.10వేల పైనే వెచ్చించాల్సి వస్తోంది. కెరమెరి మండలం పాటగూడ, ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్, ఈ టోపీల తయారీకి ప్రసిద్ధి. నెమలి ఈకల్ని మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తారు. సర్కారు ఒక్కో గుస్సాడీకి కనీసం రూ.30వేల చొప్పున కేటాయించి, తమ ఆలయాలు ఉన్న చోట్ల మౌలిక వసతులు కల్పించాలని ఆదివాసీ పెద్దలు కోరుతున్నారు.



ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం చిన్న సాకడలో గుస్సాడీ నృత్యాలు

మాకెంతో ప్రత్యేకం



దండారీ మాకు ఎంతో ప్రత్యేకం. ఆషాఢ పూర్ణిమలో గుస్సాడీ శిక్షణగా మొదలై, దీపావళి తర్వాత ముగుస్తుంది. నిర్దిష్ట వంశాలకు చెందిన వారే దీక్షలు తీసుకుంటారు. నిష్ఠతో పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రతీ మూడేళ్లకోసారి ఆడపిల్లలు, మగవారు, గుస్సాడీలు చేస్తుంటారు.

\- సిడాం అర్జు, గోండ్వానా గోండ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు

టీటీడీ కొత్త పాలక మండలి ఏర్పాటు

సీఎంవో జాబితాకు అదనంగా చేరిన భాను ప్రకాశ్‌రెడ్డి పేరు

సాక్షి, అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన పాలక మండలి (ట్రస్ట్ బోర్డు)ను ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. మొత్తం 29 మంది సభ్యులతో కొత్త పాలక మండలిని నియమిస్తూ దేవదాయ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ జీవో నంబరు 243 విడుదల చేశారు. నూతన పాలక మండలి చైర్మన్‌గా టీవీ -5 ఛానల్ అధినేత బీఆర్ నాయుడుని నియమించింది. బోర్డులో ఎవరూ వరుసగా రెండు విడతలకు మించి నియమితులు కాకూడదన్న ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ చట్టంలోని 19(1)(కె) నిబంధనల నుంచి ఇద్దరికి మినహాయింపునిచ్చింది. మహారాష్ట్రకు చెందిన సౌరబ్ హెచ్ బోర, తమిళనాడుకు చెందిన కృష్ణమూర్తి ఇప్పటికే వరుసగా రెండు విడతలు పాలక మండలి సభ్యులుగా కొనసాగగా, ప్రభుత్వ విచక్షాధికారాలతో ఈ ఇద్దరినీ మూడో విడత కొనసాగింపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం సీఎం కార్యాలయం (సీఎంవో) విడుదల చేసిన 24 మంది సభ్యుల జాబితాను యధావిధిగా కొనసాగించడంతో పాటు అదనంగా రాష్ట్ర బీజేపీ నుంచి భానుప్రకాష్ రెడ్డిని 25వ సభ్యునిగా నియమితుల య్యారు. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, టీటీడీ ఈవో, తుడా చైర్మన్‌ను పాలక మండలిలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమించారు. వీరితో కలిపి మొత్తం 29 మంది పాలక మండలిలో ఉంటారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శనివారం I 2-11-2024

నేతన్నల బతుకు 'యుద్ధం'

- నిలిచిపోయిన ఎగుమతులు
- రష్యా- ఉక్రెయిన్ యుద్ధంతో మొదలు
- ఇజ్రాయెల్- పాలస్తీనా యుద్ధంతో తీవ్రం
- పేరుకుపోతున్న వస్త్ర నిల్వలు
- ఉపాధి కోల్పోతున్న నేతన్నలు


రఘునాథపురంలో పేరుకుపోయిన వస్త్ర నిల్వలు

సాక్షి, యాదాద్రి: నిన్న రష్యా-ఉక్రెయిన్, నేడు పశ్చిమాసియా యుద్ధం.. రాష్ట్రంలోని చేనేత కార్మికుల పొట్ట కొడుతోంది. ప్రస్తుత యుద్ధ కాలంలో అరబ్, తూర్పు ఆఫ్రికా దేశాలకు తగ్గిన ఎగుమతులతో ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో మరమగ్గాల (పవర్ లూమ్స్)కు పేరుగాంచిన గ్రామం రాజపేట మండలంలోని రఘునాథపురం. దుబాయ్, సౌదీతో పాటు ఉగాండా వంటి తూర్పు ఆఫ్రికా దేశాల ప్రజలు ఉపయోగించే లుంగీలు, పట్కాలు, చీరలను రఘునాథపురం గ్రామంలో నేస్తుంటారు. ఇక్కడ తయారు చేసిన ఈ వస్త్రాలను చిన్న చిన్న వ్యాపారులు ముంబైకి చెందిన బడా వ్యాపారులకు ఎగుమతి చేస్తే.. వారు అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

ఎనిమిది నెలలుగా తగ్గిన గిరాకీ

రష్యా- ఉక్రెయిన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, ఇరాన్, లెబనాన్ యుద్ధం కారణంగా ఎనిమిది నెలలుగా రఘునాథపురంలో నేత కార్మికులు తయారు చేసే వస్త్రాలకు పూర్తిగా గిరాకీ తగ్గింది. దీంతో వృత్తిపై ఆధారపడ్డ వందలాది మంది నేతన్నలు ఉపాధి కోల్పోతున్నారు. ఉత్పత్తికి ఆర్డర్లు లేక జీవనం దుర్భరంగా మారింది. రఘునాథపురంలో పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేసే దాబీ లుంగీలు, పట్కాలు, స్టేబల్ లుంగీలు, అక్రాలిక్‌లు, టైఅండ్ డై వస్త్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు అరబ్, ఉగాండా దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. ఈ గ్రామంలో సుమారు 1000కి పైగా మరమగ్గాలు ఉండగా.. వాటిలో 80 శాతం మగ్గాలపై అరబ్ దేశాలకు ఎగుమతి చేసే వస్త్రాలనే నేస్తున్నారు.

ఎగుమతి నిలిచి..

ఇక్కడ తయారయ్యే పట్కాలు, లుంగీలను ఉపయోగించే దేశాల్లో మాత్రం వాటికి మంచి డిమాండ్ ఉంటుందని వస్త్ర ఉత్పత్తిదారులు తెలిపారు. కాటన్ డ్రెస్ మెటీరియల్, విండో, డోర్ కర్టెన్స్, బెడ్‌షీట్స్ వంటివి పూర్తిగా ఇతర దేశాలు, అరబ్ దేశాలకు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతుంటాయి. యుద్ధం వల్ల వీటి ఎగుమతి పూర్తిగా నిలిచిపోయిందని కొందరు పవర్‌లూమ్ కార్మికులు తెలిపారు.

హౌతీ తీవ్రవాదుల బెడద..

ఇక్కడ తయారయ్యే వస్త్రాలను ముంబై సేట్లకు పంపిస్తారు. ముంబై నుంచి నౌకలలో ఎర్ర సముద్రం ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఇజ్రాయెల్ - పాలస్తీనా యుద్ధం నేపథ్యంలో హౌతీ తీవ్రవాదులు ఎర్ర సముద్రంలో ప్రయాణించే నౌకలపై బాంబు దాడులు చేస్తున్నారు. దీంతో నౌకల ద్వారా వస్త్రాల ఎగుమతి నిలిచిపోయింది. ముంబై వ్యాపారులు రిస్క్ భరించి తమ దేశాలకు వస్త్రాలను ఎగుమతి చేయాలని దుబాయ్, ఆఫ్రికా దేశాల వ్యాపారులు కోరుతున్నారు. కానీ తీవ్రవాదుల దాడుల రిస్క్‌ను విదేశీ వ్యాపారులే భరించాలని ముంబై వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. ఇరువర్గాల మధ్య అంగీకారం కుదరక ఎగుమతులు నిలిచిపోయాయి.

గుట్టలుగా వస్త్ర నిల్వలు

ప్రస్తుత యుద్ధంతో రఘునాథపురంలో తయారయ్యే వస్త్రాలకు డిమాండ్ తగ్గి.. ఎగుమతులు పడిపోవడంతో వాటిని తయారు చేసే కార్మికులు నిరుద్యోగులయ్యారు. దీంతోపాటు అంతకుముందు తెచ్చుకున్న ఆర్డర్ల మేరకు.. తయారు చేసిన వస్త్రాలు సైతం ఎగుమతి కాక తయారీదారుల ఇళ్లలో గుట్టలుగా పేరుకుపోయాయి.

యుద్ధం ఆగితేనే మనుగడ



పశ్చిమాసియా, రష్యా యుద్ధం ఆగితేనే వస్త్ర పరిశ్రమకు మనుగడ ఉంటుంది. యుద్ధం వల్ల 9 నెలలుగా ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో గ్రామంలో కార్మికులకు పనిలేకుండా పోయింది. ఎగుమతులు లేక విదేశీ మారక ద్రవ్యం నిలిచిపోయింది. ఇది దేశానికి కూడా నష్టం. మా గ్రామంతో పాటు పొరుగున ఉన్న సాదువెల్లి, గౌరాయపల్లి గ్రామాల్లో వందలాది మంది వృత్తిపై ఆధారపడ్డ వారికి ఉపాధి లేకుండా పోయింది.

– కటుకం వెంకటేశం, మాస్టర్ వీవర్, రఘునాథపురం

ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్‌లకు నివాళి

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహనీయుల చిత్రపటాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, పార్టీ నేతలు నివాళులర్పించారు.

విద్యాశాఖ కళా ఉత్సవాలు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థాయి కళా ఉత్సవాలను పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత అంశాలను వెలికితీయాలంటే ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. పాఠశాలల్లో చదువుతోపాటు సాహిత్య కళాకారులకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీడీ జేడీ రాజీవ్, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వెంకటస్వామి, పలు జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు, గైడ్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన 174 మంది విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి వచ్చిన వారు జాతీయస్థాయి కళా ఉత్సవాల్లో పాల్గొంటారు.

ఆస్ట్రేలియా సీపీఏ సదస్సుకు శాసనసభ, మండలి బృందం

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగే 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు తెలంగాణ శాసనసభ, శాసనమండలి బృందం శనివారం అధికారిక విదేశీ పర్యటనకు వెళ్తోంది. ఇందులో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేచర్ సెక్రటరీ వి.నరసింహాచార్యులు ఉన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ బృందం సిడ్నీకి బయల్దేరనుంది. సీపీఏ సదస్సు అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో వీరు పర్యటిస్తారు. అనంతరం నవంబర్ 16న పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు రానున్నారు.

ఉచిత మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

పాడి రైతులకు పశుసంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులకు అన్ని రకాల సాయమందిస్తోందని పశుసంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ పేర్కొన్నారు. పాడి రైతులు పాల ఉత్పత్తిలో గణనీయ పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పశువులకు నిర్వహిస్తున్న ఉచిత మెడికల్ క్యాంపుల బ్రోచర్‌ను శుక్రవారం ఆయన సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఘోష్ మాట్లాడుతూ...రాష్ట్రీయ గోకుల్‌మిషన్ సహకారంతో గేదెల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,100 ఉచిత గర్భధారణ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపుల ద్వారా దీర్ఘకాలికంగా గర్భానికి నోచుకోని గేదెలను గుర్తించి వాటికి చికిత్స అందిస్తారని, కృత్రిమ గర్భధారణ చేస్తారని, కంటిపరీక్షలతో పాటు దూడలకు పోషక, విటమిన్ ఇంజెక్షన్లు, పాల ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన మినరల్స్ అందిస్తారని తెలిపారు. దీనికితోడు మరో 300 ఎంపిక చేసిన గ్రామాల్లో కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడల ప్రదర్శన, పాలు పితికే పోటీలు నిర్వహిస్తామని, పాడి రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ డైరెక్టర్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.




థాంక్యూ సీఎం సర్

డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ.. ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సంక్షేమ హాస్టళ్ల విద్యార్థినులు

కాలేజీల్లో జేఈఈ హడావుడి

- ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో మొదలైన సన్నాహాలు
- ఇప్పటికే ఇంటర్ సిలబస్ పూర్తి.. జేఈఈ కోసం ఏర్పాట్లు
- తొలి సెషన్ కోసం ప్రత్యేక క్లాసులు.. గ్రాండ్ టెస్టులు
- ప్రభుత్వ కాలేజీల్లో మాత్రం మొదలవ్వని కసరత్తు



సాక్షి, హైదరాబాద్: ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జేఈఈ తేదీలను ప్రకటించడంతో జూనియర్ కాలేజీల్లో జేఈఈ హడావుడి మొదలైంది. జేఈఈ మొదటి సెషన్ పరీక్షలు జనవరి 22 నుంచి 31వ తేదీ వరకూ ఉంటాయి. ఈ విడత కోసం ఎక్కువగా ప్రైవేటు కాలేజీల విద్యార్థులు సన్నద్ధమవుతుంటారు. కాగా ఆయా కాలేజీల్లో ఇప్పటికే ఇంటర్మీడియెట్ సిలబస్ పూర్తయింది. రివిజన్ కూడా చేపట్టారు. దీంతో జేఈఈ ప్రిపరేషన్ దిశగా బోధనా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు, ప్రతివారం గ్రాండ్ టెస్టులు ఉంటాయని కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు చెబుతున్నాయి. తొలి విడతను చాలామంది సెమీ ఫైనల్స్‌గా తీసుకుంటారు. ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకూ జరిగే ఫైనల్ మెయిన్స్ పరీక్షనే లక్ష్యంగా పెట్టుకుంటారు. తొలి విడత పరీక్షకు హాజరైనా, మంచి స్కోర్ కోసం ఏప్రిల్‌లోనూ రాస్తారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులు సాధారణంగా రెండో విడత జేఈఈపైనే ఆశలు పెట్టుకుంటారు. ఈ కాలేజీల్లో ఇప్పటికీ ఇంటర్ సిలబస్ సగం కూడా పూర్తవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు. మొత్తం మీద తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతి ఏటా జేఈఈకి 2 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో హైదరాబాద్ కేంద్రంగానే 1.25 లక్షలకు పైగా ఉంటున్నారు.

జేఈఈకి ఈసారి డిమాండ్ పెరిగేనా?

కోవిడ్ తర్వాత జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల వైపు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. జేఈఈ మెయిన్స్ రాసేవారి సంఖ్య ప్రతి సంవత్సరం తగ్గుతోంది. మరోవైపు రాష్ట్ర ఎంసెట్‌కు దరఖాస్తులు పెరుగుతున్నాయి. 2014లో దేశంలో జేఈఈ మెయిన్స్ రాసినవారి సంఖ్య 12.90 లక్షలుంటే, 2022లో ఈ సంఖ్య 9.05 లక్షలకు తగ్గింది. 2023లో మాత్రం 11 లక్షలకు పెరిగింది. కోవిడ్ సమయంలో టెస్ట్ పరీక్షలు లేకుండా ఉత్తీర్ణులైన వారి సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా దీనికి కారణంగా చెబుతున్నారు. మన రాష్ట్రం నుంచి 2014లో జేఈఈ రాసిన వారి సంఖ్య 2 లక్షల వరకూ ఉంటే, కోవిడ్ తర్వాత ఏకంగా 1.30 లక్షలకు పడిపోయింది. అయితే గత సంవత్సరం కాస్త పుంజుకుంది. కాగా రాష్ట్ర ఎంసెట్ రాసేవారి సంఖ్య 2018లో 1.47 లక్షలుంటే, 2022లో ఇది 1.61 లక్షలకు పెరిగింది. రాష్ట్ర ఎంసెట్ ద్వారా విద్యార్థులు రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పొందుతారు. జేఈఈ మెయిన్స్ ద్వారా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో, అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో సీట్లు దక్కించుకుంటారు. గత రెండేళ్ళుగా రాష్ట్రంలో హాస్టళ్ళు తెరుచుకోవడం, జేఈఈపై దృష్టి పెడుతున్న వారి సంఖ్య పెరగడంతో ఈ సంవత్సరం కూడా జేఈఈ రాసే వారి సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌కు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఇలా....

సంవత్సరం	దరఖాస్తులు	పరీక్షకు హాజరైనవారు
2014	13,57,002	12,90,028
2015	13,56,765	12,03,453
2016	12,34,760	12,07,058
2017	11,86,454	11,22,351
2018	11,35,084	10,74,319
2019	12,37,892	11,47,125
2020	11,74,939	10,23,435
2021	10,48,012	9,39,008
2022	10,26,799	9,05,590
2023	11,62,398	11,13,325
2024	12,21,624	9,24,636

ఇప్పట్నుంచే సన్నద్ధత అవసరం

మారుతున్న జేఈఈ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఇప్పట్నుంచే ప్రిపరేషన్ చేసుకోవాలి. తొలిదశలో వచ్చే ర్యాంకును బేరీజు వేసుకుని మలిదశ జేఈఈకి సన్నద్ధం కావొచ్చు. దీనివల్ల లోపాలు ఎక్కడనేది విద్యార్థి గుర్తించే వీలుంది.

– ఎంఎన్ రావు (గణిత శాస్త్ర అధ్యాపకులు)

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం

ఆటోడ్రైవర్లతో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయానికి శుక్రవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఆటో డ్రైవర్లతో మాట్లాడి ఆర్థిక స్థితిగతులు, రోజువారీ సంపాదన, అందుతున్న సంక్షేమ పథకాలు, పిల్లల చదువులపై ఆరా తీశారు. అవకాశమున్న ఆటో అడ్డాల వద్ద కార్పొరేషన్ ద్వారా టాయిలెట్ల నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గుర్తింపు కార్డుల జారీ, రూ.5 లక్షల బీమా, అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఒక కాలు లేని ఆటో డ్రైవర్ కొల్లు శ్రీనివాసరెడ్డితో మాట్లాడి తేలికగా ఉండే కృత్రిమ కాలు అమర్చుకోవాలని ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఆ తర్వాత ఆటో గేర్లు వేయడం, నడిపే విధానాన్ని డ్రైవర్లతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.


ఆటో సీట్లో కూర్చొని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

క్లుప్తంగా...

ఆంధ్రప్రదేశ్‌కి అవతరణ దినం కనుమరుగు

- ఆరుకోట్ల ఆంధ్రులను ముఖ్యమంత్రి అవమానించారు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కేరోజా

నగరి: ఆంధ్రప్రదేశ్‌కి అవతరణ దినం కనుమరుగైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఆమె ఈ మేరకు స్పందించారు. రాష్ట్రానికి పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలు అవతరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటుందని అయితే ఆంధ్రప్రదేశ్‌కు అవతరణ దినం కనుమరుగైందన్నారు. నవంబర్ 1న నిర్వహించే అవతరణ దినోత్సవాన్ని నిర్వహించకుండా ఆరుకోట్ల ఆంధ్రులను, ఆంధ్ర రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అవమానించారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అవతరణ దినోత్సవం నిర్వహించక పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగాన్ని అవహేళన చేశారన్నారు. ''ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించరా? ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా? మీరసలు పాలకులేనా? ఆంధ్రప్రదేశ్ ఎప్పుడు అవతరించిందని అడిగితే.. భావితరాలకు ఏం సమాధానం చెప్తారు'' అంటూ ఆమె ప్రశ్నించారు. ఇంతటి దారుణం రాష్ట్రంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఇలా చేసినందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తణుకులో వ్యక్తి దారుణ హత్య



హత్యాస్థలాన్ని పరిశీలిస్తున్న తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్

తణుకు: పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానిక సజ్జాపురంలో నివాసం ఉంటున్న కాకర్ల దుర్గారావు (35)ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఈ ఘటన జరిగింది. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గత మూడు రోజులుగా బాణసంచా విక్రయాలు జరిగాయి. గురువారం రాత్రి వరకు బాణసంచా విక్రయాలు జరిగిన అనంతరం ఈ ఘటన జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు దుర్గారావును చెట్టుకు కట్టేసి కొట్టినట్టు తెలుస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున స్కూలు ఆవరణలో మృతదేహం ఉందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు రాబట్టారు. క్లూస్ టీం సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య అలివేలు మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఎస్.కొండయ్య పర్యవేక్షణలో ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీ తీసుకుంటూ లోయలో పడి బాలుడి దుర్మరణం

కడప అర్బన్: సెల్ఫీ తీసుకుంటూ లోయలో పడి వీర వెంకటసాయి మనోజ్ (14) అనే బాలుడు మృత్యువాత పడ్డాడు. దీపావళి పండుగ రోజున కడపలోని మృత్యుంజయకుంటకు చెందిన మనోజ్, తన స్నేహితులతో కలిసి నగర శివార్లలోని పాలకొండలకు వెళ్లి సరదాగా ఈత కొట్టాడు. కొండపై నుంచి 60 అడుగుల కంటే ఎక్కువ లోతున్న లోయలో నీళ్లు పడుతున్నాయి. అక్కడ సెల్ఫీ తీసుకుంటున్న మనోజ్ కాలుజారి లోయలో పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న రిమ్స్ పీఎస్ ఎస్ఐ జయరాములు, కడప ఫైర్ స్టేషన్ అధికారి బసివిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. నీటి కుంటలో చిక్కుకుపోయిన మనోజ్‌ను బయటకు తీశారు. అప్పటికే మనోజ్ మరణించాడు. మనోజ్ కో–ఆపరేటివ్ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాములు తెలియజేశారు.

మద్యం షాపు వద్దని ఆందోళన



రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని వెల్ల గ్రామం శివారు వెల్లసావరం గ్రామానికి వెళ్లే రహదారి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును దూరంగా తరలించాలని శుక్రవారం టీడీపీ, జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో మహిళలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు, గ్రామస్తులు ధర్నా చేశారు. వెల్ల, వెల్లసావరం, గొల్లలచెరువు, అరుంధతి పేట, కందులపాలెం, ఆదివారపుపేట తదితర గ్రామాల నుంచి విద్యార్థినులు ఇదే రహదారిలో వెల్ల జెడ్పీ హైస్కూల్, రామచంద్రపురంలోని వివిధ కళాశాలలకు వెళుతుంటారు.

ఓటీటీకి జై

భారీగా పెరుగుతున్న ఓటీటీ వీక్షకుల సంఖ్య

వినోదం అంటే దాదాపు అందరికీ ఫస్ట్ ఛాయిస్ సినిమానే! ఇతర ఎంటర్‌టైన్‌మెంట్‌లు ఎన్ని ఉన్నా ఇప్పటికీ సినిమా క్రేజ్ తగ్గలేదు. ఇంకా చెప్పాలంటే సినిమాలు చూసేవారి సంఖ్య పెరుగుతోంది. అయితే చూసే విధానం మారుతోంది. థియేటర్లకు వెళ్లే వారి సంఖ్య తగ్గుతూ ఓటీటీల్లో వీక్షించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇంటర్నెట్ యుగంలో ఓటీటీ ప్లాట్‌ఫాంలు దూసుకురావడంతో ఎంటర్‌టైన్‌మెంట్ తీరు పూర్తిగా మారిపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక సినిమాకు ఒక ఫ్యామిలీ వెళ్తే అయ్యే ఖర్చుతో రెండు ఓటీటీ యాప్‌లలో ఏడాది పాటు సినిమాలు చూడొచ్చు. వీడియో, ఆడియో థియేటర్ క్వాలిటీతో ఓటీటీ స్ట్రీమింగ్ అవుతుండటం, తక్కువ ఖర్చుతో ఎక్కువ 'ఎంటర్‌టైన్‌మెంట్' ఇంట్లోనే ఆస్వాదించే అవకాశం ఉండటంతో అధికశాతం మంది ఓటీటీకి జై కొడుతున్నారు.

– సాక్షిప్రతినిధి, కర్నూలు




- మల్టీప్లెక్స్‌లు పెరగడంతో థియేటర్‌కు దూరమైన మధ్యతరగతి ప్రజలు
- ఒక సినిమాకు అయ్యే ఖర్చుతో ఏడాది పాటు రెండు ఓటీటీ స్ట్రీమింగ్‌లు
- 2023తో పోల్చితే 21 శాతం పెరిగిన ఓటీటీ సబ్‌స్క్రైబర్స్
- ఓటీటీల ద్వారా స్మార్ట్‌ఫోన్, టీవీల్లో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూస్తున్న వైనం
- క్యూ ఎల్ఈడీ, ఫోర్‌కే వంటి క్వాలిటీ టీవీల రాకతో థియేటర్ ఎక్స్‌పీరియన్స్

వెండితెర!... సినిమా స్క్రీన్‌కు సినీ ప్రియులు పెట్టిన పేరు! 50 ఏళ్ల కిందట వినోదం అంటే డ్రామాలు, సినిమాలు! అభిమాన హీరో సినిమా వస్తోందంటే చెప్పలేని హడావుడి. అయితే ప్రస్తుతం ప్రేక్షకుడి తీరు మారింది. థియేటర్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీనికి ప్రధాన కారణం ఖర్చు పెరగడమే! మల్టీప్లెక్స్‌ల రాకతో వెండితెర సగటు ప్రేక్షకుడికి అందనంత దూరం వెళ్లింది. భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబం సినిమాకు వెళ్లాలంటే రిక్లైనర్ సీట్లకు రూ.295 చొప్పున రూ.1180. ట్యాక్స్‌లతో కలిపి రూ.1312.16 అవుతుంది. అదే కొత్త సినిమా అయితే ఒక్కో టిక్కెట్ రూ.400పైమాటే! దీనికి బ్రేక్ టైంలో స్నాక్స్ ఖర్చు అదనం. సామాన్య ప్రజలు ఇంత డబ్బు ఖర్చు చేయాలంటే కష్టమే! దీంతో సినిమా కూడా సామాన్యులకు అందకుండా ఖరీదైన వినోదం అయిపోయింది. అయితే అదే సమయంలో సినిమా చూసే వారి సంఖ్య పెరుగుతోంది. ఇదేంటి అనుకుంటున్నారా...అవును ఓటీటీ స్ట్రీమింగ్! ఓటీటీల ఎంట్రీతో 'ఎంటర్‌టైన్‌మెంట్' 'షో' పూర్తిగా మారిపోయింది.

ఎప్పుడు వీలైతే, అప్పుడు 'సినిమా'!..

వీడియో, ఆడియో క్వాలిటీని ఎంజాయ్ చేయాలంటే థియేటర్‌లోనే సినిమా చూడాలనుకునేవాళ్లం. ఇప్పుడు 4కే, క్యూ ఎల్ఈడీ లాంటి టీవీలు వచ్చాయి. అందులోనూ 65, 75 ఇంచుల్లో పెద్ద టీవీలూ ఉన్నాయి. కొన్ని థియేటర్ల కంటే ఈ టీవీల్లో ఆడియో, వీడియో క్వాలిటీ బాగుంటోంది. దీంతో ఇంట్లో కూడా 'థియేటర్ ఎక్స్‌పీరియన్స్' వస్తోంది. పైగా ఇప్పుడు 'హోం థియేటర్ కల్చర్' పెరిగింది. కొత్తగా నిర్మించే ఇళ్లలో చాలామంది 'హోంథియేటర్' నిర్మిస్తున్నారు. థియేటర్‌కు వెళ్లాలంటే నిర్దేశిత సమయం కేటాయించాలి. ఉద్యోగస్తులు, వ్యాపారులకు సినిమాపై కోరిక ఉన్నా వీలుండదు. వీరంతా ఓటీటీ కేటగిరీలో ఉన్నారు. కొందరు ఒకే సినిమాను రోజూ కొద్ది కొద్దిగా 2–3 రోజుల్లో చూస్తున్నారు. ఇలా ఓటీటీ ప్లాట్‌ఫాం అన్ని రకాలుగా అనుకూలంగా ఉంది.





ఎంటర్‌టైన్ మెంట్‌ను మార్చేసిన కోవిడ్

కోవిడ్ సమయంలో థియేటర్‌కు వెళ్లడం తగ్గింది. ఒకదశలో 'సినిమా' మనుగడ కష్టమే! అనే చర్చ నడిచింది. ఈ విపత్తు నుంచి పుట్టుకొచ్చిందే ఓటీటీ ప్లాట్‌ఫాం! అంతకు ముందు కూడా ఉన్నా, కోవిడ్ నుంచి ఓటీటీ సంఖ్య, స్ట్రీమింగ్ పెరిగాయి. అమెజాన్‌ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్, ఆహా, సన్‌నెక్ట్స్, జీ5, సోనీలివ్‌తో పాటు దేశవ్యాప్తంగా 46 ఓటీటీ ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. వీటి స్ట్రీమింగ్ ఖర్చు కూడా చాలా తక్కువ. అమెజాన్ ప్రైమ్ ఏడాది స్ట్రీమింగ్ రూ.1499. ఆహా గోల్డ్ ఏడాది సబ్‌స్క్రిప్షన్ రూ.699. రెండు కలిపినా రూ.2,198! ఒక ఫ్యామిలీ, ఒక సినిమాకు వెళ్లే ఖర్చుకంటే తక్కువ! దాదాపు అన్ని ఓటీటీ ఏడాది సబ్‌స్క్రిప్షన్ రేట్లు కూడా రూ,.1500లోపే ఉన్నాయి. దీంతో ప్రజలు థియేటర్‌కు వెళ్లడం తగ్గించి, 'టీవీ రిమోట్' చేతిలో పట్టుకుంటున్నారు. ఒక సర్వే ప్రకారం, సినిమాను థియేటర్‌లో చూసేవారి సంఖ్య కంటే, ఆ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన తర్వాత చూసేవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. దీనికి తోడు పెద్ద హీరోలు కూడా రియాల్టీ షోల్లో నటించి, వాటిని ఓటీటీల్లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. చివరకు క్రికెట్‌తో పాటు ఇతర స్పోర్ట్స్ కూడా ఓటీటీల్లో లైవ్ ఇస్తున్నారు. దీన్నిబట్టే ఓటీటీ ఏస్థాయికి వెళ్లిందో తెలుస్తోంది. 2022తో పోల్చితే 2023లో 13.8శాతం ఓటీటీ సబ్‌స్క్రైబర్స్ పెరిగితే, 2024లో ఇప్పటివరకూ 21 శాతం పెరిగారు.



5జీతో పెరిగిన ఇంటర్నెట్ వేగం!

5 జీ రాకతో ఇంటర్నెట్ వేగం కూడా పెరిగింది. పైగా రూ.351కే 40ఎంబీపీఎస్ స్పీడ్‌తో అన్‌లిమిటెడ్ ఇంటర్నెట్ అందుతోంది. ఓటీటీల విస్తృతికి ప్రధాన కారణం ఇంటర్నెట్ వినియోగమే! టీనేజర్ల నుంచి పెద్దల దాకా దాదాపు అందరూ 'స్మార్ట్ ఫోన్' యూజర్లే! వీరంతా ఇంటర్నెట్ యూజర్లు కూడా! దీంతో మొబైల్‌లో ఓటీటీ యాప్‌ల ద్వారా వినోదం చూస్తున్నారు. ఓటీటీలపై అవగాహన ఉన్న వారంతా రెండు ఓటీటీయాప్‌లకు తక్కువ లేకుండా చూస్తున్నారు. కేబుల్‌రంగంలో ఇంటర్నెట్ హవా పెరిగింది. ఎక్కువగా వైఫై ద్వారానే కేబుల్ ప్రసారాలు చేస్తున్నారు.

వెబ్‌సిరిస్‌లపై ఆసక్తి!..

ప్రస్తుతం సినిమాకు ధీటుగా 'వెబ్‌సిరీస్' లు వచ్చాయి. పెద్ద దర్శకులు, పేరున్న నటులు వెబ్‌సిరీస్‌లలో నటిస్తున్నారు. పైగా సినిమా 2.30గంటలు చూడాలి. వెబ్‌సిరీస్ 40 నుంచి 60 నిమిషాలే. పైగా ఇవి ఓటీటీ రిలీజ్‌లు. దీంతో ఎక్కువమంది వెబ్‌సిరీస్‌లపై ఆసక్తి చూపిస్తున్నారు. ఓటీటీలో సినిమాలు చూసేవారి సంఖ్య 82.5శాతం ఉంటే, వెబ్‌సిరీస్‌లు చూసేవారి సంఖ్య 68.7శాతం ఉంది. అంటే వెబ్‌సిరిస్ కంటే సినిమాలు చూసే వారి సంఖ్య కేవలం 13.8 శాతం మాత్రమే అధికం! 2022లో హిందీలో 72, తెలుగులో 56 వెబ్‌సిరీస్‌లు విడుదలయ్యాయి. ఈ సంఖ్య ఈ ఏడాది 3 నుంచి 5 రెట్లు పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకుల అంచనా. ఓటీటీల రాకతో పైరసీలకు చెక్‌పడింది.

చంద్రబాబు అసమర్థ పాలకుడు

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం పట్టని అసమర్థ పాలకుడని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. 45 ఏళ్ల ఆయన రాజకీయ అనుభవం రాష్ట్ర ప్రజలను దగా చేయడానికి మాత్రమే ఉపయోగపడిందని మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీపావళి పండుగను ప్రజలు అసంతృప్తిగా నిర్వహించుకోవడం బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా.. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం చంద్రబాబుకు ప్రజలపై ఉన్న అలసత్వానికి అద్దంపడుతోందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం గత వరదల సమయంలో విజయవాడలోని ప్రజలను రక్షించే విషయంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అక్కడి ప్రజలకు వరదల సమయంలో అందించిన కొవ్వొత్తులకు, అగ్గిపెట్టెలకు కోట్ల రూపాయల ఖర్చును చూపడం కూటమి ప్రభుత్వం అవినీతికి తార్కాణమని మండిపడ్డారు. దాతలు అందించిన విరాళాలు సీఎంఆర్ఎఫ్ ఖాతాకు చేరాలని, అలా కాకుండా నేరుగా అందిన సొమ్ములకు లెక్క చెప్పకుండా వేల కోట్లు ఖర్చుపెట్టామని చెప్పడం దోపిడీతనానికి అద్దం పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అసమర్థ పాలన అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులకు నష్టం చేకూర్చిందని విషయం స్పష్టంగా తెలుస్తోందని కొట్టు సత్యనారాయణ అన్నారు. నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని చెప్పారు. బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించి జగన్ ప్రభుత్వంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు పక్క రాష్ట్రాలకన్నా ఎక్కువగా ఉన్నాయని ఊకదంపుడు ప్రచారం చేసి తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని చెప్పిన కూటమి నేతలు.. ఇప్పుడు వాటి ధరలు తగ్గించే చర్యలు తీసుకోవడం లేదని గుర్తుచేశారు.

అంగన్‌వాడీ టీచర్‌పై వేధింపులు

- ఉద్యోగానికి రాజీనామా చేయకుంటే అక్రమ కేసులు పెడతామంటూ బెదిరింపులు
- టీడీపీ నాయకులు, ఐసీడీఎస్ అధికారుల బెదిరింపులతో రాజీనామా

నరసరావుపేట రూరల్: అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తావా.. నీ భర్తను కేసులు పెట్టి జైలుకు పంపమంటావా? అంటూ టీడీపీ నాయకులు, ఐసీడీఎస్ అధికారులు బెదిరిస్తుండటంతో ఓ అంగన్‌వాడీ కార్యకర్త తన ఉద్యోగానికి రాజీనామా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పల్నాడు జిల్లా రావిపాడు పంచాయతీ పరిధిలోని బాలయ్యనగర్‌కు చెందిన మల్లెం ధనలక్ష్మి 13 సంవత్సరాలుగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ ధనలక్ష్మిపై స్థానిక టీడీపీ నాయకుడు కండ్లకుంట సీతయ్య ఒత్తిడి తీసుకువచ్చాడు. దీనికి ధనలక్ష్మి అంగీకరించకపోవడంతో ఐసీడీఎస్ అధికారులతో కలిసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆగస్టు 14న సీడీపీవో ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ పార్వతి ఐసీడీఎస్ కార్యాలయానికి పిలిపించి కనీసం తాగునీరు ఇవ్వకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్బంధించారు. 13 సంవత్సరాల రికార్డులను కార్యాలయానికి తరలించారు. ఉద్యోగానికి రాజీనామా చేయకపోతే నీ భర్త సుభాష్‌పై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని, నీవు ఉద్యోగంలో అక్రమాలకు పాల్పడినట్టు నిరూపించి రికవరి చేస్తామని బెదిరింపులకు దిగారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్త సుభాష్‌కు విషయం తెలియజేయకుండా గత్యంతర లేని పరిస్థితుల్లో ధనలక్ష్మి ఉద్యోగానికి రాజీనామా చేసింది. నవంబర్ 21 నుంచి ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు రెండు పత్రాలపై ధనలక్ష్మి చేత సంతకాలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న సుభాష్ దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా సీతయ్య తన అనుచరులతో అక్కడికి చేరుకుని మరోసారి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును ఆశ్రయించింది. తనను బెదిరించి, కార్యాలయంలో నిర్బంధించిన టీడీపీ నాయకుడు కండ్లకుంట సీతయ్య, సూపర్‌వైజర్ పార్వతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బెదిరించి రాయించుకున్న రాజీనామాను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'కూటమి' వచ్చాక ఉక్కుకు మరిన్ని కష్టాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సీతంపేట(విశాఖ): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మరింత ముప్పు వాటిల్లుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వామపక్ష పార్టీలు, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారని, అధికారంలోకి వచ్చాక కేంద్రం చెప్పినట్టు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం కార్మికులకు మాత్రమే పరిమితం కాకూడదని, దీనిని ప్రజా పోరాటంగా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంపై ఈ నెల 7వ తేదీన విజయవాడలో వామపక్ష పార్టీల సమావేశం జరుగుతుందని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకువెళ్లడంపై చర్చిస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం ముడిసరుకుతో పాటు అవసరమైన అన్ని వనరులు సమకూర్చడానికి సిద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో చొరవ చూపకపోవడం దురదృష్టకరమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబు చరిత్ర హీనుడుగా మిగిలిపోతారన్నారు.

వివాహిత దారుణ హత్య

- ప్రియుడే అంతమొందించాడనే అనుమానాలు
- సత్యసాయి జిల్లా కొండకమర్లలో ఘటన

ఓడీ చెరువు: శ్రీసత్యసాయి జిల్లా ఓడీచెరువు మండలం కొండకమర్లలో గురువారం అర్ధరాత్రి వివాహిత హత్యకు గురైంది. అనుమానంతో ప్రియుడే ఆమెను అంతమొందించినట్లు తెలుస్తోంది. ఓడీ చెరువు పోలీసులు తెలిపిన మేరకు.. కొండకమర్లకు చెందిన గొర్ల అల్లాబకష్‌కు నలుగురు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె మెహతాజ్(32)ను 14 ఏళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన షేక్ బాబ్జాన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. గురువారం సాయంత్రం మెహతాజ్ పిల్లలతో కలిసి పుట్టినింటికి వచ్చింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి బయట శబ్దం రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారు మేల్కొని బయటకు వచ్చారు. ఇంటి వెనుక భాగంలో కొండకమర్లకే చెందిన షేక్ ఇర్ఫాన్ బాషా గోడ దూకి పారిపోవడాన్ని గమనించారు. అక్కడికి వెళ్లి చూడగా మెహతాజ్ మృతదేహం కన్పించింది. మెహతాజ్‌ను ఇర్ఫాన్‌బాషా చంపి ఆమె మృతదేహాన్ని మెట్లపై నుంచి కిందకు పడేసినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. మెహతాజ్‌తో షేక్ ఇర్ఫాన్ బాషా చాలా ఏళ్లుగా వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని, ఇటీవలి కాలంలో ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటోందన్న అనుమానంతో ప్రియుడే గొంతు నులిపి హత్య చేశాడనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇర్ఫాన్ బాషా శుక్రవారం ఓడీ చెరువు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ లైన్ టీబీసీ వరకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 63,987 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,902 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.66 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

శాస్త్రోక్తంగా కేదారగౌరీ వ్రతం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా కేదారగౌరీ వ్రతం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కలశ స్థాపన చేసి వ్రతం ఆచరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి సాంగ్యం సమర్పించి నోములు నోచుకున్నారు. నోము దారాలు స్వీకరించారు. కాగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆగమోక్తంగా ఆకాశదీపం వెలిగించారు.

భక్తులతో పోటెత్తిన కాణిపాకం



కాణిపాకం: దీపావళి పండుగ నేపథ్యంలో కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్యూలైన్లు నిండిపోయాయి. వారికి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకుని స్వామి వారి దర్శనం కల్పించారు. అలాగే వాహన పూజ మండపం వద్ద ఆయుధ పూజ కోసం ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో క్యూకట్టాయి.

వేడుకగా దీపావళి ఆస్థానం



తిరుపతి కల్చరల్: తిరుపతి పట్టణంలో ఉన్న టీటీడీ పరిధిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీకోదండరామస్వామి ఆలయంలో గురువారం దీపావళి సందర్భంగా శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించారు. ఈమేరకు శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలోని శ్రీపుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి సాయంత్రం నూతన వస్త్రాలు, దీపాలు తీసుకొచ్చి బాలాలయంలోని స్వామివారికి సమర్పించారు. అనంతరం దీపావళి ఆస్థానం వేడుకగా చేపట్టారు. అలాగే శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో గురువారం రాత్రి దీపావళి ఆస్థానం ఘనంగా నిర్వహించారు.

తిరుచ్చిపై దేవదేవేరి అభయం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేకసేవ అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు కనుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ సమీపంలోని అలంకార మండపంలో తిరుచ్చిపై ఆశీనులైన శ్రీవారి పట్టపురాణి, నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

రేపు దుర్గమ్మకు గాజుల అలంకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): యమ ద్వితీయ, భగిని హస్త భోజనంను పురస్కరించుకుని 3వ తేదీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గాజులతో విశేషంగా అలంకరించనున్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారికి 2.50 లక్షల గాజులను అలంకరణ నిమిత్తం వినియోగిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ, ఖడ్గమాలార్చన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. అమ్మవారి మూలవిరాట్, ఉత్సవ మూర్తిని గాజులతో అలంకరించేందుకు అవసరమైన గాజుల దండలను మహా మండపం ఆరో అంతస్తులో సిద్ధం చేస్తున్నారు.

చిరుత దాడిలో దూడ మృతి

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలంలో ఘటన

నిమ్మనపల్లె : చిరుత దాడిలో దూడ మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలంలో గురువారం చోటుచేసుకుంది. ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన రైతు ఆకుల ఆదెన్న బోడికొండకు సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద పశువుల షెడ్ నిర్మించుకొని, పశువులను అక్కడే ఉంచి మేత వేసేవాడు. గురువారం ఉదయం పశువుల వద్ద పాలు పితికి, ఇంటికి తీసుకువచ్చి కాసేపటి తరువాత వ్యవసాయ పొలం వద్దకు తిరిగి వెళ్లాడు. అక్కడ షెడ్డులో కట్టి ఉంచిన దూడ కనిపించకపోవడంతో, చుట్టు ప్రక్కల వెతకగా రక్తపు మరకల జాడలు కనిపించాయి. సమీపంలోని బోడికొండ వద్ద రాళ్ల మధ్యలో మృతి చెంది పడి ఉన్న దూడను కనుగొన్నాడు. దూడ వెనుక భాగంలో కొంత మాంసాన్ని అడవి జంతువు పీక్కుతిని ఉండటాన్ని గమనించి చిరుత పులి దాడి చేసి ఉంటుందని భావించాడు. సమాచారం అందుకున్న వీఆర్వో, తవ్వళం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దీప సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో అటవీ శాఖ మదనపల్లె డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మదన్ మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి చిరుత పులి ఆనవాళ్లను గుర్తించారు. చిరుత పులి దాడితోనే దూడ మృతి చెందిందని నిర్ధారించారు.





● హాబీ






బర్డ్ వాచింగ్ చేస్తారా?


బర్డ్ వాచింగ్ అంటే ఏమిటి? పక్షులను చూడటం. పుట్టినప్పటి నుంచి చూస్తూనే ఉన్నాం కదా అంటారు. మన ఇంటి దగ్గర కనిపించే వాటిని చూడటం వేరు. పక్షులను పనిగట్టుకుని చూడటానికి వెళ్లడం వేరు. రకరకాల పక్షులను, వలస వచ్చే పక్షులను సీజన్‌ను బట్టి అవి తిరుగాడే అడవులకు, అభయారణ్యాలకు, నీటి ఒడ్డులకు వెళ్లి చూడాలి. ఇలా పక్షులను చూసేవారిని 'బర్డ్‌వాచర్స్' అంటారు. ఈ హాబీని 'బర్డింగ్' అని కూడా అంటారు. అయితే 'బర్డ్‌వాచర్స్' ఉన్నట్టే 'బర్డర్స్' కూడా ఉంటారు. మనకు తోచినప్పుడు వెళ్లి పక్షులను చూస్తే మనల్ని బర్డ్‌వాచర్స్ అంటారు. అలా కాక పక్షుల చరిత్ర, వాటిని గుర్తు పట్టే జ్ఞానం, అవి ఎప్పుడు ఎక్కడకు వలస వస్తాయి, వెళతాయి, అవి ఏం తింటాయి, ఎన్నాళ్లు జీవిస్తాయి... ఇవన్నీ తెలిసి ఆ జ్ఞానంతో వాటిని చూడటానికి వెళితే గనగ 'బర్డర్స్' అని పిలుస్తారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో చాలా బర్డ్‌వాచింగ్ తావులు ఉన్నాయి. తెలంగాణలో వికారాబాద్, నర్సాపూర్ ఫారెస్ట్, ఉస్మాన్ సాగర్ చెరువు.. లాంటి హాట్‌స్పాట్స్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొల్లేరు, కోరింగ, పులికాట్, నేలపట్టు ప్రాంతాలు ఉన్నాయి. బర్డ్‌వాచర్స్ క్లబ్‌లు ఉంటాయి వాటిలో చేరి అందరితో కలిసి వెళ్లాలి. ఒక్కరే వెళ్లకూడదు. ఇక ఇక్కడ కొలంబియా దేశంలోని 'కాలి' అనే నగర శివార్లలో ఉండే అడవుల్లో కొంతమంది బర్డ్‌వాచర్స్ విహరిస్తే వారికి కనిపించిన హమింగ్‌బర్డ్ విన్యాసాలు.




మెగా మ్యూజియం

మ్యూజియం అంటే కళాఖండాలు, పురాతన వస్తువులు ఉంటాయని తెలుసు. అయితే చిన్నపిల్లల కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మ్యూజియం గురించి మీకు తెలుసా?

అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో ఇండియానా పోలిస్ అనే ప్రాంతంలో 'The Children's Museum of Indianapolis' ఉంది. ప్రపంచంలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన అతి పెద్ద మ్యూజియం ఇది. 1925లో మేరీ స్టీవర్ట్ కారీ అనే ఆయన దీన్ని ప్రారంభించారు. మొదట చిన్నగా మొదలైన ఈ మ్యూజియం అనంతరం విస్తరిస్తూ 1976లో అతి పెద్ద మ్యూజియంగా మారింది. 4,72,900 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ మ్యూజియంలో ఐదు అంతస్తులున్నాయి. ఇక్కడ దాదాపు 1,30,000కు పైగా రకరకాల వస్తువులు, కళాఖండాలు ఉన్నాయి. ఏటా పది లక్షలమందికి పైగా ఈ మ్యూజియాన్ని సందర్శిస్తుంటారు. వారికి సేవలందించేందుకు నాలుగు వందల మంది ఉద్యోగులు, 1500 మంది వాలంటీర్లు ఉంటారు.




చిన్నారుల్లో సైన్స్ పట్ల, సామాజిక అంశాల పట్ల ఆసక్తి, అవగాహన పెంచడం ఈ మ్యూజియం ప్రధాన ఉద్దేశం. ఇందులో సైన్స్, చరిత్ర, జంతువులు, వైద్యం, సామాజిక, ఆర్థిక అంశాలను సూచించే అనేక వస్తువులున్నాయి. అవన్నీ పిల్లలకు చూపించడం ద్వారా వారిలో ఆ అంశాలపై అవగాహన పెంచుతారు. ఒక్కో ఫ్లోర్‌లో ఒక్కో అంశానికి సంబంధించిన వస్తువులు ఉంటాయి. డైనోసార్ల జీవితం, వాటి మరణం వంటి అంశాలను వివరించేందుకు ఇక్కడ ప్రత్యేక విభాగం ఉంది. అది చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

కేవలం వస్తువులు చూసి వెళ్లిపోయేలా కాకుండా ఈ మ్యూజియంలో పలు క్రీడా కోర్టులు ఏర్పాటు చేశారు. చిన్నారులు అక్కడికి వెళ్లి వారికి నచ్చిన ఆటలు ఆడుకోవచ్చు. మ్యూజియంలో 'లిల్లీ థియేటర్' కూడా ఉంది. అక్కడ చిన్నారుల కోసం ప్రత్యేకంగా నాటకాలు, షోలు ఏర్పాటు చేస్తుంటారు.

● మహనీయులు | లాల్ బహదూర్ శాస్త్రి

ఊరికే ఇచ్చే డబ్బు వద్దంటూ..
గంగానదిని ఈదాడు



పిల్లలూ! మీరెప్పుడూ అందరూ మెచ్చుకునే స్థితిలోనే ఉండాలి తప్ప ఎవరూ మీ మీద జాలి పడే స్థితిలో ఉండకూడదు. ఈ విషయం మీకు అర్థమవ్వాలంటే ఈ సంఘటన తెలుసుకోండి. అనగనగా ఓ పిల్లవాడు తన తోటివారితో కలిసి గంగానది అవతలి ఒడ్డున జరిగే జాతర చూసేందుకు వెళ్లాడు. అతనిది పేద కుటుంబం. తండ్రి మరణించడంతో బంధువుల వద్ద ఉంటూ తల్లి అతణ్ని పెంచుతోంది. పడవ ఖర్చుల కోసం ఆమె అతనికి కొంత డబ్బు ఇచ్చింది. దాన్ని అతను జాతరలో ఖర్చుపెట్టాడు. తిరిగి వచ్చేటప్పుడు పడవ ఎక్కేందుకు అతని వద్ద డబ్బు లేదు. మేమిస్తామని స్నేహితులు అతనికి చెప్పారు. కానీ ఆత్మగౌరవం కలిగిన అతను ఆ డబ్బు తీసుకోలేదు. స్నేహితులను పడవలో వెళ్లమని చెప్పి, తనొక్కడే నదిలో ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. చూశారా! ఎవరి వద్దా ఊరికే డబ్బు తీసుకోకూడదని అతనికెంత పట్టుదలో! ఆ పిల్లాడెవరో కాదు, మన దేశానికి రెండో ప్రధానిగా పనిచేసిన లాల్ బహదూర్ శాస్త్రి. 'జై జవాన్.. జై కిసాన్' అన్న నినాదం ఆయన ఇచ్చిందే. అయితే మీరు ఇలాంటి సాహసాలు చేయొద్దు. బాగా ఈత వచ్చిన వారే ఇలాంటివి చేయాలి. స్ఫూర్తిని గ్రహిస్తే చాలు.

● సినిమా చూద్దామా?

ఫ్యామిలీ ప్యాక్

ఇదో ఫ్రెంచి జుమాన్ జీ



మీకందరికీ 'జుమాన్ జీ' సినిమా గుర్తుందా. సినిమాలో ఓ కుటుంబం పాము నిచ్చెన ఆట ఆడతారు. ఆట ఆడిన ప్రతిసారి కుటుంబమంతా ఆ ఆటలో ఇరుక్కుంటూ చాలా సరదాగా వుంటుంది. ఈ మధ్యనే జుమాన్ జీకి రెండో భాగం కూడా రిలీజ్ అయి సూపర్ హిట్ అయింది. ఫ్రెంచ్ దర్శకుడైన ఫ్రంకాయిస్ ఉజాన్ తీసిన 'ఫ్యామిలీ ప్యాక్' సినిమా కూడా జుమాన్ జీ కి ఫ్రెంచ్ వెర్షన్ అని చెప్పవచ్చు. ఈ సినిమా కథ ప్రకారం పాత కార్డ్‌గేమ్ ఒకటి బయటపడి ఓ ఫ్యామిలీలోని సభ్యులు అనుకోకుండా ఆ గేమ్ ఆడతారు. అంతే ఆ కుటుంబం మొత్తం ఆ గేమ్‌రూల్ ప్రకారం టైం ట్రావెల్ చేసి పాతకాలంలోకి వెళతారు. గేమ్ ప్రకారం తోడేళ్ళ రూపంలో వున్న మనుషులను కనిపెట్టి, వాటి మనిషి ముసుగుని తీసేలా చేయాలి. అలా ఆ కుటుంబం తోడేళ్ళను కనిపెట్టి గేమ్ నుండి బయట పడిందో లేదో అన్నది ఫ్యామిలీ ప్యాక్ సినిమాలోనే చూడాలి. ప్రముఖ హాలివుడ్ నటుడు జీన్ రెనో నటించిన సినిమా ఆద్యంతం ఆకట్టుకుంటుంది. తోడేళ్ళు, ఆ కాలానికి చెందిన పరిసరాల సిజి వర్క్ చూస్తున్న ప్రేక్షకులకు కనువిందు చేస్తాయి. ఈ ఫ్యామిలీ ప్యాక్ సినిమా నెట్ ఫ్లిక్స్‌లో తెలుగులోనూ లభ్యమవుతుంది. ఫ్యామిలీ ప్యాక్ నిజంగా ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్ టైనర్.

- ఇంటూరు హరికృష్ణ

● ఈ సామెత తెలుసుకోండి!

'పెద్దల మాట చద్దిమూట'



రోజూ మన చుట్టూ అనేక విషయాలు జరుగుతూ ఉంటాయి. అందులో కొన్నింటికి ఎలా స్పందించాలో, సమస్యలు వస్తే పరిష్కరించాలో మనకు అర్థం కాదు. అలాంటి సమయంలో మనకన్నా పెద్దవాళ్లను అడిగి తెలుసుకుంటాం. వారి మాట మనల్ని సరైన దారిలో నడుపుతుంది. ఒకప్పుడు పొద్దున్న లేచాక అందరూ చద్దన్నం తినేవారు. అది వారికి ఎంతో బలాన్నిచ్చి, ఆరోగ్యంగా ఉంచేది. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు మూటలో అన్నాన్ని తీసుకెళ్లేవారు. దాన్ని 'చద్దిమూట' అనేవారు. పెద్దల మాట కూడా అలా చద్దన్నం మూటలా మనకు మంచి చేస్తుందని చెప్పేందుకు ఈ సామెత వాడతారు.



● పాడుదాం గేయం

చల్లని మామ... చందమామ

1
చల్లని మామ.. చందమామ
వెన్నెల పంచే.. చందమామ
హాయిని పెంచే..చందమామ
అందరి బంధువు.. చందమామ

2
నింగిన మెరిసే వెన్నెల ఱేడు
చుక్కల నడుమ నిలిచెను చూడు
పున్నమి నాటి వెలుగుల రాజు
నిండుదీపమై వెలిగెను చూడు

3
జోలపాటతో తాళం కలిపి
లాలిపాటలో రాగం నిలిపి
నిద్దురపుచ్చే చల్లని మామ
అదిగో అదిగో చందమామ



ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

జిలిబిలి	సూక్ష్మం, అల్పం	బీజం	విత్తనం
జిహ్వ	నాలుక	బేహారము	వ్యాపారం
జీవదుడు	వైద్యుడు	బొమ్మర	భ్రాంతి
బిద్దె	నరకం	బోధి	రావి
బిభీషణం	భయంకరం	భంగురము	నశించునది



నోరూరించే చాక్లెట్ల చరిత్ర తెలుసా?

క్యాడ్‌బరీ డైరీమిల్క్, ఫైవ్‌స్టార్, కిట్‌కాట్, జెమ్స్... చెబుతుంటేనే నోరూరిపోతోంది కదా. అమ్మానాన్నలు ఏదైనా పని చెప్పాలంటే 'చేశావంటే చాక్లెట్ ఇస్తా' అంటుంటారు. నోట్లో వేసుకోగానే కరిగిపోయే చాక్లెట్లంటే చిన్నపిల్లలకే కాదు, పెద్దలకూ ఇష్టమే. ఈ చాక్లెట్లకు దాదాపు 5 వేల ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో అమెరికాలో చాకో చెట్లను తొలిసారి గుర్తించారు. ఆ చెట్టు పళ్లలోని గింజల నుంచి రసం తీసి తాగడం అలవాటు చేసుకున్నారు. రుచికరమైన ఆ రసం అందరికీ తెగ నచ్చింది. దీంతో కోకో చెట్టును దైవప్రసాదంగా భావించేవారు. ప్రధాన వేడుకల్లో ఈ చెట్లను కానుకలుగా ఇచ్చేవారు. డబ్బు చలామణీ లేని ఆ కాలంలో ఈ చెట్టునే విలువైన వస్తువుగా భావించేవారు.



ఆ తర్వాత 1519లో స్పెయిన్ దేశస్థులు ఆ చాకో చెట్టు రసాన్ని తమ దేశానికి తెచ్చారు. అక్కడే మొదటిసారి ఆ రసానికి 'చాకొలేట్' అనే పేరు పెట్టారు. అక్కడి నుంచి అది యూరప్ ప్రాంతానికి పరిచయమై ప్రాధాన్యాన్ని పొందింది. వందల ఏళ్లపాటు రసంగానే ఉన్న ఆ ద్రవం 19వ శతాబ్దంలో పారిశ్రామికీకరణ అనంతరం బిళ్లల రూపంలోకి మారింది. ఆ రసంలో మరిన్ని కొత్త దినుసులు కలిపి కొత్త తరహా రుచుల్ని తీసుకొచ్చారు. 1819లో స్విట్జర్లాండ్ దేశంలో 'ఫ్రాంకోయిస్ లూయిస్ కైల్లర్' తొలిసారి చాక్లెట్ తయారీ ఫ్యాక్టరీ మొదలుపెట్టారు. 'స్విస్ చాక్లెట్' సృష్టికర్త ఆయనే. ఇప్పటికీ కైల్లర్ బ్రాండ్ చాక్లెట్ ప్రపంచంలోనే శ్రేష్ఠమైన చాక్లెట్.

మొదట్లో ఒకే రంగులో ఉండే చాక్లెట్లు ఆ తర్వాత కొత్త కొత్త రంగులతో మార్కెట్లోకి వచ్చాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చాక్లెట్ల వ్యాపారం లక్షల కోట్ల ఆదాయంతో నడుస్తోంది. పుట్టినరోజులు, పెళ్లిరోజులు, చిన్నారులకు వేడుకలు... ఇలా ఏ శుభకార్యం జరిగినా చాక్లెట్లు ఉండాల్సిందే అనేంతగా పేరుపొందాయి. అయితే మీకు చాక్లెట్లంటే ఎంత ఇష్టమున్నా వాటిని ఎక్కువగా తింటే అనేక సమస్యలు వస్తాయి. తరచూ చాక్లెట్లు తింటే పళ్లు పాడవుతాయి. కాబట్టి ఎప్పుడో ఒకసారి మాత్రమే చాక్లెట్లు తినండి.

● కథ

ప్రయత్నమే విజయం

శివయ్యకు రమ అనే కూతురుంది. ఆమెను అల్లారుముద్దుగా పెంచుకునేవాడు. నెమ్మదిగా ఆ అమ్మాయి పెరిగి పెద్దగయింది. పెళ్ళి చేయాలి అనుకున్నాడు.

శివయ్యకు రాముడు, శేఖరుడు అని ఇద్దరు మేనల్లుళ్ళు వున్నారు. వాళ్ళిద్దరూ రమను 'నేను చేసుకుంటానంటే నేను చేసుకుంటా'నంటా ముందుకు వచ్చినారు. ఇద్దరూ బాగా చదువుకున్నోళ్ళే. దాంతో శివయ్య ఇద్దరినీ పిలిచి 'నేనొక పరీక్ష పెడతాను. అందులో గెలిచిన వాళ్ళకే నా కూతురును ఇచ్చి పెళ్ళి జరుపుతా. సరేనా' అన్నాడు.

ఇద్దరూ 'సరే' అన్నారు.

శివయ్య తరువాత రోజు ఇద్దరినీ వూరికి దూరంగా వున్న ఒక కొండ దగ్గరకు పిలుచుకొని పోయినాడు. 'మీలో ఎవరైతే ముందుగా ఆ కొండను ఎక్కి, అక్కడున్న గుడిని చేరుకుంటారో వాళ్ళే నాకు కాబోయే అల్లుడు' అన్నాడు.

ఆ కొండ చానా ఎత్తుగా వుంటాది. పైకి ఎక్కడానికి సరియైన దారి గూడా లేదు. అంతా ముళ్ళ పొదలు, నున్నని రాళ్ళు, అడుగడుగునా పాములూ, తేళ్ళతో నిండి వుంది. దాంతో శేఖరుడు 'అమ్మో... నావల్ల కాదు. ఇంకేదయినా పోటీ పెట్టు' అన్నాడు. కానీ రాముడు కొంచెం కూడా వెనకడుగు వేయకుండా 'రమను పెళ్ళి చేసుకోవడం కోసం నేను ఏ పోటీకయినా సిద్ధమే. ఎప్పుడు పోటీ' అంటూ ముందుకు వచ్చినాడు.

'సరే... ఐతే నువ్వు ఒక్కనివే పోయి రాపో చూద్దాం' అన్నాడు శివయ్య.

వెంటనే రాముడు వురుక్కుంటా పోయి కొండ ఎక్కడం మొదలు పెట్టినాడు. అది చానా నున్నగా, జారుడుగా, ముళ్ళ పొదలతో వుంది గదా... దాంతో కొంచం దూరం ఎక్కినాక పట్టు తప్పి కాలు జారి ఒక చోట కిందపడ్డాడు. అయినా సరే కొంచం గూడా వెనుకడుగు వేయకుండా మళ్ళా ఎక్కడం మొదలుపెట్టినాడు. అది చూసి శేఖరుడు 'నేను ముందే చెప్పాగదా దాన్ని ఎక్కడం అంత సులభం కాదని' అని తిట్టినాడు.

ఆ మాటలకు శివయ్య నవ్వుతూ 'చూడు శేఖరూ... ఏదయినా ఒక పని చెబితే అడుగు కూడా ముందుకు వేయకుండా నా చేతగాదు అనే నీలాంటోడు ఎప్పటికీ విజయం సాధించలేడు. అసలు పని మొదలుపెట్టని వాని కన్నా ఓడిపోయినా సరే అడుగు ముందుకు వేసినోడే గొప్పోడు. ఈ రోజు కాకపోయినా రేపయినా విజయం పొందుతాడు. కాబట్టి రాముడే నా కూతురికి తగిన మొగుడు, నాకు అల్లుడు' అన్నాడు.

శేఖరుడు సిగ్గుతో తలదించుకొన్నాడు.

- ఎమ్.హరి కిషన్



బిజినెస్ రీల్

ఓలా ఎలక్ట్రిక్ విస్తరణ



బెంగళూరు: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తమ సర్వీస్ సెంటర్లను 30 శాతం మేర పెంచుకుంది. కొత్తగా 50 సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు 500 మంది టెక్నీషియన్లను నియమించుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇది దోహదపడగలదని వివరించాయి. అలాగే, సర్వీస్ వ్యూహాలు, ప్రక్రియలను మెరుగుపర్చుకునేందుకు తగు సూచనలు ఇచ్చేందుకు ఎర్నెస్ట్ అండ్ యంగ్‌ను నియమించుకున్నట్లు పేర్కొంది. ఓలా వాహన సర్వీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అత్యుత్తమ ఆఫ్టర్-సేల్స్ అనుభూతిని అందించేందుకు 2024 డిసెంబర్ నాటికి తమ సర్వీస్ నెట్‌వర్క్‌ను 1,000 సెంటర్లకు పెంచుకోనున్నట్లు ఓలా వ్యవస్థాపకుడు, సీఎండీ భవీష్ అగర్వాల్ సెప్టెంబర్‌లో ప్రకటించారు.

మొబైల్ డేటా ట్రాఫిక్‌లో అగ్రగామిగా జియో



న్యూఢిల్లీ: మొబైల్ డేటా ట్రాఫిక్‌లో వరుసగా మూడవ త్రైమాసికంలో ప్రపంచ అగ్రగామిగా రిలయన్స్ జియో కొనసాగుతోందని కన్సల్టింగ్, రిసర్చ్ కంపెనీ టెఫిషంట్ తెలిపింది. ప్రపంచ ప్రత్యర్థులను జియో మించిపోయిందంటూ ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించింది. జియో, చైనా మొబైల్, ఎయిర్‌టెల్, చైనా యునికామ్ తోపాటు వొడాఫోన్ ఐడియా తదితర ఆపరేటర్ల మొబైల్ డేటా ట్రాఫిక్‌ను పోలుస్తూ ఒక పత్రాన్ని పంచుకుంది. 'చైనా మొబైల్ కేవలం 2 శాతం వార్షిక వృద్ధి సాధించింది. జియో, చైనా టెలికాం 24 శాతం, ఎయిర్‌టెల్ 23 శాతం వృద్ధి నమోదు చేశాయి. చైనా మొబైల్‌లో ఏం జరుగుతోంది? అంటూ టెఫిషంట్ ప్రశ్నించింది. సెప్టెంబర్ చివరినాటికి జియో మొత్తం మొబైల్ చందాదార్ల సంఖ్య 47.88 కోట్లుంది.

రెట్టింపు ఆదాయంపై సువెన్, కోహ్యాన్స్ దృష్టి

న్యూఢిల్లీ: విలీన ప్రయత్నాల్లో ఉన్న సువెన్ ఫార్మా, కోహ్యాన్స్ లైఫ్‌సైన్సెస్ 2029 ఆర్థిక సంవత్సరం నాటికి సంయుక్తంగా రెట్టింపు ఆదాయాన్ని ఆర్జించాలని నిర్దేశించుకున్నాయి. వివిధ వృద్ధి వ్యూహాలతో దాదాపు రూ. 6,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సువెన్ ఫార్మా ఎండీ ప్రసాద రాజు తెలిపారు. 2024 ఆర్థిక సంవత్సరంలో రెండు సంస్థల సంయుక్త ఆదాయం రూ. 2,392 కోట్లుగా నమోదైంది. సువెన్, కోహ్యాన్స్ విలీనానికి ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ నుంచి అనుమతులు లభించాయి. ఇందుకు సంబంధించి నవంబర్ 28న షేర్‌హోల్డర్ల సమావేశం నిర్వహించనున్నారు. విలీన సంస్థ ప్రధానంగా ఫార్మా సీడీఎంవో, స్పెషాలిటీ కెమికల్స్ సీడీఎంవో, ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇంగ్రిడియెంట్స్) విభాగాలపై దృష్టి పెట్టనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,073
ఎన్‌ఎస్‌ఈ	18,225
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	24,192
ఎఫ్ఐఐ	- 212
డీఐఐ	- 377

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.53	$ 69.26
బ్రెంట్	73.14	$ 72.81

భారత్‌లో మరిన్ని యాపిల్ స్టోర్స్

దేశీయంగా రికార్డు స్థాయిలో ఆదాయం

న్యూఢిల్లీ: సెప్టెంబర్ త్రైమాసికంలో తమ భారత విభాగం ఆదాయాలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో నమోదైనట్లు ఐఫోన్ల తయారీ దిగ్గజం యాపిల్ సీఈవో టిమ్ కుక్ తెలిపారు. ఐప్యాడ్‌ల అమ్మకాలు రెండంకెల స్థాయిలో వృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. సమీక్షాకాలంలో రెండు కొత్త స్టోర్స్‌ను (ముంబై, ఢిల్లీ) ప్రారంభించినట్లు కుక్ చెప్పారు. కొత్తగా మరో నాలుగు స్టోర్స్‌ను కూడా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పుణె, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలో ఇవి ఏర్పాటు కానున్నాయి. సెప్టెంబర్ క్వార్టర్‌లో కంపెనీ మొత్తం ఆదాయం 6 శాతం వృద్ధి చెంది 94.93 బిలియన్ డాలర్లుగా నమోదైంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఐఫోన్ అమ్మకాలు 43.8 బిలియన్ డాలర్ల నుంచి 5.5 శాతం వృద్ధితో 46.22 బిలియన్ డాలర్లకు, ఐప్యాడ్ అమ్మకాలు 8 శాతం



పెరిగి 6.95 బిలియన్ డాలర్లకు చేరాయి. సర్వీసుల విభాగం ఆదాయం 22.31 బిలియన్ డాలర్ల నుంచి 24.97 బిలియన్ డాలర్లకు పెరిగింది.

పసిడికి పెరిగిన డిమాండ్

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 248.2 టన్నులు
- ఆర్‌బీఐ నుంచి కొనసాగిన కొనుగోళ్లు
- 2024లో 750 టన్నులుగా ఉండొచ్చు
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక వెల్లడి



ముంబై: దిగుమతి సుంకం తగ్గింపుతో బంగారానికి డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 248.3 టన్నులుగా నమోదైంది. ముఖ్యంగా సుంకం తగ్గింపు ఆభరణాల కొనుగోళ్లను పెంచినట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) '2024 క్యూ3 గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్' నివేదిక తెలిపింది. ''బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరడంతో.. ధరలు తగ్గే వరకు కొనుగోళ్ల కోసం ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణి అనుసరించొచ్చు. దీంతో పూర్తి ఏడాదికి (2024) బంగారం డిమాండ్ 700-750 టన్నుల మేర ఉంటుంది. గతేడాదితో పోల్చితే కొంత తక్కువ. 2024 చివరి త్రైమాసికంలో ధనత్రయోదశి, వివాహాల సీజన్ మొత్తం మీద బంగారం డిమాండ్‌కు ఊతంగా నిలుస్తాయి'' అని ఈ నివేదిక తెలిపింది. 2023లో బంగారం డిమాండ్ 761 టన్నులుగా ఉంది. ధనత్రయోదశి సందర్భంగా డిమాండ్ పెరగడంతో మంగళవారం ఢిల్లీలో బంగారం ధర 10 గ్రాములకు రూ.300 పెరిగి రూ.81,400కు చేరడం గమనార్హం. ఇక విలువ పరంగా చూస్తే సెప్టెంబర్ క్వార్టర్‌లో బంగారం డిమాండ్ 53 శాతం పెరిగి రూ.1,65,380 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.1,07,700 కోట్లుగా ఉంది. బంగారం, వెండి దిగుమతులపై 15 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని 6 శాతానికి బడ్జెట్‌లో తగ్గించడం తెలిసిందే.

ఆభరణాల డిమాండ్ 172 టన్నులు

బంగారం ఆభరణాల డిమాండ్ సెప్టెంబర్ త్రైమాసికంలో 171.6 టన్నులుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో డిమాండ్ 155.7 టన్నుల కంటే 10 శాతం పెరిగింది. దిగుమతి సుంకం తగ్గింపుతో ఆభరణాలకు అనూహ్య డిమాండ్ పెరిగిందని.. 2015 తర్వాతి కాలంలో ఒక ఏడాది మూడో త్రైమాసికంలో ఆభరణాలకు గరిష్ట డిమాండ్ ఏర్పడినట్టు డబ్ల్యూజీసీ ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ తెలిపారు. బంగారంపై సుంకం తగ్గింపుకు అదనంగా ఇతర అంశాలు సైతం దేశీయంగా డిమాండ్ పెరగడానికి దారితీసినట్టు డబ్ల్యూజీసీ నివేదిక తెలిపింది. ముఖ్యంగా ఆర్‌బీఐ నుంచి బంగారం కొనుగోళ్లు కొనసాగడం, మంచి వర్షాల సీజన్ డిమాండ్‌కు ప్రేరణగా నిలిచినట్టు పేర్కొంది. సెప్టెంబర్ క్వార్టర్‌లో ఆర్‌బీఐ 13 టన్నుల మేర కొనుగోలు చేసింది. ఈ ఏడాది జనవరి-మార్చి కాలంలో, ఏప్రిల్-జూన్ కాలంలో 18 టన్నుల చొప్పున ఆర్‌బీఐ బంగారం కొనుగోలు చేసింది. దీంతో బంగారం నిల్వలు 854 టన్నులకు చేరాయి. 2023 చివరితో పోల్చి చూస్తే 6% పెరిగాయి.

ఇక ముందూ బలమైన డిమాండ్

డిసెంబర్ త్రైమాసికంలోనూ బంగారం డిమాండ్ బలంగా కొనసాగుతుందని సచిన్ జైన్ పేర్కొన్నారు. ధనత్రయోదశి, వివాహాల కోసం కొనుగోళ్లు డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తాయన్నారు. బంగారం ధరలు పెరగడం దిగుమతి సుంకం ప్రయోజనాన్ని పూర్తిగా హరించిందని.. దీంతో పెట్టుబడుల దృష్ట్యా బంగారం కొనుగోళ్లకు ధరలు తగ్గే వరకు ఇన్వెస్టర్లు వేచి చూడొచ్చని అభిప్రాయపడ్డారు. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో బంగారంలో పెట్టుబడుల డిమాండ్ 76.7 టన్నులుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 54.5 టన్నులతో పోల్చి చూస్తే 41 శాతం పెరిగినట్టు డబ్ల్యూజీసీ నివేదిక తెలిపింది. దిగుమతులు 360 టన్నులుగా ఉన్నాయి. 2023 సెప్టెంబర్ క్వార్టర్‌లో దిగుమతులు 193 టన్నులతో పోల్చి చూస్తే 87% మేర దిగుమతులు పెరిగాయి. పునర్వినియోగానికి సిద్ధం చేసిన (రీసైకిల్డ్) ఆభరణాల పరిమాణం 23.4 టన్నులుగా ఉంది.

బంగారం దిగుమతులు 22% జంప్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బంగారం దిగుమతులు జోరుగా సాగుతున్నాయి. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల కాలంలో 22 శాతం అధికంగా 27 బిలియన్ డాలర్ల విలువైన బంగారం దిగుమతి అయినట్టు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో బంగారం దిగుమతులు 22 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుత పండుగల సీజన్ దిగుమతులు పెరగడానికి కారణంగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో మొత్తం మీద బంగారం దిగుమతులు 30 శాతం పెరిగి 45.54 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. అత్యధికంగా స్విట్జర్లాండ్ 40 శాతం మేర మన దేశానికి బంగారం ఎగుమతి చేయగా, యూఏఈ 16 శాతం, దక్షిణాఫ్రికా 10 శాతం వాటా ఆక్రమించాయి. దేశ మొత్తం దిగుమతుల్లో బంగారం దిగుమతుల వాటా 5 శాతంగా ఉంటుంది. బంగారం దిగుమతులు పెరగడంతో దేశ వాణిజ్య లోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) మొదటి ఆరు నెలల్లో (సెప్టెంబర్ చివరికి) 137.44 బిలియన్ డాలర్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వాణిజ్య లోటు 119.24 బిలియన్ డాలర్లుగానే ఉండడం గమనించొచ్చు. బంగారానికి చైనా తర్వాత ప్రపంచంలో రెండో అతిపెద్ద వినియోగదారుగా భారత్ ఉంటోంది. వెండి దిగుమతులు సైతం 376 శాతం పెరిగి 2.3 బిలియన్ డాలర్లుగా ఏప్రిల్-సెప్టెంబర్ కాలానికి నమోదయ్యాయి. కరెంటు ఖాతా లోటు ఒక శాతం ఎగసి 9.7 బిలియన్ డాలర్లకు చేరింది.

లాభాల్లోకి న్యూ ఇండియా ఎస్యూరెన్స్

క్యూ2లో రూ. 71 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ న్యూ ఇండియా ఎస్యూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నష్టాలను వీడి రూ. 71 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 200 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 9,839 కోట్ల నుంచి రూ. 10,090 కోట్లకు ఎగసింది. స్థూల(మొత్తం) ప్రీమియం వసూళ్లు రూ. 9,397 కోట్ల నుంచి రూ. 9,620 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. నికర ప్రీమియం రూ. 7,894 కోట్ల నుంచి రూ. 8,067 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 10,628 కోట్ల నుంచి రూ. 10,577 కోట్లకు స్వల్పంగా తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో సంస్థ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం బలపడి రూ. 200 వద్ద ముగిసింది.

ఫేస్‌బుక్ ఇండియా ఆన్‌లైన్ లాభం జూమ్

2023-24లో రూ. 505 కోట్లు



న్యూఢిల్లీ: సోషల్ మీడియా దిగ్గజం మెటాకు చెందిన అడ్వర్టయిజ్‌మెంట్ యూనిట్ ఫేస్‌బుక్ ఇండియా ఆన్‌లైన్ సర్వీసెస్ గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో పటిష్ట ఫలితాలు సాధించింది. రీసెర్చ్ సంస్థ టోఫ్లర్ వివరాల ప్రకారం నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 505 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022-23)లో రూ. 353 కోట్ల నికర లాభం మాత్రమే ఆర్జించింది. కంపెనీ దేశీయంగా అడ్వర్టయిజింగ్ ఇన్వెంటరీని కస్టమర్లకు విక్రయించే సర్వీసులతోపాటు మెటా ప్లాట్‌ఫామ్స్ ఇంక్‌కు ఐటీ ఆధారిత సపోర్ట్, డిజైన్ సపోర్ట్ సేవలు సైతం అందిస్తోంది. కాగా.. గతేడాది టర్నోవర్ 9 శాతంపైగా ఎగసి రూ. 3,035 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది రూ. 2,776 కోట్ల ఆదాయం నమోదైంది.

నష్టాల్లోకి స్టెరిలైట్ టెక్

క్యూ2లో రూ. 14 కోట్లు




న్యూఢిల్లీ: బ్రాడ్‌బ్యాండ్ టెక్నాలజీ కంపెనీ స్టెరిలైట్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో లాభాలను వీడి రూ. 14 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 32 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,494 కోట్ల నుంచి రూ. 1,413 కోట్లకు నామమాత్రంగా తగ్గింది. ఓపెన్ ఆర్డర్‌బుక్ విలువ రూ. 8,630 కోట్లకు చేరినట్లు కంపెనీ ఎండీ అంకిత్ అగర్వాల్ వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో స్టెరిలైట్ షేరు బీఎస్‌ఈలో 1% లాభంతో రూ. 119 వద్ద ముగిసింది.

టాటా పవర్.. ఫర్వాలేదు

- రూ.1,093 కోట్ల నికర లాభం



న్యూఢిల్లీ: టాటాపవర్ సెప్టెంబర్ త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 8 శాతం పెరిగి రూ.1,093 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,017 కోట్లుగా ఉంది. ఆదాయం స్వల్ప వృద్ధితో రూ.16,029 కోట్ల నుంచి రూ.16,211 కోట్లకు చేరింది. ''ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, రెన్యువబుల్ వ్యాపారం స్థిరమైన వృద్ధిని కొనసాగించాయి. అన్ని విభాగాలు చెప్పుకోతగ్గ మేర పనితీరు చూపించాయి. దీంతో వరుసగా 20వ త్రైమాసికంలోనూ నికర లాభాన్ని నమోదు చేశాం. భారత్‌లో తయారీ లక్ష్యానికి అనుగుణంగా తమిళనాడులో మేము చేపట్టిన 4.3 గిగావాట్ సెల్ అండ్ మాడ్యూల్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా.. 2 గిగావాట్ సెల్ తయారీ సెప్టెంబర్ క్వార్టర్‌లో మొదలైంది. వచ్చే నెల చివరికి పూర్తి స్థాయి సామర్థ్యానికి తయారీ పెరగనుంది'' అని టాటా పవర్ సీఈవో, ఎండీ ప్రవీర్ సిన్హా తెలిపారు. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 20,000 కోట్ల మూలధన వ్యయాల ప్రణాళిక ప్రకటించగా.. ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో రూ.9,100 కోట్లను వెచ్చించినట్టు తెలిపారు. విద్యుత్ సరఫరా, పునరుత్పాదక విద్యుత్ తయారీ, హైడ్రో ప్రాజెక్టులపై తాము చేస్తున్న పెట్టుబడులతో దేశ ఇంధన సామర్థ్యం బలోపేతం అవుతుందన్నారు.

బీఎస్‌ఈలో టాటా పవర్ 1 శాతం లాభపడి రూ.445 వద్ద ముగిసింది.

డాబర్ లాభం నేలచూపు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 418 కోట్లకు పరిమితమైంది. పట్టణ ప్రాంతాలలో డిమాండ్ తగ్గడం, ఆహార ధరల పెరుగుదల ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 507 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.75 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 5 శాతం వెనకడుగుతో రూ. 3,029 కోట్లను తాకింది. మొత్తం వ్యయాలు సైతం స్వల్పంగా 1 శాతం తగ్గి రూ. 2,634 కోట్లకు చేరాయి. ఆదాయంలో కన్సూమర్ కేర్ విభాగం నుంచి 4 శాతం తక్కువగా రూ. 2,488 కోట్లు లభించగా.. ఫుడ్ బిజినెస్ 13 శాతం క్షీణించి రూ. 467 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో డాబర్ ఇండియా షేరు బీఎస్‌ఈలో 0.5% బలపడి రూ. 543 వద్ద ముగిసింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు

గ్లాక్సోస్మిత్‌క్లయిన్ పనితీరు ఫర్వాలేదు

- 16 శాతం పెరిగిన లాభం
- షేరుకు రూ.12 డివిడెండ్



న్యూఢిల్లీ: గ్లాక్సోస్మిత్‌క్లయిన్ ఫార్మాస్యూటికల్స్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.217 కోట్లతో పోల్చి చూస్తే 16 శాతం పెరిగి రూ.252 కోట్లకు చేరింది. ఆదాయం సైతం రూ.957 కోట్ల నుంచి రూ.1,010 కోట్లకు చేరింది. వాటాదారుల వద్దనున్న ఒక్కో షేరుకు రూ.12 చొప్పున ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది. భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు మొదలు పెట్టి వందేళ్లు అయిన సందర్భంగా ఈ ప్రత్యేక డివిడెండ్ ఇస్తున్నట్టు గ్లాక్సో ఫార్మా ఎండీ భూషణ్ అక్షికార్ తెలిపారు. స్థిరమైన వృద్ధి, ఆవిష్కరణలకు తమ పనితీరు అద్దం పడుతుందన్నారు. కంపెనీకి చెందిన కీలక బ్రాండ్లు వాటి మార్కెట్ వాటాను కొనసాగించాయని చెప్పారు. పిల్లల వ్యాక్సిన్ల పోర్ట్‌ఫోలియో రెండంకెల వృద్ధిని నమోదు చేసినట్టు తెలిపారు.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు 0.22 శాతం పెరిగి రూ.2,730 వద్ద స్థిరపడింది.

టాటా టెక్నాలజీస్ లాభం రూ. 157 కోట్లు

- 16 శాతం పెరిగిన లాభం
- షేరుకు రూ.12 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో టాటా టెక్నాలజీస్ నికర లాభం సుమారు రెండు శాతం తగ్గి రూ. 157 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో ఇది రూ. 160 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 1,269 కోట్ల నుంచి రూ. 1,296 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ. 1,086 కోట్ల నుంచి రూ. 1,095 కోట్లకు పెరిగాయి. సీక్వెన్షియల్ ప్రాతిపదికన సర్వీసుల వ్యాపార విభాగం పుంజుకుందని, 2 శాతం ఆదాయ వృద్ధి నమోదు చేసిందని సంస్థ సీఈవో వారెన్ హ్యారిస్ తెలిపారు. ఆర్డర్ బుక్ పటిష్టంగా ఉందని, ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధం మరింత మెరుగ్గా ఉండగలదని ఆయన వివరించారు.

మురిపించిన హడ్కో

- 52 శాతం ఎగిసిన లాభం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) సెప్టెంబర్ త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. రూ.688 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.451 కోట్లతో పోల్చి చూసినప్పుడు 52 శాతం పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్ క్వార్టర్ లాభంతో పోల్చి చూసినా 23 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.1,881 కోట్ల నుంచి రూ.2,526 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 27 శాతం పెరిగి రూ.627 కోట్ల నుంచి రూ.797 కోట్లకు చేరింది. ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు హడ్కో రుణాలు అందిస్తుంటుంది.

పటిష్ట ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో హడ్కో షేరు 1 శాతం ఎగసి రూ.219 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ కార్డ్స్‌కు నిరర్థక ఆస్తుల సెగ

- 16 శాతం పెరిగిన లాభం
- షేరుకు రూ.12 డివిడెండ్



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద క్రెడిట్‌కార్డు కంపెనీ ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ మిశ్రమ పనితీరు నమోదు చేసింది. సెప్టెంబర్ త్రైమాసికంలో నికర లాభం రూ.404 కోట్లకు తగ్గిపోయింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.603 కోట్లతో పోల్చి చూస్తే 33% క్షీణించింది. మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.4,221 కోట్ల నుంచి 8% వృద్ధితో రూ.4,556 కోట్లకు దూసుకుపోయింది. వడ్డీ ఆదాయం 20% పెరిగి రూ.2,290 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం 2% పెరిగి రూ.2,131 కోట్లుగా నమోదైంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డు రుణాల్లో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) పెరిగిపోయాయి. మొత్తం రుణాల్లో క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 2.43 శాతం నుంచి 3.27 శాతానికి చేరాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.89 శాతం నుంచి 1.19 శాతానికి పెరిగాయి. ఇంపెయిర్‌మెంట్ నష్టాలు, మొండి బకాయిల రుణ వ్యయాలు 63 శాతం పెరిగి రూ.1,212 కోట్లకు చేరినట్టు ఎస్‌బీఐ కార్డ్స్ తెలిపింది. క్యాపిటల్ అడెక్వెసీ రేషియో 23.3 శాతం నుంచి 22.1 శాతానికి తగ్గింది. కార్డులపై కస్టమర్లు చేసిన వ్యయాలు రూ.81,893 కోట్లకు చేరాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూస్తే 3 శాతం అధికం కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌తో పోల్చితే 6 శాతం పెరిగాయి. రూ.1,106 కోట్ల రుణాలను మాఫీ చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 63 శాతం ఎక్కువ.

బీఎస్‌ఈలో ఎస్‌బీఐ కార్డ్స్ షేరు ధర 1 శాతం లాభపడి రూ.694 వద్ద ముగిసింది.

రాణించిన సిప్లా

- సెప్టెంబర్ క్వార్టర్‌లో బలమైన పనితీరు



న్యూఢిల్లీ: విక్రయాలు జోరుగా సాగడంతో ప్రముఖ ఫార్మా సంస్థ సిప్లా సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.1,303 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,115 కోట్లతో పోల్చి చూస్తే 17 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.6,490 కోట్ల నుంచి రూ.7,051 కోట్లకు పెరిగింది. ''2024-25 క్యూ2లో రికార్డు స్థాయిలో 9% మేర ఆదాయంలో వృద్ధిని సాధించాం. నిర్వహణ సామర్థ్యాల మద్దతుతో కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఎబిట్డా మార్జిన్ 26.7 శాతాన్ని నమోదు చేశాం'' అని సిప్లా ఎండీ, గ్లోబల్ సీఈవో ఉమంగ్ వోహ్రా తెలిపారు. సీజనల్ ప్రభావాలతో దేశీయంగా ఒక వ్యాపార విభాగంపై ప్రభావం పడినట్టు, అయినప్పటికీ క్రానిక్ థెరపీ విభాగంలో బ్రాండెడ్ ప్రిస్కిప్షన్ వ్యాపారం వేగవంతమైన వృద్ధి సాధించినట్టు చెప్పారు. కన్స్యూమర్ హెల్త్ వ్యాపారం సైతం 21 శాతం బలపడినట్టు తెలిపారు. భిన్నమైన పోర్ట్‌ఫోలియోపై దృష్టి సారించడంతో యూఎస్ వ్యాపారం 237 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసినట్టు సిప్లా ప్రకించింది. దక్షిణాఫ్రికా మార్కెట్లోనూ 22% వృద్ధిని నమోదు చేసినట్టు తెలిపింది. వర్ధమాన మార్కెట్లు, యూరప్ వ్యాప్తంగా 18% వృద్ధి సాధించినట్టు పేర్కొంది. కంపెనీకి చెందిన ప్రతిష్టాత్మక బ్రాండ్ల బలోపేతంపై మరింత దృష్టి సారిస్తామని తెలిపింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సిప్లా షేరు 0.5% పెరిగి రూ.1,559 వద్ద ముగిసింది.

మారికో స్థిరమైన పనితీరు

- 20 శాతం దూసుకెళ్లిన లాభం



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీ మారికో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.433 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.360 కోట్లతో పోల్చి చూస్తే 20 శాతం పెరిగింది. స్థిరాస్తుల విక్రయం, రూ.42 కోట్లకు సంబంధించిన వివాదంలో సానుకూల పరిష్కారం లాభం 20 శాతం పెరిగేందుకు దారితీసినట్టు మారికో తెలిపింది. సెప్టెంబర్ త్రైమాసికంలో పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో విక్రయాలు రెండింతలు పెరిగినట్టు వెల్లడించింది. కన్సాలిడేటెడ్ ఆదాయం 7.6 శాతం వృద్ధితో రూ.2,476 కోట్ల నుంచి రూ.2,664 కోట్లకు చేరింది. దేశీయ అమ్మకాలు 5 శాతం పెరగ్గా, అంతర్జాతీయ వ్యాపారం స్థిర కరెన్సీ రూపంలో 13 శాతం వృద్ధి చెందింది. దేశీయ వ్యాపారం ఆదాయం 8 శాతం పెరిగి రూ.1,979 కోట్లుగా ఉంది. కోకోనట్ (పారాచ్యూట్) ఆయిల్ ధరలను పెంచడంతోపాటు అమ్మకాలు పెరగడం సానుకూలించినట్టు మారికో పేర్కొంది. పారాచ్యూట్ అమ్మకాలు 4 శాతం పెరగ్గా, ఆదాయం 10 శాతం వృద్ధి చెందినట్టు తెలిపింది. సఫోలా వంట నూనెల రూపంలో ఆదాయం కేవలం 2 శాతమే పెరిగింది. ఎఫ్ఎంసీజీ రంగానికి సంబంధించి ధరల వృద్ధి సానుకూలంగా మారినట్టు మారికో తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో ఆదాయంలో రెండంకెల వృద్ధిని అంచనా వేస్తున్నట్టు ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో మారికో స్టాక్ ఒక శాతం పెరిగి రూ.646 వద్ద ముగిసింది.

సాక్షి ప్లస్
శనివారం : 2-11-2024

క్లాసెన్‌కు రూ. 23 కోట్లు

కళ్లు చెదిరే మొత్తం వెచ్చించిన సన్‌రైజర్స్ హైదరాబాద్

కోహ్లికి బెంగళూరు రూ. 21 కోట్లు | రిషబ్ పంత్‌ను వదిలేసిన ఢిల్లీ క్యాపిటల్స్

కేఎల్ రాహుల్, శ్రేయస్, సిరాజ్ కూడా వేలానికి | **ముంబైతోనే హార్దిక్, రోహిత్, బుమ్రా** | **ఇద్దరినే రీటైన్ చేసుకున్న పంజాబ్ కింగ్స్**

తిలక్ వర్మకు ముంబై రూ. 8 కోట్లు | **నితీశ్ కుమార్ రెడ్డికి సన్‌రైజర్స్ రూ. 6 కోట్లు** | **ఐపీఎల్ రిటెన్షన్ గడువు పూర్తి**



ఈసారి ఐపీఎల్ వేలం ఆసక్తికరంగా సాగడం ఖాయం! రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ వంటి భారత స్టార్లతో పాటు... వార్నర్, మ్యాక్స్‌వెల్, బట్లర్, బెయిర్‌స్టో, మిల్లర్ వంటి పలువురు అంతర్జాతీయ ఆటగాళ్లు వేలానికి రానున్నారు. వేలానికి ముందు ఆటగాళ్లను అట్టిపెట్టుకున్న జాబితా విడుదల కాగా... సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన దక్షిణాఫ్రికా ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ అత్యధికంగా 23 కోట్ల రూపాయలు దక్కించుకున్నాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలను తమ ఫ్రాంచైజీలు కొనసాగించగా... ధోనీ తొలిసారి 'అన్‌క్యాప్డ్' ప్లేయర్ జాబితాలోకి వచ్చాడు. హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మకు ముంబై ఇండియన్స్ మంచి ధర కేటాయించగా... ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని రూ. ఆరు కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ అట్టిపెట్టుకుంది.

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలానికి ముందు... అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల జాబితా వెల్లడి గడువు ముగిసింది. ఈ నెలాఖరున వేలం జరగనుండగా... రీటైన్ చేసుకున్న ఆటగాళ్ల జాబితాను ఐపీఎల్ నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో కొందరు ఆటగాళ్లు అనూహ్యంగా కోట్లు కొల్లగొట్టగా... మరికొందరు స్టార్ ప్లేయర్లు ఫ్రాంచైజీ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయారు. అందరికంటే అత్యధికంగా దక్షిణాఫ్రికా 'హార్డ్ హిట్టర్' హెన్రిచ్ క్లాసెన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ రూ. 23 కోట్లు కేటాయించగా... విరాట్ కోహ్లీకి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు... నికోలస్ పూరన్‌కు లక్నో సూపర్ జెయింట్స్ రూ.21 కోట్లు ఇచ్చి అట్టిపెట్టుకున్నాయి. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు సారథ్యం వహించిన హార్దిక్ పాండ్యా... ఇక మీదట కూడా నాయకుడిగా కొనసాగడం ఖాయం కాగా... ముంబై మొత్తంగా ఐదుగురు ప్రధాన ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. మేటి పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు అత్యధికంగా రూ. 18 కోట్లు కేటాయించిన ఫ్రాంచైజీ సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యాలకు చెరో రూ. 16 కోట్ల 35 లక్షలు వెచ్చించింది. ఇక 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మకు రూ. 16 కోట్ల 30 లక్షలు కేటాయించింది. హైదరాబాద్ ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మకు రూ.8 కోట్లు ఇచ్చి ముంబై తమ వద్దే పెట్టుకుంది.

ఆటగాళ్ల కొనుగోలు కోసం ఒక్కో జట్టు రూ.120 కోట్లు ఖర్చు చేసుకునే అవకాశం ఉండగా... అందులో రూ. 75 కోట్లు రిటెన్షన్‌కు కేటాయించారు. తాజా జాబితాను చూస్తే ముంబై ఇండియన్స్ జట్టు రీటైన్‌ను సంపూర్ణంగా వాడుకోగా... అత్యల్పంగా పంజాబ్ కింగ్స్ జట్టు కేవలం ఇద్దరు ప్లేయర్లనే అట్టి పెట్టుకుంది. పంజాబ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ రికీ పాంటింగ్ వ్యూహాల్లో భాగంగా... కేవలం ఇద్దరు 'అన్‌క్యాప్డ్' ప్లేయర్లను మాత్రమే రీటైన్ చేసుకున్న పంజాబ్ వద్ద వేలం కోసం అత్యధికంగా రూ. 110.5 కోట్లు మిగిలి ఉన్నాయి.

ఈ ఏడాది జట్టుకు ఐపీఎల్ టైటిల్ అందించిన శ్రేయస్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ వేలానికి వదిలేయగా... తొమ్మిదేళ్లుగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో కొనసాగుతున్న రిషబ్ పంత్‌ను ఫ్రాంచైజీ వదిలేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్ యాజమాన్యం కేఎల్ రాహుల్‌పై నమ్మకం ఉంచలేదు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ధోనీ సహా మొత్తం ఐదుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకోగా... రాజస్తాన్ రాయల్స్ కూడా ఆరుగురు ప్లేయర్లను రీటైన్ చేసుకుంది. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 16 కోట్ల 50 లక్షలు కేటాయించగా... సిక్సర్ల వీరుడు రింకూ సింగ్‌కు కోల్‌కతా రూ.13 కోట్లు ఇచ్చి అట్టిపెట్టుకుంది. వెస్టిండీస్ ద్వయం రసెల్, నరైన్‌తో పాటు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి తలా రూ. 12 కోట్లు కేటాయించింది.

కోల్‌కతా వదిలేసుకున్న శ్రేయస్ అయ్యర్ కోసం వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడటం ఖాయమే కాగా... సారథి కోసం చూస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు పంత్‌పై కన్నేసే అవకాశాలు ఉన్నాయి. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఐదేళ్లు దాటిపోయిన ధోనీని ఐపీఎల్ నిబంధనల ప్రకారం 'అన్‌క్యాప్డ్' ప్లేయర్ కోటాలో రీటైన్ చేసుకున్న చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ... మాజీ సారథికి రూ.4 కోట్లు కేటాయించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చెరో రూ. 18 కోట్లు వెచ్చించింది. శ్రీలంక పేసర్ పతిరణకు రూ. 13 కోట్లు, పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబేను రూ.12 కోట్లకు అట్టిపెట్టుకుంది. రిటైనింగ్‌లో మొత్తం ఆరు అవకాశాలను వాడుకున్న రాజస్తాన్ రాయల్స్... సంజూ సామ్సన్, యశస్వి జైస్వాల్‌కు చెరో రూ.18 కోట్లు కేటాయించింది. రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్‌కు చెరో రూ. 14 కోట్లు వెచ్చించింది.

కేఎల్ రాహుల్‌ను వేలానికి వదిలేసిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు నిలకడగా ఆడతాడో లేదో తెలియని వెస్టిండీస్ హిట్టర్ నికోలస్ పూరన్ కోసం రూ. 21 కోట్లు కేటాయించింది. గాయాలతో సహవాసం చేసే సూపర్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్, స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కు రూ. 11 కోట్లు కేటాయించిన లక్నో... మొహసిన్ ఖాన్, ఆయుష్ బదోనీలకు చెరో రూ. 4 కోట్లు వెచ్చించింది. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌కు రూ.18 కోట్లు కేటాయించిన గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ... కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌ను రూ. 16 కోట్ల 50 లక్షలకు అట్టిపెట్టుకుంది.


వేలానికి రానున్న ప్రధాన ఆటగాళ్లు

కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్, చాహల్, అశ్విన్, వాషింగ్టన్ సుందర్, భువనేశ్వర్, శార్దుల్ ఠాకూర్, దీపక్ చాహర్, షమీ (భారత్). వార్నర్, మ్యాక్స్‌వెల్, కామెరూన్ గ్రీన్, మిచెల్ స్టార్క్, స్టొయినిస్ (ఆస్ట్రేలియా). బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, స్యామ్ కరన్, బట్లర్, ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్). డుప్లెసిస్, డేవిడ్ మిల్లర్, క్వింటన్ డికాక్, నోర్జే (దక్షిణాఫ్రికా). కాన్వే, రచిన్ రవీంద్ర, బౌల్ట్ (న్యూజిలాండ్).


రోహిత్ శర్మ, బుమ్రా, హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్, తిలక్ వర్మ







నితీశ్ రెడ్డికి రూ.6 కోట్లు



ఈ ఏడాది తమ విధ్వంసక ఆటతీరుతో ఐపీఎల్‌లో ప్రకంపనలు సృష్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు... ప్రధాన ఆటగాళ్లను రీటైన్ చేసుకుంది. కేవలం సిక్సర్లే తన లక్ష్యమన్నట్లు చెలరేగి ఆడిన క్లాసెన్‌కు అత్యధికంగా రూ. 23 కోట్లు కేటాయించిన ఫ్రాంచైజీ... కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను రూ. 18 కోట్లకు రీటైన్ చేసుకుంది. ఇక డేంజర్ ఓపెనింగ్ జోడీ హెడ్, అభిషేక్ శర్మలకు చెరో రూ. 14 కోట్లు కేటాయించింది. ఈ సీజన్‌లో తన పవర్ హిట్టింగ్‌తో 'ఎమర్జింగ్ ప్లేయర్' ఆఫ్ ది టోర్నీగా నిలిచిన ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి రూ. 6 కోట్లు కేటాయించింది. మొత్తం రూ. 75 కోట్లు ఖర్చు పెట్టేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పర్స్‌లో ఇక రూ. 45 కోట్లు మిగిలాయి. వేలంలో ఒక ప్లేయర్‌ను రైట్ టు మ్యాచ్ (ఆర్టీఎమ్) ద్వారా తిరిగి దక్కించుకునే అవకాశం ఉంది. చాన్నాళ్లుగా ఫ్రాంచైజీతో కొనసాగుతున్న బౌలర్లు భువనేశ్వర్ కుమార్, నటరాజన్‌లతో పాటు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లపై ఫ్రాంచైజీ పెద్దగా దృష్టి పెట్టలేదు.

రీటైన్ ఆటగాళ్ల జాబితా...

సన్‌రైజర్స్ హైదరాబాద్ 5

ఆటగాడు	దేశం	ధర
హెన్రిచ్ క్లాసెన్	దక్షిణాఫ్రికా	రూ. 23 కోట్లు
ప్యాట్ కమిన్స్	ఆస్ట్రేలియా	రూ. 18 కోట్లు
అభిషేక్ శర్మ	భారత్	రూ. 14 కోట్లు
ట్రావిస్ హెడ్	ఆస్ట్రేలియా	రూ. 14 కోట్లు
నితీశ్ రెడ్డి	భారత్	రూ. 6 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 45 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం: ఒక అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను తీసుకోవచ్చు

ముంబై ఇండియన్స్ 5

ఆటగాడు	దేశం	ధర
జస్‌ప్రీత్ బుమ్రా	భారత్	రూ. 18 కోట్లు
సూర్యకుమార్	భారత్	రూ. 16.35 కోట్లు
హార్దిక్ పాండ్యా	భారత్	రూ. 16.35 కోట్లు
రోహిత్ శర్మ	భారత్	రూ. 16.30 కోట్లు
తిలక్ వర్మ	భారత్	రూ. 8 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 45 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం: ఒక అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను తీసుకోవచ్చు

చెన్నై సూపర్ కింగ్స్ 5

ఆటగాడు	దేశం	ధర
రుతురాజ్ గైక్వాడ్	భారత్	రూ. 18 కోట్లు
మతీశా పతిరన	శ్రీలంక	రూ. 13 కోట్లు
శివమ్ దూబే	భారత్	రూ. 12 కోట్లు
రవీంద్ర జడేజా	భారత్	రూ. 18 కోట్లు
ధోనీ	భారత్	రూ. 4 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 55 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం: ఒక అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను తీసుకోవచ్చు

కోల్‌కతా నైట్ రైడర్స్ 6

ఆటగాడు	దేశం	ధర
రింకూ సింగ్	భారత్	రూ. 13 కోట్లు
వరుణ్ చక్రవర్తి	భారత్	రూ. 12 కోట్లు
సునీల్ నరైన్	వెస్టిండీస్	రూ. 12 కోట్లు
ఆండ్రె రసెల్	వెస్టిండీస్	రూ. 12 కోట్లు
హర్షిత్ రాణా	భారత్	రూ. 4 కోట్లు
రమణ్‌దీప్ సింగ్	భారత్	రూ. 4 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 51 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం లేదు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 3

ఆటగాడు	దేశం	ధర
విరాట్ కోహ్లి	భారత్	రూ. 21 కోట్లు
రజత్ పాటిదార్	భారత్	రూ. 11 కోట్లు
యశ్ దయాళ్	భారత్	రూ. 5 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 83 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం: ముగ్గురు క్యాప్‌డ్ ప్లేయర్లను తీసుకోవచ్చు

పంజాబ్ కింగ్స్ 2

ఆటగాడు	దేశం	ధర
శశాంక్ సింగ్	భారత్	రూ. 5.5 కోట్లు
ప్రభ్‌సిమ్రన్ సింగ్	భారత్	రూ. 4 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 110.5 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం: నలుగురు క్యాప్‌డ్ ప్లేయర్లను తీసుకోవచ్చు

రాజస్తాన్ రాయల్స్ 6

ఆటగాడు	దేశం	ధర
సంజూ సామ్సన్	భారత్	రూ. 18 కోట్లు
యశస్వి జైస్వాల్	భారత్	రూ. 18 కోట్లు
రియాన్ పరాగ్	భారత్	రూ. 14 కోట్లు
ధ్రువ్ జురెల్	భారత్	రూ. 14 కోట్లు
హెట్‌మైర్	వెస్టిండీస్	రూ. 11 కోట్లు
సందీప్ శర్మ	భారత్	రూ. 4 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 41 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం లేదు

గుజరాత్ టైటాన్స్ 5

ఆటగాడు	దేశం	ధర
రషీద్ ఖాన్	అఫ్గానిస్తాన్	రూ. 18 కోట్లు
శుబ్‌మన్ గిల్	భారత్	రూ. 16.50 కోట్లు
సాయి సుదర్శన్	భారత్	రూ. 8.50 కోట్లు
రాహుల్ తెవాటియా	భారత్	రూ. 4 కోట్లు
షారుఖ్ ఖాన్	భారత్	రూ. 4 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 69 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం లేదు: ఒక క్యాప్‌డ్ ప్లేయర్‌ను తీసుకోవచ్చు

ఢిల్లీ క్యాపిటల్స్ 4

ఆటగాడు	దేశం	ధర
అక్షర్ పటేల్	భారత్	రూ. 16.50 కోట్లు
కుల్దీప్ యాదవ్	భారత్	రూ. 13.25 కోట్లు
ట్రిస్టన్ స్టబ్స్	దక్షిణాఫ్రికా	రూ. 10 కోట్లు
అభిషేక్ పొరెల్	భారత్	రూ. 4 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 73 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం: ఇద్దరు క్యాప్డ్ ప్లేయర్లను తీసుకోవచ్చు

లక్నో సూపర్ జెయింట్స్ 5

ఆటగాడు	దేశం	ధర
నికోలస్ పూరన్	వెస్టిండీస్	రూ. 21 కోట్లు
రవి బిష్ణోయ్	భారత్	రూ. 11 కోట్లు
మయాంక్ యాదవ్	భారత్	రూ. 11 కోట్లు
మొహసిన్ ఖాన్	భారత్	రూ. 4 కోట్లు
ఆయుష్ బదోని	భారత్	రూ. 4 కోట్లు

వేలం కోసం మిగిలిన మొత్తం: రూ. 69 కోట్లు
ఆర్టీఎమ్ అవకాశం లేదు: ఒక క్యాప్‌డ్ ప్లేయర్‌ను తీసుకోవచ్చు



సెమీఫైనల్లో సాకేత్–రామ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: సియోల్ ఓపెన్ ఏటీపీ–100 చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. దక్షిణ కొరియాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ జంట 6–3, 6–1తో యోంగ్ సియోక్ జియోంగ్–యుసంగ్ పార్క్ (దక్షిణ కొరియా) జోడీపై గెలిచింది. 59 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–రామ్ జంట నాలుగు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేసింది. నేడు జరిగే సెమీఫైనల్లో జిసుంగ్ నామ్ (దక్షిణ కొరియా)–జోషువా పారిస్ (బ్రిటన్) జంటతో సాకేత్–రామ్‌కుమార్ ద్వయం ఆడుతుంది. ఇదే టోర్నీలో ఆడుతున్న హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ భారత్‌కే చెందిన తన భాగస్వామి నిక్కీ కలియంద పూనాచా జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ అనిరుధ్–నిక్కీ జంట 1–6, 3–6తో జిసుంగ్ నామ్ (దక్షిణ కొరియా)–జోషువా పారిస్ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడిపోయింది.

విండీస్‌దే తొలి వన్డే

రాణించిన గుడకేశ్ మోతీ, లూయిస్



నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): ఇంగ్లండ్‌తో మొదలైన మూడు వన్డేల సిరీస్‌లో వెస్టిండీస్ 1–0తో ముందంజ వేసింది. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన తొలి మ్యాచ్‌లో విండీస్ 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 45.1 ఓవర్లలో 209 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ లివింగ్‌స్టోన్ (49 బంతుల్లో 48; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... స్యామ్ కరన్ (56 బంతుల్లో 37; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గుడకేశ్ మోతీ (4/41) ప్రత్యర్థిని పడగొట్టగా... సీల్స్, అల్జారి జోసెఫ్, మాథ్యూ ఫోర్డ్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం విండీస్ స్కోరు 15 ఓవర్లలో 81/0 వద్ద ఉండగా వర్షంతో ఆట నిలిచిపోయింది. దాంతో విండీస్ లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 35 ఓవర్లలో 157 పరుగులుగా నిర్దేశించారు. విండీస్ 25.5 ఓవర్లలో 2 వికెట్లకు 157 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఎవిన్ లూయిస్ (69 బంతుల్లో 94; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా... బ్రెండన్ కింగ్ (30) అండగా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే నేడు ఇదే మైదానంలో జరుగుతుంది.

గాయంతో వైదొలిగిన రిత్విక్ ద్వయం



సాక్షి, హైదరాబాద్: స్లొవాక్ ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ–అర్జున్ ఖడే (భారత్) జోడీ పోరాటం ముగిసింది. స్లొవేకియా రాజధాని బ్రాటిస్లావాలో జరుగుతున్న ఈ టోర్నీలో రిత్విక్–అర్జున్ ద్వయం గాయం కారణంగా సెమీఫైనల్ మ్యాచ్ నుంచి మధ్యలో వైదొలిగింది. టాప్ సీడ్ నికోలస్ బారిన్‌టోస్ (కొలంబియా)–జూలియన్ క్యాష్ (బ్రిటన్)లతో జరిగిన సెమీఫైనల్లో రిత్విక్–అర్జున్ జంట 4–2తో ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో భారత జోడీకి గాయం కావడంతో మ్యాచ్ నుంచి తప్పుకుంది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో శ్రీరామ్ బాలాజీ (భారత్)–గిడో ఆండ్రెజి (అర్జెంటీనా) ద్వయం 2–6, 5–7తో వెర్‌బెన్స్కయ్ (చెక్ రిపబ్లిక్)–లుకాస్ పొకోర్నీ (స్లొవేకియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

రెండో టెస్టులో బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ 273 పరుగులతో జయభేరి



చట్టోగ్రామ్: బంగ్లాదేశ్ పర్యటనను దక్షిణాఫ్రికా జట్టు భారీ విజయంతో ముగించింది. మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో ఇన్నింగ్స్ 273 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం ఆటలో బంగ్లాదేశ్ ఏకంగా 16 వికెట్లను సమర్పించుకుంది. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 38/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లాదేశ్ 45.2 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. మిడిలార్డర్ బ్యాటర్ మోమినుల్ హక్ (82; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. మొత్తం ఇన్నింగ్స్‌లో ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. హసన్ (10) సహా రెండో అత్యధిక స్కోరు పదో వరుస బ్యాటర్ తైజుల్ ఇస్లామ్ (95 బంతుల్లో 30; 1 ఫోర్) చేశాడు. నిజానికి బంగ్లాజట్టు 15వ ఓవర్ కూడా ముగియకముందే 48 పరుగులకే 8 వికెట్లు కోల్పోగా... మోమినుల్, తైజుల్ తొమ్మిదో వికెట్ భాగస్వామ్యానికి పెద్ద పోరాటమే చేశారు. ఇద్దరు కలిసి 103 పరుగులు జోడించడంతో బంగ్లా 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది. రబడ 5 వికెట్లు పడగొట్టగా, డేన్ పీటర్సన్, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. 416 పరుగుల భారీ ఆధిక్యం పొందిన దక్షిణాఫ్రికా... బంగ్లాదేశ్‌ను ఫాలోఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ బంగ్లాదేశ్ బ్యాటర్లు తేలిపోయారు. దాంతో బంగ్లాదేశ్ 43.4 ఓవర్లలో 143 పరుగులకే ఆలౌటైంది. ఈసారి స్పిన్నర్లు కేశవ్ మహరాజ్ (5/59), సేనురన్ ముత్తుస్వామి (4/45) బంగ్లా బ్యాటర్లను తిప్పేశారు. హసన్ (38 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు), కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ (36; 4 ఫోర్లు, 1 సిక్స్), ఇస్లామ్ (29; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కాస్త మెరుగ్గా ఆడారు. ఈ రెండు ఇన్నింగ్స్‌లు కలిపి కూడా బంగ్లాదేశ్ 100 ఓవర్లు ఆడలేకపోయింది. రెండు టెస్టుల్లో కలిపి 14 వికెట్లు తీసిన రబడకు 'ప్లేయర్ ఆఫ్ సిరీస్', ఈ మ్యాచ్‌లో భారీ సెంచరీ సాధించిన ఓపెనర్ టోని డి జార్జికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు దక్కాయి. 22 ఏళ్ల తర్వాత ఇన్నింగ్స్ పరుగుల తేడాలో బంగ్లాదేశ్ రెండో చెత్త పరాజయం చవిచూసింది. 2002లో వెస్టిండీస్ చేతిలో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 310 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది.

పింక్ పాంథర్స్‌పై యు ముంబా పైచేయి



సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో యు ముంబా జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన పోరులో యు ముంబా 39–37తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది. యు ముంబా రెయిడర్ అజిత్ చవాన్ 14 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. 7 రెయిడ్ పాయింట్లు సాధించిన అజిత్... 7 బోనస్ పాయింట్లు సంపాదించాడు. జైపూర్ తరఫున నీరజ్ (12 పాయింట్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన యు ముంబా రెండు విజయాలు ఒక ఓటమి, ఒక 'డ్రా'తో 13 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 44–30 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీపై నెగ్గింది. పట్నా తరఫున దేవాంక్, అయాన్ చెరో 12 పాయింట్లు సాధించగా... ఢిల్లీ జట్టు తరఫున అశు మలిక్, వినయ్ వీరేందర్ 10 పాయింట్ల చొప్పున సాధించారు. నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో పట్నా పైరేట్స్ (రాత్రి 8 గంటలకు), బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటలకు) తలపడనున్నాయి.

రష్మిక జోడీకి నిరాశ



సిడ్నీ: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మికకు నిరాశ ఎదురైంది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక–వైదేహి చౌదరి (భారత్) జోడీ 2–6, 0–6తో టాప్ సీడ్ డెస్టనీ–మ్యాడిసన్ ఇంగ్లిస్ (ఆస్ట్రేలియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో భారత జోడీ రెండు గేమ్‌లు మాత్రమే గెలిచింది.



ఫిలిప్పీన్స్‌లో ఇటీవల తుపానుతో పలు ప్రాంతాలు జల దిగ్బంధమయ్యాయి. పంపాంగా ప్రావిన్స్‌లోని మసన్‌టోల్ శ్మశాన వాటికలోకి వరద చేరింది. గురువారం ఆ వరదలోనే తమ కుటుంబసభ్యుల సమాధిపైకి చేరి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువతులు



జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం కోసం శుక్రవారం రాంచీ చేరుకున్న పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సంప్రదాయ దోల్‌పై దరువు వేస్తున్న వేణుగోపాల్



జర్మనీలోని పారిశ్రామిక నగరం ఫ్రాంక్‌ఫర్ట్ సమీపంలోని యుసింజెన్ అటవీ ప్రాంతంలోని రంగురంగుల చెట్ల మధ్యన రహదారిపై ట్రాఫిక్ దృశ్యమిది.

నవంబర్‌లో చలి లేనట్లే!

- కోస్తాంధ్ర, రాయలసీమలో సాధారణం కంటే అధిక వర్షాలు
- భారత వాతావరణ విభాగం అంచనా

న్యూఢిల్లీ: సాధారణంగా నవంబర్ మాసం వచ్చిందంటే చలికాలం మొదలైనట్లే. చలి గాలులు గిలిగింతలు పెడుతుంటాయి. కానీ, ఈసారి ఆ పరిస్థితి ఉండకపోవచ్చని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) డైరెక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర శుక్రవారం చెప్పారు. ఈ ఏడాది అక్టోబర్‌లో సాధారణం కంటే 1.23 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. అక్టోబర్‌లో సాధారణంగా 25.69 డిగ్రీలు నమోదు కావాల్సి ఉండగా, ఈసారి 26.92 డిగ్రీలు నమోదైంది. 1901 తర్వాత అత్యంత వేడి కలిగిన అక్టోబర్‌గా రికార్డుకెక్కింది. నవంబర్‌లోనూ ఉష్ణోగ్రతలు తగ్గిపోయే సూచనలు కనిపించడం లేదని మృత్యుంజయ్ వివరించారు. చలి పెరగడానికి వీలుగా వాతావరణ పరిస్థితులు లేవని అన్నారు. నవంబర్‌లో చలికి వాయవ్య భారతదేశం నుంచి వీలే గాలులే కీలకమని వివరించారు. అక్కడ రుతుపవనాల ప్రభావం ఇంకా ఉండడంతో గాలులు వీచడం లేదని తెలియజేశారు. వాయువ్య భాగంలో మరో రెండు వారాల పాటు ఉష్ణోగ్రతలు సాధారణ కంటే 2 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదవుతాయని చెప్పారు. రెండు వారాల తర్వాత మాత్రమే ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి రావడానికి అవకాశం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. నవంబర్‌లో కోస్తాంధ్ర, రాయలసీమ, కేరళ, కర్ణాటక, తమిళనాడులో సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయని తెలిపారు. వాస్తవానికి వాతావరణ విభాగం దృష్టిలో నవంబర్ నెల చలి మాసం కాదు. జనవరి, ఫిబ్రవరి మాత్రమే చలి మాసాలు.

ప్రమిదల తయారీలో రాహుల్ గాంధీ...

శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కే వ్యవస్థ రావాలన్న కాంగ్రెస్ అగ్ర నేత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మరోమారు వృత్తి పనివారల ఇబ్బందులను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఇందుకు సంబంధించిన సుమారు 9 నిమిషాల వీడియోను శుక్రవారం 'ఎక్స్'లో విడుదల చేశారు. ఢిల్లీలో మట్టి ప్రమిదలను తయారు చేసే మహిళ ఇంటికి రాహుల్ గాంధీ వెళ్లారు. ప్రమిదలను సొంతంగా తయారు చేసేందుకు ప్రయత్నించారు. వీటిని తన తల్లి సోనియా గాంధీ, సోదరి ప్రియాంకా గాంధీ వాద్రాకు ఇస్తానన్నారు. 'ప్రత్యేకమైన వ్యక్తులతో గుర్తుండిపోయే దీపావళి ఇది. దీపావళి నాడు పెయింటర్ సోదరులతో, కుమ్మరి వృత్తి పని వారి కుటుంబంతో పనిచేస్తూ గడిపాను. వారి వృత్తి పనిని దగ్గర్నుంచి గమనించాను. వారి పనితనాన్ని అలవాటు చేసుకునేందుకు ప్రయత్నించాను. వారి కష్టనష్టాలను అర్థం చేసుకున్నాను. మనం కుటుంబంతో కలిసి పండగలను సంతోషంతో జరుపుకుంటాం. వారు మాత్రం ఎంతోకొంత డబ్బు సంపాదించుకునేందుకు సొంతింటిని, కుటుంబాన్ని, సొంతూరిని, నగరాన్ని మర్చిపోతున్నారు'అని అనంతరం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'మట్టిలోనే వారు సంతోషం వెదుక్కుంటున్నారు. ఇతరుల జీవితాల్లో పండుగ వెలుగుల కోసం ప్రయత్నిస్తూ..తమ జీవితాల్లో వెలుగులు నింపుకోగలుతున్నారా? ఇళ్లను నిర్మించే వీరికి సొంతిల్లు కూడా ఉండటం గగనంగా మారింది'అని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు, నైపుణ్యానికి తగిన ప్రతిఫలం, ఆత్మగౌరవాన్ని అందించే వ్యవస్థను మనం తయారు చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ దీపావళి అందరికీ సుఖ సంతోషాలను ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.



బంగ్లాకు రంగు వేస్తూ..



కుమ్మరి చక్రంపై ప్రమిదె తయారీలో రాహుల్..

10, జన్‌పథ్ బంగ్లా అంటే పెద్దగా ఇష్టం లేదు

ఢిల్లీలోని ల్యుటెన్స్ ప్రాంతంలో ఉన్న 10, జన్‌పథ్ బంగ్లా అంటే తనకు పెద్దగా ఇష్టం లేదని రాహుల్ గాంధీ చెప్పారు. తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 1991లో తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో హత్యకు గురైన సమయంలో ఈ బంగ్లాలోనే ఉన్నారని, అందుకే అంతగా ఇష్టం లేదని ఆయన గురువారం చెప్పారు. జన్‌పథ్ బంగ్లాకు రంగులు వేసే కార్మికులతో కలిసి పనిచేశారు. ఈ సందర్భంగా సోదరి ప్రియాంకా గాంధీ కుమారుడు, మేనల్లుడు రైహాన్ రాజీవ్ వాద్రాతో ఈ మేరకు చేసిన సంభాషణ వీడియోను ఆయన విడుదల చేశారు. రాహుల్ గాంధీ చిన్నప్పటి నుంచి 10, జన్‌పథ్ బంగ్లాలోనే గడిపారు. రాజీవ్ గాంధీ హత్యానంతరం తల్లి సోనియా గాంధీకి ఈ భవనాన్ని కేటాయించారు. రాహుల్ ఎంపీ అయ్యాక తుగ్లక్ లేన్‌లోని 12వ నంబర్ బంగ్లాకు మకాం మార్చారు. 2023లో పరువు నష్టం కేసులో అనర్హత వేటు పడటంతో తల్లి ఉండే జన్‌పథ్ బంగ్లాకు మారారు. అనర్హత వేటు తొలిగి, మళ్లీ ఎంపీ అయ్యాక కూడా రాహుల్ ఇక్కడే ఉంటున్నారు.

డెమ్‌చోక్‌లో పెట్రోలింగ్ ప్రారంభం

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వద్ద భారత్, చైనా బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో సాధారణ గస్తీ(పెట్రోలింగ్)పై ఇరు దేశాలు దృష్టి పెట్టాయి. డెమ్‌చోక్‌లో భారత సైన్యం శుక్రవారం పెట్రోలింగ్ ప్రారంభించినట్లు సైనిక అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. డెస్పాంగ్‌లో అతి త్వరలో పెట్రోలింగ్ ప్రారంభమవుతుందని తెలియజేశాయి. ఒప్పందం ప్రకారం డెమ్‌చోక్, డెస్పాంగ్ నుంచి భారత్, చైనా బలగాలు పూర్తిగా వెనక్కి వెళ్లిపోయాయి. ఈ రెండు ప్రాంతాల్లో 2020 ఏప్రిల్‌కు ముందున్న తరహాలోనే పెట్రోలింగ్ కొనసాగే అవకాశం కనిపిస్తోంది. గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత నాలుగేళ్లుగా ఎల్‌ఏసీ వద్ద కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ఇటీవలే తెరపడిన సంగతి తెలిసిందే.

రత్న భాండార్‌లో రహస్య చాంబర్లు లేవు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని ఆలయం ఆవరణలోని రత్న భాండార్ లోపల ఎటువంటి రహస్య గదులు లేవని ఒడిశా న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ స్పష్టం చేశారు. భారత పురాతత్వ శాఖ(ఏఎస్ఐ) నిపుణులు గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్(జీపీఆర్) చేపట్టిన సర్వేలో ప్రాథమికంగా ఈ విషయం తేలిందన్నారు. తుది నివేదిక అందాక దీనిపై పూర్తి స్థాయిలో స్పష్టత వస్తుందని మంత్రి వివరించారు. అయితే, రత్న భాండార్ గది గోడలకు పగుళ్లు వచ్చినట్లు సర్వేలో గుర్తించారని తెలిపారు. ఏఎస్ఐ ఆధ్వర్యంలో రత్న భాండార్‌కు మరమ్మతులు పూర్తయ్యాక ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను తిరిగి అందులోకి మారుస్తామని వెల్లడించారు.

పాక్‌లో పేలుడు.. 9 మంది మృతి

మృతుల్లో ఐదుగురు స్కూలు పిల్లలు

ఇస్లామాబాద్/కరాచీ: పాకిస్తాన్‌లోని కల్లోల బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకున్న బాంబు పేలుడుతో ఐదుగురు స్కూలు పిల్లలు, పోలీస్ అధికారి సహా 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మస్టుంగ్ జిల్లా కేంద్రంలోని సివిల్ హాస్పిటల్ లైన్‌లో ఉన్న బాలికల హైస్కూల్ సమీపంలో శుక్రవారం 8.35 గంటల సమయంలో పేలుడు చోటుచేసుకుంది. బైక్‌లో ఉంచిన పేలుడు పదార్థాన్ని ఉగ్రవాదులు రిమోట్‌తో పేల్చివేశారని అధికారులు తెలిపారు. పోలీసు వాహనం లక్ష్యంగా పేలుడుకు పాల్పడ్డారని, అయితే అదే సమయంలో స్కూలు పిల్లల ఆటో అక్కడికి చేరుకోవడంతో ఘోరం జరిగిందని చెప్పారు. ఘటనలో పోలీస్ వ్యాన్‌తోపాటు కొన్ని ఆటోలు ధ్వంసమయ్యాయన్నారు. ఘటనలో స్కూలు విద్యార్థులు, పోలీసులు సహా 30 మంది వరకు గాయపడ్డారన్నారు.

మహారాష్ట్ర నామినేషన్లు 7,994

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు గాను అందిన నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తయిందని ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 7,994 నామినేషన్ పత్రాలను సరైనవిగా గుర్తించగా, మరో 921 నామినేషన్లను తిరస్కరించినట్లు వెల్లడించారు. అసెంబ్లీలోని మొత్తం 288 స్థానాలకు ఈ నెల 20వ తేదీన జరగాల్సిన ఎన్నికలకు గాను నామినేషన్లను అక్టోబర్ 22–29 తేదీల మధ్య స్వీకరించారు. అక్టోబర్ 30న నామినేషన్ పత్రాల పరిశీలన చేపట్టారు. ఈ నెల 4వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది.

కశ్మీర్ బీజేపీ ఎమ్మెల్యే రాణా కన్నుమూత

జమ్మూ: జమ్మూకశ్మీర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా(59) గురువారం రాత్రి కన్నుమూశారు. హరియాణా రాష్ట్రం ఫరీదాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన మృతి చెందారని బీజేపీ ప్రతినిధి ఒకరు తెలిపారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోదరుడు కూడా అయిన దేవేందర్ సింగ్ మృతికి కారణాలు తెలియరాలేదు. వ్యాపారవేత్త అయిన దేవేందర్ సింగ్ ఇటీవలి ఎన్నికల్లో జమ్మూ జిల్లా నగ్రోటా నుంచి 30 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. హరియాణాలోని కురుక్షేత్ర నిట్‌లో ఇంజినీరింగ్ చేసిన ఆయన జమ్‌కాశ్ వెహికల్‌లీడ్స్ అనే ఆటోమొబైల్ సంస్థను స్థాపించారు. నేషనల్ కాన్ఫరెన్స్‌లో చేరికతో రాజకీయ జీవితం మొదలైంది. అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీ ప్రావెన్షియల్ అధ్యక్షుడయ్యారు. అప్పటి సీఎం ఒమర్ అబ్దుల్లా రాజకీయ సలహాదారుగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో నగ్రోటా నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2021 అక్టోబర్‌లో ఎన్‌సీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు.

హెజ్‌బొల్లా రాకెట్ల దాడిలో ఏడుగురు మృతి

జెరుసలేం: లెబనాన్‌లోని హెజ్‌బొల్లా గ్రూపు గురువారం ఇజ్రాయెల్‌పైకి భారీ సంఖ్యలో రాకెట్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో మెటులా ప్రాంతంలో ఆలివ్ వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే నలుగురు విదేశీ కార్మికులు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన కార్మికులు ఏ దేశస్తులో అధికారులు వెల్లడించలేదు. అక్టోబర్ మొదట వారంలో ఇజ్రాయెల్ బలగాలు లెబనాన్‌పై భూతల దాడులకు దిగాక హెజ్‌బొల్లా చేపట్టిన అతిపెద్ద దాడి ఇదేనని చెబుతున్నారు. పెద్ద సంఖ్యలో రాకెట్లు ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంలోని హైఫా పైకి దూసుకొచ్చినట్లు సమాచారం. ఇలా ఉండగా, ఇజ్రాయెల్ వైపు దూసుకెళ్లే రాకెట్ ఒకటి బుధవారం లెబనాన్‌లోని తమ శాంతి పరిరక్షక దళం బేస్‌పై పడిందని ఐర్లాండ్ ప్రభుత్వం తెలిపింది. ఈ పరిణామంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనలో ఎటువంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంది. ఆ రాకెట్ దానంతటదే పడిందా, లేక ఇజ్రాయెల్ ఆర్మీ కూల్చిందా అనేది తెలియాల్సి ఉందని పేర్కొంది.

గాజాలో 25 మంది మృతి: డెయిర్ అల్-బలాహ్: గాజాలోని నుసెయిరత్ శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ ఆర్మీ గురు, శుక్రవారాల్లో జరిపిన దాడుల్లో మృతుల సంఖ్య 25కు చేరుకుంది. వీరిలో ఐదుగురు చిన్నారులున్నట్లు అల్ అక్సా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరిలో పదేళ్ల చిన్నారి, 18 నెలల వయస్సున్న ఆమె సోదరుడు ఉన్నారు. దాడి తర్వాత వీరి తల్లి ఆచూకీ కనిపించడం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. చిన్నారుల తండ్రి నాలుగు నెలల క్రితం ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయాడని వారు చెప్పారు.

ఐరాస కార్యాలయం ధ్వంసం

వెస్ట్‌బ్యాంక్‌లోని నూర్‌షమ్స్ శరణార్థి శిబిరంలో ఉన్న ఐరాస శరణార్థి విభాగం కార్యాలయాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ గురువారం బుల్డోజర్లతో ధ్వంసం చేసింది. కార్యాలయ భవనం పాక్షికంగా దెబ్బతిందని పాలస్తీనా మీడియా తెలిపింది. కార్యాలయం వెలుపలి గోడ ధ్వంసమైంది. తాత్కాలిక హాల్ మొత్తం నేలమట్టమైంది. పైకప్పు దెబ్బతింది. భవనం ప్రాంగణం మట్టి, శిథిలాలతో నిండిపోయిట్లు కనిపిస్తున్న వీడియోను అసోసియేటెడ్ ప్రెస్ విడుదల చేసింది.

లెబనాన్‌లో 24 మంది మృతి

లెబనాన్‌లోని బీరుట్, బాల్బెక్-హెర్మెల్, దహియే ప్రాంతాలపై ఇజ్రాయెల్ ఆర్మీ శుక్రవారం జరిపిన దాడుల్లో 24 మంది చనిపోయారు. లెబనాన్-సిరియా సరిహద్దుల్లోని హెజ్‌బొల్లా ఆయుధ డిపోలు, స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆర్మీ గురువారం భీకర దాడులకు పాల్పడింది. తమ యుద్ధ విమానాలు కుసాయిర్ నగరంలోని పలు లక్ష్యాలపై బాంబులు వేశాయని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

బిబేక్ డెబ్రాయ్ కన్నుమూత



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్, ప్రముఖ ఆర్థికవేత్త బిబేక్ డెబ్రాయ్ అనారోగ్యంతో కన్నుమూశారు. 69 ఏళ్ల డెబ్రాయ్ చాలా రోజులుగా డయాబెటిస్, హైపర్ టెన్షన్, గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం రాత్రి ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన డెబ్రాయ్ 2017 సెప్టెంబర్ నుంచి ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్‌గా పనిచేస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన బిబేక్ డెబ్రాయ్ నరేంద్రపూర్‌లోని రామకృష్ణ మిషన్ స్కూల్‌లో, కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకున్నారు. తర్వాత ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని ట్రినిటీ కాలేజీలో ఉన్నత విద్య అభ్యసించారు. ఉపనిషత్తులు, పురాణాలు, నాలుగు వేదాలతోపాటు వాల్మీకి రామయనం, మహాభారతాన్ని అనువదించారు. 2015లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

రాష్ట్రపతి, ప్రధానమంత్రి సంతాపం

బిబేక్ డెబ్రాయ్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఒక గొప్ప మేధావిని దేశం కోల్పోయిందని విచారం వ్యక్తంచేశారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో డెబ్రాయ్‌కి అపారమైన పరిజ్ఞానం ఉందని కొనియాడారు. డెబ్రాయ్ మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

కెనడాలో డ్రగ్స్ సూపర్‌ల్యాబ్ గుట్టురట్టు

- రూ.4,076 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- భారత సంతతి వ్యాపారవేత్త అరెస్టు

వాంకోవర్: కెనడాలో మాదక ద్రవ్యాల తయారీ కేంద్రం గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏకంగా 485 మిలియన్ డాలర్ల (రూ.4,076 కోట్లు) కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ప్రయోగశాలలో డ్రగ్స్ తయారు చేసి, విక్రయిస్తున్న భారత సంతతి వ్యాపారవేత్త గగన్‌ప్రీత్ రంధవాను అరెస్టు చేశారు. కెనడాలో బ్రిటిష్ కొలంబియాలోని కామ్లూప్స్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఫాల్క్‌ల్యాండ్ అనే గ్రామీణ ప్రాంతంలో ఈ సూపర్ ల్యాబ్ ఏర్పాటుచేశారు. ఇక్కడ ఫెంటానైల్, మెథ్, కొకైన్, కన్నబీస్ తదితర డ్రగ్స్ పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. సూపర్ ల్యాబ్ గురించి సమాచారం అందుకున్న రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు దాడి చేశారు. అక్కడి ఏర్పాట్లు చూసి ఆశ్చర్యపోయారు. అత్యాధునికంగా ఉన్న ల్యాబ్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు తయారవుతుండడం చూసి అవాక్కయ్యారు. ఈ దాడిలో 500 కిలోలకుపైగా డ్రగ్స్ లభించాయి. అంతేకాదు కొన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలు సైతం లభ్యమయ్యాయి. ఇక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలకు మాదక ద్రవ్యాలు రవాణా అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ల్యాబ్ నిర్వహణలో, డ్రగ్స్ దందాలో గగన్‌ప్రీత్ రంధవా కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తేల్చారు.

ప్రపంచంలోనే శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించాం

ఉత్తర కొరియా ప్రకటన

సియోల్: అత్యంత శక్తివంతమైన, బలీయమైన ఖండాంతర బాలిస్టిక్ మిస్సైల్ (ఐసీఎంబీ)ను పరీక్షించామని శుక్రవారం ఉత్తరకొరియా ప్రకటించింది. ఇది ప్రచార యావ తప్పితే.. వాస్తవ యుద్ధ పరిస్థితుల్లో ఇంతటి భారీ స్థాయి క్షిపణి ఉపయుక్తకరంగా ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అమెరికాను చేరుకోగల ఖండాంతర క్షిపణుల అభివృద్ధి చేయడంలో సాంకేతిక అడ్డంకులను ఉత్తరకొరియా అధిగమించినట్లు తాజా క్షిపణి పరీక్ష ఎక్కడా రుజువు చేయలేకపోయిందని నిపుణులు పేర్కొన్నారు. గురువారం తాము పరీక్షించిన ఖండాంతర క్షిపణి హ్వాసాంగ్–19 .. ఇదివరకు ఎన్నడూ లేనంత దూరానికి, ఎన్నడూ లేనంత ఎత్తులో ప్రయాణించిందని ఉత్తరకొరియా ప్రకటించింది. దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ ఈ పరీక్షను దగ్గరుండి పరిశీలించారని వెల్లడించింది. రష్యా, అమెరికా వద్దనున్న అత్యాధునిక ఖండాంతర క్షిపణుల పొడవు 20 మీటర్ల లోపే ఉంటుందని, హ్వాసాంగ్–19 పొడవు 28 మీటర్లు ఉండటం మూలంగా.. ప్రయోగానికి ముందుగానే దీన్ని దక్షిణకొరియా నిఘా సంస్థలు కనిపెట్టగలిగాయని దక్షిణకొరియా వ్యూహ నిపుణుడు చాంగ్ యంగ్–కెయున్ తెలిపారు. ల్యాంచ్‌ప్యాడ్ల పరిమాణం పెరుగుతుందని, పొడవు అధికంగా ఉన్నందువల్ల శత్రుదేశాల నిఘా రాడార్లకు ఈ తరహా క్షిపణులు సులభంగా చిక్కుతాయని వివరించారు.

ఉక్రెయిన్ సరిహద్దుల్లో 8 వేల కొరియా సైనికులు

ఎనిమిది వేల మంది ఉత్తరకొరియా సైనికులను ఉక్రెయిన్ సరిహద్దుల్లో రష్యా మోహరించిందని అమెరికా వెల్లడించింది. రష్యాలోని కర్స్క్‌లో ఉక్రెయిన్ సేనలు పాగా వేయడం తెలిసిందే. కర్స్క్ నుంచి ఉక్రెయిన్ సేనలు వెనక్కి మళ్లించడానికి వీలుగా 8 వేల మంది ఉత్తరకొరియా సైనికులను తరలించిందని వివరించింది.

రక్షణ శాఖ కార్యదర్శిగా రాజేశ్ కుమార్ సింగ్

నేషనల్ వార్ మెమోరియల్‌లో నివాళులు అర్పించి బాధ్యతలు స్వీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: రక్షణ కార్యదర్శిగా నియమితులైన రాజేశ్ కుమార్ సింగ్ ఢిల్లీ సౌత్ బ్లాకులో శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. కేరళ కేడర్ 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన ఆర్‌కే సింగ్ ఈ ఏడాది ఆగస్టు 20న రక్షణశాఖలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (రక్షణ కార్యదర్శి పదవిలో)గా బాధ్యతలు చేపట్టారు. కాగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించే కంటే ముందు ఆర్‌కే సింగ్ నేషనల్ వార్ మెమోరియల్‌కు వెళ్లి, అమరులైన జవానులకు నివాళులు సమర్పించారు. 'మాతృభూమికి సేవ చేయడంలో అత్యున్నత త్యాగానికి వెనుదీయని మన శూర జవానులకు ఈ దేశ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు. అమర జవానుల అసాధారణ ధైర్య సాహసాలు, వారి త్యాగాలు భారత్‌ను ఒక సురక్షిత, సమృద్ధ దేశంగా తీర్చిదిద్దడానికి మనకందరికీ శక్తిని, ప్రేరణను అందిస్తూనే ఉంటాయి' అని రాజేశ్ కుమార్ సింగ్ అన్నారు. అంతకు ముందు, ఆయన 2023 ఏప్రిల్ 24 నుంచి 2024 ఆగస్టు 20 మధ్య కాలంలో వాణిజ్య, పరిశ్రమ శాఖలోని అంతర్గత వాణిజ్యం-పరిశ్రమల ప్రోత్సాహక విభాగం కార్యదర్శిగా సేవలు అందించారు. కాగా రక్షణ కార్యదర్శిగా గురువారం పదవీ విరమణ చేసిన ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి గిరిధర్ అరమానే స్థానంలో ఆ పదవిని ఆర్‌కే సింగ్ చేపట్టారు.

కాళ్లకు నమస్కరించి.. కాల్చి చంపారు!

పండగ వేళ ఢిల్లీలో దారుణం

న్యూఢిల్లీ: పాత కక్షలు విషం చిమ్మాయి. పండగనాడే ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నింపాయి. ఓ వ్యాపారి తన మేనల్లుడు, కుమారుడితో టపాసులు కాల్చేందుకు సిద్ధమవుతున్నారు. అంతలోనే అక్కడికి స్కూటర్‌పై ఇద్దరు ఆగంతకులు వచ్చారు. వ్యాపారి కాళ్లకు వంగి నమస్కరిస్తూనే వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్పులకు దిగారు. వ్యాపారి, ఆయన మేనల్లుడు అక్కడికక్కడే చనిపోగా కుమారుడు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. గురువారం రాత్రి ఢిల్లీలోని షాహ్‌దారా ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. ఆకాశ్ శర్మ(40), కుమారుడు క్రిష్ శర్మ(10), మేనల్లుడు రిషభ్ శర్మ గురువారం రాత్రి 8.30 గంటలప్పుడు తమ ఇంటి వద్ద టపాసులు కాల్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్కూటర్‌పై అక్కడికొచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆకాశ్‌కు నమస్కరించారు. ఆయన ఇంట్లోకి వెళ్లబోతుండగా తమ వద్ద తుపాకీతో కాల్పులకు దిగారు. వారిని పట్టుకోబోయిన రిషభ్‌తోపాటు, క్రిష్‌పైనా కాల్పులు జరిపారు. ఆకాశ్, రిషభ్ అక్కడికక్కడే చనిపోగా క్రిష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. భూమి వివాదమే దీనికి కారణమని ఆకాశ్ భార్య తెలిపారు.

పావుకిలో ఆలుగడ్డలను ఎత్తుకెళ్లారు!

పోలీసులకు ఫిర్యాదు! ● ఓ తాగుబోతు నిర్వాకం

హర్దోయ్: యూపీలో ఓ తాగుబోతు పోలీసులకు విచిత్రమైన ఫిర్యాదు చేశాడు! దీపావళి సందర్భంగా తప్పతాగి పోలీసు ఎమర్జెన్సీ నంబర్‌కు ఫోన్ చేశాడు. తన ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పాడు. దాంతో పోలీసు బృందం మనవాడి ఇంటి ముందు వాలింది. ఏం జరిగిందని ప్రశ్నిస్తే ''పావు కిలో ఆలుగడ్డలు ఎత్తుకెళ్లారు'' అని తాపీగా చెప్పాడు! పైగా, ''వంట కోసమని తోలు వలిచి తయారుగా పెట్టుకున్న ఆలుగడ్డలవి. తక్షణం దర్యాప్తు జరపాల్సిందే. నా ఆలుగడ్డలను నాకిప్పించాల్సిందే'' అని డిమాండ్ చేశాడు. దాంతో నోరెళ్లబెట్టడం పోలీసుల వంతైంది. వళ్లు మండిన ఖాకీలు గట్టిగా ఒకట్రెండు తగిలించారు. తప్పతాగి ఉన్నట్టు తేలడంతో చేసేది లేక వదిలేశారు. అయితే ఈ తతంగాన్ని పోలీసులే వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ''మేం కష్టపడి పని చేస్తాం. కనుక మందు తాగుతాం. తప్పేముంది? విషయం తాగుడు గురించి కాదు. ఆలుగడ్డల గురించి'' అంటూ పోలీసులతో మనవాడు గొడవ పెట్టుకున్న వైనం నవ్వులు పూయిస్తోంది. గురువారం హర్దోయ్ జిల్లాలో జరిగిన ఈ ఉదంతం వైరల్‌గా మారింది.

తొలిసారిగా హిందీలో శాసనాలను జారీ చేసినవారు?

తొలి మధ్యయుగం

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఉత్తర భారతదేశాన్ని 36 రాజపుత్ర వంశాలు పాలించాయి. వీటిలో ప్రతీహారులు, పరమారులు, చౌహాన్‌లు, సోలంకీలతోపాటు మరికొన్ని రాజ వంశాలు కూడా ప్రఖ్యాతి చెందాయి. ఈ రాజవంశాలు తమ పాలన ద్వారా ఉత్తర భారత సంస్కృతికి, వాస్తుశిల్ప కళలకు అమూల్య సేవలందించాయి.

చాందేలులు

వీరు ఘూర్జర ప్రతీహారుల తర్వాత జేజకభుక్తి (బుందేల్‌ఖండ్) ప్రాంతాన్ని పాలించారు. వీరు శాసనాల్లో తమను చంద్రవంశ క్షత్రీయులుగా పేర్కొన్నారు. వీరి రాజధాని ఖజురహో. క్రీ.శ. 9 నుంచి 14వ శతాబ్దం వరకు పాలించారు. వీరి కాలంలో దాదాపు 80 ఆలయాలను నిర్మించారు. వాటిలో 30కి పైగా ఆలయాలు నేటికీ నిలిచి ఉన్నాయి.

నన్నుక: చాందేల వంశాన్ని స్థాపించినవాడు. చాందేలుల వంశంలో తొలిరాజుగా నన్నుకను పేర్కొంటారు.

వాక్పతి: నన్నుక అనంతరం రాజ్యానికి వచ్చిన వాడు వాక్పతి. తన సమకాలీన పాల వంశ రాజు దేవపాలుడితో, ప్రతీహార రాజు భోజుడితో ఇతడు పలు యుద్ధాలు చేశాడు.

జయశక్తి: వాక్పతి కుమారుడు జయశక్తి. ఇతడు తన తండ్రి అనంతరం రాజ్యానికి వచ్చాడు. ఇతడి పేరు మీదుగానే ఈ రాజ్యాన్ని జేజకభుక్తి రాజ్యం అని పిలిచేవారు.

యశోవర్మన్: జయశక్తి అనంతరం విజయశక్తి, రాహిలుడు అనే రాజుల తర్వాత యశోవర్మన్ రాజ్యానికి వచ్చాడు. తన దండయాత్రల ద్వారా అనేక ప్రాంతాలను జయించి చాందేలులను ఒక గొప్పశక్తి రూపొందించాడు. తన రాజధాని ఖజురహోలో ఇతడు చతుర్భుజ స్వామి అనే విష్ణు ఆలయాన్ని నిర్మించాడు. దీన్నే లక్ష్మణ ఆలయం అని కూడా పిలుస్తారు.

ధంగ: ఇతడు 50 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ కాలంపాటు చాందేల రాజ్యాన్ని పాలించాడు. ఇతడి పాలనలో చాందేలులు తిరుగులేని శక్తిగా ఎదిగారు. ఇతడి రాజ్యం విదిష నుంచి గ్వాలియర్ వరకు, వారణాసి నుంచి నర్మద వరకు విస్తరించింది. ధంగ హయాం వాస్తుకళలకు పేరొందింది. రాజధాని ఖజురహోలో ఇతడు విశ్వనాథ, పార్శ్వనాథ ఆలయాలను నిర్మించాడు. ఇతడి కాలంలో పంజాబ్‌పై గజనీరాజు సబక్తజిన్ దాడి చేశాడు. ఈ దాడి నుంచి హిందూ షాహీరాజు జయపాలుడిని రక్షించేందుకు ధంగ కొన్ని రాజ్యాల కూటమిని



ఏర్పరిచి ఈ దాడిని ఎదుర్కొన్నాడు.

గండ: తన తండ్రిలాగే ఇతడు కూడా విదేశీ దండయాత్రలను ఎదుర్కొనేందుకు పంజాబ్ షాహీ రాజుల కూటముల్లో చేరాడు. ఇతడి కాలంలో క్రీ.శ. 1008లో మహ్మద్ గజనీ పంజాబ్‌పై దాడి చేశాడు. ఖజురహోలో గండ రెండు దేవాలయాలను నిర్మించాడు. అవి - దేవి జగదాంబి ఆలయం (వైష్ణవాలయం), చిత్రగుప్త ఆలయం (సూర్య దేవాలయం).

విద్యాధర: ఇతడు తన సమకాలీనులైన కాలచూరి రాజులను, పరమార రాజులను ఓడించి రాజ్యాన్ని మరింత విస్తరించాడు. ఇతడి పాలనా కాలంలో మహ్మద్ గజనీ క్రీ.శ. 1019, 1022లో రెండుసార్లు చాందేల రాజ్యంపై దాడి చేశాడు. ఖజురహోలోని దేవాలయాలన్నింటిలోకి తలమానికమైన కందరియ మహాదేవ ఆలయాన్ని విద్యాధరుడే నిర్మించాడు.

మదనవర్మన్: విద్యాధరుడి అనంతరం విజయపాల, దేవవర్మన్, కీర్తివర్మన్ మొదలైన బలహీన రాజుల పాలన అనంతరం మదనవర్మన్ రాజ్యానికొచ్చాడు. ఇతడు త్రిపురి పాలకులైన కాలచూరి రాజులను, పరమార రాజులను, గహద్వాలులను ఓడించాడు. కానీ ఇతడు మూడో పృథ్వీరాజు చౌహాన్ చేతిలో ఓడిపోయాడు.

పరమార్ది దేవ: ఇతడి కాలంలో కుతుబుద్దీన్ ఐబక్ వీరి రాజ్యంపై దాడి చేసి మహోబా, కళింజర్ మొదలైన ప్రాంతాలను ఆక్రమించాడు. పరమార్ది దేవ అనంతరం త్రిలోక్య వర్మన్, వీరవర్మన్ అనే రాజులు పాలించారు. కానీ క్రీ.శ. 1309లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కల్యాణీ చాళుక్య రాజ్యాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

గహద్వాలులు

వీరు తాము సూర్య చంద్ర వంశాలకు చెందిన వారమని, యయాతి వారసులమని పేర్కొన్నారు. కానీ వీరిని రాష్ట్రకూటుల శాఖకు చెంది నవారిగా చరిత్రకారులు భావించారు.

యశో విగ్రహ: ఇతడు గహద్వాల వంశస్థాపకుడు.

చంద్రదేవ: ఇతడిని స్వతంత్ర గహద్వాల రాజ్య స్థాపకుడిగా భావిస్తారు. ఇతడు పలు ప్రాంతాలను ఆక్రమించి బనారస్‌ను తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. ముస్లింల దాడులను ఎదుర్కొనేందుకు తన ప్రజల నుంచి తురుష్క దండన అనే పన్ను విధించాడు.

గోవిందచంద్ర: చంద్రదేవ అనంతరం కొద్దికాలం మదనపాలుడు పాలించాడు. తర్వాత అతడి కుమారుడు గోవిందచంద్ర రాజ్యానికొచ్చాడు. ఇతడిని ఈ వంశంలో అందరికంటే గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు పాల, బేధి, చాందేల రాజులను ఓడించాడు. గజనీరాజు మూడో మసూద్‌షా సైనికుల దాడిని తిప్పికొట్టాడు. కాశ్మీర్ రాజు జయసింహుడితో, గుజరాత్ పాలకుడు సిద్ధరాజుతో స్నేహ సంబంధాలను కలిగి ఉన్నాడు. ఇతడి ఆస్థానంలోనే లక్ష్మీధరుడు (యుద్ధమంత్రి) కృత్యకల్పతరు/కల్పద్రుమ అనే గ్రంథాన్ని రచించాడు. ఇతడి ఆస్థానంలోని మరో కవి దామోదరశర్మ ఉక్తి-వ్యక్తి-ప్రకరణం అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. గోవిందచంద్ర రాణి కుమారదేవి సారనాథ్‌లో బౌద్ధ విహారాన్ని నిర్మించింది.

విజయచంద్ర: తన తండ్రిలాగే ఇతడు కూడా వాయవ్యం నుంచి జరిగే విదేశీ దాడులను విజయవంతంగా ఎదుర్కొన్నాడు. విజయచంద్రుడి విజయాల గురించి విజయప్రశస్తి అనే గ్రంథాన్ని శ్రీహర్షుడు రచించాడు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

జయచంద్రుడు: పృథ్వీరాజరాసో గ్రంథం లో ఇతడి కుమార్తె రాణి సంయుక్తకు, మూడో పృథ్వీరాజ్‌కు మధ్య గల ప్రేమాయణం గురించి వివరించారు. పృథ్వీరాజ్‌తో ఇతడికి బద్ధ వైరముంది. ఇతడి కాలంలోనే ఘోరీ మహ్మద్... చౌహాన్ రాజ్యాన్ని అంతం చేశాడు. చివరికి 1193-94లో ఘోరీ... కనౌజ్‌పై దాడి చేసి జయచంద్రుడిని వధించి గహద్వాల రాజ్యాన్ని ఆక్రమించాడు. కానీ జయచంద్రుడి కుమారుడు హరిశ్చంద్రుడిని తన సామంతుడిగా చేసుకొని గహద్వాల రాజ్యాన్ని తిరిగి అప్పగించాడు.

జయచంద్రుడి ఆస్థానంలోని ప్రముఖ సంస్కృత కవి శ్రీహర్షుడు. ఇతడు నైషధ చరితం, ఖండన ఖండ ఖాద్య అనే గ్రంథాలను రచించాడు. చివరికి ఇల్‌టుట్‌మిష్ కాలంలో ఈ రాజ్యం ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనమైంది.

పాలవంశం

తొలి మధ్య యుగంలో తూర్పు భారతదేశాన్ని పాలించిన వంశాల్లో పాలవంశం ప్రముఖ మైంది. తొలుత పాటలీపుత్రం, తర్వాత మాంఘీర్ రాజధానులుగా పాలరాజులు బెంగాల్, బీహార్, ఒరిస్సా మొదలైన ప్రాంతా లను క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి 11వ శతాబ్దం వరకు పాలించారు. భారతదేశంలో బౌద్ధ మతా న్ని ఆదరించిన చివరి రాజవంశంగా పాలవంశాన్ని పేర్కొనవచ్చు. వీరు వజ్రయాన మతాన్ని గొప్పగా ఆదరించారు. వీరి కాలంలోనే ఈ మతం టిబెట్‌కు కూడా వ్యాప్తి చెందింది.

గోపాల: గౌడ శశాంకుడి తదనంతరం బెంగాల్‌లో మత్స్యన్యాయం రాజ్యమేలింది. దాదాపు 100 సంవత్సరాలు సాగిన ఈ రాజకీయ అనిశ్చితిని అంతం చేసి గోపాల క్రీ.శ.750లో పాలరాజ్యాన్ని స్థాపించాడు. ఇతడిని ప్రజలే తమ రాజుగా ఎన్నుకున్నారు. గోపాలుడు తన రాజ్యంలో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించాడు. బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఓదంతపురి విహారాన్ని నిర్మించాడు.

ధర్మపాల: కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో పాల్గొన్న మొదటి పాలరాజు ధర్మపాల. కనౌజ్ ఆక్రమణ కోసం ప్రతీహారులతో, రాష్ట్రకూటులతో ఇతడు యుద్ధాలు చేశాడు. ప్రతీహార సామంతుడు ఇంద్రాయుధుడిని ఓడించి కనౌజ్‌ను ఆక్రమించాడు. కానీ ప్రతీహార రెండో నాగభటుడు ఇతడిని మాంఘీర్ యుద్ధంలో ఓడించాడు. ధర్మపాలుడు కూడా గొప్ప బౌద్ధ మతాభిమాని. ఇతడు విక్రమపుర, సోమపుర బౌద్ధ విశ్వవిద్యాలయాలను స్థాపించాడు. అంతేకాకుండా గుప్తుల కాలంలో స్థాపించిన నలంద విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించి దాని నిర్వహణకు రెండు వందల గ్రామాలను దానంగా ఇచ్చాడు. బౌద్ధ బిక్షువుల కోసం దాదాపు 50 మత సంస్థలను స్థాపించాడు. ఇతడి ఆస్థానంలో హరిభద్రుడు అనే గొప్ప బౌద్ధ పండితుడు ఉండేవాడు.

మాదిరి ప్రశ్నలు

1. ఖజురహో దేవాలయాల గురించి తొలిసారిగా ప్రస్తావించిన విదేశీ చరిత్రకారుడు/ రచయిత?
   1) సులేమాన్, అల్‌మసూదీ
   2) అల్‌బెరూనీ, ఇబ్న్‌బతూతా
   3) అబ్దుల్ రజాక్, అబ్దుల్ రహీం
   4) వి.ఎ. స్మిత్, రాబర్ట్ సీవెల్
2. పంజాబ్ హిందూషాహీరాజు ఆనంద పాలుడి కూటమిలో చేరి మహ్మద్ గజనీ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) ధంగ 2) గండ
   3) జయపాల 4) యశోవర్మన్
3. ఖజురహోలోని కందరీయ మహాదేవ ఆలయ నిర్మాత?
   1) విద్యాధర 2) గండ
   3) ధంగ 4) నన్నుక
4. కుతుబుద్దీన్ ఐబక్ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) త్రిలోక్య వర్మన్ 2) మదన వర్మన్
   3) పరమార్ది దేవ 4) వీరవర్మన్
5. ఖజురహో దేవాలయాలను ఏ వాస్తు శిల్పకళాశైలికి పరాకాష్టగా భావిస్తారు?
   1) ద్రావిడ 2) నగర
   3) వెస్సార 4) ఇండో-పర్షియన్
6. తొలిసారిగా హిందీలో శాసనాలను జారీ చేసినవారు?
   1) చౌహాన్‌లు 2) చాందేలులు
   3) గహద్వాలులు 4) ప్రతీహారులు
7. కామసూత్ర శిల్పాలతో దేవాలయాలను నిర్మించినవారు?
   1) చాందేలులు 2) చోళులు
   3) పరమారులు 4) పాలరాజులు
8. కనౌజ్ రాజధానిగా పాలించిన రాజ వంశాలు?
   1) మౌఖరీలు
   2) మౌఖరీలు, ప్రతీహారులు
   3) మౌఖరీలు, ప్రతీహారులు, గహద్వాలులు
   4) ఎవరూ కాదు
9. తురుష్క దండన అనే పన్నును విధించిన రాజు?
   1) మూడో పృథ్వీరాజ్ చౌహాన్
   2) గహద్వాల జయచంద్ర
   3) చంద్రదేవ 4) ఆనంద పాలుడు
10. లక్ష్మీధరుడు కృత్యకల్పతరు గ్రంథాన్ని ఎవరి ఆస్థానంలో రచించాడు.
    1) సిద్ధరాజ జయసింహ
    2) గోవింద చంద్ర
    3) పృథ్వీరాజ 4) జయచంద్ర
11. బంగారు నాణేలను జారీ చేసిన ఏకైక గహద్వాల రాజు?
    1) గోవిందచంద్ర 2) జయచంద్ర
    3) విజయచంద్ర
    4) యశోవిగ్రహ
12. నైషధ చరితం గ్రంథకర్త?
    1) శ్రీహర్షుడు 2) శ్రీనాథుడు
    3) లక్ష్మీధరుడు 4) జయచంద్రుడు
13. మహ్మద్‌ఘోరీ ఏ యుద్ధంలో గహద్వాలులను అంతం చేశాడు?
    1) మొదటి తరైన్
    2) రెండో తరైన్
    3) బనారస్ యుద్ధం
    4) చాందావార్ యుద్ధం
14. కల్హణుడు ఏ కాశ్మీర్ రాజుకు సమకాలీనుడు?
    1) హర్ష 2) క్షేమగుప్త
    3) అవంతీవర్మన్
    4) లలితాదిత్య ముక్తాపీడ
15. దిలికపుర (ఢిల్లీ) నగరాన్ని నిర్మించిన రాజవంశం?
    1) చౌహాన్‌లు 2) ప్రతీహారులు
    3) గహద్వాలులు 4) తోమారులు

సమాధానాలు:

1) 2;	2) 2;	3) 1;	4) 3;
5) 2;	6) 2;	7) 1;	8) 3;
9) 3;	10) 2;	11)1;	12) 1;
13) 4;	14) 1;	15) 4.	

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్ఈఆర్, భోపాల్‌లో 31 నాన్ టీచింగ్ పోస్టులు

భోపాల్(మధ్యప్రదేశ్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్).. డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ రిజిస్ట్రార్-01, డిప్యూటీ లైబ్రేరియన్-01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-01, అసిస్టెంట్ రిజిస్ట్రార్-01, స్పోర్ట్స్ ఆఫీసర్-01, మెడికల్ ఆఫీసర్-01, సీనియర్ సూపరింటెండెంట్-01, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్-01, కౌన్సిలింగ్ సూపరింటెండెంట్-01, జూనియర్ ఇంజనీర్(సివిల్)-01, జూనియర్ లైబ్రరీ సూపరింటెండెంట్-01, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్-01, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్-01, జూనియర్ అసిస్టెంట్-07, ల్యాబ్ అసిస్టెంట్-06, అటెండెంట్-05.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్, మెటీరియల్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, లా, హెచ్ఆర్, సైకియాట్రీ, మెడిసిన్, కార్డియాలజీ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, ఎంబీబీఎస్/ఎండీ/డీఎన్‌బీ, పీజీ, ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ రిజిస్ట్రార్, రిక్రూట్‌సెల్, రూమ్ నెం.105(ఎ), ఫస్ట్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), భోపాల్ బైపాస్ రోడ్, భౌరి, భోపాల్ చిరునామాకు పంపించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.11.2024.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2024.
- **వెబ్‌సైట్:** https://www.iiserb.ac.in/

పక్షుల్లో ఎన్ని గదుల గుండె ఉంటుంది?

జీవశాస్త్ర పరిచయం

జీవశాస్త్రం (బయాలజీ) అనే పదం బయోస్ (జీవం), లాగస్ (అధ్యయనం) అనే గ్రీకు పదాల నుంచి ఉద్భవించింది. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322) అనేక జీవశాస్త్ర ప్రాథమిక భావనలు ఇచ్చారు. అందువల్ల ఆయనను 'జీవశాస్త్ర పితామహుడు' అంటారు.

★ జీవశాస్త్రంలో రెండు విభాగాలుంటాయి. 1. జంతు శాస్త్రం (జువాలజీ - జోవన్ అంటే జంతువు, లాగోస్ అంటే అధ్యయనం)
2. వృక్షశాస్త్రం (బోటనీ - బొటానె అనే మాటకు మొక్క అని అర్థం)

★ మొక్కలు స్వయం పోషకాలు. అంటే తమ ఆహారాన్ని తామే తయారుచేసుకుంటాయి. కిరణజన్య సంయోగక్రియలో సూర్యరశ్మి సమక్షంలో కార్బన్ డై ఆక్సైడ్, నీరు కలవడం వల్ల పిండిపదార్థం లేదా కార్బో హైడ్రేట్ ఏర్పడుతుంది. ఈ చర్యకు అవసరమైన క్లోరోఫిల్ (పత్రహరితం) మొక్కల్లో ఉంటుంది. శిలీంధ్రాల్లో పత్రహరితం ఉండదు. అవి సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి.

★ జంతువులు ఆహారం కోసం ఇతర జీవులపై ఆధారపడతాయి. అందువల్ల వీటిని పరపోషకాలు (Heterotrophs) అంటారు.

★ కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడే జీవులు 'పూతికాహారులు (Saprophytes)' ఇవి కళేబరాలపై ఆధారపడి జీవిస్తాయి.

★ ఆహారం లేదా ఆవాసం లేదా రెండింటి కోసం ఇతర జీవుల శరీరాన్ని అంటిపెట్టుకునే జీవులను 'పరాన్నజీవులు' అంటారు. అతిథేయి శరీరం బయటకు అంటి పెట్టుకునేవి బాహ్య పరాన్నజీవులు **ఉదా:** జలగ.
అతిథేయి లోపలి భాగాల్లో నివసించేవి అంతర పరాన్న జీవులు
ఉదా: ఆస్కారిస్ (ఏలికపాము)

★ సహజీవనంలో రెండు రకాల జీవులు పరస్పర సహకారం అందించుకుంటాయి.

పోషణ

★ జీవుల ప్రధాన లక్షణం జీవనక్రియలు జరుపుకోవడం. ఈ క్రియల్లో జీర్ణక్రియ ఒకటి. శక్తి కోసం జీర్ణక్రియ అవసరం.

★ ఏకకణ జీవులైన ప్రాథమిక జీవుల్లో జీర్ణవ్యవస్థ ప్రత్యేకంగా అభివృద్ధి చెంది ఉండదు.

★ ఏకకణ జీవుల్లో కణాంతర జీర్ణక్రియ ఉంటుంది.

కణం: జీవి ప్రాథమిక ప్రమాణం కణం. దీన్ని రాబర్ట్ హుక్ గుర్తించాడు.

కణజాలం: ఒకే విధమైన నిర్మాణం కల్గి, ఒకే పనిని నిర్వర్తించే కణాల సమూహాన్ని కణజాలం అంటారు. భిన్న కణజాలాలు కలిసి అవయవం ఏర్పడుతుంది.

➡ ఎగిరే పక్షుల శరీరం పడవ ఆకారంలో ఉంటుంది. వీటి ఎముకలు గుల్లగా ఉంటాయి. వీటిలో వాయుసంచులు ఉంటాయి.

➡ బయాలజీ అనే పదాన్ని కనుగొన్నది 'లామార్క్'.

➡ సరీసృపాల్లోని గుండె గదుల సంఖ్య 'మూడు'. కానీ మొసలిలో నాలుగు గదుల గుండె ఉంటుంది.



వ్యవస్థ: భిన్న అవయవాలు కలిసి ఒకే పనిని నిర్వర్తిస్తే దాన్ని 'అవయవ వ్యవస్థ' అంటారు.

జీవి శరీరంలో జీర్ణ, శ్వాస, విసర్జన, ప్రత్యుత్పత్తి, నాడీ, రక్తప్రసరణ, అంతస్రావ వ్యవస్థలుంటాయి. జంతువులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1. వెన్నెముక లేని జీవులు. 2. వెన్నెముక ఉన్న జీవులు

వెన్నెముక లేని జీవులను 9 వర్గాలుగా విభజించారు.

★ **ప్రోటోజోవా:** ప్రోటో అంటే ప్రాథమిక, జోవన్ అంటే జంతువులు అని అర్థం.

★ **పారిఫెరా:** పారి అంటే పోరస్ (రంధ్రాలు ఉన్న), ఫెరిన్ అంటే కల్గి ఉండేవి అని అర్థం.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - కంటెంట్ (ఎస్‌జీటీ)

రంధ్రాలు కల్గిన జీవులు.
ఉదా: స్పంజికలు

★ **సీలెంటరేటా:** ఆయికులాస్ ఎంటిరాన్ పదాల కలయికతో సీలెంటరేటా వచ్చింది. ఆయికులాస్ అంటే గొట్టం, ఎంటిరాన్ ఆహారనాళం అని అర్థం. వీటిలో గొట్టం లాంటి ఆహారనాళం ఉంటుంది. ఇవి ద్విస్తరిత (డిప్లోబ్లాస్టిక్) జీవులు. **ఉదా:** హైడ్రా.

★ **ప్లాటీ హెల్మింథిస్:** ప్లాట్ అంటే బల్లపరుపు, హెల్మింథ్స్ అంటే పురుగులు అని అర్థం. ఇవి బల్లపరుపు శరీర నిర్మాణం కల్గిన జీవులు. ఇవి పరాన్నజీవులు.
ఉదా: టీనియా సోలియం(బద్దెపురుగులు)

★ **నిమాటి హెల్మింథిస్:** ఇవి గుండ్రటి పురుగులు. ఎక్కువగా పరాన్నజీవులు.
ఉదా: ఏలిక పాము (ఆస్కారిస్)

★ **అనెలిడా:** అన్యులస్ అంటే వలయాకార ఖండితాలు అని అర్థం. ఈ జీవుల్లో ఇలాంటి అవయవ వ్యవస్థలుంటాయి. సీలోం (శరీర కుహరం) ఉంటుంది.
ఉదా: వానపాము, జలగ.

★ **ఆర్థ్రోపొడా:** ఆర్థ్రాస్ అంటే కీళ్లు కలిగిన పోడియం - కాళ్లు. కీళ్లు కల్గిన (ఖండితాలున్న) కాళ్లు ఉండటం వీటి లక్షణం. బాహ్య అస్థిపంజరం కల్గిన కీట కాలుంటాయి.
ఉదా: బొద్దింక, ఈగ, దోమ.

★ **మొలస్కా:** మెత్తని శరీరం కల్గినది అని అర్థం. దీంట్లో కర్పరాలుంటాయి.
ఉదా: ఆల్చిప్ప, నత్త.

★ **ఇఖైనోడెర్మేటా:** ఇఖినస్ అంటే ముళ్లు, డర్మా అంటే చర్మం. చర్మంపై ముళ్లు కల్గిన జీవులు అని అర్థం. **ఉదా:** సముద్ర నక్షత్రం.

వెన్నెముక ఉన్న జీవులు

వీటిని నాలుగా రకాలుగా విభజించారు.

★ **చేపలు:** జలచరాలు. శీతల రక్త జీవులు (పరిసర ఉష్ణోగ్రత మారినప్పుడు రక్తం ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది). వీటిలో రెండుగదుల గుండె ఉంటుంది. ఇవి చాలా వరకు అండోత్పాదకాలు.

★ **ఆంఫిబియా (ఉభయచరాలు):** నేలపైనా, నీటిలోనూ నివసిస్తాయి. ఇవి కూడా శీతల రక్తజీవులు. 3 గదుల గుండె ఉంటుంది. ఇవి అండోత్పాదకాలు.

★ **సరీసృపాలు:** ఇవి నేలపై పాకే జీవులు. శీతల రక్తజీవులు. 3 గదుల గుండె (2 కర్ణికలు, అసంపూర్తిగా విభజితమైన జఠరిక) ఉంటుంది. ఇవి అండోత్పదకాలు.
ఉదా: పాము, బల్లి, మొసలి.

★ **పక్షులు:** ఉష్ణరక్త జీవులు. అంటే రక్తం ఉష్ణోగ్రత పరిసర ఉష్ణోగ్రతలో మారకుండా స్థిరంగా ఉంటుంది. 4 గదుల గుండె ఉంటుంది. ఇవి ఈకలు కల్గిన జీవులు, అండోత్పదకాలు.

★ **క్షీరదాలు:** పాలిచ్చే శిశుత్పాదకాలు. నాలుగు గదుల గుండె ఉంటుంది. ఉష్ణరక్త జంతువులు.
ఉదా: ఆవు, మేక, కుక్క, మానవుడు.

మాదిరి ప్రశ్నలు

1. బయాలజీ అనే పదానికి సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
   1) గ్రీకు - అరిస్టాటిల్
   2) గ్రీకు - లామార్క్
   3) ఫ్రెంచ్ - లామార్క్
   4) ఏదీకాదు
2. 'జీవశాస్త్ర పితామహుడు' అని ఎవరిని పేర్కొంటారు?
   1) లామార్క్ 2) థియోఫ్రాస్టస్
   3) అరిస్టాటిల్ 4) ప్లేటో
3. బొటానె అనే మాటకు అర్థం?
   1) విత్తనం 2) వేరు
   3) మొక్క 4) ఫలం
4. కిందివాటిలో ఏ గ్రీకు పదానికి జంతువు అనే అర్థం ఉంది?
   1) బొటానె 2) జోవన్
   3) లాగస్ 4) బయోస్
5. బయోస్, లాగస్ అనే పదాల నుంచి బయా లజీ ఉద్భవించింది. కిందివాటిలో వీటి అర్థాలు వరుసగా..
   1) అధ్యయనం, మొక్కలు
   2) జంతువులు, శాస్త్రం
   3) మొక్కలు, జంతువులు
   4) జీవం, అధ్యయనం
6. మొక్కలు, జంతువుల పోషణకు సంబంధించి కిందివాటిలో సరైన ప్రవచనం?
   1) మొక్కలు పరాన్నజీవులు, జంతువులు పరపోషకాలు
   2) జంతువులు పరపోషకాలు, మొక్కలు స్వయం పోషకాలు
   3) మొక్కలు పూతికాహారులు, జంతు వులు పరాన్నజీవులు
   4) జంతువులు పరపోషకాలు, మొక్కలు పరపోషకాలు
7. జలగ ఏ రకానికి చెందిన జీవి?
   1) పూతికాహార జీవి
   2) అంతర పరాన్న జీవి
   3) స్వయంపోషకం
   4) బాహ్య పరాన్న జీవి
8. ఏ రకమైన జీవులు కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి?
   1) పరాన్నజీవులు 2) పూతికాహారులు
   3) సహభోజకులు 4) పరపోషకాలు
9. ప్రాటోజోవా వర్గానికి చెందిన ఏకకణ జీవుల్లో ఈ రకానికి చెందిన జీర్ణక్రియ జరుగుతుంది?
   1) కణబాహ్య జీర్ణక్రియ
   2) అసంపూర్ణ జీర్ణక్రియ
   3) కణాంతర జీర్ణక్రియ
   4) ఎక్స్ట్రా కార్పోరియర్ జీర్ణక్రియ
10. ఏలికపాము, బద్దెపురుగు, స్పంజికలు వరుసగా ఏ వర్గాలకు చెందుతాయి?
    1) ప్లాటిహెల్మింథిస్, నిమాటి హెల్మింథిస్, పొరిఫెరా
    2) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మింథిస్, మొలస్కా
    3) ప్లాటిహెల్మింథిస్, ఇఖైనోడెర్మేటా, ప్రోటోజోవా
    4) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మిం థిస్, పొరిఫెరా
11. ఆల్చిప్ప ఏ వర్గానికి సరైన ఉదాహరణ?
    1) మొలస్కా 2) ఇఖైనోడెర్మేటా
    3) పొరిఫెరా 4) అనెలిడా
12. ఇఖైనోడెర్మేటా జీవుల ప్రధాన లక్షణం?
    1) రంధ్రాలు కల్గి ఉండటం
    2) శరీరత్వచం రెండు పొరలతో ఉండటం
    3) శరీరంపై ముళ్లు ఉండటం
    4) ఖండితాలు కల్గిన కాళ్లు ఉండటం
13. కిందివాటిలో సరైన ప్రవచనం ఏది?
    1) అమీబా బహుకణ జీవి
    2) హైడ్రా ద్విస్తరిత జీవి
    3) బొద్దింక అనెలిడా వర్గానికి చెందింది
    4) బద్దెపురుగు పరాన్నజీవి కాదు

సమాధానాలు

1) 2;	2) 3;	3) 3;	4) 2;
5) 4;	6) 2;	7) 4;	8) 2;
9) 3;	10) 4;	11) 1;	12) 3;
13) 2.			

పల్నాటి యుద్ధంలో పాల్గొన్న కాకతీయ రాజు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఏపీ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. హాలుడు రచించిన గాథాసప్తశతిలో కృష్ణుడు గురించి ఏమని పేర్కొన్నారు?
   1) సుందరుడు 2) మోహనాంగుడు
   3) మధుమథనుడు 4) రతివల్లభుడు
2. శాతవాహన యుగంలో 'శ్రేణి ధర్మం' అంటే?
   1) యుద్ధ సమయంలో కాల్బలం పాటించవలసిన నియమాలు
   2) శాతవాహన రాజు రాజ్యపాలనలో పాటించవలసిన నియమాలు
   3) నికాయసేణు సభ్యులు పాటించవలసిన నియమాలు
   4) శాతవాహన రాణికి తన రాజుపట్ల ఉండే బాధ్యత
3. ఆంధ్రుల ప్రశంస దేనిలో కనిపిస్తుంది?
   ఎ) ఐతరేయ బ్రాహ్మణం
   బి) మార్కండేయ పురాణం
   సి) రామాయణం
   1) ఎ,బి 2) బి,సి
   3) ఎ,సి 4) పైవన్నీ
4. శాతవాహన యుగంలో సుగంధ ద్రవ్యాలను తయారుచేసే వారిని ఏ పేరుతో వ్యవహరించేవారు?
   1) గధికులు 2) సేల వధకులు
   3) చంకుకారులు 4) తిలపిష్టకులు
5. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని వి.ఎస్. సుక్తాంకర్ దేని ఆధారంగా చెప్పాడు?
   1) నాసిక్ శాసనం
   2) హిరహడగల్లి శాసనం
   3) నానాఘట్ శాసనం
   4) భట్టిప్రోలు శాసనం
6. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) దక్షిణాపథపతి – మొదటి శాతకర్ణి
   బి) దక్షిణాపథేశ్వరుడు–వాసిష్ఠీపుత్ర పులోమావి
   సి) దక్షిణాపథ సామ్రాట్టు– వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు
   1) ఎ,బి 2) ఎ మాత్రమే
   3) ఎ,సి 4) పైవన్నీ
7. నాగార్జున కొండలో బౌద్ధ విహారాన్ని నిర్మించిన ఎహువల శాంతమూలుని సోదరి?
   1) శాంతిశ్రీ 2) హర్మ్యశ్రీ
   3) షష్టిశ్రీ 4) కొడబలిసిరి
8. శాసనాలు వీర పురుషదత్తుడిని ఏ పేరుతో పేర్కొంటున్నాయి?
   1) మాఢరీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   2) వాసిష్ఠీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   3) గౌతమీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   4) శాంతిశ్రీ పుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
9. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) గోరంట్ల శాసనం – అత్తివర్మ
   బి) మట్టిపాడు తామ్ర శాసనం – దామోదర వర్మ
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ,బి 4) ఎ,బి కాదు
10. క్రీ.శ.130 ప్రాంతంలో భారతదేశాన్ని సందర్శించిన టాలెమీ కృష్ణాముఖద్వారంలోని ఏ ప్రాంతం వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని చెప్పాడు?
    1) ఘంటసాల 2) భట్టిప్రోలు (పిటింద్ర)
    3) ధరణికోట 4) నాగార్జున కొండ
11. ఇక్ష్వాకుల కాలంనాటి శిల్పాలలో 'మాంధాత శిల్పం' అతి ముఖ్యమైంది. ఈ శిల్పం ఎక్కడ లభించింది?
    1) జగ్గయ్యపేట 2) నాగార్జున కొండ
    3) అమరావతి 4) ఘటప్రభ
12. 'త్రిపురమర్త్య మహేశ్వర'గా కీర్తి పొందిన వేంగీ చాళుక్యుల రాజు?
    1) ఒకటో విజయాదిత్యుడు
    2) రెండో విజయాదిత్యుడు
    3) మూడో విజయాదిత్యుడు
    4) నాల్గో విజయాదిత్యుడు
13. త్రికాలయోగి సిద్ధాంత దేవునికి రామతీర్థంలో 'రామ కొండ' అనే గుహాలయాన్ని నిర్మించి ఇచ్చిన రాజు?
    1) రెండో విజయాదిత్యుడు
    2) రాజరాజనరేంద్రుడు
    3) చాళుక్య భీముడు 4) విమలాదిత్యుడు
14. బెజవాడలో జైన సన్యాసుల కోసం 'నడుంబి వసతి' అనే బసదిని నిర్మించిన రాణి?
    1) రుద్ర భట్టారిక
    2) ఉపాసిక బోధిశ్రీ 3) చల్లవ్వ
    4) అయ్యణ మహాదేవి
15. జతపరచండి.
    జాబితా-I
    a) బెజవాడ శాసనం b) చీపురుపల్లి శాసనం
    c) కందుకూరి శాసనం d) విప్పర్ల శాసనం
    జాబితా-II
    i) గుణగ విజయాదిత్యుడు
    ii) కుబ్జ విష్ణువర్ధనుడు
    iii) రెండో యుద్ధమల్లుడు
    iv) జయసింహ వల్లభుడు
    1) a-i, b-ii, c-iii, d-iv
    2) a-iii, b-ii, c-i, d-iv
    3) a-iii, b-i, c-iv, d-ii
    4) a-ii, b-iv, c-i, d-iii
16. 'శబ్దచంద్రిక', శబ్దరత్నాకరం' అనే నిఘంటువులను రచించింది?
    1) నన్నయ్య భట్టు 2) కేతన
    3) వామనభట్టు 4) శ్రీనాథుడు
17. తెలుగులో కావ్య లక్షణాలు కనిపిస్తున్న అతి పురాతన గ్రంథం? (పండితుల అభిప్రాయం ప్రకారం)
    1) మహాభారతం 2) కుమార సంభవం
    3) ఆంధ్ర మహాభాగవతం
    4) నిర్వచనోత్తర రామాయణం
18. కింది వారిలో 'చండ చాళుక్యులు' అని ఎవరిని పిలిచేవారు ?
    1) వేంగీ చాళుక్యులు 2) బాదామి చాళుక్యులు
    3) కళ్యాణి చాళుక్యులు 4) రెడ్డి రాజులు
19. కింది వాటిలో పాత రాతి యుగానికి చెందిన ప్రదేశం?
    1) పాతపాడు 2) కీసరవల్లి
    3) నందికనుమ 4) ఉట్నూరు
20. ఆంధ్ర దేశంలో అతి ప్రాచీన బౌద్ధ స్తూపం ఎక్కడ ఉంది?
    1) అమరావతి 2) నాగార్జున కొండ
    3) భట్టిప్రోలు 4) ఘంటసాల
21. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని వ్యాఖ్యానించినవారు?
    ఎ) నికోలో కొంటి బి) శ్రీకృష్ణదేవరాయలు
    సి) సి.పి. బ్రౌన్
    డి) వినుకొండ వల్లభామాత్యుడు
    1) ఎ,బి 2) బి,సి 3) బి,డి 4) ఎ,సి
22. మోటుపల్లి అభయవర్తక శాసనాన్ని అమలుపరచడానికి గణపతిదేవుడు ఎవరిని నిమమించాడు?
    1) జాయపసేనాని 2) రేచర్ల రుద్రుడు
    3) గంగయ్య సేనాని 4) సిద్దయ్య దేవుడు
23. 'సాగర గౌతమీ సలిల సంగమ సకల జలదుర్గ సాధన రఘురామ' బిరుదువహించిన రెడ్డి రాజు?
    1) ప్రోలయ వేమారెడ్డి
    2) అనవేమారెడ్డి 3) పెదకోమటి వేమారెడ్డి
    4) కొమరగిరి రెడ్డి
24. సవరం ఎల్లయ్య అనే రాజ్య పోరుడు ఏ రెడ్డి రాజును చంపాడు?
    1) రాచవేమారెడ్డి 2) కొమరగిరి రెడ్డి
    3) అనవోతారెడ్డి 4) ప్రోలయ వేమారెడ్డి
25. పెదకోమటి వేమభూపతి రచించిన గ్రంథం?
    1) నృత్య రత్నావళి 2) గీతా రత్నావళి
    3) వేమభూపాల చరితం 4) శృంగార దీపిక
26. పల్నాటి యుద్ధంలో పాల్గొన్న కాకతీయ రాజు?
    1) గణపతి దేవుడు 2 రెండో ప్రతాపరుద్రుడు
    3) రుద్రదేవుడు 4) ఎవరూ కాదు
27. నిమ్నకులాల వారికి ఆలయ ప్రవేశం కల్పించడం కోసం బ్రహ్మనాయుడు నిర్మించిన ఆలయం?
    1) రుద్రేశ్వర ఆలయం 2) ప్రసన్న కేశవాలయం
    3) చెన్నకేశ్వర ఆలయం 4) రామప్ప దేవాలయం
28. బ్రహ్మ సమాజ కార్యకలాపాల్లో మచిలీపట్నంలో ప్రముఖ పాత్ర వహించింది?
    1) కోకా వెంకటరత్నం
    2) కందుకూరి వీరేశలింగం
    3) రఘుపతి వెంకటరత్నం నాయుడు
    4) దేశిరాజు పెదబాపయ్య
29. 1898లో రాజా ఆర్.వి. కృష్ణారావు ప్రారంభించిన 'సరస్వతి' అనే పత్రిక కోసం కొంతకాలం పనిచేసిన వ్యక్తి?
    1) చిలకమర్తి లక్ష్మీనరసింహం
    2) న్యాపతి సుబ్బారావు
    3) కందుకూరి వీరేశలింగం
    4) కొక్కొండ వెంకటరత్నం
30. మహిళలకు సమానత్వం, శాస్త్రీయ విద్యా విధాన ఆవశ్యకత గురించి వివరించిన 'హిత సూచని' గ్రంథ రచయిత?
    1) కందుకూరి వీరేశలింగం
    2) పరవస్తు వేంకట రంగాచార్యులు
    3) ఏనుగుల వీరాస్వామి
    4) స్వామినేని ముద్దు నరసింహం
31. రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆంధ్ర బ్రహ్మోపాసన మందిరాన్ని ఎక్కడ నెలకొల్పాడు?
    1) మచిలీపట్నం 2) కాకినాడ
    3) రాజమండ్రి 4) సికింద్రాబాద్
32. దత్తమండలాలకు థామస్ మన్రోను ప్రధాన కలెక్టర్‌గా ఎప్పుడు నియమించారు?
    1) 1879 అక్టోబర్ 4 2) 1800 అక్టోబర్ 4
    3) 1801 అక్టోబర్ 4 4) 1807 అక్టోబర్ 4
33. కమ్యూనిస్ట్ పార్టీ మొదటిసారిగా 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే నినాదాన్ని ఇచ్చింది?
    1) 1952 2) 1950
    3) 1948 4) 1946
34. ఆంధ్రదేశంలో ప్రారంభించిన స్వరాజ్య పార్టీ శాఖ అధ్యక్షుడు?
    1) వి.రామదాసు 2) ఉన్నవ లక్ష్మీనారాయణ
    3) మద్దూరి అన్నపూర్ణయ్య 4) దర్శి చెంచయ్య
35. 'చెన్నపట్నం స్వదేశీ సంఘం' కింది ఏ శిస్తు వసూలు పద్ధతిని సూచించింది?
    1) శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి 2) రైత్వారీ పద్ధతి
    3) గ్రామవారీ పద్ధతి 4) ఏదీకాదు
36. కింది వారిలో 1879లో జరిగిన రంపా తిరుగుబాటుకు నాయకత్వం వహించినవారు?
    1) రమాభూపతి దేవుడు 2) తమ్మన్న దొర
    3) పులికంటి సాంబయ్య 4) అంబుల్ రెడ్డి
37. బ్రిటిష్ వారు అనుసరించిన పన్నుల విధానాన్ని ఉద్దేశించి 'ఉప్పుకు పన్ను, పప్పుకు పన్ను' అని వ్యాఖ్యానించింది?
    1) కొండా వెంకటప్పయ్య
    2) గరిమెళ్ల సత్యనారాయణ
    3) బసవరాజు అప్పారావు
    4) త్రిపురనేని రామస్వామి చౌదరి
38. గాంధీజీ ఆస్థాన కవిగా ఎవరిని పేర్కొంటారు?
    1) పట్టాభి సీతారామయ్య
    2) తుమ్మల సీతారామమూర్తి
    3) వావిలాల గోపాలకృష్ణయ్య
    4) జమలాపురం కేశవరావు
39. ఆంగ్ల విద్యావ్యాప్తికి ఏర్పడిన అనువైన పరిస్థితుల గురించి దాసు శ్రీరామకవి ఏ కావ్యంలో పేర్కొన్నాడు?
    1) ఆంధ్రనాడు 2) తెలుగుదేశం
    3) ఆంధ్రదేశం 4) తెలుగునాడు
40. ఆంధ్రదేశంలో మొదటి బాలికా పాఠశాలగా దేనిని పేర్కొంటారు?
    1) విక్టోరియా బాలికా పాఠశాల
    2) రెవరెండ్ నోబెల్ పాఠశాల
    3) వివేకవర్ధిని బాలికా పాఠశాల
    4) రాజమండ్రి బాలికా పాఠశాల
41. 1879లో జరిగిన రంపా తిరుగుబాటుకు ప్రధాన కారణమైన చిగురు పన్నును ఎవరిపై విధించారు?
    1) కల్లుతీసే గిరిజనులపై
    2) పోడు వ్యవసాయం చేసే గిరిజనులపై
    3) నేత కార్మికులపై
    4) పశువుల కోసం కోసే గడ్డిపై
42. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంలో ఆర్థర్ కాటన్‌కి సహకరించిన భారతీయ అధికారి?
    1) కెప్టెన్ ఓర్ 2) వీనం వీరన్న
    3) కావలి బొర్రయ్య 4) దామెర్ల వెంకటాద్రి
43. జతపరచండి.
    జాబితా-I
    a) బొబ్బిలి యుద్ధం b) చందుర్తి యుద్ధం
    c) కొండూరు యుద్ధం d) వందవాసి యుద్ధం
    జాబితా-II
    i) 1757 ii) 1758
    iii) 1759 iv) 1760
    1) a-i, b-ii, c-iii, d-iv
    2) a-ii, b-i, c-iii, d-iv
    3) a-i, b-ii, c-iv, d-iii
    4) a-i, b-iii, c-ii, d-iv
44. కావలి సోదరులు అంటే ఎవరు?
    1) వెంకటాద్రి, అయ్యప్ప
    2) దామోదర్, బాలకృష్ణ
    3) బొర్రయ్య, బాలకృష్ణ
    4) బొర్రయ్య, వెంకట రామస్వామి
45. కింది వాటిలో సరికాని జత ఏది?
    ఎ) ఆంధ్ర నేతాజీ – పర్వతనేని వీరయ్య చౌదరి
    బి) ఆంధ్ర వాల్మీకి–వావికొలను సుబ్బారావు
    సి) ఆంధ్ర గాంధీ–వావిలాల గోపాలకృష్ణయ్య
    1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
    3) సి మాత్రమే 4) ఎ,బి
46. 'రామదాసు'గా బిరుదు పొందిన వ్యక్తి?
    1) కొండా వెంకటప్పయ్య
    2) పట్టాభి సీతారామయ్య
    3) పింగళి వెంకయ్య
    4) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
47. మద్రాస్ ప్రభుత్వం నిషేధించిన నాటకం?
    1) గయోపాఖ్యానం 2) మా భూమి
    3) కన్యాశుల్కం 4) ద్రౌపదీ పరిణయం
48. థామస్ మన్రో నివేదిక ప్రకారం దత్త మండలాల్లో ఎంతమంది పాలెగాళ్లు ఉండేవారు?
    1) 100 2) 45 3) 13 4) 80
49. గుంటూరు నుంచి వెలువడే దేశాభిమాని పత్రికకు అనేక వ్యాసాలు రాసి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును సమర్థించింది?
    1) జొన్నవిత్తుల గురునాథం
    2) కొండా వెంకటప్పయ్య
    3) శేషగిరిరావు 4) ఉన్నవ లక్ష్మీనారాయణ
50. 1917లో నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభ ఐదో సమావేశానికి అధ్యక్షుడు ఎవరు?
    1) న్యాపతి సుబ్బారావు
    2) కొండా వెంకటప్పయ్య
    3) మోచర్ల రామచంద్రరావు
    4) రామరాయనింగార్
51. 1903–1904 మధ్య గుంటూరులో స్థాపించిన సంస్థ కింది వాటిలో ఏది?
    1) యువజన స్వరాజ్య సమితి
    2) యువజన సాహితీ సమితి
    3) బాల భారత సమితి
    4) మహిళా భారతి సంఘం
52. 1884లో మే 16న ఆవిర్భవించిన మద్రాస్ మహాజన సభకు అధ్యక్షుడు, కార్యదర్శి (వరుసగా)?
    1) సుబ్రమణ్య అయ్యర్, ఆనందాచార్యులు
    2) ఆనందాచార్యులు, రంగయ్య నాయుడు
    3) రంగయ్య నాయుడు, ఆనందాచార్యులు
    4) రంగయ్య నాయుడు, సుబ్రమణ్య అయ్యర్
53. 1950లో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి మద్రాస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన విభజన సంఘానికి అధ్యక్షుడు?
    1) కుమార రాజా 2) టంగుటూరి ప్రకాశం
    3) నీలం సంజీవరెడ్డి 4) భక్తవత్సలం
54. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) కందుకూరి వీరేశలింగం గురువు – ఆత్మూరి లక్ష్మీ నరసింహం
    బి) టంగుటూరి ప్రకాశం పంతులు గురువు – హనుమంతరావు నాయుడు
    1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
    3) ఎ,బి సరైనవి 4) ఎ,బి సరైనవి కావు
55. ఫజల్ అలీ అధ్యక్షుడిగా రాష్ట్రాల పునర్విభజన సంఘాన్ని ఎప్పుడు నియమించారు?
    1) 1953 డిసెంబర్ 22 2) 1953 డిసెంబర్ 29
    3) 1954 ఏప్రిల్ 3 4) 1955 సెప్టెంబర్ 30
56. 1949 నవంబర్ 26న ఏర్పాటు చేసిన విశాలాంధ్ర మహాసభ ప్రధాన కేంద్రం?
    1) వరంగల్లు 2) హైద్రాబాద్
    3) విజయవాడ 4) కర్నూలు

సమాధానాలు

1) 3	2) 3	3) 4	4) 1	5) 2
6) 4	7) 4	8) 1	9) 3	10) 2
11) 1	12) 3	13) 4	14) 4	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 3	22) 4	23) 2	24) 1	25) 4
26) 3	27) 3	28) 3	29) 1	30) 4
31) 2	32) 2	33) 4	34) 1	35) 3
36) 1	37) 2	38) 2	39) 4	40) 1
41) 1	42) 2	43) 1	44) 4	45) 1
46) 4	47) 2	48) 4	49) 3	50) 2
51) 2	52) 3	53) 1	54) 3	55) 2
56) 3				

What is the total distance between..

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.

Certain number of people was seated in a linear row facing north. One of them was seated at the end. Information about some of them is known. There were not more than 13 people. At least six people were seated between P and U where P was to the right of U. V was to the immediate right of S. T was seated second from the right end of the row. The number of people to the left of Q was more than twice the number of people to the right of Q. Only one person was seated between R and S. There were not more than 5 people sitting between R and Q. R was not seated adjacent to U. No three people mentioned were sitting together.

1. How many people were seated in the row?
   a) 8 b) 12 c) 10 d) 11
   e) Cannot be determined
2. Who was seated second to the left of R?
   a) P b) Q c) U
   d) No body e) Data insufficient
3. How many people were seated between Q and S?
   a) 3 b) 5 c) 7 d) 8
   e) Cannot be determined
4. What is the position of T with respect to U?
   a) Second to the right
   b) Tenth to the right
   c) Fourth to the left
   d) Immediate right
   e) Immediate left
5. How many people were seated to the left of S?
   a) 6 b) 4 c) 9
   d) 3 e) 7

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

Eight persons A, B, C, D, E, F, G and H went to a conclave. It was seen that each person was of a different age. The partial sequence of their ages is as follows:

___> ___> F > ___ > ___> ___> __
(39) (27) (23)
D > ___

They were seated in a straight row facing the North. The partial arrangement is shown below:

___ B ___ ___ ___ ___ ___ G
(25) (36)

The numbers shown in the brackets denote age.

» The person aged 31 was seated 3rd to the left of the one who was aged 27.
» B was aged more than G.
» The person who was 39 years old was seated 2nd to the left of F
» E was the 2nd eldest person and was seated to the immediate right of C.
» The person aged 23 was to the immediate right of the one who was aged 22
» A was seated 3rd to the left of the one who was 19 years old
» D was not the eldest.

6. What was the age of the person who was at the extreme left end of the row?
   a) 31 b) 19 c) 22
   d) 39 e) Cannot be determined
7. What was the difference between the age of A and C?
   a) 1 year b) 2 years
   c) 3 years d) 4 years
   e) 9 years
8. Who among the following was seated to the immediate left of D?
   a) A b) E c) F
   d) B e) H
9. Who among the following was the 3rd youngest person?
   a) D b) B c) C
   d) A e) F
10. If all the digits at odd positions in the number "324846237" are changed to previous digit in the number series and all the digits at even positions are changed to next digit in the number series, then which digit appears more than twice in the number thus formed?
    a) More than one such digit is there
    b) 7 c) 2 d) 3
    e) No such digit is there

Directions (Q.No.11-15): Study the information carefully and answer the questions given below.

Six people were born in different years with the current base is taken as 2018. None of them is older than 90 years old. They like different colours Red, Orange, Green, Blue, Black and Yellow.

A was born in the year 1981. The difference of age between A and C is 23 years. B's age is sum of the digits of the year in which C was born. The one who likes Blue colour is 6 years elder to B. The one who likes green colour is just younger than F. F's age is either the last two digits or reverse of the last two digits of the year in which the person who likes Blue colour was born. The difference between the age of D and the one who likes Green colour is 25 years. D is older than E. F is not the eldest. The one who likes Red colour is just elder than the one who likes Black colour. C does not like Orange colour.

Note - If mentioned the last two digits or reverse of the last two digits of the year in which a person is born can be the age of some other person. (Like A is born in 1943 and age of b is denoted by the last two digits of the birth year of A. Then B's age will be either 34 or 43).

11. Who among the following likes Orange colour?
    a) A b) D c) E
    d) B e) None of these
12. Who among the following is the eldest?
    a) A b) D c) C
    d) E e) None of these
13. Which of the following combination is true?
    a) A - 1981 - Black
    b) B - 2012 - Blue
    c) C - 2006 - Yellow
    d) F - 1958 - Black
    e) None of these
14. Which of the following statement is correct?
    a) A is three years younger than the one who likes Black
    b) C is the eldest
    c) E likes Blue colour
    d) E is born before A
    e) All are correct
15. In which of the following year F was born?
    a) 1995 b) 1958
    c) 1956 d) 2004
    e) None of these

Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below.

Eight persons P, Q, R, S, T, U, V, W are sitting around a rectangular table but not necessarily in the same order. Those who are sitting next to each have different distance from each other. Each of them facing towards the center. Some of them are sitting at the corners while some are sitting on the side of the table. The area of the rectangular table is $540m^2$. The length of the table is 7m more than the breadth of the table. R sits at one of the corners of the table. T sits second to the left of R. P is sitting at a distance of 14m from T. Only two persons sit between P and Q. The distance between R and U is twice of the distance between R and V. W faces R. P sits immediate right of W and at a distance of 13m, Neither Q nor S is an immediate neighbour of R. The distance between R and U is 2m more than the distance between P and T. U is not an immediate neighbour of T. The distance between Q and W is equal to the distance between R and U. The distance between Q and S is half of the distance between V and T. T does not sit at the corner of the table.


16. What is the total distance between V and W?
    a) 40 m b) 15 m c) 24 m
    d) 39 m e) 49 m
17. Who among the following sits second to the left of Q?
    a) T b) W c) V
    d) P e) R
18. Which of the following is not true regarding U?
    a) U sits second to the left of S
    b) The distance between U and V is 24 m
    c) W sits third to the right of U
    d) P is an immediate neighbour of U
    e) All are correct
19. How many persons sits between T and U when counted from the left of U?
    a) Three b) One c) No one
    d) Four e) Two
20. What is the position of P with respect to S?
    a) Third from the right
    b) Second from the left
    c) Second from the right
    d) Fourth from the left
    e) None of these

Directions (Q.No.21-23): Study the following data carefully and answer the following given questions.

In a family, there are ten members A, B, J, K, L, N, P, Q, R and T. J is married to K. R is daughter of P. T is wife of N. A is paternal aunt of B. K is paternal aunt of R. Q is niece of A. N is son of J. T has two daughter. L is mother of R. Q and B are grand-daughter of J. Each child has either both their parents alive or none alive.


21. How many female members are there in the family?
    a) 5 b) 6 c) 7 d) 3 e) 4
22. Which of the following is true?
    a) J is brother of P
    b) T is sister of R
    c) Q is mother of R
    d) A is sister of L
    e) R is niece of K
23. How many generations and couples are there in the family?
    a) 2, 3 b) 3,3 c) 3,2
    d) 1, 3 e) 2, 1

Directions (Q.No. 24- 25): Study the following example based on corresponding conditions:



i) If the box contains number
   a) And the number is even then multiply the number by 1.5
   b) And the number is odd then multiply the number by 3
ii) If the box contains letter/s then
   a) Replace vowel by its 2nd next letter as per English alphabets
   b. Replace consonant by its 2nd pervious letter as per English alphabets

Apply the conditions to the given input and answer the following questions.



24. 32 will be replaced by ?
    a) 64 b) 96
    c) 16
    d) 48 e) 23
25. U and S will be replace by ____ respectively
    a) W and U
    b) S and U
    c) W and Q d) S and Q
    e) None of these

KEY

1) b	2) c	3) a	4) b	5) b
6) d	7) d	8) c	9) d	10) d
11) d	12) b	13) d	14) c	15) b
16) d	17) e	18) d	19) e	20) c
21) c	22) e	23) b	24) d	25) c